భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

సెప్టెంబరు 1958

సంపుటము 35 : : సంచిక 9

విడిపత్రిక వెల ఒక రూపాయి


అమృతాంజనము
...ఏనుగు తలనొప్పులనుకూడా
క్షణంలో
ఉపశమింపచేస్తుంది
లక్షలాది ప్రజలు 1893 - నుంచి దేశమంతటా అమృతాంజనాన్ని వాడుతున్నారు. అమృతాంజనము బెణుకులు, వాపులు, తలనొప్పి, పళ్లపోటు, జలుబులు, దగ్గులు మొదలైన వాటిని ఉపశమింపచేస్తుంది.
అమృతాంజనము
అన్ని నొప్పులకు
దివ్యామృతము.
AMRUTANJAN
The Pain Balm
Amrutanjan Limited
MADRAS BOMBAY
అమృతాంజన్ లిమిటెడ్.
మద్రాసు-4, బొంబాయి-1, కలకత్తా-7.

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1958

కరుణాలహరి

శ్రీ బూర్గుల రామకృష్ణరావు

* గతసంచిక తరవాయి *

హారిసీలస్థగితావనీతలమునం దందాలకందమ్మునై
వరబృందావనవాటికన్ పరమశోభాపేటికన్ దృశ్యమౌ
హారనానామణిమండపాగ్ర విబుధోద్యత్ తూర్మజమూలమ్మునన్
బరమైన యొయ్యారి మామక వచో మత్తేభ సంచారినిన్.

శిరమం దూగెడు కేకిపించియముతోఁ జెల్వైకనద్రత్నసుం
దర కోటీర వికుంచితాగ్ర లలితోద్యత్కుంతలాక్రాంతమై
స్ఫురదాస్నీల విలోలఖేలదలకస్ఫూర్జల్లలాటేందు సుం
దరమై, శ్రీ శరదిందు బింబరుచి చందం బొప్పు నెమ్మోమునన్.

దలదంభోజపలాశలోచనము నుద్యత్పక్వ బింబాధరా
కలితస్మేర శుచిస్మితాకలిత తద్దంతావళీకాంతి సం
కులితాశాంబర, మిందుపాండురలసద్గండస్థలీలోలకుం
డలమున్ మౌక్తిక మంజరీ మధుర కర్ణశ్రీక సుశ్లోకమున్.

ఉరమై గుండ్రతనమ్మునన్ గలిగి యొంతో యొప్పు ముత్యాలహా
ర రుచిం గుల్కెడు కంఠదేశ మటుపై రమ్యేంద్రనీలావనీ
ధరరోచిన్ జకితమ్ము సేయు పరమోదార ప్రభాపూర మ
వ్వరలక్ష్మీ శుభమందిరాయిత మహావక్షఃస్థలాఢ్యమ్మున్.

చరణాబ్జమ్ముల నానఖస్ఫురణ మాక్రాంతంబు జేరాడుచున్
వరభోగీంద్ర సమానదోర్యుగమునన్ వాసించి వ్రేలాడుచున్
వరవస్త్రాభము దట్టమై మెఱుపుదీవం దాల్చు చందంబు దో
ప, రహిన్ ఫుల్లవనామలస్రజము శోభల్ నించు సౌందర్యమున్.

మణిమత్కంకణ కాంతిమాంసలము, శుంభత్ఫుల్లపద్మారుణా
రుణ, మాక్రాంతనతాశ్రితోద్ధరణమై రూపించుహస్తద్వయిన్
గణుతిన్ రత్నమయాంగుళీయకవిభా కల్పాంగుళిన్ వేణు పూ
రణముం జేసి యశేష జీవుల మనోరాగ శ్రుతుల్ గాంచునున్.

ఉదరోద్యద్వళినిమ్నగాలహరిమై యొప్పారు నూగారు ను
న్మదగోపీ నయనానుకర్షణ సునిమ్నంబైన యన్నాభి యొ
ప్పిదమై బంగరు సీరునన్ దొలఁకు నాపీతాంబర శ్రీ ప్రభా
మృదులమ్ముల్ మఱి యూరువుల్ గులుకు నా మేలైన సౌభాగ్యమున్.

లలిత శ్రీమణినూపుర శ్రుతిజటాలంబైన జంఘాయుగ
మ్మలఘుస్పర్థి ముఖస్థ దంతివరహస్తాగ్రైక జంఘాలమం
జులజంఘాయుగ దివ్యవైభవమునై శోభిల్లు చిద్బింబమున్
కులిశమ్మంకుశమంబుజమ్ము మఱి శంఖున్ జక్రమున్ గేతన
మ్ములరేకల్ గులుకంగ కోమలములై ముద్దుల్ పిసాళించు మం
జులముల్ పాదతలంబులున్ జెలఁగు మేల్ సొంపున్ నిగారింపునన్
దొలుకన్ బ్రహ్మశివాది దేవమకుట స్తోమాగ్రరత్నప్రభా
కలిత శ్రీనఖ చంద్రికావిదళిత క్షోణీజనక్షోభమై.

చెలువా పాదయుగమ్మునుం గల కృపాశృంగారమాకారమున్
కలలో నిద్దురలోన మేల్కొలుపులో గన్గొందుగా కింటిలో
వెలి రాదారుల దారులం దదియ యోవిశ్వేశ! నీమూర్తి క
న్నులలోఁ గట్టిన యట్లు చిత్తమున నెంతో హత్తినట్లయ్యెడిన్.

నవఘన నీలిమద్యుతి కన న్నమనీయ మశేష వేదవై
భవకమనీయ మూసాబఁగు పాపగతిం బడిపోవు నన్ను నం
భవ మిదియేను గాదనక మక్కువ కన్నులనేని యబ్బి మా
నవ పరమాణువున్ నను సనాథుని జేయునుగాక యిప్పుడే.

హరి! నీకున్ బ్రణమిల్లి కోరెదనురా హా! అంజలింబట్టి నే
వరమీ యొక్కటిగాఁగ నొక్కటి ప్రభూ! వద్దెందునున్ జన్మ, మీ
శ్వర! పుట్టింతువొ భూమి దున్ను కొను నవ్వారింటఁ బుట్టింపు సుం
దర గోవిందపదారవింద మధుమత్తంబైన చిత్తమ్ముతో

అమృతస్యంది వచోవిలాసమును నానందించినా వైన! స్వ
ప్నమునం దైనఁ దలంప నీకృప యహంభావాన సిగ్గింత లే,
దమిత మ్మీమయపరాధమున్ గనక నన్నాత్మీయుగా గొన్న నీ
కు మరేదీ దయసాటి? మత్తులను, నాకున్ సాటి యేదీ ప్రభూ!

పాతాళంబున కేగుమా సురపురిం బాలింపుమా మేరువుం
వాతూలోద్గతి నెక్కుమా జలధులం బాహుద్వయిం దాటుమా
చేతస్సక్తములైన యాశలవి నిశ్శేషమ్ముగా వీడవో
భూతవ్యాధిజరాజ్వరాహత! సుఖంబుం గోరితేనిం మదిన్,
ప్రీతిం గృష్ణరసాయనమ్ము గొనుమా! వేరే శ్రమ మ్మేటికిన్

పాపమహీధరమ్ములకు వజ్రము, జన్మరుజాభిఘాత సం
తాప సుసిద్ధభేషజము, 'దంభ' తమఃపటలార్క బింబముల్
వ్యాపృత దుఃఖభూరుహ దవాగ్నికలాపము! 'కృష్ణ' నామమీ
శా! పరనిర్వృతి ప్రకట సౌధకవాటము పోల్చు నున్నతిన్

ఘనవిష కూటపీ శిఖ శిఖావితతిన్ వికలత్వమొంది నా
మన మిటు మాధురీ పరమ మందిరమందు ముకుంద ముగ్ధ మో
హనవద నేందుబింబమున సంచిత చారు చకోరవృత్తి చే
ననిమిష భావ మొంది యమృతాప్లుతమై విలసిల్లుఁ గావుతన్

అమరతరంగిణీ పులినమందు సుఖాసనముండి కన్నులం
దమరిచి యోగముద్ర, విషయమ్ము లదగ్చి, హరించిలోని సం
తమసము సత్సుఖాత్మక సుధారస నిర్ఝరి నన్నవాంబుదో
త్తమరుచిఁ జిత్కళన్ మునిఁగి ధన్యుఁడ నౌటది యెన్నఁడో కదా!!

వసంతరాజీయము

శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు

'వసంతరాజీయము' రెడ్డిరాజగు 'కుమారగిరి' చే (క్రీ. శ. 1386-1402) రచింపబడిన నాట్యశాస్త్రగ్రంథము. ఈ కుమారగిరిరెడ్డికి 'వసంతరాయలు', 'కర్పూరవసంతరాయలు' అను బిరుదులు కలవు. ఈ బిరుదులను బట్టియే అతని నాట్యశాస్త్రము 'వసంతరాజీయ' మనబడింది.

ఈ వసంతరాజీయము గ్రంథ మంతయును లభింపకపోవుట ఆంధ్రుల దురదృష్ట మని చెప్పక తప్పదు. ఈ గ్రంథమునుండి ఆయా వ్యాఖ్యాతలు తమ తమ వ్యాఖ్యానములందు ఉదాహరించిన లక్షణ శ్లోకములను పట్టి దీని స్వరూపమును మాత్రము కొంత ఊహింపుటకు వీలగుచున్నది.

'వసంతరాజీయ' మను పేర శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు 'పాఠక' స్మారక సంచికలో ఒక ఆంగ్లవ్యాసమును ప్రకటించినారు. ఆ వ్యాసమునందు రెడ్డిరాజుల చరిత్ర వివరింపబడినది; అంతమున మాత్రము వసంతరాజీయమునందలి తొమ్మిది శ్లోకములు ఉదాహరింపబడినవి. శ్రీమాన్ కృష్ణమాచార్యులుగారు కూడ తమ 'సంస్కృతవాఙ్మయ చరిత్ర'లో ఈ శ్లోకములనే ఉదాహరించియున్నారు.

ఇప్పుడు నే నింకను చాల శ్లోకములను సేకరించినాను. వానిని సహృదయుల పరిశీలనార్థము నివేదించుటకే ఈ నా ప్రయత్నము.

వసంతరాజీయ శ్లోకములను తమ తమ వ్యాఖ్యానములం దుదహరించిన వారిలో కాటయవేముడు ముఖ్యుడు. కాటయవేముడు కుమారగిరియొక్క బావమఱది. ఇతడు కాళిదాస ప్రణీతములగు మూడు నాటకములకును 'కుమారగిరి రాజీయము' అను పేర వ్యాఖ్యలను రచించెను. వసంతరాజీయశ్లోకములను పేర్కొనిన రెండవ వ్యాఖ్యాత తిమ్మరుసు మేనల్లుడగు నాదిండ్ల గోపమంత్రి. ఇతడు కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయమునకు 'చంద్రిక' అను వ్యాఖ్యను రచించెను. వ్యాఖ్యాతృచక్రవర్తి యగు మల్లినాథసూరి శిశుపాలవధవ్యాఖ్యలోను, వాని కుమారుడగు కుమారస్వామి ప్రతాపరుద్రీయ వ్యాఖ్యలోను వసంతరాజీయమునుండి చెరియొక శ్లోకమును పేర్కొనియున్నారు. నేను చూచినవి ఇవి మాత్రమే. ఇంకను ఎందఱు వ్యాఖ్యాతలు వసంతరాజీయ శ్లోకములను పేర్కొనిరో తెలియదు. పరిశోధకు లింకను పరిశీలింపవలసియున్నది.

నేను పరిశీలించిన పై వ్యాఖ్య లన్నియును ముద్రితములే. వాని వివరముల నీ క్రింద నొసంగుచున్నాను.

1. కాటయవేముని అభిజ్ఞానశాకుంతల వ్యాఖ్య—దీనిని శ్రీ సి. శంకరరామశాస్త్రిగారు ప్రకటించినారు. (అభిజ్ఞానశాకుంతలము—బాలమనోరమా ప్రెస్, మద్రాసు, 1947.)

2. కాటయవేముని మాలవికాగ్నిమిత్రవ్యాఖ్య—దీనిని శ్రీ ఎమ్. ఆర్. కాళేగారు ప్రకటించినారు. (మాలవికాగ్నిమిత్రము— గోపాల్ నారాయణ్ అండు కో, బొంబాయి, 1922).

3. కాటయవేముని విక్రమోర్వశీయవ్యాఖ్య—దీనిని శ్రీ చారుదేవశాస్త్రిగారు ప్రకటించినారు. (లాహోరు, 1929).

[పై వ్యాఖ్యలను మఱికొందఱుకూడ ప్రకటించినారట. అవి నాకు లభ్యము కాలేదు.]

4. గోపమంత్రి ప్రబోధచంద్రోదయవ్యాఖ్య—దీనిని శ్రీ వాసుదేవశర్మగారు పరిష్కరించినారు. (ప్రబోధచంద్రోదయము—నిర్ణయసాగర ముద్రణాలయము, బొంబాయి, 1928).

5. మల్లినాథసూరి శిశుపాలవధ వ్యాఖ్య— (శిశుపాలవధము — నిర్ణయసాగర ముద్రణాలయము, 1917).

6. కుమారస్వామి ప్రతాపరుద్రీయ వ్యాఖ్య—దీనిని శ్రీ కె. పి. త్రివేది ప్రకటించెను. (ప్రతాపరుద్రీయము—బొంబాయి, 1909).

పై వ్యాఖ్యాతలు వెలువరించు తెలుగువారికి అరుదు గనుక వ్రాసితిని.

కాటయ వేముని శాకుంతలవ్యాఖ్యయొక్క వ్రాతప్రతి యొకటి (నం. 1864) కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తులో కలదు. నేను దానినికూడ పరిశీలించినాను. శ్రీ శంకరరామశాస్త్రిగారు శాకుంతల వ్యాఖ్యాన ప్రారంభమందలి 19 శ్లోకములను వెలుగులో ప్రకటింపలేదు. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు మాత్రము వీనిని 'రెడ్డి సంచిక'లో ప్రకటించియున్నారు (పుటలు-854-856).

కుమారగిరిరెడ్డి విలాసపురుషుడనియు, అతని బావమరదియును, మంత్రియును అగు కాటయవేముచే రాజ్యభారమును వహించి పరిపాలనము కావించెననియు చరిత్ర తెలుపుచున్నది. శాకుంతల వ్యాఖ్యాన ప్రారంభశ్లోకములు ఈ అంశములనే విశదీకరించుచున్నవి.

కుమారగిరి రెడ్డియును, కాటయ వేముడును గొప్ప సంస్కృత పండితులు. కుమారగిరిరెడ్డి నాట్యశాస్త్రవేత్తయై నాట్యశాస్త్రమును రచింపగా, కాటయవేముడా నాట్యశాస్త్రము నాధారముగా చేసికొని కాళిదాసు నాటకములు మూడింటికిని వ్యాఖ్యలు రచించియున్నాడు. ఈ వ్యాఖ్యలు మనోహరములు, ప్రమాణములు అని విమర్శకులచే ప్రశస్తులందినవి. వసంతరాజీయము లభించియున్నచో అదికూడ ఇట్టి ఖ్యాతిని పొందియుండెడిది. ఇందు మిందుగా సమకాలికములైన కాటయ వేముని వ్యాఖ్యలు లభించి, ఆ వ్యాఖ్యల కాధారమైన వసంతరాజీయము లభింపకపోవుట ఆశ్చర్యముగా నున్నది.

నేను చరిత్రకారుని కాక, నా వ్యాసమును వ్యాఖ్యాత ఉదాహరించిన శ్లోకములకే పరిమితము చేసికొని, వసంతరాజీయ స్వరూపమును సూచించుటకు మాత్రమే ప్రయత్నింతును.

కుమారగిరిరెడ్డి వసంతోత్సవ వైభవమును అనవేముని 'ప్రుజ్జకరందానశాసనము' (శ. క. 1871) ఈ క్రింది విధముగా వర్ణించుచున్నది (శ్రీ మల్లంపల్లివారి 'History of Reddi Kingdoms' చూడవలెను. పుట-472).

వసంతరాయస్య వసంతకేళౌ
కస్తూరికా రేణుదయాంబువాహాః
ప్రసం హిమాంబు ఘనవర్త ధారా
కర్పూర ఖండాః కరకా వికీర్ణాః ॥

—(పై శ్లోకమందు 'రాయశ్య' అను చోట 'రాయస్య' అని ఉండుట సమంజసముగా నుండును) "వసంతరాయులయొక్క వసంతకేళియందు కస్తూరికా రేణు పటాహమే మేఘము, హిమాంబువులే వర్ష ధారలును, కర్పూరఖండములే వడగండ్లును అగుచున్నవి."

పై శ్లోకమును శ్రీనాథు డనుసరించినట్లు శ్రీ మల్లంపల్లివారే గుర్తించియున్నారు—

సీ॥ బహుళ కస్తూరికా మేఘపటలముచేత
కేసరాసార మయ్యె గోష్ఠాంగణము
వెలయ వడగండ్లు వర్షించె వర్షసమయ
గామినులు చల్లు కర్పూరఖండ వితతి.

—(భీమఖండము-5 ఆ. అ, 124 ప.)

ఇట్లు వసంతోత్సవ ప్రియుడైన కుమారగిరిరెడ్డి సర్వరాజ్యభారమును కాటయవేమునిపై పెట్టి, తాను విలాసముగా కాలమును గడిపెడివాడట—

భాగ్యం నామ సమగ్ర దివ్యకృతిమతిస్స హైక
పాత్రం యతో
వీరం కాటయ వేమ మద్భుతరిపుధ్వంసే నియుజ్య
స్వయమ్
నిత్యం సంపది వర్తమానై రభినవైః కాంతై ర్వ
సంతోత్సవైః
సంతానాభ్యుదయైః కుమారగిరిభూపాలో
నృపాలోత్తమః

—(మాలవికాగ్నిమిత్రవ్యాఖ్య ప్రారంభ శ్లోకము)

"కుమారగిరి ప్రభువు అదృష్టమే అదృష్టము; ఏలనన స్నేహపాత్రుడును, వీరుడును అగు కాటయ వేముని శత్రునాశనమందు వినియోగించి తాను నిత్యము అభినవములగు వర్తనములతోను, మనోహరములగు వసంతోత్సవములతోను, సంతానాభ్యుదయములతోను సంతసించుచున్నాడు."

కుమారగిరిరెడ్డి ఆస్థానమందు 'లకుమాదేవి' అనెడి నాట్యప్రవీణురాలుండెననియు, ఆమె కుమారగిరి ప్రభువు రచించిన నాట్యశాస్త్రమందలి రహస్యములను అభినయించి వన్నెకూర్చెదనియు కాటయవేముడు పేర్కొనెను—

జయతి మహిమా లోకాతీతః కుమారగిరి ప్రభోః
సనసిలకుమారీవ యస్య ప్రియా సదృశీ ప్రియా
ఇవ మభినయం నాట్యార్థానాం తనోతి సహ
ప్రజా
వితరతి బహులా వర్షా ఇర్థి ప్రబలాయ సహస్రశః

—('రెడ్డి సంచిక'—పుట—354; శ్రీ వేటూరివారి శృంగారశ్రీనాథము — పుట—57 కూడ చూడ వలెను)

"ఏ కుమారగిరి ప్రభువుయొక్క కీర్తి సదృశు రాలగు లకుమాదేవి సభలలో నాట్యశాస్త్రములకు వేలకొలది నూతనాభినయములను చేయుచున్నదో అర్థి బృందమునకు వేలకొలది ధనములను దానము చేయు చున్నదో ఆకుమారగిరి ప్రభుని మహిమ లోకాతీతమై వర్ధిల్లుచున్నది."

ఈ కుమారగిరిప్రభువు భరతాదుల నాట్యశాస్త్రములను చక్కగా పరిశీలించి వసంతరాజీయమును వ్రాసెననియు, ఆ వసంతరాజీయము ననుసరించి తాను కాళిదాస నాటకత్రయమునకు వ్యాఖ్యను రచించు చున్నట్లును కాటయవేముడు చెప్పుకొనెను...

మునీనాం భరతాదీనాం భోజాదీనాం చ భూభుజామ్
శాస్త్రాణి సమ్యగాలోచ్య నాట్యవేదార్థ వేదినామ్
ప్రోక్తం వసంతరాజేన కుమారగిరిభూభుజా
నామ్నా వసంతరాజీయం నాట్యశాస్త్రం
యదుత్తమమ్॥
తత్రోక్తేనైవమార్గేణ దర్శితాశేష లక్షణమ్
కవీనా మాశ్రయో మంత్రీ కాటభూపతినామకః
సోఽహం వేమవిభుః కుమారగిరిణా రాజ్ఞా
నియుక్తః కృతీ
నాట్యానాం త్రితయం కృతం కృతధియా
శ్రీ కాళిదాసేన యత్
తస్యోద్దీర్ణరసార్ణవస్య రసికః శాకుంతలాదేస్స్వయమ్
వ్యాఖ్యానం కురుతే కుమారగిరిరాజీయాఖ్య
మస్మైహితమ్

—(మా. 'రెడ్డి సంచిక'—పుట 356)

"నాట్య వేదార్థ విదులైన భరతాదిమునులయు, భోజాది భూపతులయు శాస్త్రములను చక్కగా పరిశీలించి 'వసంతరాజు' అనబడెడి కుమారగిరిభూపతి 'వసంత రాజీయ' మనెడి ఉత్తమ నాట్యశాస్త్రమును రచించెను. అందు చెప్పబడిన మార్గము ననుసరించియే రాజాజ్ఞానుసారముగా, కాటయవేముడు, ప్రజ్ఞాశాలియైన కాళిదాసుచే రచింపబడిన రసనిధులగు మూడు నాటకములకును 'కుమారగిరిరాజీయము' అను పేర వ్యాఖ్యానమును చేయుచున్నాడు"

కాటయవేముడు మొట్టమొదట శాకుంతల వ్యాఖ్యను రచించినట్లు కన్పట్టుచున్నది. అందలి లక్ష్యము కెల్ల లక్షణశ్లోకములను పేర్కొని యుండెను. కాని మాళవికాగ్నిమిత్రమందు "నాంద్యాదిలక్షణంతు శాకుంతల వ్యాఖ్యాన ఏవాభిహితం" (నాంద్యాదుల లక్షణములు శాకుంతల వ్యాఖ్యానమందే చెప్పబడినవి) అని వ్రాసినాడు. అందుచేత శాకుంతల వ్యాఖ్య మొదటి దియును, మాళవికాగ్నిమిత్రవ్యాఖ్య రెండవదియును అగుచున్నవి. దీని తరువాత విక్రమోర్వశీయ వ్యాఖ్యను రచించియుండును.

కాటయవేముని వ్యాఖ్యలందు నాట్యశాస్త్రము నకు సంబంధించిన అనేక లక్షణ శ్లోకములు ఉదాహృతములైనవి. వానిలో కొన్ని శ్లోకములకు మాత్రమే 'యథోక్తం వసంత రాజీయే', 'తథాచోక్తం వసంత రాజీయే', 'ఉక్తం వసంతరాజీయే', 'తల్లక్షణంతు వసంతరాజీయే' అని స్పష్టముగా నున్నది. కావున ఇట్లు చెప్పబడిన శ్లోకములన్నియును వసంతరాజీయము లోని వనుట నిర్వివాదము. ఇంక తక్కిన శ్లోకము లెవ్వ టివో చెప్పబడలేదు; ఆశ్లోకములలో కొన్నింటికిముందు 'ఉక్తం'. 'యదుక్తం', 'తథాచోక్తం' 'తదుక్తం' అనియు, కొన్నింటికి వెనుక 'ఇత్యుక్తత్వాత్', 'ఇత్యుక్తః', 'ఇతి' అనియు కలదు. ఆ శ్లోకములు కూడ వసంతరాజీయములోనివే యని నేను సకారణ ముగా ప్రతిపాదించుచున్నాను.

నాట్యశాస్త్రేతర విషయములకు లక్షణ శ్లోకము లను ఉదాహరించునప్పుడు కాటయవేముడు ఆగ్రంథ నామమును కాని, తద్గ్రంథకర్తృనామమును కాని తప్పక పేర్కొనినాడు. ఉదా:— యథాచోక్తం 'త్రిపురాసుర సింధౌ' "అరవింద మశోకంచ శిరీషం చూత ముత్పలమ్ పంచైతాని ప్రకీర్త్యంతే పంచబాణస్య సాయకాః" (శాకుంతల వ్యాఖ్య - పుట 144). ఎవ్వటివో పేరు చెప్పకయే ఉదాహరించిన శ్లోకములు వసంతరాజీయ మందలివి కాక ఇతర గ్రంథములందలి

అయినచో పై విధముగానే కాటయవేముడు మూలములను పేర్కొని యుండెడివాడు. అట్లు పేర్కొని యుండకపోవుటచేత ఆ శ్లోకములు ఇతర గ్రంథములలోనివి కావనియు, అవి యెల్ల వసంతరాజీయములోనివే అనియు భావించుచున్నాను. "తత్రోక్తే నైతదూర్ధ్వేణదర్శితా కేవలక్షణం. వ్యాఖ్యాస్యంకుతే" అని కాటయవేముడు స్పష్టముగా చెప్పకొనియుండుట నా ప్రతిపాదనమునకు బలమొసంగు చున్నది.

కావున కాటయవేముని వ్యాఖ్యలందలి నాట్యశాస్త్ర సంబంధి శ్లోకము లన్నియును వసంతరాజీయములోనివనియే తలంచుట సముంజసము. తక్కిన రెండువ్యాఖ్యల విషయము మెట్లున్నను మొట్టమొదట వ్రాయబడిన శాకుంతల వ్యాఖ్యయందలి లక్షణశ్లోకము లైనను తప్పక వసంతరాజీయము నందలివే అని నేను విశ్వసించుచున్నాను. ఈ శ్లోకముల నన్నింటిని నాట్యశాస్త్రము, దశరూపకము, ప్రతాపరుద్రీయము, సాహిత్యదర్పణము, నాట్యదర్పణము, భావప్రకాశము మొదలగు నాట్యశాస్త్ర గ్రంథములందలి శ్లోకములతో చాలవఱకు సరిచూచినాను; ఇవి భిన్నములుగా నున్నవి. అందుచే ఇవి వసంతరాజీయములోనివే అని మఱింత నిశ్చయముగా చెప్పగలుగుచున్నాము. కొన్ని శ్లోకార్థములు మాత్రము (ఉదా: బీజలక్షణము మొ) దశరూపక, ప్రతాపరుద్రీయాది శ్లోకములతో సంవదించుచున్నవి; ఆ కాక నాట్యశాస్త్రగ్రంథములను పరిశీలించియున్న వరుసగా తెలుప వచ్చిన లక్షణములను అచ్చటచ్చట అట్టే పొందుపఱచియుండును. అవ ఱిట్టి పోలికలు ప్రతిగ్రంథమునందును కలవు. కావున పైశ్లోకములు వసంతరాజీయమునందలివే అనుటకు ఇట్టిపోలికలు ప్రతిబంధకములు కాజాలవు.

ఇప్పుడింక వసంతరాజీయ శ్లోకములను ఒక క్రమములో పేర్కొందును. వీనిని కొన్ని శీర్షికల క్రింద విభజించియున్నాను. అవి ఏ వ్యాఖ్యానము నందలివో కూడ పరిశీలించియున్నాను. మొత్తము శ్లోకసంఖ్యను కూడ గణించినాను; కొన్ని శ్లోకములు, శ్లోకపాదములు ఒకతడవలోనివి కాకపోయినను, సౌలభ్యార్థము మొత్తము, సంఖ్యను గణించియున్నాను. 'వసంతరాజీయ మందలివి' అని స్పష్టముగా చెప్పబడిన శ్లోకములకు శ్లోకపాదములకు గుర్తులు పెట్టినాను.

నాంది

* ప్రథమః పూర్వరంగశ్చ తతః ప్రస్తావనేతి చ ।
ఆరంభే సర్వనాట్యానా మేత త్సామాన్య మిష్యతే॥

* యన్నాట్యవస్తునః పూర్వం రంగవిఘ్నోపశాంతయే।
కుశీలవాః ప్రకుర్వంతి పూర్వరంగః స ఈరితః॥ 2

* యద్యప్యంగాని భూయాంసి పూర్వరంగస్య నాటకే।
తేషామవశ్యం కర్తవ్యా నాందీ నందీశ్వరప్రియా॥ 3

* ఆశీర్నమస్క్రియారూపః శ్లోకః కావ్యముఖోదితః।
నాందీతి కథ్యతే తస్యాం పదాది నియమోఽపి వా॥ 4

* మాంగల్యారంభ చక్రాబ్జ కోక కైరవశంసినీ।
నాందీ పదై ర్ద్వాదశభి రష్టాభి ర్వాప్యలంకృతా॥ 5

—(శాకుంతలవ్యాఖ్య పుట. 2)

శాఖార్థ సూచనం కైశ్చి న్నాంద్యామేవ నిరూప్యతే

—(శా. వ్యాఖ్య-పుట. 2)

[పై అయిదు శ్లోకములకును ముందు 'యథోక్తం వసంతరాజీయే' అని కలదు. కావున ఇవి అన్నియును వసంతరాజీయములోనివే అని స్పష్టమగుచున్నది. పై వానిలో "యన్నాట్యవస్తునః...సఈరితః" అను శ్లోకమును 'యథాహ వసంతరాజః' అని చెప్పి మల్లినాథసూరి శిశుపాలవధ వ్యాఖ్యలో ఉదాహరించియున్నాడు (2 వ. సర్గ, 8 వ. శ్లోక వ్యాఖ్యలో) దీనిని శ్రీ వేంకటరావుగారు పేర్కొనియున్నారు. "యద్యప్యంగాని...నందీశ్వరప్రియా" అను శ్లోకమును 'అత ఏవాభిప్రాయేణోక్తం వసంతరాజీయే' అని చెప్పి గోపమంత్రి ఉదాహరించియున్నాడు. (ప్రబోధ చంద్రోదయము - పుట 7) దీనినికూడ శ్రీ వేంకటరావుగారు పేర్కొనిరి.

నేపథ్యము

కుశీలవ కుటుంబస్య స్థలీ నేపథ్య మిష్యతే॥ 6

—(శా. వ్యాఖ్య. పుట. 2)

ఆముఖము

సూత్రధారో నటీం బ్రూతే మారిషం వా విదూషకమ్।
స్వకార్య ప్రస్తుతాక్షేపై ర్విచిత్రై ర్వచనై స్తథా॥ 7
వీథ్యంగై రుచితై ర్వాపి యత్రేదం ప్రాహురాముఖమ్।

—(శా. వ్యాఖ్య - పుట. 4.)

ప్ర రో చ న

వినోదజననం ప్రయోజ్యస్య నిర్దేశో దేశకాలయోః॥ 8
కావ్యార్థ సూచనక్తైః సూక్తైః సభాయాశ్చ స్థిరంజనమ్
కవికావ్య నటాదీనాం ప్రశంసా తు ప్రరోచనా॥ 9

—(శా. వ్యాఖ్య. పుట. 2)

ఉద్ఘాత్యకము (వీథ్యంగము)

* మూఢీ ప్రస్తుతార్థస్య యా ప్రశ్నోత్తర మాలికా
ఉద్ఘాత్యకః మితి ప్రాహు స్తత్రేత న్నాట్యవేదినః

[ఇది కాశీవాస సాహిత్య పరిషత్తులోని వ్రాత ప్రతిలో మాత్రమే ఉన్నది. ఈ శ్లోకమునకు ముందు 'తథా వసంతరాజీయే' అని కూడ కలదు. ఈ మాట కాని, ఈ శ్లోకముకాని ముద్రిత వ్యాఖ్యలో లేనే లేవు. ఇది సంపాదకుని పొరపాటో, లేదా వారికి దొరికిన వ్రాతప్రతిని వ్రాసిన లేఖకుని పొరపాటో తెలియదు. ముద్రిత వ్యాఖ్యలో "...ఉద్ఘాత్యకం నామ వీథ్యంగముక్తం భవతి" అని మాత్రమే కలదు.

(శా. వ్యా. పుట 5]

ప్ర యో గా తి శ య ము

ఏషోఽయ మిత్యుపక్షేపాత్ సూత్రధార ప్రయోగతః
భవేత్పాత్ర ప్రవేశో యః ప్రయోగాతిశయో హి సః 11

(శా. వ్యాఖ్య పుట 6)

భా షా వి ధా న ము

స్త్రీ విదూషక బాలానాం శూద్రాణాం ప్రాకృతం వదః।

(శా. వ్యాఖ్య పుట 3)

ప్రాయేణ ప్రాకృతస్థానే శౌరసేనీ విధీయతే॥12

(శా. వ్యాఖ్య పుట 3)

మ్లేచ్ఛాంత్యజ పిశాచాదౌ పైశాచీ వాపి మాగధీ

(శా. వ్యాఖ్య పుట 135)

సంబోధన విధానము

విప్రాహూత శ్శ్రుగ్ణా ప్రాప్తార్యా నటీసూత్ర కృతో మిథః॥ 13

(శా. వ్యాఖ్య-పుట 2)

[ముద్రితమైన శాకుంతల వ్యాఖ్యలో ఈ శ్లోక పాదమునకు ముందు 'తథోక్తం' అనిమాత్రమే కలదు. కాని కాశీవాస సాహిత్య పరిషత్తులోని వ్రాత ప్రతిలో 'తథాచోక్తం వసంతరాజీయే' అని యున్నది. కావున ఇది వసంతరాజీయములోనిదే అనుట స్పష్టము.

స్వామిన్ దైవేతి నృపతి ర్భృత్యై ర్భట్టేతి చాధమైః।

(శా. వ్యాఖ్య. పుట 44)

పూజ్యా భద్రముఖేత్యేవం మతే రాజ్ఞ సుతేఽనఘా॥ 14

అ ర్థో ప క్షే ప క ము లు

ద్వేధా వస్తు విభాగః స్యాత్సూచ్యమాద్య ఇతీష్యతే।
నీరసోఽనుచితస్తత్ర సూచ్యః స్యా ద్వస్తు విస్తరః॥ 15

దూరాధ్వానం వధం యుద్ధం రాజ్యదేశాది విప్లవాన్।
సంరోధం భోజనం స్నానం సురతం చానులేపనమ్॥ 16

అంబర గ్రహణాదీని ప్రత్యక్షాణి న నిర్దిశేత్।
అర్థోపక్షేపకైః సూచ్యం పంచభిః ప్రతిపాదయేత్ ॥ 17

అర్థోపక్షేపకాణిస్యుః విష్కంభకః ప్రవేశకః।
చూలికాంకావతారశ్చ తథాంకముఖమిత్యపి॥ 18

(—శా. వ్యాఖ్య-పుటలు-33-34)

అంకేతర కథాంశానాం భూతానాం భావినామపి।
సంక్షేపేణ సమస్తానాం విష్కంభః సూచనా భవేత్ ॥ 19

శుద్ధోమిశ్రస్తు తద్భేదౌ మధ్యపాత్ర ప్రయోజితః
శుద్ధో భవతి, మిశ్రస్తు నీచపాత్ర ప్రయోజితః॥ 20

ప్రధానాదపరం మధ్యం నాయకాదే రమాత్యవాక్।
నీచం స్యాదనుజాతోక్తి నారీ పరిజనాదికమ్॥ 21

* అంకయోర్మధ్యగ శ్చ మధ్యపాత్ర ప్రయోజితః।
శుద్ధో భవతి మిశ్రస్తు నీచపాత్ర ప్రయోజితః
విష్కంభ ఏవ వాల్యస్త్రైః ప్రవేశక ఇతిస్మృతః॥ 22

—(శా. వ్యాఖ్య పుట. 38)

[కాకినాడ సాహిత్యపరిషత్తులోని వ్రాత ప్రతియందు ప్రవేశకలక్షణమునకుముందు 'తదుక్తంతు వసంతరాజీయే' అని ఉన్నది; కావున ఇది వసంత రాజీయములోనిది అనుటస్పష్టము. ఆ వ్రాత ప్రతియందు ప్రవేశక లక్షణము "అంకయో ర్మధ్యవర్తీ చ నీచపాత్ర ప్రయోజితః। విష్కంభ ఏవ నాట్యజ్ఞైః ప్రవేశక ఇతి స్మృతః" అని ఉన్నట్లు కర్త అట్లు అచ్చట లేక పోయినను ఈవిధముగా నుండుట సమంజసము]

* నేపథ్యాంతః స్థితైః పాత్రైః చూలికార్థస్య సూచనా।
విష్కంభ ఖండయో చాంతే వా ప్రయోగోఽస్యాః
ప్రకీర్తితః॥ 23

—(శా. వ్యాఖ్య పుటలు 34;77)

అంకాంతపాత్రేణాంకస్య ముక్తిరంకార్థ
సూచనా।

—(శా. వ్యాఖ్య. పుట 110)

[అర్థోపక్షేపకములను వివరించెడి పై శ్లోకము లన్నియును ఇంచుమించుగా వరుస శ్లోకములు (continuous verses) వాని మధ్యలో ప్రవేశకలక్షణము వసంత రాజీయము లోని దైనప్పుడు తక్కినవి కూడ వసంతరాజీయములోనివే అని తలంచుట అసమంజసము కాదు.]

ఆకాశభాషితము

అప్రవిష్టైర్య ఆలాపః స ఏవాకాశభాషితమ్॥ 24
ఏష ప్రయోజ్య ఆకాశే లక్ష్యం బద్ధ్వే
త్యనంతరమ్।
కిమాత్థేతి వదోఽముష్య పశ్చాత్కార్యం
తదుత్తరమ్॥ 25

(శా. వ్యాఖ్య. పుట 61)

అంకము

అంకో బీజబిందు సమన్వితః......।

(శా. వ్యాఖ్య. పుటలు 40; 59)

పంచాది దశ పర్యంతమంకః కార్యాస్తథో
చితమ్॥ 26

(శా. వ్యాఖ్య పుట 3)

.........శేషా మంతే చ నిర్గమః (శేషాః= అంకములు)।

(శా. వ్యాఖ్య. పుట. 36)

పతాకాస్థానకము

* పతాకాస్థానకం ప్రాహు ర్భావినోఽర్థస్య
సూచనమ్॥ 27
చతుర్భిః కారణైరేవ చతుర్ధా పరికీర్తితమ్।
* సహసైవార్థసంపత్త్యా విపర్యాసమనిర్దయాత్ ॥ 28
తుల్యేన సంవిధానేన తథాతుల్య విశేషణాత్।

(శా. వ్యాఖ్య. పుట 9)

[ముద్రిత ప్రతియందును, వ్రాతప్రతియందును కూడ 'యథోక్తం వసంతరాజీయే' అని కలదు. ముద్రింపబడిన ప్రతిలో 104 వ. పుటలో ఈ శ్లోకములు మరల ఉదాహృతములైనవి. కాని అచ్చట 'తథోక్తం' అని మాత్రమే ఉన్నది; ఇది పొరపాటు అయి యుండును. ఇవి రెండును వసంతరాజీయము లోనివే అనుట స్పష్టము.]

ఆత్మగతాదులు

అశ్రావ్యం నియతశ్రావ్య మపవార్య
మితి త్రిధా॥ 29
అశ్రావ్య మన్యైరజ్ఞాత మాత్మన్యేవ స్థితం విదుః।
తదాత్మగత మిత్యుక్త్వా నాట్యజ్ఞస్సం
నివేశయేత్॥ 30
* అర్థస్త్వేకేన విజ్ఞేయో నియతశ్రావ్య ఇష్యతే।
ద్వివిధః సపరిజ్ఞేయో జనాంత శ్చాపవారితమ్॥ 31
కు హ్యస్య కుహ్యేతర శ్చేతి జనాంతో
ద్వివిధో మతః।
వ్యాజ జనాంతిక మిత్యుక్త్వా వాదయేః పూర్వ
స్తథాపరః॥ 32
కర్ణ ఏవమిత్యుక్త్వా జప్యః పశ్చాత్సంగతేః।
పరావృత్యాకర్ణనీయార్థః శ్రావ్య ఇత్యభిధీయతే॥ 33
ఏతం ప్రకాశ మిత్యుక్త్వా తయోరంతే ప్రయో
జయేత్।

—(శా. వ్యాఖ్య-పుటలు-22-23.)

["అర్థస్త్వేకేన ... జనాంతశ్చాపవారితః" అను శ్లోకమునకు ముందు మాలవికాగ్నిమిత్రవ్యాఖ్యలో 'యథోక్తం వసంతరాజీయే' అనియున్నది (పుట. 26) కావున ఇది వసంతరాజీయములోనిదనుట స్పష్టము. పై శ్లోకములు ఇంచుమించుగా వరుస శ్లోకములు.

అందుచే ఇవి యెల్ల వసంతరాజీయము లోనివే అని తలంచుట అసమంజసము కాదు]

* పరైరలక్ష్యమాణ్యపారే కథితోఽర్థోఽపవారితః॥ 34
ఉక్త్వాऽపవార్యేతి పర్యాదేనం ప్రయోజయేత్ ।
—(మాల. అగ్ని. వ్యాఖ్య-పుట-26)

[శాకుంతలవ్యాఖ్యయందు లేని అపవారితలక్షణము మాలవికాగ్నిమిత్రవ్యాఖ్యయందు కలదు. "అర్థ స్త్రీకేన..." అను వసంతరాజీయ శ్లోకము నుదాహరించి, 'అత్ర' అని చెప్పి పై శ్లోకమును కాటయ వేము డుదాహరించెను. కావున, సందర్భమునుపట్టి ఇదియును వసంతరాజీయములోనిదే అనుట నిర్వివాదము.]

అంగిరసము, అంగరసములు

* వీరోరసో భవేదంగీ వీరశృంగారయోర్ద్వయోః॥ 35
అంగాన్యశ్శేషరసాః సర్వేభవేన్నిర్వహణేఽద్భుతః।
—(విక్ర. ఊర్వ. వ్యాఖ్య-పుట. 42)

['తథాచోక్తం వసంతరాజీయే' అని ఈ శ్లోకమునకు ముందుకలదు. కావున ఇది వసంతరాజీయము లోనిదే.]

సంచారి భావములు

* ఇష్టార్థవిరహ-వ్యాధి-నిందాప-దావమానసైః ॥ 36
దారిద్ర్య-తాడ-నాక్షేప-పరవృద్ధ్యవలోకనైః ।
* నిష్ఫలత్వమతిర్నౄణాం నిర్వేదో జీవితాదిషు ॥ 37
అంతర్బాష్పోద్గమధ్యాన నిశ్శ్వాసవ్యాకులాననైః ।
* దైన్యగద్గదవైవర్ణ్యైరభినేయోఽథ వేదయం ॥ 38
* హర్షో మనః ప్రముల్లాసో గురుదేవమహీభుజామ్ ।
ప్రసాదా త్ప్రియసంగాద్వా భవే దిష్టార్థ లాభతః॥ 39
* ముఖనేత్ర ప్రసన్నత్వ ప్రియోక్తి పులకోద్గమైః।
దానత్యాగ పరీరంభై రభినేయోధి కేః తం॥ 40
* ఇష్టాలాభా దిష్టనాశా దనిష్టాప్తేశ్చ దైన్యతః।
చిత్త స్యైకాగ్రతా చింతా...
......స్మరణం చానుసంస్మృతిః॥ 41
* సంతాపోచ్ఛ్వాస నిశ్శ్వాసా మాంద్య మింద్రియ కర్మణాం।
అథోముఖత్వ మిత్యాద్యై రభినేయో ధ వేదయం॥ 42

* అతేజస్త్వంతు మనసో దైన్య మిత్యభిధీయతే ।
మనః సంతాపదారిద్ర్య చింతౌత్సుక్యాదిభి ర్భవేత్ ॥ 43
* అంగానా మపి శైథిల్యం దేహసంస్కార వర్జనం ।
అంచితం చ శిరస్తత్ర హ్యనుభావాః ప్రకీర్తితాః ॥ 44
(మాల. అగ్ని. వ్యాఖ్య-పుట-28.)

['తేషాం లక్షణ ముక్తం వసంతరాజీయే' అని చెప్పబడిన తరువాత పై శ్లోకము లన్నియును ఉదాహృతములైనవి. ఇవి అన్నియును వసంతరాజీయము లోనివనుట స్పష్టము.]

శృంగారావస్థలు

అభిలాషః స్పృహాతత్ర స్యాద్దృష్టే చాలంబనే శ్రుతే।
ఔత్సుక్యస్వేదరోమాంచ హార్ష విస్మిత హాస్యసైః॥ 45
చాపలస్తంభలజ్జాద్యై రనుభావైః సహోచ్యతే।
(శా. వ్యాఖ్య. పుటలు-19; 22)
మనస్సంయోగోఽనురాగేణ సతతం తద్విచింతనమ్॥ 46
(శా. వ్యాఖ్య. పుటలు.35, 36)
మనోరథః స్యాత్ సంకల్ప స్తస్యనాగమగోచరః।
మనోరథాన్యపదశా చంతః పాఠా త్ప్రతీయతే॥ 47
దృష్టార్థసంగసంకల్ప ఇతి కైశ్చిదుదీరితః।
-(శా. వ్యాఖ్య-పుట-40)
భవేద్గుణనుతి స్తస్య రూపాదిగుణకీర్తనమ్॥ 48
-(శా. వ్యాఖ్య. పుట.50)
క్రియాద్వేషో మతో ఽవ్యగ్ర విద్వేషో భోగ్య వస్తుషు
(శా. వ్యాఖ్య. పుట-62)
మనత్యాగ స్తాపహాని రౌత్సుక్యాతిశయో భవేత్ ॥49
—(శా. వ్యాఖ్య. పుట-74)

అభిసారిక

* మదేనమదనేనాపి ప్రేరితా శిథిలత్రపా।
యాత్సుకాభిసరేత్కాంతం సా భవేదభిసారికా॥50

* కులజాం గణికాం ప్రేష్యాం యథాశాస్త్రైర్వచేష్టితైః।
రాగాతిశయసంపన్నాం వర్ణయేదభిసారికాం॥ 51
—(వి॥క. ఊర్వ. వ్యాఖ్య-పుట. 60)

[ఈ శ్లోకములకుముందు 'అభిసారికా లక్షణముక్తం వసంతరాజీయే యథా' అని కలదు. కావున ఇవి వసంతరాజీయములోని వనుట స్పష్టము. మొదటి శ్లోకమును శ్రీ వేంకటరావుగారు పేర్కొనియున్నారు.]

వేశ్యానాయిక

వేశ్యేతి నాయికారాజ్ఞః పాదిన్యా శ్చాన్య మానుషీ।
—(వి॥క. వ్యాఖ్య-పుట-18.)

[ఈ శ్లోకపాదమునకు ముందు 'యథోక్తం వసంతరాజీయే' అని కలదు. కావున ఇది వసంతరాజీయములోని దనుట స్పష్టము. ఈ శ్లోకార్థమును సమర్థించు 'తథాచ భారతీయే' అని చెప్పి భరతుని నాట్యశాస్త్రమునందలి శ్లోకములను కొన్నింటిని కాటయ వేముడు ఉదాహరించియున్నాడు.]

కుపితనాయికల ననునయించు నుపాయములు

* సామ్నా దానేన భేదేన వత్యుపేక్షణ సాంత్వనైః॥ 52
మానాపనయనం తాసాముపాయైః షడ్భిరాచరేత్।
—(వి॥క. ఊర్వ. వ్యాఖ్య పుట 49)

ఈ శ్లోకమునకు ముందు 'యథోక్తం వసంతరాజీయే' అని కలదు. కావున ఇది వసంతరాజీయములోని దనుట స్పష్టము.]

నృత్తారంభోచితావస్థానము

* అంగస్య చతురశ్రత్వం సమపాదౌ లతాకరౌ॥ 53
ఆరంభే సర్వనృత్తానాం మేతి త్స్థానమవస్య మిష్యతే।
—(మాల. అగ్ని. వ్యాఖ్య—పుట 26)

[ఈ శ్లోకమునకు ముందు 'తథాచోక్తం వసంతరాజీయే' అని కలదు. కావున ఇది వసంతరాజీయమునందలిదే అనుట స్పష్టము.]

కపోత హస్తము

కపోతః ప్రాంతసంశ్లేషా దన్యోన్యస్యం సర్వ శీర్షయోః॥ 54
—(శా. వ్యాఖ్య. పుట 144)

నైపథ్య భేదములు

(చతుర్విధాహార్యాభినయములు)—

పుస్తం ప్రదర్శితం నాట్యే విమానాద్రి వనాదికమ్।
కుండలాది విభూషాంగరచనా త్వనులేపనమ్॥ 55
సంజీవః పశుపక్ష్యాది ప్రాణినాం రూపధారణమ్।
—(శా. వ్యాఖ్య-పుట. 8)

విషవేగములు

* వైవర్ణ్యం వేపథుర్దాహః ఫేనః స్కంధస్య భంజనం॥ 56
దుఃఖం జాడ్యం మృతిశ్చేతి విషవేగాః స్యురష్టధా।
—(మాల. అగ్ని వ్యాఖ్య-పుట. 69)

[ఈ శ్లోకమునకు ముందు 'విషవేగాస్తు వసంతరాజీయే కథితాః' అని కలదు. కావున ఇది వసంతరాజీయమునందలిది.]

అధర భేదములు

* వివర్తితో వికాసీచ విసృష్టశ్చ వినూహితః॥ 57
ఆయతో రేచితో న్యస్తః సంహృష్టశ్చ సముద్గకః।
* కంపితశ్చేతి నాట్యజ్ఞై రధరో దశధా మతః॥ 58
తత్ర -
* ప్రసారితో విసృష్టాఖ్యోఽవాదకే దర్శితాగ్రణః।
(శా. వ్యాఖ్య పుట - 185)

[ఈ శ్లోకములకు ముందు 'యథోక్తం వసంతరాజీయే' అని కలదు. కావున ఇవి వసంతరాజీయమునందలివే.]

ధ్రువా భేదములు

* నానాదేశపాత్రభేదానాం తత్స్వభావార్థ సూచనీ॥
యా గీతిః సా ధ్రువా తుల్యసంవిధాన విశేషతః।
* ప్రావేశిక్యాక్షేపికీ చ తథా ప్రాసాదికీతి చ॥ 60
నైష్క్రామికాంతరీ చేతి తాసాం లక్షణముచ్యతే।
* ప్రవేశే సూచకాద్యా తు ధ్రువా ప్రావేశికీ మతా॥ 61
ప్రసంగముద్ధృత్యాన్యార్థస్య క్షేపాదాక్షేపికీ మతా।
* ప్రాసాదికీతు పాత్రాణాం వ్యాకులానాం ప్రసాదనాత్॥ 62
నిష్క్రామసూచికాయాంతే ధ్రువా నైష్క్రామికీ భవేత్।
* విషాదే విస్మృతౌ క్రోధే ప్రమాదే సంభ్రమే మదే॥ 63

రోపప్రచ్ఛన్నవాదో ఽపి గీయతే యాతు సాంవృతి
—(ప్రబో. చం. వ్యాఖ్య-పుట-101)

['తథోక్తం వసంతరాజీయే' అని పేర్కొని పై శ్లోకములను గోపమంత్రి ఉదాహరించెను. కావున, ఇవి వసంతరాజీయమునందలివే అనుట స్పష్టము. శాకుంతల వ్యాఖ్యలో కూడ కాటయవేము డీ శ్లోకముల నుదాహరించెను. (పుట-112) కాని, అచ్చట 'యథోక్తం' అనిమాత్రమే కలదు. ఇది పొరపాటు. ఈ రెండింటికి పాఠభేదములుకూడ నున్నవి. కాటయవేముని పాఠము నే సరిఅయినదానినిగా గ్రహించుట సమంజసమగును. ఈ శ్లోకములను శ్రీ విడుదవోలు వేంకటరావు గారు పేర్కొనియున్నారు.]

కార్యావస్థలు

ఆరంభయత్న ప్రాప్త్యాశానియతాప్తి ఫలాగమః॥ 64
ఔత్సుక్య మాత్ర మారంభః ఫలలాభాయ భూయసే।
—(శా. వ్యాఖ్య. పుట-17)

ప్రయత్నస్తు ఫలప్రాప్తౌ ప్రవర్తన ముపాయతః॥ 65
—(శా. వ్యాఖ్య-పుట. 43)

ఉపాయాపాయశంకాభ్యాం ప్రాప్త్యాశా కార్య సంభవః। —(శా. వ్యాఖ్య. పుట. 82)

అర్థస్యాభావతః ప్రాప్తి ర్నియతాప్తిః సునిశ్చితా॥ 66
—(శా. వ్యాఖ్య. పుట. 153)

అర్థ ప్రకృతులు

స్తోకోద్దిష్టః కార్యహేతో ర్బీజం విస్తార్య నేకధా।
—(శా. వ్యాఖ్య. పుట. 15)

వస్తునః సతివిచ్ఛేదే బిందు రచ్ఛేద కారణమ్॥ 67
—(శా. వ్యాఖ్య. పుటలు-36; 79)

పతాకా సంధవే బీజం బిందునా విన్యసే త్సుధీః।
—(శా. వ్యాఖ్య. పుట-84)

కథాంతర ప్రసంగేన ప్రకరీ స్యాత్ ప్రవేశభాక్॥ 68
—(శా. వ్యాఖ్య. పుట-141)

కార్యం త్రివర్గ స్తచ్ఛుద్ధమేకా నేకానుబంధి చ।
—(శా. వ్యాఖ్య. పుట-196)

ముఖసంధ్యంగ లక్షణములు

[సంధి, సంధ్యంగ లక్షణముల నెల్ల శాకుంతల వ్యాఖ్యనుండియే గ్రహించితిని. లక్షణముల చివర కుండలీకరణములందు పుటల సంఖ్యల నొసంగియున్నాను.)

బీజన్యాస ముపక్షేపః (పుట 19), తద్బాహుల్యం పరిక్రియా (పుట 19)॥ 69

తస్యదార్ఢ్యం పరిన్యాసః (పుట 25), గుణాఖ్యానా ద్విలోభనమ్ (పుట 25)।

యుక్తిః సంశయితార్థస్య నిర్ణయః పరికీర్తితః (పుట 28)॥ 70

అర్థానా మనుభూతేశ్చైవ సుఖాప్తిః ప్రాప్తి రిష్యతే (పుట 33)।

యద్బీజస్యానుసంధానం తత్సమాధాన మిష్యతే పుట 35॥ 71

సుఖదుఃఖ విధానం య ద్విధానం పరికీర్తితమ్ (పుట 27)।

పరిభావ ఇతి ప్రాహు రద్భుతార్థస్య దర్శనమ్ (పుట 27)॥ 72

ఉద్భేదః సపరిజ్ఞేయో యత్తు గూఢార్థ భేదనమ్ (పుట 28)।

కరణం ప్రకృతారంభః(పుట 30), భేదః ప్రోత్సాహనా ద్భవేత్ (పుట 30)॥ 73

సంధ్యంగక్రమత్యాగము—

యథోచితం ప్రయోగః స్యా దంగానాం నక్రమో మతః (పుట 25)।

ప్రతిముఖ సంధిలక్షణము—

లక్ష్యాలక్ష్య స్తదుద్భేదో యత్ర ప్రతిముఖంతు తత్ (పుట 43)॥ 74

ప్రతిముఖ సంధ్యంగములు-13

విలాసః-పరిసర్పశ్చ-విధూతం-శమ-నర్మణీ।
నర్మద్యుతిః-ప్రగమనం-నిరోధః-పర్యుపాసనమ్॥ 75
వజ్రం-పుష్పం-పరిన్యాసో-వర్ణసంహార ఇత్యపి(పుట48)

ప్రతిముఖసంధ్యంగ లక్షణములు

ఇష్టార్థవిషయో హాసో విలాస ఇతిమన్యతే (పుట 50)॥ 76

పరిసర్ప ఇతి ప్రాహు ర్దృష్టనష్టానుసర్పణమ్ (పుట 62)
విధూతమారతిః (పుట 62) తచ్ఛాంతిః శమ ఇత్యభిధీయతే (పుట 67)॥ 77

పరిహాసవచో నర్మ యద్వాచిత్త ముదీరితమ్ (పుట 51)|
దోషప్రచ్ఛాదనార్థంతు వచో నర్మద్యుతి ర్మతా (పుట 51) 78
దుఃఖోత్తర కృతాంవాద మాహుః ప్రగమనం బుధాః (పుట 78)|
నిరోధో హి నిరోధః స్యాత్ (పుట 76), సాంత్వనం పర్యుపాసనమ్ (పుట 72)॥ 79
వజ్రం ప్రత్యక్షనిష్ఠురం (పుట 62), పుష్పం విశేష వద్వాక్యమ్ (పుట 64)|
ఉపపత్తియుతంవాక్య ముపన్యాసం ప్రచక్షతే (పుట 72) 80
బహుపాత్ర సమావేశో వర్ణ సంగ్రహః... (పుట 78)|

గర్భసంధి లక్షణము

సగర్భో దృష్టనష్టస్య యత్ర బీజస్య మార్గణమ్| (పుట. 88) 81

గర్భసంధ్యంగములు 12

అభూతాహరణం, మార్గో-రూప-పోదాహరణ-క్రమాః
సంగ్రహ-శ్చానుమానంచ-తోటక-శ్చాధిబలే అపి॥ 82
ఉద్వేగ — సంభ్రమ — మాక్షేపా — ద్వాదశాంగాని తస్యతు (పుట 84)|

గర్భసంధ్యంగ లక్షణములు

అభూతాహరణం ప్రాహుః కపటోపాయకల్పనమ్ (పుట. 90)॥ 83
తత్త్వార్థకథనం మార్గః (పుట. 91), రూపం వితర్కవ ద్వాక్యం (పుట. 117)|
* ఉత్కర్షేణాన్వితంవాక్య ముదాహరణ మిష్యతే (పుట. 120)॥ 84.
చింతితమానార్థ సంప్రాప్తిః క్రమ ఇత్యభిధీయతే (పుట. 95)|
సంగ్రహః సామదానాభ్యాం వశీకరణ ముచ్యతే (పుట. 105) ॥ 85
ఊహాశ్చ లింగతః సమ్య గనుమాన మితి స్మృతమ్ (పుట. 99)|
సంరంభవచనం యత్తు తత్తోటక ముదీరితమ్ (పుట. 125) ॥ 86
వంచనాదధిబలమ్ (పుట-128), భీతిరుద్వేగకారిణీ (పుట. 131)|
శంకాత్రాసౌ సంభ్రమాద్యౌ (పుట. 124), ఆక్షేపో బీజసూచనమ్ (పుట. 134) ॥ 87

(‘ఉత్కర్షేణాన్వితం వాక్యముదాహరణ మిష్యతే’ అనెడి పై ఉదాహరణ లక్షణమునకు ముందు ‘యథోక్తం వసంతరాజీయే’ అని కలదు. పై శ్లోకము లన్నియును వరుసశ్లోకములు. వీనిలోని ఒకపాదము వసంతరాజీయములోని దైనప్పుడు తక్కినవి కూడ వసంతరాజీయములోనివే అని తలంచుట అసమంజసము కాజాలదు. అన్ని చోట్లను ఇట్లు లేక పోవుటకు కారణము లేఖకుల పొరపాటు కావచ్చును; లేదా మటిమాటికిని ‘యథోక్తం వసంతరాజీయే’ అనుచు వ్రాయుటకు నిజముగా కోటయవేముడే బద్ధకించి ఉండవచ్చును జ్ఞాపకార్థము అప్పటప్పట మాత్రము వసంతరాజీయమును పేర్కొనెనని, తలంచుట సమంజస మగును. ఇంతకును వసంతరాజీయ మార్గము ననుసరించియే తాను వ్యాఖ్యానించుచుంటినని మొదటనే చెప్పినాడుగదా.

మాటిమాటికిని ‘వసంతరాజీయమునుండి’ అని వ్రాయుటకు లేఖకులుకూడ బద్ధకించి యుందురనుటలో సందేహము లేదు. వారు కొన్ని శ్లోకపాదముల నే వదలివేయుట ‘ఉద్ఘాత్యక’ విషయమున గుర్తించి యున్నాము.

కావున సంధి, సంధ్యంగ నిర్వచనము లన్నియును వసంతరాజీయములోనివే అని తలంచుచున్నాను.

విమర్శసంధి లక్షణము

యత్ర విమృశ్యతే మోహా ద్వ్యసనాద్వా విలోభనాత్ |
గర్భ నిర్భిన్న బీజార్థః సోఽవమర్శ ఇతి స్మృతః (పుట. 158) ॥ 88

విమర్శ సంధ్యంగములు 13

అపవాదశ్చ-సంఫేటో-విద్రవ-ద్రవ-శక్తయః|
ద్యుతిః-ప్రసంగ-శ్ఛలనం-వ్యవసాయో-విరోధనమ్॥ 89
ప్రరోచనం-విచలనం-మాదానం చ త్రయోదశ (పుట. 158)|

విమర్శ సంధ్యంగ లక్షణములు

అపవాదస్తు దోషాణా ముద్ఘాటన ముదీర్యతే
(పుట 152)॥ 90

సంఫేటః సహి విజ్ఞేయో యద్రోషపరుషంవచః
(పుట 172)।

విద్రవః కథ్యతే బంధవధసంతాడనాదికః
(పుట 171)॥ 91

ద్రవ ఇత్యుచ్యతే తత్ జ్ఞై స్తిరస్కారో మహాత్మనామ్
(పుట 172)।

విరోధశమనాచ్ఛక్తిః (పుట 178)। తర్జనోద్వేజనే
ద్యుతిః (పుట 168)॥ 92

గురుకీర్తనం ప్రసంగః (పుట 174)। ధన్యం
పాద్యాద్యాశ్రయ కల్పితమ్ (పుట 175)।

వ్యవసాయః స్వశక్తిః (పుట 178)। సంరంభాద్యా
విరోధనమ్ (పుట 171)॥ 93

యథా ప్రవర్తనా ద్భావివర్తనం ప్రరోచనా
(పుట 169)।

వికత్థనా స్వబలనమ్ (పుట 172) ఆదానం కార్య
సంగ్రహః (పుట 174) ॥ 94

నిర్వహణ సంధిలక్షణము

క్షీణంతో ముఖాద్యర్థాః విప్రకీర్ణా యథా యథా।
ఏకార్థ్య ముపనీయంతే యత్ర నిర్వహణం హి తత్
(పుట 184) 95

నిర్వహణ సంధ్యంగములు—14

సంధి-ర్విరోధో-గ్రథనం-నిర్ణయః-పరిభాషణమ్।
ప్రసా-దానంద-సమయాః-కృతి-ర్భా-షోప
గూహనే॥ 96

పూర్వభా-నోపసంహారే-ప్రశస్తిశ్చ చతుర్దశ
(పుట. 184)।

నిర్వహణ సంధ్యంగ లక్షణములు

సంధిస్తు బీజోపగమనం (పుట. 184), కార్య
స్యేషో విరోధః స్యాత్ (పుట. 188)॥ 97

గ్రథనం సంనిబంధనం (పుట 189), అనుభూతార్థ
కథనం నిర్ణయః (పుట. 189)।

పరిభాషా మిథోజల్పః (పుట 191), ప్రసాదః
పర్యుపాసనమ్ (పుట. 195)॥ 98

ఇష్టార్థసిద్ధి రానందః (పుట. 197), సమయో దుఃఖ
నిర్గమః (పుట. 195)।

స్థిరీకరణ ముక్తస్య లబ్ధస్య కృతిరిష్యతే
(పుట. 201)॥ 99

బహుమానాది సంప్రాప్తి ర్భాషేతి పరికీర్తితా
(పుట. 202)।

అద్భుతార్థస్య సంప్రాప్తి రుపగూహన ముచ్యతే
(పుట 190)॥ 100

పూర్వభాగః సవిజ్ఞేయో యత్తు కార్యప్రదర్శనమ్
(పుట 192)।

వరాప్తే రుపసంహారః (పుట. 203), ప్రశస్తిః శుభ
శంసనమ్ (పుట. 204)॥ 101

ఒంటిబ్రాహ్మణుని శకునము

* ధృతాతపత్రః శుచిశుక్లవాసాః
పుష్పార్చిత శ్చందన చర్చితాంగః।
విప్రః శిఖావాన్ కృత భోజనశ్చ
దదాతిదృష్టః పథిసర్వసిద్ధిమ్॥ 102

—(కుమారస్వామి ప్ర. రు. వ్యాఖ్య పుట. 173)

[ఈ శ్లోకమునకు ముందు 'వసంతరాజీయే ఽప్యుక్తమ్' అని కలదు. ఇదియును వసంతరాజీయము నందలిదే అనుట స్పష్టము. దీనిని శ్రీ వెంకటరావు గారు పేర్కొనినారు.]

ఇంతవఱకును మొత్తం 102 శ్లోకములను, సరిగా చెప్పవలెనన్నచో 204 శ్లోక పాదములను, ఉదాహరించియున్నాను. వీనిలో వసంతరాజీయమునందలివని స్పష్టముగా చెప్పబడిన శ్లోకములు 32; శ్లోకపాదములు 6. (కాగా మొత్తము శ్లోకపాదములు 70. ఈ శ్లోకములకు, శ్లోకపాదములకును '*' ఇట్టి గుర్తును పెట్టియున్నాను)

పైన పేర్కొనిన కారణములను పట్టి పైశ్లోకములన్నియును వసంత రాజీయమునందలివే యని నిస్సంశయముగా చెప్పవచ్చును. ఈ నా ప్రతిపాదనమునకు సహృదయులే ప్రమాణము. మాలవికాగ్నిమిత్రవ్యాఖ్యయందును, విక్రమోర్వశీయ వ్యాఖ్యయందును పేరు చెప్పకయే పేర్కొనబడిన లక్షణ శ్లోకములింకను అనేకములు కలవు. వానిని ఇంకను పరిశీలింప వలసి యున్నది.

వసంతరాజీయము

తెలుగుదేశపు నాలుగు మూలలను సరిగా గాలించినచో 'వసంత రాజీయము' యొక్క వ్రాతప్రతులు తప్పక లభింపగలవని ఆశించుచున్నాను. అవకాశము లున్నవారికి ఆసక్తి లేదు, ఆసక్తి కలవారికి అవకాశములు లేవు. ఇదీ నేటి పరిస్థితి. లభించని వసంత రాజీయము మాట ఎట్లున్నను, లభించిన కాటయ వేమని వ్యాఖ్యలనైనను విస్పష్టముగా పరిష్కరించి ప్రకటించుటకు తెలుగుదేశమున ప్రయత్నమే జరుగలేదు. ఇంక జాయపసేనాపతి 'నృత్తరత్నావళి' ఇంతవఱకును అముద్రితముగానే ఉండుట ఆంధ్రుల కవమానము. సహృదయులు డా. వి. రాఘవన్ గారు దీని సంపాదకత్వమును వహించి, జూలై, 1966 లో సుమారు 200 పేజీలను ముద్రించినారు. కాని, ఇది నేటివఱకును ప్రకటితము కాలేదు; ఏమైనదో తెలియదు. తెలుగువారికి గర్వకారణములైన ఇట్టి అమూల్యగ్రంథములను వెలుగులోనికి తెచ్చుటకు పూనుకొనుట సహృదయులైన పెద్దల, ముఖ్యముగా సాహిత్య, సంగీత నాటక అకాడమీలలోని కవి, పండితుల కనీసకర్తవ్యము. ఈ వ్యాసమును దిద్ది సలహాల నొసంగిన శ్రీ మాన్ ఎస్. టి. రామానుజాచార్యుల గారికి కృతజ్ఞుడను.

అంతర్వాహిని

'హితశ్రీ'

* గతసంచిక తరవాయి *

4

వాకిట్లో జట్కాబండి ఆగిన చప్పుడు విని గోపీ పరుగెత్తుకొచ్చి గేటుతలుపు తీసి సంతోషంగా కేక పెట్టాడు.

"అన్నయ్యొచ్చాడమ్మో."

విశ్వం చిరునవ్వుతో వాడివైపు చూసి "ఏరా గోపీ, కులాసాగా ఉన్నావా?" అన్నాడు.

గోపీ తల ఆడించాడు. వరండాలోకి విశ్వం వచ్చేసరికి వరసగా అందరూ ఇంట్లోంచి బయటికొస్తున్నారు.

"ఏరా విశ్వం, పరీక్షలన్నీ బాగా రాశావా?" అన్నారు రంగనాథంగారు.

"ఆ: సెకండ్ క్లాస్ తప్పక వస్తుంది."

"అదేమిటిరా, అలా చిక్కిపోయావు? పాడు పరీక్షలు." అంది విశ్వం తల్లి.

"ఇంక పరీక్షల గొడవ లేదుగా." అంది పద్మ.

"ఓహో పద్మావతమ్మగారా? నీతో పోటీకైనా హిందీ పరీక్షలకి కూచోకుండా ఉంటానా?"

"హిందీ పరీక్షలకే లేకపోతే డ్రాయింగ్ పరీక్షలకికూడా కూచో, నాదేం పోయింది మధ్య?"

"థాంక్స్. పర్మిషన్ ఇచ్చావుగదా."

చిరునవ్వులో లోపలికొచ్చాడు విశ్వం. హాల్లో శ్రీనివాసరావు రేడియో వింటూ కూర్చున్నాడు.

"ఓ. డాక్టరుగారా! నమస్తే."

"కూర్చోవోయ్ విశ్వం." వాల్యూం తగ్గిస్తూ అన్నాడు శ్రీనివాసరావు.

మా ఇంట్లో మాకు నువ్వు మర్యాద చెయ్యక్కర్లేదులే."

"ఎవరిల్లయితే ఏం, బంధువు బంధువే."

"డాక్టర్ గారికి మందులసంగతికంటే మర్యాదల సంగతే బాగా తెలుసల్లే ఉంది."

"మన తెలుగుదేశంలో కొత్తగా పెళ్ళయిన వాడికి ముందు ముఖ్యంగా తెలిసేది అదేగా!"

ఇద్దరూ నవ్వారు.

"పండక్కి రావటానికి వీలుండదేమో నని రాశావుటగా. ఎలా వీలయింది?"

"పండక్కి రాకపోతే చాలా కష్టపడాలి సొస్తుందని చుట్టపక్కాలు సలహా ఇచ్చార్లే—అందువల్ల వీలయింది." అన్నాడు శ్రీనివాసరావు ఓరగా పద్మ వైపు చూసి. పద్మ ఇదేమీ వినబడనట్టు దొంగ వేషం వేసి లోపలికి జారుకుంది.

"ఏమిటి గిరాకీ?" అన్నాడు విశ్వం నవ్వుతూ.

"గ్లాస్గోపం చెలూ మొదలైనవి పండగ తప్పించి మరీ వొచ్చావు. ఏమిటో కారణం?"

విశ్వం జరిగిన సంగతి చెప్పాడు. ఇంతలోకే గోపీ వొచ్చి "అన్నయ్యా, స్నానం చేసి వొస్తే అమ్మ కాఫీ ఇస్తుందట." అన్నాడు. "రేడియో వింటున్నట్టున్నావు. నిన్ను ఇబ్బంది పెట్టనులే. కాసేపాగి పునర్దర్శనం చేసుకుంటాను." అని విశ్వం లేచినుంచున్నాడు. "నేనూ అలా కాస్త బయటికి వెళ్ళొస్తాలే. మధ్యాహ్నం తీరిగ్గా ఒకళ్ళ నొకళ్ళం విసిగించుకోవచ్చు" అని శ్రీనివాసరావు బయటికి నడిచాడు.

విశ్వం స్నానం చేసి, కాఫీ తాగి పేపర్ ముందేసుకుని వార్తల శీర్షికలు చూస్తున్నాడు. గోపీ అతని దగ్గిర్లోనే చాప వేసుకు కూర్చుని లెక్కలు చేసుకుంటున్నాడు.

"గోపీ, బావేరీ?"

పద్మ కంఠం విని విశ్వం తలెత్తాడు.

"బజారుకి వెళ్లాడు" చెప్పాడు గోపి.

"ఎందుకూ?"

"ఏమో?"

"ఏమో" ఏమిట్రా? ఏమైనా కావాలేమో, 'నేను తెచ్చిపెడతానులే బావా' అనకూడదూ? థర్డ్ ఫారం చదువుతున్నావు గాని......"

"అయితే బావ అంత చదువుకున్నాడు కదా, అడక్కుండా తనే చెప్పకూడదా ఏమిటక్కయ్యా?"

గోపీ ఎదురు ప్రశ్నకి విశ్వానికి నవ్వొచ్చింది.

"డాక్టర్ గారికి కోపం వొచ్చింది" అన్నాడతను.

"కోపమా!" అంది పద్మ తెల్లబోయి.

"అవును అంటే ఆగ్రహం."

"ఎందుకూ?" కొంచెం బెదురుగా అంది.

"కాఫీ ఇవ్వలేదని."

"ఎందుకివ్వలేదు. నేనేగా ఇచ్చిన దాన్ని."

"అయితే ఏమీ లోటుక ఇంకోసారి కాఫీ తాగి రావటానికి బజారుకి వెళ్లి ఉంటాడు."

పద్మ గ్రహించింది.

"వేళాకోళమేనా. నిజమేమోనని హడలి పోయాను."

"ఎందు కంతభయం?"

"భయం దేనికి?"

"మరి హడలిపోయానన్నావేం?"

"మాటవరసకి అన్నాను."

"దాపాటేం? పద్మా, నిజం చెప్పాలంటే ఈ ఆడ వాళ్లకి బుద్ధిలేదు. మొదట మొదట నేర్పుతారు. తర్వాత ఏకు మేకై కూర్చుంటుంది. ప్రతి చిన్నదానికీ భర్తగారికి కోపం వస్తుందేమోనని బెంగపడిపోతారు. చివరికి అదే ఖాయమైపోతుంది. ముందు జాగ్రత్తకి చెబుతున్నాను. పూర్వపురోజులు పోయాయి. ఈ రోజుల్లో కావాలిసింది అన్నిరంగాల్లో అందరికీ సమాన హక్కులు. సమతారాజ్యస్థాపన జరగాలంటే ఎవరి హక్కులు వాళ్లు తెలుసుకుని అవి సిద్ధించేవరకూ విశ్రమించకూడదు. ఈ చివరిమాటలు నావికావులే. ఇదిగో, ఈ మూలమహిళా మహోదయసంఘ వార్షిక సభలో ప్రసంగవిశేషాలు చూడు."

గంభీరంగా ప్రారంభించి వ్యంగ్యోక్తితో ముగించిన విశ్వంవైపు విస్తుపోయి చూసింది పద్మ.

"ఏమిటన్నయ్యా నీ గొడవ, భలేవాడివిలే" అనేసి ఆమె మేడ మీదికి వెళ్ళిపోయింది.

గోపీ ఈ గొడవ పట్టించుకున్నట్టు లేదు. వాడు పెదవులు బిగించి కలం గడ్డం కింద పెట్టుకుని దీర్ఘాలోచనా తత్పరుడై ఉన్నాడు. ఆ భంగిమ చూసి విశ్వం అడిగాడు.

"ఏమిట్రా గోపీ ఆ ఆలోచన ?"

గోపీ ఆ ప్రశ్నకి ఆలోచన నించి తేరుకుని విశ్వం వైపు చూసి అన్నాడు.

"x విలువ తప్పిందన్నయ్యా."

"ఏది ఇలా తే."

గోపీ దగ్గిరకొచ్చి లెక్క చేసిన పుస్తకం విశ్వాని కిచ్చాడు.

"గోటితో పోయేదానికి గొడ్డలి దేనికిరా ? ఈ లెక్క x పద్ధతిలో చెయ్యక్కర్లేదు. కొన్న ఖరీదు 100 అనుకో చిటికెలమీద వచ్చేస్తుంది ఆన్సర్."

గోపీ అనుమానంగా విశ్వంవైపు చూశాడు.

"మా మేష్టరుగారు x పద్ధతిలో చెయ్యమని చెప్పారే!"

"ఆయనెవరో గాని ముక్కు చూపించమంటే తలవెనకనించి చెయ్యి పోనిచ్చి చూపించేట్టున్నాడే."

గోపీకి కొంచెం నవ్వొచ్చింది.

"రంగారావు మాష్టరు గారన్నయ్యా"

"ఏ రంగారావు?"

"నీ స్నేహితుడేటగా."

విశ్వం కొంచెం ముఖం చిట్లించి "ఓహో, వాడా!" అన్నాడు.

"రంగారావు మాష్టరు గారు నిన్ను చాలాసార్లు అడిగారు."

"నా క్లాసుమేటులే."

"ఆయనకి లెక్కలు బాగా వొచ్చు. బలేబాగా చెప్తారుకూడా."

"సరేలే. నేను చెప్పినట్టు ఈ లెక్క చెయ్యి."

అయిష్టంగా పుస్తకంవైపు చూశాడు గోపీ.

"ఏమిట్రా నీ సందేహం? నేను మీ మాష్టరు కంటే అయిదు క్లాసులు ఎక్కువ చదివాను, తెలుసా?" అన్నాడు విశ్వం.

గోపీకి ఆశ్చర్యం వేసింది. అన్నయ్య అబద్ధం చెబుతున్నాడని అతననుకో లేదుగాని ఆ విషయం అతనికి నమ్మ తగిందిగా కనిపించలేదు. ఆ పసి మనసుకి చదువుల్లో భేదాలు తెలియవు. మాస్టరు గారు సునాయాసంగా బోర్డుమీద లెక్కలు చేసేస్తుంటే అదో విచిత్రమైన అభిమాన పూర్వకమైన గొప్ప అభిప్రాయం ఆయనమీద గోపీకి ఏర్పడ్డది.

తను చెప్పిన పద్ధతిలో లెక్క ఎలా చేయాలో వివరించి ఆ ప్రకారం చేసి మాస్టరుగారికి చూపించమని చెప్పి మేడమీదకి వెళ్లాడు విశ్వం.

వాకిలి తెరకి కొంచెం తెల్లటిగుడ్డమీద రంగు దారాల్తో కుడుతూ పందిరిమంచంమీద కూర్చుంది పద్మ.

"ఏమిటి పద్మా ఆ డిజైను?"

"పద్మ వెనక్కి తిరిగి మాసి, రేఖాచిత్రాన్ని చూపిస్తూ "మామిడిచెట్టుమీద కోయిల" అంది. ఆ బొమ్మ తీక్ష్ణంగా చూసి అన్నాడు విశ్వం.

"వేపచెట్టుమీది కాకి కాదూ?"

"కాదు. సరిగా చూడు" అంది పద్మ అమాయకంగా.

"మరి ఆ మాటలు కింద రాయలేకేం?"

"ఎందుకూ?"

"లేకపోతే ఎలా తెలుస్తుందీ?"

విశ్వం కళ్ళలోకి చూసింది పద్మ. అతను నవ్వాపుకుంటున్నాడు. అప్పటికి తెలిసిందామెకి అతని మాటల్లోని వ్యంగ్యం.

"పోదూ గొడవ" అంది విసుగ్గా.

"ఎవరిదీ మహత్తర శిల్పం?"

"ఛీ ఛీ వేళాలే."

"నువ్వా?"

అటువంటి పొరపాటు పని పద్మ ఎప్పుడూ చెయ్యదని అతనికి బాగా నమ్మకం ఉంది. డిజైన్లకి కార్బన్ కాపీలు తియ్యటానికి పైమెట్టు ఆమె ఊహాకి అతీతం. ఆలోచించగా విశ్వానికి అకస్మాత్తుగా తట్టింది.

"ఓ. డాక్టరుగారి చిత్రకళానైపుణ్యం కాబోలు. అవునా?"

"కాదులే" అంది పద్మ.

"నాకు తెలుసులే."

"తెలిస్తేసరే. నన్ను పని చేసుకోనీ."

దృఢపడిపోయింది అతని అనుమానం. చూస్తూ చూస్తూ పద్మ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు కానివ్వటం అతని కిష్టంలేదు.

"ఫస్టుక్లాసయిన బొమ్మ నేను వేసిపెడతాలే. పాపం డాక్టరుగార్ని ఎందుకు అవస్థ పెట్టావు?" అని పద్మ సమాధానంకోసం కూడా ఎదురు చూడకుండా ఆమె చేతిలో ఫ్రేంలాక్కుని, గుడ్డ సరిచేసి తనకి చిరపరిచితమైన రేఖాచిత్రం 'మామిడిచెట్టుమీద కోయిల' త్వరత్వరగా గీశాడు.

"ఎలా ఉంది?"

"ఎన్నిసార్లు వేసినా అదేగా?"

తెల్లబోయాడు విశ్వం. "ఏ లేమాత్రం?" అన్నాడు.

"సరేలే, ఇలా ఇవ్వు" అంది పద్మ.

"సరైన రంగుదారాలతో కుడితే ఫస్టుగా ఉంటుంది. డాక్టర్ హడలిపోవాలిసిందే" అని వెనక్కి తిరిగి వెళ్ళబోతూ గదిలోని నిలువుటద్దంలో చూసుకుని అదిరిపడి పద్మవైపు తిరిగి "ఇదేమిటి పద్మా, ఈ పందొమ్మిదో శతాబ్దపు అలంకారం?" అన్నాడు. అదేమిటోనని పద్మ వెనక్కి చూసింది. నిలువుటద్దం చూపించాడు విశ్వం. అది పూర్వం గోడకి చేరగిల వేసి ఉండేది. ఇప్పుడు గోడనించి ముందుకు వంగి ఉండటం చూసి విశ్వం ఆశ్చర్యపోయాడు. వెంటనే దాన్ని మళ్లీ వెనకటి స్థితిలో ఉంచటానికి ప్రయత్నించసాగాడు.

"హెయిర్ కటింగ్ సెలూన్లోలాగా గోడకి చేరవెయ్యటమేమిటి? అలా ముందుకి ఉంటేనే బాగుంటుంది." అంది పద్మ విసుగ్గా.

అద్దం అలా వొదిలేసి ఆశ్చర్యంగా విశ్వం పద్మ ముఖంలోకి చూశాడు.

"హెయిర్ కటింగ్ సెలూనా? అక్కడ ఎలా ఉంటుందో నీకేం తెలుసు?"

పద్మ మాట్లాడలేదు. వెంటనే విశ్వానికి అర్థమైంది. ఇది డాక్టర్ గారి అభిరుచి కాబోలు. అభిప్రాయాలు ఆడవాళ్లు ఎంత త్వరలో మార్చుకుంటారు.

మరేమీ మాట్లాడకుండా విశ్వం మేడదిగి హాల్లోకి వచ్చాడు. గోపీ అక్కడ లేడు. పుస్తకాలు మాత్రం చాపమీదనే ఉన్నాయి. లెక్క ఎలా చేశాడో చూడాలని పుస్తకం తెరిచాడు విశ్వం. అతని ఆశ్చర్యానికి మేరలేదు. ఆ లెక్క x పద్ధతిలోనే మళ్ళీ చెయ్యబడి ఉంది. తను చేసి చూపించిన నమూనాకోసం పుస్తకంలో వెతికాడు విశ్వం. అదెక్కడా కనిపించలేదు. విశ్వం కిటికీలోంచి బయటికి చూశాడు. ఓమూల ఓ కాగితం ఉండ కనిపించింది. అది చూడగానే విశ్వానికి నవ్వొచ్చింది. "ఓరి వెధవా!" అనుకున్నాడు. ఈ విషయం పద్మకికూడా చెప్పి ఆమెని పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వించాలనుకున్నాడు. సరాసరి మేడమీదికి వెళ్ళాడు.

పద్మ అల్లికపని చేస్తూనే ఉంది. విశ్వం తొంగి చూశాడు. అది తను చేసి ఇచ్చిన బొమ్మకాదు. పద్మ అంతకుపూర్వం కుట్టటానికి ప్రారంభించిన చిత్రం. విశ్వం బుర్ర గోక్కున్నాడు. ఏంమనుషులు వీళ్ళందరూ? విచక్షణాజ్ఞానం ఉపయోగించరేం? యుక్తమేమిటో తెలుసుకోవటం కూడా ఇష్టం ఉన్నట్టు లేదు. మాటిమాటికి ఆశ్చర్యపోవటం తనవంతవుతోంది. ఇంతకీ మనుషుల భావాలు చిత్రమైనవి.

విశ్వం పద్మతో మాట్లాడకుండానే వెనక్కి తిరిగి మేడదిగి మళ్లీ హాల్లోకి వచ్చేశాడు. అక్కడ రంగనాథంగారు కూర్చొని వున్నారు. విశ్వాన్ని చూడగానే ఆయన అన్నాడు.

"ఒరే విశ్వం, బాబు రేపు వెడతానంటున్నాడు. సాయంత్రం బజారుకివెళ్లి ఖరీదైన మంచి సూటింగ్ క్లాత్ సెలెక్ట్ చేసి తీసుకువస్తావా? అతనికి మరీ మొహమాటం. షాపుకి వెళ్లివచ్చింది చూడమంటే ఒప్పుకోడు. నువ్వే వెళ్ళి ఆ పనేదో చూడు కాస్త."

"అలాగే తెస్తా." అన్నాడు విశ్వం.

5

"కాలం సాగిపోతోంది. పనులు జరిగిపోతున్నాయి. కుమాస్తాలు రాస్తున్నారు. రైతులు పొలం దున్నుతున్నారు. పంట పండిస్తున్నారు. శ్రామికులు శ్రమించి స్వేదజలం వర్షిస్తున్నారు. పెద్ద ఉద్యోగులు హుంకరిస్తున్నారు. ఫ్యాక్టరీల గొట్టాలు పొగ విడుస్తున్నాయి. మంత్రులు తిరుగుతున్నారు. నాయకులు అరుస్తున్నారు. విద్యార్థులు పుస్తకాలు తిరగేస్తున్నారు. పండిన ధాన్యం ఎక్కడో ఉడుకుతూనే ఉంది. ఇలా పనులు జరిగిపోతూనే ఉన్నాయి. కాలం గడుస్తూనే ఉంటుంది. కాలగమనం చూడగలిగినవాళ్లు చూస్తూనే ఉంటున్నారు. లేనివాళ్ళు నిర్లక్ష్యంగా కళ్ళు మూసుకుంటూనే ఉన్నారు. ప్రపంచంలో పుట్టి పెరిగిన ప్రతివాడూ ఏదో పనిచేస్తూనే ఉన్నాడు.

నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః

అన్నాడు గీతాకారుడు.

కాని ప్రతిపని మనిషి అభ్యున్నతికే జరగటం లేదు. మనిషి ఇంకా గొప్పగా బతకటానికి ఉపకరించే పనుల్ని కాలం దొంగిలిస్తోంది. వాటికి బదులు మనిషిని కిందికి లాగే పనుల్ని కాలం ఇప్పుడు మనకిస్తోంది.

కాలం వెనక్కి తిరగదు. చేసిన పనుల్ని చెరప లేము. క్షణక్షణమూ జీవితం ఖర్చయిపోతోంది. తక్షణము జరగాలిసిన పని ఏమంటే, మానవజీవిత ప్రమాణాన్ని అన్నిరంగాలలో కొన్ని మెట్లు పైకిలాగే ప్రయత్నం. నేడు ప్రపంచం మొత్తంమీద జరగాలిసిన పని ఇది ఒక్కటే. ఇది ఎలా సాధ్యపడుతుందో చూద్దాం..."

మైదానంలో ఒక సాంఘిక సేవాపరుడు ఉపన్యసిస్తున్నాడు. ఉపన్యాసాన్ని మొదటినుంచీ శ్రద్ధగా వింటున్నాడు విశ్వం. అప్రయత్నంగా అతనిలోని చిలిపితనం తలెత్తింది. ఉపన్యాసకుడు ఉపన్యాసాన్ని వెంటనే కొనసాగించకుండా కొంతసేపు ఆగి నాలుగుదిక్కులా చూస్తున్నాడు.

"కాలం సాగిపోతోంది" అన్నాడు విశ్వం గట్టిగా విద్యార్థిదశలోని కొంటెతనంతో.

"ఇప్పుడు కాలాన్నిగురించి మాట్లడిన దెవరో వారు చూడాలని వుంది" అన్నాడు ఉపన్యాసకుడు.

విశ్వం ధైర్యంగా లేచి నిలబడ్డాడు. అలా అన్నందుకు అతను కొంచెం విచారించక పోలేదు. కాని ఒకపని చేసిన తరవాత దానిఫలితం అనుభవించడానికి అతను వెనుదీయడు.

"దయచేసి మీరు ఒకసారిలా వస్తారా? మీతో రెండు విషయాలు మాట్లాడాలి."

విశ్వం అతనికి దగ్గరగా వెళ్ళాడు.

"మీ పేరు?"

"విశ్వేశ్వరరావు."

"కాలం సాగిపోతోంది అనే విషయం ఇంతకు ముందు మీకెప్పుడైనా స్ఫురించిందా?"

"స్ఫురించకుండా ఉండటానికి అదేం కొత్త సంగతి కాదు గదండీ?" కొంచెం నవ్వుతూ అన్నాడు విశ్వం.

"అప్పుడు మీ భావాలు ఎలా వుండేవో చెప్ప గలరా?"

"నిన్న, ఇవాళ, రేపు—ఇదే కదా కాలం అంటే, అనిపించేది నాకు. ఒక్కొక్కప్పుడు కాలం మీద ఏమైనా కవిత్వం రాద్దామని ఉండేది. కాని సరైన భావాలు రాకపోవటంవల్ల రాయలేదు."

"మీ వయసెంత?"

"ఇరవై రెండు"

"ఈ ఇరవై రెండేళ్ల కాలంలో ఎన్నో పనులు చేసి ఉంటారు మీరు."

"అవును, మరి."

"ఇన్ని సంవత్సరాల్లో మీరు చేసిన అతి ముఖ్యమైన పని ఒకటి చెప్పగలరా?"

విశ్వం ఆలోచించాడు.

"ఏదైనా సరే, మీరు గుండెమీద చెయ్యి వేసుకుని ఫలానా ఘనకార్యం చేశానని చెప్పగల ఒక్క పని, కనీసం ఒక్క మంచి పని చెప్పండి చాలు."

విశ్వం నుదుటిమీద స్వేదబిందువులు చేరాయి. ఒక్క మంచి పని...తను ఒక్క మంచి పని కూడా ఇంతవరకూ చెయ్యలేదా? గొప్ప పనికాక పోవొచ్చు- కాని కనీసం ఒక్క మంచి పని...

విశ్వం తలవంచుకున్నాడు నిరుత్తరంగా.

"పోనీ కనీసం అలాంటి పనిఏదైనా చెయ్యాలను కున్నారా?"

"ఎందుకనుకోలేదు" అన్నాడు విశ్వం తెప్పరిల్లి

"ఏమిటది?"

విశ్వానికి పచ్చివెలక్కాయ నోట్లోపడ్డట్టయింది. ఎంత ఆలోచించినా ఏమీ తట్టటంలేదు.

"ఒక్క ప్రశ్న అడుగుతాను. తడుముకోకుండా సమాధానం చెబుతారా?"

"అడగండి."

"మీ జీవిత లక్ష్యం ఏమిటి?"

ఏమిటి తన జీవిత లక్ష్యం? శూన్యంగా చూశాడు విశ్వం.

"మీకు ప్రత్యేకించి ఏమీ లక్ష్యం లేదన్న మాట?"

తను పూర్తిగా పరాభవం పొందాడు. కాని పరాభవం కంటె కూడా తన నిస్సహాయకత్వం అతన్ని బాధపెట్టింది. ఇటువంటి ప్రశ్నే తనలో ఎప్పుడూ ఉదయించలేదు.

ఎంత భావదారిద్ర్యం!

ఉపన్యాసకుడు విశ్వం భుజం తట్టి అన్నాడు. "జరిగిన కాలంలో మీరేమీ చెప్పతగిన పని చేసిఉండక పోవొచ్చు. పరవాలేదు. రాబోయే రోజుల్లో మీరు తోటివాళ్లు నిర్విణ్ణులయ్యే మహాకార్యాలు చెయ్య వచ్చు. కావలసిందల్లా చెయ్యాలనే ఉత్సాహం, కోరిక ఉండటం. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచు కోవటం. గమ్యం చేరుకోటానికి నిజాయితీతో ప్రయ త్నించటం. అంతే."

"కృతజ్ఞుణ్ణి" అన్నాడు విశ్వం.

"మీకేమైనా మాట్లాడాలిసిన విషయాలుంటే తరవాత మిమ్మల్ని కలుసుకుంటాను. ఇదిగో నా అడ్రసు." ఒక చిన్న కార్డు విశ్వానికిచ్చాడు ఉపన్యా సకుడు. విశ్వం అది స్వీకరించి సెలవు తీసుకుని బరు వుగా అడుగు వేసుకుంటూ మైదానందాటి బజార్లో ప్రవేశించాడు. ఇప్పుడతని మనసులో విచారం లేదు. తను త్వరలోనే మేల్కొన్నాడు. అసలు తన జీవితం ప్రారంభమయ్యే తరుణంకూడా అదే. తన అస్తిత్వాన్ని తను సార్థకం చేసుకోగలడు.

బజార్లో నడుస్తున్నాడు విశ్వం. బజారంతా అత నికి కొత్త కొత్తగా కనిపించసాగింది ఆరోజున. ప్రతి వ్యక్తి శ్రమపడుతున్నాడు ధనసంపాదనకి. శ్రమకి తగిన ప్రతిఫలం మాత్రం అందరికీ ముట్టదు. చిన్న చిన్న దుకాణదారులు రోజంతా శ్రమపడి వస్తువుల అమ్మకంకోసం నానాబాధలూ పడుతూండటం తను చాలాసార్లు గమనించాడు. శక్తిలేని కొనేవాళ్ళు అతని కళ్ళలో ఎప్పుడూ మెదుల్తూనే ఉంటారు. ఏమిటి దీనికి విరుగుడు? ఆలోచిస్తున్నకొద్దీ అతను నిరుత్సాహ

పడ్డాడు. ప్రభుత్వాన్నే ఊపివేసేసమస్య అది. సామాన్యుడు తనేం చెయ్యగలడు?

"పాలిష్ చెయ్యమంటారా బాబూ బూట్లకి?" అడుగుతున్నాడు కుర్రాడు జాలిగా. తన కవసరం లేదు. కాని వాడికుంది. జాలివేసి, చెయ్యమని రెండు కాలిచ్చాడు.

ఇలాగే ప్రతివాళ్ళూ తనని ఏదో అర్థిస్తే? తను జయించగా కాదు. దిగకుండానే లోతు తెలిసే విషయం ఇది.

జాలైతే తనకి పుట్టెడు ఉంది. ఆ మాటకొస్తే అందరికీ ఉంటుందేమో. కాని హస్తాలు శూన్యం.

సంజచీకట్లు అలముకుంటున్నాయి. తిరిగి తిరిగి విశ్వం తను ఎరిగిన బట్టల దుకాణంలోకి వెళ్ళాడు.

"ఏం కావాలండీ?"

విశ్వం సమాధానం చెప్పేలోపుగా వెనక నుంచి బతిమాలుతున్న స్వరం వినిపించి వెనక్కి తిరిగి చూశాడు. మాసిపోయిన గడ్డంతో, చిరిగిపోయిన దుస్తులతో, రేగిపోయిన జుట్టుతో, గుంటలుపడిన కళ్ళతో ఒకవ్యక్తి కనిపించాడు. దీనాతిదీనంగా అతను ప్రాథేయపడుతున్నాడు.

"మూడు రోజుల్నుంచీ తిండి లేదండి. దయచేసి ఏమైనా ఇప్పించండి."

అతను .అనుకుంటున్నా అభిమానం అతని ముఖంలో ప్రస్ఫుటమౌతూనే ఉంది.

విశ్వం అతనివైపు పరకాయించి చూశాడు. ఆ వ్యక్తికి అంగలోపమేమీ లేదు. జీవితం మాత్రం మార్దవించినట్లు ఉంది. ఎంతమంది లేరు అలాంటి వాళ్ళు! ఈ వ్యక్తి ప్రత్యేక మేమిటి? విశ్వానికి జాలికలగ లేదు.

"వెళ్ళు" అన్నాడు.

అవ్యక్తి వెళ్ళ లేదు. మరింత ప్రాధేయపడసాగాడు. అడుక్కోవటం! పైగా బతిమాలుకోవటం! విశ్వానికి వొళ్ళు మండింది.

"మనిషికి మనిషి అడుక్కోవట మేమిటయ్యా? అభిమానం లేదూ? ఏదైనా పని చేసుకోకూడదూ ఇలా ముష్టికోసం తిరక్కపోతే?" కర్కశంగా అన్నాడు విశ్వం.

"పని దొరక లేదండి" హీనస్వరంతో అన్నాడా వ్యక్తి.

"దొరక్కపోతే దొరికేచోటుకి వెళ్ళాలి."

"దయచేసి తమరేదైనా ఇప్పించండి."

తను ఇప్పించాలిట, తనదగ్గిర ఉద్యోగాలు కుప్పపోసి ఉన్నట్టు!

"చాల్లేవెళ్ళు" కసురుకున్నాడతను.

దుకాణదారు కూడా వెళ్ళగొట్టటానికి సిద్ధమయ్యాడు. ఆ వ్యక్తి నిర్లిప్తంగా వాళ్ళవైపు చూసి వెళ్ళిపోబోతూ విషాదంగా అన్నాడు.

"మీరు పని చూపించలేరని నాకు తెలుసు. అడుక్కుంటూ ప్రతిపూటా బతుకు వెతుక్కోక పోతే చావరాదా అని మీ అభిప్రాయం. అదే మంచిది అవును. కాని... కాని ఎవరిదైనా ప్రాణం ఎంత చులకన! ఎంత చవక..."

దుకాణంలోని వాళ్ళందరూ స్తబ్ధులయారు. ఇతనెవరో మామూలు బిచ్చగాడిలా లేడు. స్వచ్ఛంగాకూడా మాట్లాడుతున్నాడు.

విశ్వం హృదయం ఆర్ద్రమైంది. తను మాటలు జారాడు. విసుక్కున్నాడు. ఏమీ చెయ్యలేకపోతే ఊరుకోవొచ్చు. కాని అతని హృదయం గాయపరిచాడు, కొంపతీసి అతను సూచించినట్లు ఏ అఘాయిత్యమైనా చేసుకుంటాడ! లేనిపోనిది తన మెడకి చుట్టుకుంటుందా పాపం. కాని తనేం సహాయం చెయ్యగలడు. ఒకపూట తిండికి ధర్మం చెయ్యగలడు. తరవాత...

ఆ సమయంలోనే ఒక స్త్రీ దుకాణంలోకి వస్తోంది. ఆ అమ్మాయినికూడా అతను అడుగుతాడని చూశాడు విశ్వం. కాని తలెత్తికూడా చూడకుండా ఆ వ్యక్తి వెళ్ళిపోతున్నాడు. ముచ్చెమటలు పోశాయి విశ్వానికి. అతని శరీరం కంపించింది.

"ఇదిగో. ఏమయ్యోయ్." అని కేక పెట్టాడు. అప్రయత్నంగా అతను వెనుదిరిగి చూశాడు. విశ్వం మళ్ళీ పిలిచాడు. అతను తటపటాయిస్తున్నాడు.

ఆ స్త్రీ దుకాణంలోకి వచ్చింది. విశ్వం అది గమనించలేదు. అతని దృష్టిఅంతా ఆవ్యక్తిమీదే ఉంది.

విశ్వం మనసులో ఏదో మెరుపులా మెరిసింది. ఒక్క మంచిపని...

తను ఇంతవరకు చెప్పదగిన మంచిపని ఒక్కటి కూడా చెయ్యలేదు.

ప్రాణం నిలపటం మంచిపనే కదూ!

విశ్వం ఇంకేమీ ఆలోచించలేదు. ఆ వ్యక్తిని మరోసారి పిలిచాడు. అతను విసుక్కున్నాడో గాని ముందుకు నడిచి విశ్వందగ్గిర నిలబడ్డాడు. విశ్వం ట్రౌజర్ జేబులోంచి వందరూపాయల నోటు తీసి అతని కందిస్తూ అన్నాడు.

"ఇదిగో, తీసుకో, పని చూపించలేను, నిజమే. కాని ఈ వంద రూపాయలతో ఏ కిళ్ళీ కొట్టో తెరిచి ఏదోవిధంగా పొట్టగడుపుకో వచ్చేమో. ఏమంటావు?..."

ఆ వ్యక్తి తెల్లబోయాడు. దుకాణంలోని వాళ్లందరూ ఆశ్చర్యంగా విశ్వంవైపు చూశారు. "వంద రూపాయలే!" అని గుసగుసలు విశ్వానికి వినిపించాయి. ఆ అమ్మాయి విశ్వంవైపు తలెత్తిచూసి, మళ్ళీ ఇంకో పారిచూసి అర్థంకానట్టుగా ముఖం పెట్టింది.

విశ్వం గర్వంగా నుంచున్నాడు. అమరావతి శివలింగంలా తను పెరిగిపోతున్నట్టనిపించిందతనికి. తన దగ్గిరున్న వాళ్లందరూ మరుగుజ్జుల్లా అవుతున్నారు.

"తీసుకోవేం!" దర్పంగా అన్నాడు విశ్వం.

ఆ వ్యక్తి ఒక్కక్షణం విశ్వం కళ్ళలోకిచూసి తర్వాత చుట్టూచూసి "వొద్దులెండి" అనేసి గబగబ బయటికి నడిచిపోయాడు.

కొద్దిక్షణాలవరకూ ముందుకి జాపిన చేతిలోని వందరూపాయల నోటు రెపరెపలు చూస్తూ అలాగే ఉండిపోయాడు విశ్వం. అది స్వీకరించబడలేదు.

"అదేమిటండీ అంత మొత్తమా?" అన్నాడు దుకాణదారు, విశ్వంవైపు వింతచూపులు చూస్తూ.

విశ్వం ప్రత్యుత్తరం ఇవ్వలేదు.

"ఏం చూపించమంటారు?" వ్యాపారం విషయంలోకి దిగాడు దుకాణదారు.

"గాబర్డీన్ సూటింగ్ చూపించండి."

విశ్వంవైపు ఆ అమ్మాయి మళ్ళీ చూసింది. యథాలాపంగా అటువైపే చూసిన విశ్వం ఆమె ఉనికి అప్పటికి గుర్తించాడు. ఎక్కడో చూసిన రూపం అని అతనిమనసులో లీలగా అనిపించింది. ఆలోచించగా జ్ఞప్తికివచ్చింది. తను ఇంటర్మీడియేటు చదువుతున్నప్పుడు కాలేజీకి వెళ్లే సమయాల్లో స్కూల్కి వెళుతూ ఆ అమ్మాయి తనకి అప్పుడప్పుడు ఎదురయ్యేది! ఎవరో ఆమె! ఇప్పుడేం చేస్తోందో. పూర్వం తను చూసినప్పటికంటె ఇప్పుడు పొడుగెదిగింది. కొంచెం లావుగాకూడా ఉంది.

బిల్లు చెల్లించి విశ్వం ప్యాకెట్ తీసుకుని బయటికి వచ్చాడు. అతని మనసులో మళ్ళీ తను ధర్మం చెయ్యబోయిన దృశ్యం మెదిలింది. అతనెందుకు తిరస్కరించాడు? భయపడిఉంటాడా? అంత మొత్తం అతనెప్పుడూ చూసిఉండలేదేమో? పోలీసులు లాక్కుపోతారనుకున్నాడేమో? తను కావాలని అందరిఎదుటా ఇస్తున్నప్పుడు భయం దేనికి? తను ఇవ్వాలిసినవిధంగా ఇవ్వలేదేమో ఒకవేళ? అంతకంటె తనేం చెయ్యగలడు. ఎవరూ చూడకుండా అతని చొక్కా జేబులో పెట్టాలా? బతిమాలి తీసుకోమని నచ్చచెప్పాలా? అవసరం ఉన్నవాడే వెంటకిపోతే తనసంగతేమిటి? ఏమైతేనేం, ఇప్పుడతను ఒకవేళ ఏ అఘాయిత్యం చేసినా తనకా బాధ్యతలేదు.

విశ్వానికి ఎందుకో సంతృప్తిగా లేదు. తనవల్లో పొరపాటు చేశాడేమో! తనలో బహుశా ఏదో లోపం ఉండిఉంటుంది. అకస్మాత్తుగా అతనికి ఒక విషయం తట్టింది. ఆ వ్యక్తిని ఎలాగైనా ఆ దీనావస్థనించి తప్పించి సహాయం చెయ్యాలనే దృష్టి తనలో లేదు. ఒక మంచి పనికోసం-ఒక ఘనకార్యం తనూ చేయాలనే మానసిక తృప్తికోసం తను ఆరాటంగా అందరి ఎదుటా తన ఔదార్యాన్ని ప్రదర్శించాడు! సిగ్గుచేటు!

విశ్వం ముఖం మలినమైంది. ఆ వ్యక్తి తనని చెప్పుతో కొట్టినా ఇంత బాధపడేవాడు కాదు తను.

మరో ఊహకూడా వెంటనే తట్టిందతనికి. ఆ అమ్మాయి ఈ ఆర్భాటమంతా చూసి ఏమనుకుందో! తను బాగా డబ్బుగలవాడని అనుకుని ఉంటుంది. ఆ గాబర్డీన్ సూట్ తనకోసం కాదని ఆమెకి తెలియదు. పాపం. ఆమె తనవైపు చూడటం తను కనిపెట్టకపోలేదు. తను ఫలానా అని ఆమెకి తెలుసో, తెలియదో!

ఉన్నట్టుండి విశ్వానికి ఓ అనుమానం కలిగింది. తను ఈ హడావిడంతా ఆమె దృష్టిని ఆకర్షించటానికి చేశాడని దుకాణంలోని వాళ్లు అనుకున్నారేమో! కొంపతీసి ఆ అమ్మాయికూడా అలా అనుకోలేదుగద!

విశ్వానికి ముచ్చెమటలు పట్టాయి. తను పొర పాటు చేశాడు. ఒక వేళ ఆ వ్యక్తి ఆ వందరూపాయల నోటు తీసుకుని ఉంటే ఉట్టి చేతుల్తో ఇంటికి వెళ్ళవలసి వచ్చేది. ఇంట్లో అడిగితే ఏంసమాధానం చెప్పేవాడు? దానిమీద ఎంత గొడవ జరిగేది? తన పరిస్థితేమిటో వాళ్ళకేం అర్థమవుతుంది? ఇంకా నయం! ఆ వ్యక్తి తనకి మేలేచేశాడు. ఛ్ఛ, తను వట్టి తొందరమనిషి!

6

రంగనాథంగారు ఇరవైఏళ్ళు అఖండంగా హెడ్‌డ్రాఫ్ట్సుమను గిరీ వెలిగించి రిటైరయ్యారు. ఆయనకి విశ్వం, పద్మ, గోపీ ముగ్గురే సంతానం. కిందటి మాఘ మాసంలోనే పద్మకి వివాహం జరిగింది ఆమె భర్త శ్రీనివాసరావు ఎం. బి. బి. ఎస్ ప్యాసై హౌస్ సర్జన్‌గా ఉండి ఆమధ్యనే హైదరాబాద్‌లో ప్రాక్టీసు పెట్టాడు. ఆనర్స్ చదువుతున్నప్పుడు విశ్వానికి అతని పరిచయం లభించింది. ఆ పరిచయమే తరవాతి బాంధవ్యంగా మారింది.

ఆరోజున శ్రీనివాసరావు ప్రయాణం నిశ్చితమైంది. అనుకోకుండా పద్మకూడా అతనివెంట వెళ్ళుతోంది ఈసారి. పెళ్ళి అయిన తరవాత అత్తవారింటికి వెళ్ళటం ఆమెకిదే మొదటిసారి. ఎవరూ తోడు కూడా వెళ్ళటంలేదు. విశ్వాన్ని ఆహ్వానించాడు శ్రీనివాసరావు కాని "కాపరం పెట్టిం తరవాత చూడటానికి వస్తాలే" అన్నాడు విశ్వం.

బండి ఎక్కబోయేముందు తలిదండ్రులతో పాటు తనకి కూడా నమస్కారంచేసి పద్మ సెలవు తీసుకుంటూంటే విశ్వం హృదయం ద్రవీభూతమైంది. పద్మ తనకెప్పుడూ నమస్కారం చెయ్యలేదు ఇదివర కా. పద్మని కవ్వించి, నవ్వించి అల్లరిచెయ్యటం తనకి సరదాగా ఉండేది. అదికూడా ఉడుక్కోకుండా అంతకంటె ఎక్కువగా తనని కవ్వించేది. అకస్మాత్తుగా, తను ఇద్దరిమధ్య ఇన్నేళ్ళనించీ అణగి ఉన్న ప్రేమభావం పెల్లుబికింది. పద్మ ఈరోజున తనని గౌరవిస్తోంది. దాని జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. కొన్ని క్షణాలు జీవితంమీద మహా ప్రభావం కలిగిఉంటాయి. ఈ దృశ్యం తన జీవితంలో ఎప్పుడూ మరవలేడు. నవ్వులాటకైనా పద్మని ఇక తను కవ్వించలేడు. వేళాకోళమైనా ఆమె చిన్న బుచ్చుకుంటే తన హృదయంలో మానని గాయం తగులుతుంది. కొన్ని మైళ్ళదూరంలో, మరో వాతావరణంలో పద్మ పరిస్థితుల్ని పరిశీలించుకుని జీవితం గడపాలి. తన అభిరుచుల్ని అవసరమైతే మార్చుకోటానికి సిద్ధపడాలి. ఆ క్షణంలో విశ్వం మనసులో వింతకోర్కె కలిగింది. పద్మకి జీవితకాలంలో ఏనాడైనా ఒక్క సహాయమైనా చెయ్యగలిగితే తన హృదయం లోని అవ్యక్తమైన ఏదో ఆరాటం, అస్పష్టమైనబాధ తగ్గి తనకి ప్రశాంతత కలుగుతుంది.

ఈ ఆలోచనరాగానే విశ్వానికి వెంటనే నవ్వు కూడా వచ్చింది. ఆమెకి సహాయం చెయ్యాలని కోరిక బాగానే ఉంది కాని ఆ అవసరం పద్మకి ఎందుకు కలగాలి!

దంపతుల్ని స్టేషన్‌దాకా సాగనంపటానికి విశ్వం, గోపీ స్టేషన్‌కి వెళ్లారు. శ్రీనివాసరావు ఏదో హుషారుగా మాట్లాడుతున్నాడు. కాని విశ్వం మనస్సు అంత బాగా లేదు.

గంట మోగింది. గార్డు ఈలవేశాడు. జండా ఊపుతోంది. ఇంజన్ కేక వేసింది. రైలు కదల బోతోంది.

పద్మ కేదైనా ఇవ్వాలనిపించింది విశ్వానికి. పత్రికల కుర్రాడు ఇంతలో అటువైపు వచ్చాడు. ఏవో కొన్ని పత్రికలు కొని పద్మకిచ్చాడు.

"ఎందుకన్నయ్యా ఇవన్నీ?"

"కాలక్షేపం ఔతుందిలే, ఉండనీ."

ఆ ఇవ్వటంవెనకాల హృదయం మూగభాష ఇద్దరికీ అర్థమౌతూనే ఉంది.

రైలు కదిలింది.

"వొస్తాబాబూ, గోపీ," అంది పద్మ గాద్గదికంగా.

వాడికి హృదయంలో కెలికినట్టయింది. బెంగ చూపులు చూశాడు. తనేదైనా తెలియక తప్పుచేస్తే, అమాయకంగా ఏదైనా అడిగితే "వెధవా, ఫస్ట్ ఫారం వెలిగిస్తున్నావు గాని..." అని దరువుగా మందలించే వాళ్ళు అక్కయ్యతప్ప ఇంకెవ్వరూ లేరని వాడికి తెలుసు. ఇంక అలా అనటానికి అక్కయ్యదగ్గర ఉండదు!

వాడి కళ్లలో నీళ్లు తిరిగాయి.

శ్రీనివాసరావు చెయ్యి ఊపాడు.

విశ్వం రుమాలు ఊపాడు.

క్రమంగా రైలు దూరమైంది.

గోపీ చెయ్యిపట్టుకుని విశ్వం స్టేషన్‌బయటికి వచ్చాడు. ఇలాంటి వీడ్కోలు దృశ్యాలని తను పూర్వం “సెంటిమెంటల్ ట్రాష్” అని త్రోసేసేవాడు. ఈ రోజున అతని నేత్రాలు చెమ్మగిల్లాయి. అతనేమీ ఆలోచించటం లేదు. హృదయం బరువుగా ఉంది.

మార్గమధ్యంలో ఒక్క సారిమాత్రం విశ్వం, గోపీ మాట్లాడుకున్నారు.

“అక్కయ్య మళ్ళీ ఎప్పుడు వస్తుందన్నయ్యా?” అన్నాడు గోపీ.

“తొందరగానే వొస్తుంది.” అన్నాడు విశ్వం. ఆ సమాధానం వాడికి తృప్తిగా లేదు. ఉండదని విశ్వానికీ తెలుసు.

“ఈ దేశంలో మగవాడు తన ఆధిక్యత రుజువు చేసుకోటానికి ప్రయత్నిస్తాడు. బహుశా ఎక్కడైనా అంతే నేమో. లేదా ఆ భేదం ఉంటే తరతమాల్లోనే! కాని, శ్రీనివాసరావు మంచివాడే” అని సమాధాన పడ్డాడు విశ్వం.

ఇంటికివచ్చి భోజనాదులు ముగించుకుని తీరిగ్గా పడకకుర్చీలో పడుకుని పేపరుచూసి, చేసేపనిలేక నిద్రపోవాలని కళ్లు మూసుకున్నాడు విశ్వం. కాని నిద్రవచ్చే సూచన లేదు. సరదాగా మాట్లాడుతూ కాలక్షేపం చెయ్యటానికి పక్క లేదు. గోపీ ఎప్పుడూ తోటపిల్లలతో ఆడుకుంటూనో, చదువుకుంటూనో ఎక్కడో ఉంటాడు. ఇక తనకి కావలసినంత తీరిక. ఫలితాలు తెలిసి ఉద్యోగం ఏదైనా వచ్చేదాకా రోజంతా విశ్రాంతే. ఈ సమయం వృథా పోనీయకండా ఏదైనా చెయ్యాలని అనుకున్నాడతను. వెంటనే “జీవిత లక్ష్యం” పంక్తి జ్ఞాపకం వచ్చిందతనికి. తన జీవితలక్ష్యం ఏదైతే బావుంటుంది?

బొమ్మలు వెయ్యటంలో తనకి అభిలాష కొస్తూ ఉంది. స్కూల్లో డ్రాయింగు పరీక్షల్లో తనకి మంచిమార్కులే వచ్చేవి. పక్షులూ, జంతువులూ తనకి కరతలామలకం. మనుషుల బొమ్మలుకూడా కొంచెం జాగ్రత్త తీసుకుంటే బాగానే వెయ్యగలడు. చిత్రలేఖనం కృషిచేస్తే తను అందులో పేరు సంపాదించుకోగలడేమో! కాని దానికి ఎంతో శ్రమా, ఓపికా, కాలమూ కావాలి. తన కెటువంటి ఉద్యోగం వస్తుందో! నేర్చుకుని కూడా బొమ్మలు వేసుకోటానికి తీరిక దొరకని ఉద్యోగమైతే ఆశాభంగం అవుతుంది. అయినా తను నిరుత్సాహపడకూడదు. సాధకం చెయ్యాలి. తను గొప్ప చిత్రకారుడు కావాలి.

ఈ ఊహ కలగగానే దానిని ఆచరణలో పెట్టాలనే సంకల్పం దృఢమైందతనికి. తన అదృష్టంకొద్దీ ఆ ఊళ్ళోనే ప్రఖ్యాత చిత్రకారుడు ఒకాయన ఉన్నాడు.

విశ్వం ఆలస్యం చెయ్యకుండా ఆ సాయంకాలమే ఆయన దగ్గరికి బయలుదేరి వెళ్ళాడు. ఆ చిత్రకారుడు అదృష్టవశాత్తూ తన స్టూడియోలోనే ఉన్నాడు ఆ సమయంలో. చిత్రలేఖనంలోని తన ఉబలాటమూ, కుతూహలమూ ఆయనకి తెలియచెప్పి సహాయం అర్థించాడు.

ఆ చిత్రకారుడు విశ్వాన్ని పరిశీలనగా చూసి ఒక తెల్లకాగితం, పెన్సిలూ ఇచ్చి అన్నాడు.

“కోడిపుంజు బొమ్మ వెయ్యండి.”

విశ్వం క్షణంలో గీశాడు.

“సున్నా చుట్టండి.”

విశ్వం సున్నా అనబడేది చుట్టాడు.

“ఈ రెంటికీ తేడా ఉన్నట్టు లేదా!” అన్నాడు చిత్రకారుడు నవ్వు పెదవులలోంచి చిందిస్తూ. విశ్వం చిన్నబుచ్చుకున్నాడు. అతి ఇలా తనని పరీక్షిస్తాడని తను అనుకోలేదు.

“ప్రాక్టీసు చెయ్యలేదు గదండీ” అన్నాడు.

“నా సలహా విని మీ కీ ప్రయత్నం విరమించుకోండి.”

“ఎందుకండీ?”

“మీకు బొమ్మలు వెయ్యటం రాదు.”

అలా ఆయన కుండ బద్దలు కొట్టినట్టు నిర్మొహమాటంగా అంటే విశ్వానికి ఆశ్చర్యంతో బాటు ఆగ్రహంకూడా కలిగింది.

“నేను వేసే బొమ్మలు మా డ్రాయింగ్ మాస్టరు గారు మెచ్చుకున్నారండీ.” అన్నాడు తమాయించుకుని.

"నేను డ్రాయింగ్ మాస్టర్ని కాదుగా."

"ప్రాక్టీసు చేసినా రాదంటారా?"

"ఉహుఁ. మీకు ఫ్రీ హాండ్ లేదు."

విశ్వం ముఖంలో నిరాశ తాండవించింది. 'ఇక మీ టిలా నిరుత్సాహపరుస్తాడేం ఈయన' అనుకున్నాడు.

"ఏదైనా బొమ్మ వేస్తాను, చూస్తారా?"

చిత్రకారుడు అయిష్టంగా ముఖం పెట్టాడు. అది అంగీకారమే ననుకుని విశ్వం కోయిలబొమ్మ గీశాడు.

"ఎలా ఉందండీ?" అని ఆశగా ఆయనవైపు చూశాడు, తప్పక మెచ్చుకుంటాడని భావిస్తూ.

అతను చిన్నగా, పొడిగా నవ్వాడు.

"చిత్రలేఖనం బదులు మరేదైనా చేస్తే మీ కాలం వృథా కాదు." అన్నాడు.

"అంతేనా?"

"మీమీద నాకేమీ కోపం లేదు. ఫ్రీహాండ్ లేదని చెప్పాను, అంతే."

"మనిషి పుట్టగానే అక్షరాలు రాయటం రాదు కదండీ."

"అవును. ఇప్పుడా సంగతెందుకు?"

"నేర్చుకుంటే ఏదైనా వొస్తుందని చెబుతున్నాను. కాపీలు రాసినవాడు గుండ్రటి అక్షరాలు రాస్తున్నాడు. మీరైనా ఉన్నట్టుండి అమాంతంగా ఈ విద్య మీకు వొచ్చిందని తెలుసుకున్నారనుకోను."

"నన్ను మీ రపార్థం చేసుకుంటున్నారు."

"అయితే క్షమించండి. కాని నా మాటలు నిజమని మీకు రుజువు చెయ్యగలను. సెలవు."

ఆయన ప్రత్యుత్తరానికి ఎదురు చూడకుండా విశ్వం చరచర వెళ్ళిపోయాడు. ఆ నాటినించీ అహర్రాత్రులు శ్రమపడి, పుస్తకాలు చదివి తెలుసుకుని, అభ్యాసంచేసి రేఖాచిత్రాలు సునాయాసంగా గియ్యటం నేర్చుకున్నాడు. స్వశక్తిమీద అతనికి నమ్మకం ఏర్పడింది.

ఓ రోజు సాయంత్రం మళ్ళీ ఆ చిత్రకారుడి దగ్గరికి వెళ్ళాడు.

"మళ్ళీ వచ్చారేం?" అన్నాడాయన విశ్వాన్ని గుర్తుపట్టి.

"శిష్యరికంకోసం కాదులెండి; రుజువుకోసం." అనేసి కాగితం ఆయనముందుపెట్టి ఓ సున్నా గీశాడు.

"ఇదిగో మీ సున్నా. ఇంకా కొన్ని కావాలా? ఒకటి, రెండు, మూడు—" చిన్నవీ, పెద్దవీ వరసగా కొన్ని సున్నాలు గీశాడు విశ్వం. ఆయన ఆశ్చర్యంగా వాటివైపు చూశాడు.

"అలా వెళ్ళకండి మరి. నాకు ఫ్రీ హాండ్ లేదుగా." వ్యంగ్యంగా అనేసి వెళ్ళిపోబోయాడు విశ్వం. తటాలున చిత్రకారుడు అతని భుజంమీద చెయ్యేసి ఆపాడు. చిరునవ్వు నవ్వాడు.

"శభాష్" అన్నాడు.

విశ్వంకోపం ఇంకా పోలేదు.

"సెలవిప్పించండి" అనేసి వెళ్ళబోయాడు.

"నిన్ను ఆశీర్వదిస్తున్నాను." అన్నాడాయన. విశ్వం వెళ్ళలేకపోయాడు. ఓటమిని అంగీకరించి తనని ఆశీర్వదించిన అతని సహృదయత్వం విశ్వంకాళ్ళకి బంధాలు వేసింది.

"తొందరపడి ఆవేశంగా మాట్లాడాను. క్షమించండి."

"ఫరవాలేదు. నా దగ్గిర తెలుసుకోవాలిసింది ఏదైనా ఉంటే నీ ఇష్టం వచ్చినప్పుడు నిరభ్యంతరంగా రావొచ్చు. చాలా సంతోషిస్తాను." అన్నాడు చిత్రకారుడు. అతని హృదయ వైశాల్యం విశ్వంలో భావోద్రేకం కలిగించింది.

"మహాభాగ్యం." అన్నాడు.

"వెళ్ళిరా ఇంక." సెలవిచ్చాడు చిత్రకారుడు.

తేలికపడ్డహృదయంతో విశ్వం సెలవుతీసుకున్నాడు. కాఠిన్యం వెనకాలనే ఎంత మృదుత్వం ఉంటుంది! అదే ఆ కళాకారుడి సందేశం అనిపించింది విశ్వానికి.

7

నవ్యనాటకసంఘం అనే సంస్థకి ఆ రోజున ప్రారంభోత్సవం జరుగుతోంది. దానికి కార్యదర్శి రంగారావనే యువకుడు. స్కూల్ టీచర్. అతను

విశ్వంతో ఎస్.ఎస్.ఎల్.సి. దాకా కలిసి చదివాడు. తరవాత విశ్వం కాలేజీ చదువుకీ, రంగారావు సెకండరీ ట్రయినింగ్ కీ వెళ్ళారు. అయినా ఇద్దరిదీ ఒకే ఊరు కావటంవల్ల తరుచు కలుసుకుంటూ తమ స్నేహాన్ని వర్ధిల్ల చేసుకుంటూ వచ్చారు. రంగారావు బాగా పాడగలడు. అతనికి నాటకాలంటే మొదటి నించీ సరదా. తోటివాళ్ళని కొందర్ని కూడగట్టుకుని నాటక సంఘం స్థాపించాడు. విశ్వానికి నాటకాలలో అంత అభిరుచి లేదు. అయినా రంగారావు ప్రోద్బల ప్రోత్సాహంవల్ల సంఘంలో అతను కూడా సభ్యుడయ్యాడు. ప్రారంభోత్సవానికి వచ్చేవరకూ సంఘంలోని ఇతర సభ్యుల్ని గురించి విశ్వాని కేమీ తెలియదు. ముఖ్యసభ్యుల్ని రంగారావు అంతకి కొంచెం ముందే పరిచయం చేశాడు.

పెద్దల ఉపన్యాసాల తరవాత ముఖ్యసభ్యులు కొందరు ప్రసంగాలు చేశారు. కళామతల్లి జీవితానికి ఆ రోజున తమని అంకితం చేసుకుంటున్నామనీ, కళని ఉద్ధరించటమే తమ జీవితాశయమనీ అందరూ ఉద్ఘాటించారు.

తరవాత వినోదవిజ్ఞానదాయకమైన కార్యక్రమం ప్రారంభమైంది. అందులో మొదటి అంశం రంగారావు గానం.

అతను శ్రావ్యంగా పద్యాలు పాడుతుంటే సభికులు తన్మయులై వింటున్నారు. తనకి పద్యం పాడటం రానందుకు విశ్వం ఆక్షణంలో మిక్కిలి విచారించాడు. మంచి పాట విన్నప్పుడు అనుకరించాలనే తన అభిలాష ఈ జీవితంలో తీరదు. తను ఆ విషయంలో చేసిన వివిధ ప్రయత్నాలు గుర్తొచ్చాయి విశ్వానికి. తన స్వరం తనకే అసహ్యంగా వినిపించేది. ఓసారి బీచివొడ్డున ఒంటరిగా ఉన్నప్పుడు భావావేశంతో తను గొంతెత్తి ఏదో పద్యం రాగయుక్తంగా అనబోయినప్పుడు తన స్వరం సముద్రపు ఘోషతో, రైలు ఇంజను కేకతో తులతూగి చుట్టుపక్కలవాళ్ళకి భయకారణం కావటం తనెప్పుడూ మర్చిపోలేడు. రంగారావు ఒకసారి ఏ పాటవిన్నా తు చ తప్పకుండా అదే వరసన సాహిత్యంతో సహా మళ్ళీ అనగలడు. రంగారావుమీద తనకి కొంచెం అసూయ జనిస్తున్నట్టు పసికట్టి విశ్వం నవ్వుకున్నాడు. తను ఆనర్స్ పరీక్ష బాగా రాశాడని విన్నప్పుడూ, తన బొమ్మలు చూసినప్పుడూ రంగారావులో కలిగిన ఈర్ష్యాభావం తను గ్రహించగలిగాడు. అయితే ఇలాంటి భావాలకి విలువ ఇవ్వటం అనవసరం. ఈర్ష్య అనటం కంటె అసంతృప్తి అనటం సమంజసం. అవతలివాడికి ఉందని ఏడవటం ఈర్ష్య. తనకి లేదని విచారించటం అసంతృప్తి. చాలా మంది మనుషులు బహుశా ఈ రెండో తరగతికే చెందుతారు. ఈ భేదం గమనిస్తే మనుషుల్ని ఇంకా బాగా అర్థం చేసుకోటానికి వీలుంటుంది.

విశ్వం ఇలా ఆలోచిస్తుండగా రెండో అంశం ప్రారంభమైంది. వెంకటేశ్వరరావు అనే నటుడు నటనలోని వివిధ అంశాలను సోదాహరణంగా వివరించి చివరికి ఏకపాత్రాభినయం చేసి ప్రేక్షకుల మన్ననల్ని అందుకున్నాడు.

ఆ తరవాతదే విశ్వం ప్రోగ్రాం. "మానవత్వం" అనే పేరుతో అతను ఒక చిన్న గేయం గానం చేశాడు. రాగం జోలికి పోకుండా ఆవేశంగా చదువుతూ తన్నుతానే మర్చిపోయి అక్కడక్కడ చిన్న వ్యాఖ్యానాలు కూడా చేశాడు. చివరికి—

అనిమిషత్వం నా ఆశ
మానవత్వం నా శ్వాస

అనే పంక్తులు ఉద్రేకంగా హెచ్చుస్థాయిలో అని కూర్చున్నాడు. సభికులు చప్పట్లు కొట్టారు.

కార్యక్రమం అయిపోగానే చాలామంది విశ్వం గేయాన్ని ప్రత్యేకంగా మెచ్చుకుని అతన్ని అభినందించారు. విశ్వం వాళ్ళ మెచ్చుకోలుకి సంతోషాశ్చర్యాలు పొందాడు. తను అప్పుడప్పుడు గేయాలు రాసేవాడే. కాని ఇంతవరకు ఒక్క గేయం కూడా ప్రచురించలేదు. ఏదో రాయాలని అనిపించినప్పుడు కూర్చుని నాలుగు పంక్తులు రాసేవాడు. అవి ఇతర్లు మెచ్చుకుంటారో లేదో అనే ఊహ అతని కెప్పుడూ రాలేదు. ఒక్కసారిగా అందరూ తనని ప్రశంసించటంవల్ల తబ్బిబ్బయిపోయాడు. కృతజ్ఞత చెప్పాలనే సంగతి కూడా అతనికి తట్టలేదు. రంగారావు తన గేయాలు కొన్ని వినటం, ఏదో ఒకటి ప్రారంభోత్సవ సమయంలో చదవమని బలవంతం చెయ్యటం అతను గుర్తుచేసుకొని రంగారావుకి కృతజ్ఞత చెప్పాడు.

ఆ సమయంలోనే ముఖ్యసభ్యులు కొందరు విశ్వం చుట్టూ చేరారు.

"రంగారావు గారూ, విశ్వంగారిచేత మంచి నాటకం ఒకటి రాయించాలి మీరు" అన్నాడు ఒక సభ్యుడు.

"అందులో మంచి గేయాలు తప్పకుండా ఉండాలి."

మరో సభ్యుడు తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

"థాంక్స్—కాని నాకు నాటకాలు రాయటం రాదండీ" అన్నాడు విశ్వం.

"మేం నమ్మంలెండి."

"సభ్యుడివి. నువ్వే తప్పించుకోవాలంటే ఎలా?" అన్నాడు రంగారావు.

"తాహతుకి దాటిన పనులు నెత్తిన వేసుకుంటే ఏమవుతుందో తెలుసా?"

"అదంతా మాకు వొదిలెయ్యి."

"నాటక సంఘం నాలుగు కాలాలపాటు వర్థిల్లాలని లేదా?"

"కుంటిసాకులు చెప్పకు. నువ్వు తలుచుకుంటే రాయగలవు. అంతే." అన్నాడు రంగారావు. అందరూ ఆమాటే సమర్థించారు. విశ్వానికి మాత్రం గుండెల్లో రాయిపడ్డది. తనెప్పుడూ నాటకం కాదు గదా కథ కూడా రాయలేదు. ఏదో చెత్తరాసి వాళ్ళ మీదా, ప్రజల మీదా రుద్దితే ఫలితాలు సంగతి అలా ఉంచి తనకే అపచారం చేసుకున్నవాడవుతాడు. ఏం చేయాలో అతనికేం తోచలేదు. రంగారావుతో ఈ విషయం గురించి తరవాత రెండు మూడుసార్లు ముచ్చటించాడు. అతను ఉన్న సంగతి విశదం చేశాడు.

"ఒరే విశ్వం, మనకి నాటకాలు సరైనవి ఎక్కువ లేవు. ఉన్నవి కూడా పాతవి" ఉద్యోగ విజయాలు"లాంటివి మనం వెయ్యలేకపోవటం లేదు గదా! నాటక సంఘం శ్రేయస్సు కోరి నువ్వు నీ చేత నైనంతలో ఏదైనా రాసివ్వు, బాగుంటే వేద్దాం."

ఇక విశ్వం ఏమీ అనలేకపోయాడు. ఆలోచించి సాంఘిక నాటిక ఒకటి రాసిచ్చాడు. అందరూ 'ఫస్టుగా ఉంది'న్నారు. రిహార్సల్స్‌కి వొచ్చిసూచనలిస్తూ ఉండమని విశ్వాన్ని అడిగాడు. విశ్వం అలాగే నన్నాడు కాని వెళ్లటానికి అతనికి మనసొప్పేదికాదు. ఈ నాటకాల గొడవల్లో పడితే తన చిత్రకళోపాసన పూర్తిగా దెబ్బతింటుంది. చిత్రకళే తన లక్ష్యం.

ఒకరోజు రంగారావు మరీబలవంతం చెయ్యటం వల్ల ఆ సాయంత్రం రిహార్సలుకి వెళ్లాడు.

టౌన్లో ఓ మూలగది అద్దెకి తీసుకుని 'నాటక సంఘం' అని బోర్డుకట్టారు. ఆ గదిలోని వాతావరణం చూసేసరికి విశ్వానికి చిరాకువేసింది. ఉన్న సామాను చిందరవందరగా వుంది. కొందరు బీడీలు, మరికొందరు సిగరెట్లు తాగుతూ గది పొగతో నింపి కాల్చివేసిన పీకలు గదిలోనే పారేస్తున్నారు. సభ్యులలో కూడా ఒక క్రమశిక్షణ లేదు. ఎవడి ఇష్టం వచ్చినట్లు వాడు ప్రవర్తిస్తున్నారు. తబలా ఒకపక్కన మోగుతూనే ఉంది. సభ్యులు మాట్లాడుతూనే ఉన్నారు.

"హీరోయిన్ ఎవరు వేస్తున్నారు?" అన్నాడు విశ్వం.

"వసంత అనే అమ్మాయి. అందాల బరిణే. చూస్తే గుమ్మయిపోతావు. 'ఒక్క నవ్వే పలు వజ్రవైడూర్యాలు' అన్న కవి ఈవిడని చూసే రాశాడా అనిపిస్తుంది. ఆ కళ్లూ, ఉంగరాల జుట్టూ, వాలుజడా కపోలాలూ...ఓహ్!"

అతని ధోరణి మధ్యలోనే ఆపి, "నువ్వు కూడా కవివా ఏమిట్రోయ్?" అన్నాడు విశ్వం.

"ఆ పిల్లని ఒక్కసారి చూస్తే కవిత్వం నురుగులు కక్కుతూ పరుగులు తియ్యదూ?"

"అదేం అలంకారం, మహాశయా?" అన్నాడు ఒక నటుడు.

అందరూ గొల్లుమన్నారు.

"నీకు పెళ్లయిందికదురా?" అన్నాడు విశ్వం.

"అయితే ఏమండీ, రసపాయి మన రంగారావు." అన్నాడు ఒక సభ్యుడు. అందరూ మళ్ళీ గొల్లుమన్నారు.

"జాగ్రత్త రంగారావు. చెయ్యి పట్టుకునేవు. కఠోరాణి వజ్రాదపి..."

"స్వానుభవమా స్వామీ?" అన్నాడు రంగారావు.

విశ్వం ఈ సంభాషణకి విసుక్కున్నాడు. విషయం తప్పిస్తూ అన్నాడు.

"ఆమె బాగా నటించగలదా?"

"పిచ్చివాడా? నీకు బొత్తిగా లోకజ్ఞానం లేదు. అందమైన ఆడది నటించడ మెందుకోయ్. స్టేజిమీద నిలబడితే చాలదూ? నోళ్ళు తెరుచుకుని చూడరూ జనం?"

"జనం సంగతి కాదు. ఆమె నటన సంగతి అడుగుతున్నాను."

"నాకు బాగానే ఉంటుంది ఆమె నటన."

"ఏమండీ డైరక్టర్ గారూ?"

"గొప్పగా నటిస్తుందండీ. మొదటి నాటకంతోటే ఆమె సినీఫీల్డులో చేరిపోతుంది లెండి. అలాంటి వాళ్ళు నాటకాల్లో 'రాట్' అవుతారా?"

విశ్వం కొంచెం ఆశ్చర్యంగా అతనివైపు చూశాడు.

"నాటకాలు వెయ్యటం 'రాట్' కావటమనా మీ అభిప్రాయం? ప్రారంభోత్సవసమయంలో నాటకకళను గురించి గొప్పగా మాట్లాడారే!"

"నా అభిప్రాయంకాదు. ఆమె దృక్పథం అదే ఐ ఉంటుంది."

"సినిమాల్లో చేరితే అంత నాజూకుగా ఉండదు లెండీ." అని విచారించాడు ఒక నటుడు.

"ఎందుకండీ?" అన్నాడు చిరునవ్వుతో మరొకడు.

"తెలిసియు దెలియని నరుదెల్ప బ్రహ్మదేవుని వశమే!"

"కవిచౌడప్ప శతకంలోని పద్యంకాదూ?"

"చంద్రరేఖావిలాపంలోదైతే మరీ రంజుగా ఉంటుంది."

"ఒరు లేయవి యొనరించిన నరవర..." అని భావగర్భితంగా తలూపాడు మరొకడు.

వాళ్లవైపు జాలితో చూశాడు విశ్వం.

"ఆమె ఇవాళ రిహార్సల్ కి వొస్తుందా?"

"ఎందుకురాదు? డబ్బిస్తున్నాంసార్."

"ఎవరైనా త్వరగా రమ్మని హెచ్చరించినసే బావుంటుందేమో. త్వరగా రిహార్సలు మొదలుపెడితే పెందరాళే వెళ్ళిపోవొచ్చు." అన్నాడు విశ్వం.

"అందుకే కదండీ వెంకటేశ్వర్రావుగారు వెళ్ళారు. మరొకరు వెడితే ఆయన ఒప్పుకోరు."

"ఏం?" అన్నాడు విశ్వం అర్థంకాక.

"అదంతే లెండి. ఏం రంగారావుగారూ?"

రంగారావు 'హుఁ' అని ముఖం చిట్లించుకున్నాడు.

"వెంకటేశ్వర్రావుకి ఎన్నిసార్లో చెప్పాను — కొంచెం జాగ్రత్తగా ఉండమని. ఎప్పుడో గాజుల చెయ్యి చెంపకుపరంబు కాకతప్పదులే."

అందరూ నవ్వారు.

"ఆమె రేటెంత?" అన్నాడు విశ్వం.

అందరూ ఒక్కసారి ముఖముఖాలు చూసుకున్నారు. వాళ్ల ముఖాల్లో ఆశ్చర్యం తాండవించింది. వాళ్లలా ఎందుకు చూస్తున్నారో విశ్వానికి తెలియలేదు.

"ఏమిటో అనుకున్నాను. నువ్వూ రసికుడివే." అని రంగారావు నవ్వాడు.

"ఏమిటి నువ్వనేది?"

"ఓయి మహానుభావా, ఆమె రేటెంతో ఇంతవరకూ తేలకనే చస్తున్నాం. కొంచెం హైక్లాసల్లే ఉంది."

"అసలామె అటువంటిదికాదేమోనండీ. చదువుకుంది కూడా."

"అవన్నీ తీసి అవతలపెట్టండి. అది వంశపారంపర్యం పాపమూ."

విశ్వానికి అర్థమైంది. 'ఛీ' అనుకున్నాడు. తన ప్రశ్న ఎంత తుచ్ఛంగా అర్థం చేసుకున్నారు. ఆ రెండో అర్థంలోనే వాళ్ళెందుకు తీసుకోవాలి. వాళ్ళ మనస్సులన్నీ కల్మషపూరితాలు. ఇదా వీరి కళారాధన. నాటకసంఘంట! వెంటనే రాజీనామా పారెయ్యాలనిపించింది విశ్వానికి. కాని అంతిమందిలో ఆ పనిచేసి గొడవపడదలచుకోలేదు. రంగారావులో కూడా ఇంత నీచత్వం ఉందనుకోలేదు. కళాకారుడట. ఏం లాభం? ఒక వ్యక్తిని పరోక్షంలో చులకన చెయ్యడం ఘనకార్యమా? ఇంతమంది నాటక కళోద్ధారకులు ఇక్కడ కూడి చేసే పని అదేనా?

ఆమె ఎటువంటిదైనా కావొచ్చు. కాని ఆర్టిస్టు. ఆ గౌరవం ఇవ్వలేనివాడు ఆర్టిస్టు అనిపించు

వుంటాడా? అందరూ చదువుకున్నవాళ్ళే, మాటల్లో మాత్రం సభ్యత ఎక్కడా కనిపించదు. విశ్వానికి అక్కడ ఉండే బుద్ధిపుట్టలేదు.

"వెళతాను రంగారావు. తిరవాత ఎప్పుడైనా వొస్తాలే" అన్నాడు మర్యాదకి.

అదే సమయంలో నాయికపాత్ర నిర్వహించే నటీమణి లోపలికి అడుగుపెట్టింది. "ఆమె వొచ్చిందోయ్. కాసేపు కూర్చునిపోదువుగాని లే" అని, ఆమె వైపు తిరిగి ఆహ్వానించాడు రంగారావు "రండి. రండి."

అందరూ ఆప్యాయంగా పలకరించారు.

"ఆలస్యమైందేమండీ?"

"ఒంట్లో ఖులాసాగా ఉందా?"

"రారేమో అనుకున్నాం."

కుశలప్రశ్నలు వెయ్యసాగారు. ఆమె కొంచెం ముభావంగా సమాధానాలు చెప్పింది. రంగారావు విశ్వాన్ని ఆమెకి పరిచయం చేశాడు.

"వీరే మన నాటిక రచించినవారు. విశ్వేశ్వరరావు. బి. ఏ. ఆనర్స్."

"నమస్తే. ఇంకా ఆనర్స్ కాలేదులెండి."

అని చిరునవ్వుతో ఆమె ముఖంలోకి చూసి అదిరిపడ్డాడు విశ్వం.

వసంత అంటే ఆమేనా? ఆరోజున కుడ్డలకొట్లో తనకి కనిపించింది. అనేకసార్లు స్కూల్‌కి వెడుతూ తనకి ఎదురైంది.

"నమస్తే" అంటూ వసంత విశ్వం ముఖంలోకి చూసి ఏదో అనబోయి మళ్ళీ మాట్లాడకుండా ఊరుకుంది. ఆమె ముఖంలో కూడా ఆశ్చర్యం ప్రతిఫలించటం విశ్వం కనిపెట్టాడు.

రిహార్సల్సు ప్రారంభమయాయి. ఆమె చక్కగా పాడుతుందని మెచ్చుకున్నాడు విశ్వం. ఆమె నటననీ, పాటనీ పదేపదే మిగతా వాళ్ళందరూ పోటీలుపడి మెచ్చుకున్నారు. అయితే ఇదంతా రోజూ మామూలేగనుక వాళ్ళ పొగడ్తలకి ఆమె ఏమీ ఉబ్బిపోలేదు. విశ్వం అతిగా మాట్లాడక "బాగా పాడారండీ" అనీ "బాగా నటించారండీ" అన్నప్పుడు ఆమె నిజంగా సంతోషించింది.

ఆరోజుకి రిహార్సల్సు చాలించారు. బాగా చీకటి పడ్డది. వెంకటేశ్వరరావు తోడుకవస్తా నన్నాడు.

"అక్కర్లేదు లెండి. మీరు మళ్లీ వెనక్కి ఇంత దూరం రావటం శ్రమ." అంది వసంత.

"నాకేం శ్రమలేదు."

"నేను బజారువైపు వెడుతున్నాను. రిక్షా పంపిస్తాలెండి, పోనీ" అన్నాడు విశ్వం.

"నేనూ బజారువైపే వెళ్ళాలి. దారిలో కనిపిస్తే రిక్షా చేసుకుంటాను. పదండి, పోదాం" అంది వసంత.

వెంకటేశ్వరరావు విశ్వంవైపు కొంచెం కొరకొర చూశాడు.

విశ్వం ముందు నడుస్తున్నాడు. వసంత కొంచెం వెనకగా, పక్కగా నడుస్తోంది. ఇద్దరిమధ్యా నిశ్శబ్దం ఆవరించింది. ఏదో మాట్లాడాలనిపించింది విశ్వానికి. కాని అతనికేం మాట్లాడాలో తోచలేదు. ఆమే పలకరించింది.

"నాటిక రాసింది మీరేనంటే ఆశ్చర్యపడ్డానండీ" అంది.

"ఏం నాముఖంలో అకళేమీ కనిపించటం లేదా?" అన్నాడు చిన్నగా నవ్వి.

"అదేం కాదండీ. మిమ్మల్ని ఎక్కడో ఇదివరకు చూశానండీ—ఊమన్యనే"

"ఎక్కడ?"

"జ్ఞాపకం రావటంలేదు. అంతకుముందు కూడా చాలాసార్లు చూశాను. నేను స్కూల్‌కి వెడుతున్నప్పుడు మీరు..."

"కాలేజీకి వెడుతూ కనిపించేవాడిని కదూ?"

"అవును. మీరు కూడా నన్ను చూశారన్నమాట."

"చూడకేం?"

"ఆఁ—! ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందండి. మీరు ...మీరు..." ఆమె ఆగింది.

"ఒక బట్టల దుకాణంలో కనిపించాను కదూ?"

"అవును. కాని అదేమిటండీ, ఎవరైనా అడుక్కునేవాళ్ళకి వందరూపాయలు ఇస్తారా? భలే వాళ్ళే సే."

"ఏం, ఇవ్వకూడదా?"

"మీరు బాగా డబ్బున్నట్టుంది."

"లేకపోతే ఇవ్వకూడదా?"

"అని కాదు. ఎక్కడిదిరంచి వస్తుంది?"

"నేను గొప్పవాడిని కాదు, నిజం చెప్పాలంటే."

"అదే నేనూ అనుకున్నాను."

"ఎలా అనుకున్నారు?"

"ధనవంతులైతే కారుండదూ? దుకాణం బయట కారేదీ లేదుగా!"

"మీకు మంచి పరిశీలనాశక్తి ఉందండీ."

"ఈమాత్రం దానికే! పొగడదలుచుకుని పొగుడుతున్నారు."

"మిమ్మల్ని ఊరికే పొగిడితే నాకేం లాభం?"

"నేను బాగా నటించానని మీరు మనస్ఫూర్తిగా అనుకుంటున్నారా?"

"లేక పోతే అలా అనటానికి నాకేం అవసరం?"

"మీరు మెచ్చుకుంటే చాలా సంతోషం కలిగిందండీ. మీకు కోపంవస్తుందేమో గాని, మీ స్నేహితులు ముఖస్తుతికోసం అలా అంటారని వాళ్ల మాటల్ని బట్టే తెలుస్తుందండీ."

"వాళ్ళు నా స్నేహితులు కారు." అన్నాడు విశ్వం ముఖం చిట్లించుకుని, హేయభావంతో. వసంత ఆశ్చర్యపోయింది.

"అలాగా? అయితే నేను పొరపడ్డాను, సుమండీ."

"రంగారావు ఒక్కడే నాకు స్నేహితుడు. రేపు మొహం వాచేట్లు వాడిని చివాట్లు పెడతాను." అన్నాడు విశ్వం కోపంగా.

"ఎందుకు?" అంది వసంత ఆశ్చర్యంగా.

విశ్వం తన పొరపాటు గుర్తించాడు. దప్పున అతనికి వసంత ఇంతకిముందు అన్న మాటలు గుర్తొచ్చాయి.

"ముఖస్తుతి చేస్తున్నందుకు."

"ఓ అదా!" అంది వసంత.

"మరేమి టనుకున్నారు?"

"ఏం లేదులెండి."

కొంచెంసేపు మౌనంగా నడిచారు ఇద్దరు. రిక్షా కనుచూపు మేరలో ఎక్కడా లేదు.

"ఈ నాటకంలో వేస్తున్నందుకు మీ రెంత తీసుకుంటున్నారు?"

"ఏబ్బా!" అంది వసంత.

"ఊఁ"

వసంత కొంచెం ఆశ్చర్యపడి అంది.

"నేను నాటకసంఘంలో సభ్యురాల్నికదండీ"

"అలాగా! అయితే సరదాగా వేస్తున్నారన్న మాట."

"అవును. అదీకాక ఇదే నేను మొదటిసారి నటించబోవటం. నా శక్తి ఎంతవరకుందో తెలుసుకోవాలని ఒప్పుకున్నాను."

"పేరువస్తే ఏం చేస్తారు?"

"వీలైతే సినిమాలో చేరాలని ఉంది." అంది.

విశ్వం ఏమీ మాట్లాడలేదు. ఆ సమాధానం ఎందుకో అతనికి రుచించలేదు. వసంత మనసులో ఉన్నది మర్మంలేకుండా చెప్పే అమాయకురాలని గ్రహించాడు. నాటకసంఘంలోని వాళ్లందరూ ఆ క్షణంలో తేళ్ళలా అతని మనోవీధిలో కనిపించారు. ఆ విహ్వాదకుం ఆరాటపడ్డది.

"నాటక సంఘంలో కొంచెం జాగ్రత్తగా ఉండండి."

"ఏం?" అంది వసంత ఆసక్తిగా అతనివైపు చూస్తూ.

"వాళ్ళలో కళారాధకులంటే పాడుబుద్ధులే ఎక్కువ." అన్నాడు విశ్వం. కాని వెనువెంటనే తొందరపడి అలా వాళ్ళమీద అభిప్రాయం వెలిబుచ్చినందుకు చింతించాడు. ఈ విషయాల్లో తనెందుకు అనవసరంగా కల్పించుకోటం? రొంపిలోకి దిగనే కూడదు.

వసంత ఏదేటో ఆలోచిస్తూ నడుస్తోంది. ఆమె తెలివితక్కువ దేమీ కాదు. ప్రపంచం పోకడలు తెలియనిదీ కాదు. నాటకసంఘంవాళ్ళ బుద్ధులు పసిగట్టక పోలేదు కూడా. కాని ప్రత్యేకించి విశ్వం అలా ఎందుకు హెచ్చరించాడో ఆమెకి అర్థం కాలేదు. కవిగారు అంటే అంటువట్టుగా మాటాడుతున్నారు. నాటక సంఘంలో మిగతా వాళ్ళకి మల్లే కాక కవిగారు మాట్లాడే మాటల్లో ఆమెకి హుందాతనం, ఆదరమూ కనిపించాయి. వందరూపాయలు ఊరికే వొదులుకోబోవటంలో నే తనకి ఆయనమనసు మంచిదని తెలిపింది.

రిక్షా ఏదో ఎదురుగుండా వస్తోంది ఖాళీగా.

"ఇంక రిక్షా ఎక్కండి."

"ఇంకెంతో దూరం లేదండీ మా ఇల్లు. ఇప్పుడు రిక్షా దేనికి. నడిచేవస్తాను." అంది వసంత. నటేశ్వరావైతే తను రిక్షాలో వెడతానంటే "సరదాగా నడిచి వెడదామండీ." అనేవాడు. ఆ నటేశ్వరావుని చూస్తుంటే తనకి ఒక్కొక్కసారి అరికాలిమంట నెత్తికెక్కుతుంది. కొంచెం జాగ్రత్తగా మసులుకోమని చెప్పాలి.

"మీరు బి. ఏ. ఆనర్సు ప్యాసయ్యారా?" అందామె.

"ఇంకా లేదు. పరీక్షకి వెళ్లాను. ఫలితాలు రాలేదు."

"ప్యాసయినరోజున మీకు నేను టీపార్టీ ఇస్తాను. ఏమంటారు?"

"థాంక్స్. రెడీ." అన్నాడు విశ్వం నవ్వుతూ. మాటలసందడిలో ఎంతదూరం నడిచిందీ తెలియలేదు వాళ్లిద్దరికీ. అకస్మాత్తుగా వసంత ఆగి అంది.

"ఇదేనండీ మా ఇల్లు. ఇంక వెడతాను."

"మంచిది." అనేసి విశ్వం ముందుకి సాగిపోయాడు. లోపలికి వెడుతూ వసంత నాలికకొరుక్కుంది. తను ఇన్నిమాటలు మాట్లాడినా నాటిక గురించి ఒక్కముక్కయినా అనలేదు. తను పొట్టి మతిపిష్టిది. ఏమనుకున్నారో కవిగారు!

(సశేషం.)

నూతనగ్రహముల ఫలప్రదత్వము

శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు

జాతక ముహూర్తాదులలో నూతన గ్రహములకు ఇంద్ర వరుణ యములకు సహితము కొంత ఫలప్రదత్వము కలదని సోదాహరణముగా చూపుటకు ప్రయత్నించుచున్న నా వ్యాసములు సనాతన సంప్రదాయ ధురంధరులగు హోరాశాస్త్రవేత్తలు కొందఱికి రుచించినవి కావు. మంచిదే. లోకము భిన్నరుచి. ఆగ్రహముల గొడవ లేకయే, ఏ సమస్యనైనా, నిర్వహించుట సాధ్యమని వారి విశ్వాసము. అట్లే వారు నిర్వహించి కార్యకారణ సమన్వయము చేయుచున్నారు కూడా. సంతోషమే. వారిని అధిక్షేపించు శక్తి నాకు లేదు. అట్టిపని అవసరము సహా.

కాని, నూతనగ్రహములను జాతక చర్చలలో నుపయోగించుట పూజ్యులగు మన ప్రాచీన మహర్షుల పట్ల క్షంతవ్యము కాని మహాపరాధ మగునని, ఆంగ్ల భాషలో విజ్ఞానశాస్త్రమున ఆచార్యపట్టము సాధించిన ఒకానొక జ్యోతిశ్శాస్త్రవేత్త ఇటీవల నాకొక లేఖ ననుగ్రహించినాడు. ఆ మహాపరాధమేమో బోధపడకపోవుటే నా బాధ.

మన దేశములో జ్యోతిశ్శాస్త్ర సూత్రములను నిబంధించినవారు వశిష్ఠాది మహర్షులు. వారు యోగసిద్ధులు, త్రికాలవేత్తలు. వారు చెప్పబూనిన యే విషయమును గాని అసమగ్రముగా చెప్పినవారు కారు. ఈ నూతన గ్రహములను వారు సూచించియుండలేదు, వానికి ఫలప్రదత్వ మున్నదని వారు చెప్పనూలేదు. అట్టిచో, ఈ నూతనగ్రహములకు సయితము ఫల మున్నదని మన మంగీకరించి జాతకచక్రములలో వాని నుపయోగించితిమేని, ఆ మహర్షులకు వీని విషయము తెలిసియుండలేదని సిద్ధాంతీకరించిన ట్లగుటచే, ఆ మహనీయులకు అజ్ఞతను ఆరోపించి వారిపట్ల గొప్ప అపరాధము చేసినట్లగును కదా? మన మహర్షుల మతమును తిరస్కరించి భిన్న సంప్రదాయముల నవలంబించుట ఘోరపాతకము కాదా?

ఆ పండితుని దృష్టి ఇది. అతని దృక్పథములో చూచితిమేని, ఈ యభిప్రాయము సాధువనియే చూపట్టు ననుటకు సందియము లేదు. మహనీయులగు మన ప్రాచీన మహర్షుల యోగశక్తి ప్రపంచమున నిరుపమానమయినది. వారి గౌరవమునకు, జ్ఞానమునకు, న్యూనత నాపాదించుట క్షంతవ్యము కాని యపరాధమే యగును. అట్టి అకార్యమునకు ఎన్నడుగాని పూనుకొనను. కాని, యీ రకపు విమర్శకుల సిద్ధాంతములో ఒక్క విశేషమున్నది. బుద్ధిపూర్వకముగనో, లేక అనివారితముగనో, చెప్పలేము కాని, రెండు విషయములను వారు నిశ్చితముగా విశ్వసించియున్నారని ఏర్పడుచున్నది. ఏమందురా? మొదటిది, మన మహర్షులు జ్యోతిశ్శాస్త్ర సందర్భమున చెప్పిన సూత్రము లన్నియు తమకిప్పుడు లభ్యమైయున్నవనుట. రెండవది, ఆ లభించిన సూత్రము లన్నియు తమకు అర్థమయినవనుట. ఏమో కాని, క్షమింపుడు, నా దృష్టిలో పై రెండునూ సందేహాస్పదములే.

జ్యోతిశ్శాస్త్ర సూత్రములను నిబంధించిన మన ప్రాచీనులు పదునెనమండుగురు మహనీయులని మన గ్రంథములు చెప్పుచున్నవి.

> "సూర్యః, పితామహో, వ్యాసో,
> వశిష్ఠో, ఽత్రిః, పరాశరః,
> కాశ్యపో, నారదో, గర్గో,
> మరీచి, ర్మను, రంగిరాః,
> లోమశః, పౌలిశ శ్చైవ,
> చ్యవనో యవనో, భృగుః,
> శౌనకో, ష్టాదశ హ్యేతే
> జ్యోతిశ్శాస్త్ర ప్రవర్తకాః" అని.

వీరు ఏమేమి గ్రంథములు రచియించిరో, అవి అన్నియు మన కిప్పుడు లభ్యమై యున్నవని చెప్పగలమా? వీరందరు మహర్షులు. వీరిలో ఒకరు చెప్పిన అంశమునే పదములలో, తలకట్లో, మార్చి ఇతర మహ

ర్షులు దర్శితదర్శనముగా కొకటిపాటపాడినారని చెప్పుట సాహసకార్యము. ఇతరుల మతములకంటె భిన్నముగా తనమతమును నిరూపించనిచో, అట్టిగ్రంథకర్త ఋషియే కాడట.

“నాసా వృషి ర్యస్య మతం నభిన్నమ్.”

అని మనపెద్దలే చెప్పిరి. ఈ పదునెనమండుగురు మహర్షులు ఏ ఏ భిన్నసంప్రదాయములను నిర్వచించిరో, ఏ ఏ ప్రత్యేక పద్ధతులను చూపిరో, మనకు తెలుసుకొను నుపాయము కానరాకున్నది. మహర్షి ప్రణీతము లనబడు సంహితలు ఏ మూడు నాల్గో చూడగల్గినాము. మరి, ఇతరుల గ్రంథము లెందున్నవి? రాజకీయ విప్లవాది కారణములచే నశించినవో, లేక రహస్యముగా దాగియున్నవో, తెలియదు. ఇక, తరువాతి కాలమున,

“భూయోభిః పటుబుద్ధిభిః పటుధియాం
హోరాఫలజ్ఞప్తయే,
శబ్దన్యాయ సమన్వితేషు బహుశః
శాస్త్రేషు దృష్టేష్వపి,
హోరాతంత్ర మహార్ణవ ప్రతరణే
భగ్నోద్యమానా మహమ్.
స్వల్పం వృత్తవిచిత్ర మర్థబహుళం
శాస్త్రప్లవం ప్రారభే”

(బృహజ్జాతకము)

అని, తన కాలమునకు పూర్వమందుండిన గ్రంథకర్తలనేకులు రచియించిన ఉత్తమ శాస్త్రగ్రంథములు పెక్కుండినట్లు ఆచార్య వరాహమిహిరుడు చెప్పియున్నాడు కదా! ఆ గ్రంథజాల మెందున్నది? అశ్లేషార్థములో దక్షిణాయనము, ధనిష్ఠాదిలో నుత్తరాయణము ప్రారంభమగుచుండినట్లు పూర్వులు రచించిన గ్రంథములలో నున్నదని తన బృహత్సంహితలో అతడు వర్ణించియున్నాడు. ఆ ప్రాచీన గ్రంథములన్నియు మన కిపుడు లభించియున్నవా? మాటవరుసకు ఆలోచింపుడు. వానిలో నవగ్రహములు కాక మరి కొన్నింటిని ఎవరైన చెప్పియుండకూడదా?

‘కాక భుజండరు నాడి’ అనబడు ద్రవిడ నాడీ గ్రంథములో ‘బ్రహ్మనూరి’ మొదలగు కొన్ని గ్రహములు పేర్కొనబడినవని వింటిమి. మన నవగ్రహములు కాక మరికొన్ని ఆనాడీ గ్రంథ రచనాకాలములో ప్రచారములో నుండి యుండె ననుటకు సాక్ష్యము కాదా ఇది? ఇపుడు మనకా బ్రహ్మనూరి మున్నగువానినిగుఱించి యేమియూ తెలియదు. అసాధారణ పద్ధతిలో అత్యాశ్చర్యకరముగా ఫలాదేశము చేయుచున్న నాడీ గ్రంథము లనేకములు నానాభాషలలో చూపట్టుచున్నవి. మనకిపుడు తెలిసి వాడుకలోనున్న సూత్రముల ఆధారముతో అట్టి ఫలాదేశము చేయుట సాధ్యమా? ఎదపై చేయివేసి, చెప్పగలిగిన సాహసవంతుడు చూపట్టడు. మరి, ఏ ఇతర సూత్రములు ఆనాడీ గ్రంథ ఫలముల నిర్వచనమునకు ఆధారమైనవో మన మెఱుగము.

ఇట్టి పరిస్థితులలో, మన ప్రాచీన మహర్షులు చెప్పిన దంతయు మన కిపుడు లభించియున్న దనుట నవ్వులాటచేటు.

పోతే, అందుబాటులోనున్న మూడు ముక్కలయినా సమగ్రముగ అర్థమైనదని చెప్పగల మహానుభావులు ఎందున్నారో, నామటుకు నాకు తెలియదు. బృహత్పారాశరహోరాసారమందలి లగ్నశోధన పద్ధతిని కాని, లోకయాత్ర మున్నగు విషయములను కాని, ఎవరు సాధించగలిగినారో, ఎంత ప్రయత్నించినా తెలుసుకొన లేకున్నాము. జన్మకాల నిషేక కాలముల పరస్పరసంబంధమును గూర్చి పరాశరుడు, బాదరాయణుడు మున్నగు ప్రాచీనుల మతములు భిన్నములని, కల్యాణవర్మ సూచించినాడు. ఇదే విషయమున వరాహమిహిరాచార్యుడు, సమరసింహుడు, వేరు వేరు సంప్రదాయముల నాశ్రయించిరి. వారు వ్రాసిన సూత్రముల ప్రయోగము మనవాడుకలోనికి రాలేదు. జైమినీ సూత్రముల అర్థమునుగురించి పండితులలో ఐకమత్యము కుదురలేదు. ఇట్టివెన్నియో చెప్పవచ్చును.

సర్వసాధారణముగ, ఇప్పుడు వాడుకలో నున్నది పరాశర సంప్రదాయమని అందుముకదా! ఆ పరాశరుడు “తొల్లి చెప్పినను పెద్దలమాటయె కాని” తనకట్టి గ్రంథము లభించలేదని పదియవ శతాబ్దపు ప్రముఖ శాస్త్రవేత్త పరిశోధకుడు, బహుగ్రంథకర్త యగు భట్టోత్పలాచార్యుడు చెప్పినాడట. అప్పటికే ఆ గ్రంథమునశించియుండె కాబోలు! ప్రస్తుతము ప్రకటితమయి యున్న ‘బృహత్పారాశరహోరాసారము’ అనుగ్రంథము ఒక పెద్ద కలగూరగంప. శైలి కాని, సంప్రదాయము కాని, విషయ

విభాగము కాని, ఒక గ్రంథకర్త కైవాటములో తీర్చబడినదని తోచదు. కాక, అందలి భాగములు కొన్ని అర్థము స్థితిలోనే లేవు. జన్మకాలము, ఆధాన కాలము, అను రెండింటికి కాక, చిత్రవేళ కాలమునకు సహా జాతకము గుణించి సమన్వయము చేయుట సంప్రదాయమనియు, అది కష్టసాధ్యమనియు, ఒకానొక ప్రాచీనగ్రంథ వ్యాఖ్యాత సూచించెను. ఇది ఏదో, వ్యాసఘట్టము!.

ఇట్టి సందర్భములలో ప్రాచీన మహర్షులు చెప్పినదంతయు తమకు తెలిసియున్నదనుకొను సర్వజ్ఞంమన్యులుండిరేని, ఎవరు వారికి సమాధానము చెప్పగలరు.

అది యట్లుండె.

అన్ని శాస్త్రములవలె యీ జ్యోతిశ్శాస్త్రము సహా పరిశోధకులగు శాస్త్రజ్ఞుల అనుభవ విశేషములవలన క్రమాభివృద్ధికి రాతగినదే యనుట యీ విమర్శకుల బుద్ధికి స్ఫురించదు. అప్పుడప్పుడు నూతనోపాయములతో సంస్కరించినపుడే శాస్త్రము వన్నెకెక్కునని చెప్పిన ధైర్యశాలి వరాహమిహిరుని ఆర్జవ దృష్టిని, భావౌదార్యమును స్మరించినచో, ఇట్టి విమర్శకుల సంకుచితదృష్టికి అది అంజనము కాగలదు. మన ప్రాచీన సంప్రదాయములలో లేని అనేకాంశములను ఆ మహాశయుడు యవనమతమునుండి స్వీకరించి జంకు లేక బాహాటముగా తన గ్రంథములో చేర్చినాడు. అతడు వర్ణించిన ద్రేక్కాణ స్వరూపములు యవనులు చెప్పినవే. కొన్ని రాజయోగాదులలో యవనుల మతమునెత్తి అతడు చూపించినాడు. అంతయేల? గ్రహముల అన్యోన్య మిత్రత్వ శత్రుత్వములను గూర్చి ప్రాచీనమతమును చెప్పుటయే గాక, దానికంటె చాల భిన్నమైన యవనమతమును సహేతుకము తన బృహజ్జాతకములో అతడు నిరూపించినాడు. ఈ విషయములో యవన సంప్రదాయమే వరాహమిహిరునికి అభిమతమని పదునారవ శతాబ్దమువాడగు కేశవార్యుడను హోరాతంత్రవేత్త తన 'వివాహ బృందావన' గ్రంథములో—

"ఇద ముదీర్య వరాహ విరోచనో
విజయ శేవరు దూషితవాన్ పునః;
స బహు మన్యత ఏవ యథార్థతం;
జయతి శాస్త్ర మిదం యవ నేష్వపి"

అని సయుక్తికముగా సిద్ధాంతీకరించినాడు. కావుననే,

మ్లేచ్ఛాహి యవనా, స్తేషు
సమ్యక్ శాస్త్ర మిదం స్థితం;
ఋషి వ త్తేపి పూజ్యంతే.
కిం పునర్దైవ విద్ద్విజః?"

అని వరాహమిహిరాచార్యుడే యవనుల నెంతో గౌరవించినాడు. అతని యనంతరము సమరసింహాదులను ప్రాచీనులు సాధించిన తాజక సంప్రదాయము సాక్షాత్తుగ పారశీక భాష నభ్యసించి అందలి వాఙ్మయమునుండి సంపాదించినదే యని, మూడువందల సంవత్సరముల క్రిందనే, 'హాయనరత్న'కర్త బలభద్రుడు చాటి చెప్పినాడు. వారు కల్పించిన దశాపద్ధతులు చిరకాల సాధ్యములై తృప్తికరమగు ఫలములను చూపని కారణమున, యవన శాస్త్రమునుండి వర్షజాతక పద్ధతి మున్నగు ప్రయోగములను సమరసింహాదులు గ్రహించి విపులీకరించిరట.

"ప్రాయో న జాతక ఫలే
చిరప్రయోజ్యే మతిః స్ఫురతి పుంసాం;
నే వాత్ర హాయన ఫలం
ప్రకాశ్యతే తాజక ప్రోక్తం"

అని సమరసింహుడే చెప్పినాడట.

లగ్నము, సప్తగ్రహములు అను ఎనిమిదింటికి గోచారమువలన, కలుగు శుభాశుభ ఫలములను సూచించు పద్ధతిని అష్టకవర్గ మందురు కదా? ఈ పద్ధతిలో రాహుకేతువులకు స్థానము లేదు. కాని వరాహమిహిరాదులు చెప్పకపోయినా, రాహుకేతువులకు భావఫలములను తరువాతి వారు విపులముగ వ్రాసిరి. అట్టిచో వానిస్థానములకు సయితము గోచారఫలము, లేలయుండరాదు? వానికి ఫలములను సాధించి 'ఏకవర్గ' మను పేరుతో సుమారు నూరు సంవత్సరముల వెనుకనుండిన యొకానొక శాస్త్రజ్ఞుడు ప్రత్యేక గ్రంథమును రచించెననియు అది అముద్రితముగా మూలపడియున్నదనియు, కొన్ని సంవత్సరముల క్రింద ఒకానొక ప్రాచీన జ్యోతిశ్శాస్త్ర పండితుడు నాతో చెప్పెను.

పరిశోధకుల అనుభవముల మూలముగ, క్రమముగా శాస్త్రసంప్రదాయములు అభివృద్ధి నొందుచున్నవనుటకు ఇంకెన్నియో కారణములు చూపవచ్చును. ఇట్లుండగా, తృప్తికరమగు నూతన సామగ్రి పరిశోధకుల పుణ్యమున మనకు లభించినపుడు దానిని నిరాకరించుట ఏమి వివేకము?

పోనిండు ప్రాచీన పద్ధతిలో ఏమార్పులు జేసినా, మహర్షులపట్ల అపచారమో అపరాధమో, చేసినట్లు మన ప్రాచీన శాస్త్రజ్ఞులు భావించెడివారా? తైత్తిరీయ బ్రాహ్మణకాలమున జ్యోతిశ్చక్రమున ఇరువది ఎనిమిది నక్షత్రములు. తరువాత ఎప్పుడో ఏమి కారణమో ఇరువదియేడు నక్షత్రముల పద్ధతి వచ్చినది.

"నక్షత్రాణాం తథాభిజిత్" అని భగవత్స్వరూపముగా భగవద్గీతలో ప్రశస్తిచెందిన 'అభిజిత్'

నక్షత్రమున, ప్రకృతిసోత్తమైన దానిని నిరాదరించుట పాపముకాదా? యవనమతమును గౌరవించిన వరాహమిహిరుడు, ఆయవనుల నుండి అనేకాంశములను స్వీకరించిన సమరసింహుడు సహా మనమహర్షులపట్ల మహాపరాధమునకు ఒడిగట్టినారని అనవచ్చును. గ్రహముల దృష్టి విషయమున భిన్నమార్గము నవలంబించిన జైమిని పరాశరునికి అపచారము చేసినవారవకతీరదు. అనేక విషయములకు దశాంశపద్ధతులను వివరించి, ఏపద్ధతి ఎట్టి జాతకముల కుపయోగించ వలయుననుటం గూర్చి పెక్కు సూత్రములు పరాశరుడు చెప్పియున్నాడని ఎఱుగుదుము. ఆసూత్రములకు జలాంజలి నట్టి చెప్పి, ఏ జాతకమయినా సరే,—మానవులదయినా, పశువులదయినా, కడకు సంస్థలదయినా—ఏకమూలిగా ప్రయోగముగా వింశోత్తరీదశను కట్టుట అనేక స్థలములలో ఆచారముగనున్నది. పరాశరునిపట్ల మాత్రపు గౌరవమేమైనది?

"భాస్కరే మకరేఖాయా
ముదక్ స్థేచోత్తరాయణం;
దక్షిణస్థే తతః సూర్యే
విద్యాత్తు ద్దక్షిణాయనం."

అని భరద్వాజ మహర్షి వాక్యము. భూమధ్యరేఖకు సూర్యుడు ఉత్తరమందున్నపుడు ఉత్తరాయణము, దక్షిణమందున్నచో దక్షిణాయనము, అనుట. మకరాదిగ ఉత్తరాయణమని, కర్కాటకాదిగా దక్షిణాయనమని, మన మిపుడు వాడుచుంటిమి. ఈ మార్పు ఏల వచ్చెనో, దానికి ఉపపత్తి ఏమో తెలియలేదని శ్రీ సత్యాచార్యులే సూచించియున్నాడు.

"దినప్రవృత్తిర్మృగతో మజాదౌ,
తులాధరాదౌ నిశాప్రవృత్తిః;
తే కల్పితే యైర్మృగకర్కటాదా
వత్రోపపత్తిం తు వదే బ్రువంతి."

అని. ఈ యపచారము ఎవరు చేసిరో?

"చల సంస్కృతి తిగ్మాంశోః
సద్యక్రమోయ స్వసంక్రమః;
అజాగళే స్తన ఇవ
రాశి సంక్రాంతి రుద్యతే"

అని నిరయన పద్ధతిని హేళనము చేసి, సాయన పద్ధతియే ఉత్తమమని వశిష్ఠమహర్షి చెప్పెనట. నిరయన పద్ధతి నవలంబించువారందరు ఆ మహర్షి యభిప్రాయమును త్రోసి రాజు చేయుటచే అతనిని అవమానించుచున్నట్లు భావింపవలసి వచ్చునుకదా?

పోనిమ్ము. ఉదాహరణ మొక్కటి చూపుట ఇట్టి వన్నెంటె హెచ్చు ప్రయోజనకారి.

ఉన్నత విద్యను ఆర్జించి, అందచందములు కలిగి, అవివాహితగా నున్న ఒకానొక తరుణి నిరయన జాతక చక్రము, నవాంశ చక్రము సహా, ఈ క్రింది నున్నవి:—

		కు 5-39	ర 5-52 బు 14-21 శు 19-24 X 27-24
రా 28-18	(నిరయన) జాతక చక్రము.		గు 16-47
శ 10-49 చ 0-8			కే 28-18
			I 28-48

కు గు	శ		రా
శు బు	(నిరయన) నవాంశ.		
చ			
కే	ర		ల

జన్మకాల రవి మహాదశా శేషము. 4 సం. 4 మా. 17 ది.

రాహు మహాదశలో బృహస్పతి అంతరములో ఎవడో తగిన వరుడొకడు వచ్చి చూచి సమ్మతించి, వివాహము చేసికొందునని మాట ఇచ్చినాడు. ఈమె జాతకములో అష్టమ కుజదోషమున్నది. ఆ వరునికో నాల్గింట కుజదోషము. దోషసామ్య మున్నదని, వివాహము జరుగవచ్చునని, పెద్దలు నిర్ధరించినారు. తరువాత, ఇరుపక్షముల వారికిని, ముందు జరుగతగిన కార్యక్రమమునుగురించి జాబు జవాబులు క్రమముగా జరుగ

సాగినది. ముహూర్త కాలనిర్ణయపు సందర్భమున అనుకూల్య ప్రాతికూల్యముల సంప్రతింపులు ప్రశంసలో నుండెను. నిర్ణయము జరిగి రమారమి ఆరుమాసములు గడచినవి. కొన్నాళ్ళలోనే మూడుముళ్ళు పడి శుభకార్యము జరుగగలదని యూపట్టినది. కాని, అంతలో ఏ పిల్లకు మెల్లనో, తెలవని తలంపుగా, తనకీ సంబంధము అక్కరలేదని ఆవరుడు జాబు వ్రాసి ఒక్క మాటలో నాటకమునకు భరతవాక్యము పాడి యవనికదించినాడు. సంబంధము అక్కరలేనిచో చెప్పుటకు కారణములు కరువా? "పృష్ఠతాడనాత్ దంతభంగః" అనునట్టి కారణ మేదో సూచించి చేయి కడుగు కొన్నాడా వరుడు. ఆ తరుణి మనసునకు ఇది గొప్ప దెబ్బ. ఇక, "పునః శోధన ప్రారంభ" వరాన్వేషణ కార్యమునకు మరల పూనుకోవలసినదే పాపము!

ఈ జాతకమునకు ఇటి ఫలము తాను చెప్పియుండు నని మన విమర్శక మహాశయుడు తెలిపిన కారణము లివి—(1) ఉభయ కేంద్రాధిపత్యమువలన ధర్మస్థానాధిపతి యగు గురువు, ఉచ్చుడైనా, లాభస్థానములో నుండినా 'పాపి' అయినాడట. అతని దృష్టి సప్తమ భావమునకే చెరుపట!

ఉచ్చగ్రహము కారణాంతరములచే మేలు చేయలేక పోవచ్చును కాని, చెఱుపు చేయుడని వరాహమిహిరాదులు చెప్పిరి. అందులో, లాభ భావములో నున్న శుభగ్రహమే అశుభఫలము నిచ్చినచో, ఇక శుభులెవరు? కేంద్రాధిపత్యమువలన గురువు పాపి యగుపక్షమున, ధను ర్మీన, కన్యా, మిథునములలో పుట్టినవారి కందరికిని గురువు పాపికావలసి వచ్చును. మారక విషయములో కేంద్రాధిపత్యము గురువునకు దోషముగా ఏర్పడవచ్చునేమో కాని, ఇతర సందర్భములలో అతడు 'పాపి' అయినాడనుట కేవలము శాస్త్రమునకే కలంకము.

"కేంద్రాధిపత్య దోషస్తు
బలవాన్ గురుశుక్రయోః"

అను 'జాతక చంద్రికా' వాక్యమునుబట్టి చేసిన విచిత్రసిద్ధాంత మిది. కేంద్రాధిపత్యము 'దోష'మనుటే ఆ గ్రంథకర్త ఆశయము కాని, ఆ ఆధిపత్యముచే గురువు 'పాపి' అగునని కాదు. ఒక చిన్న ఉదాహరణము చూతుము. ధర్మరాజు మహాధర్మాత్ముడు, సత్యసంధుడు. ఎప్పుడో వ్యాజము పెట్టి ఒక అసత్యమాడెను. అది అతనిపట్ల దోషమే. కాని దానిచే అతనిని పాపి అనలేము. ఈ రెండిటికిని గొప్ప భేదము కలదని సహృదయులు గ్రహించకపోరు.

(ii) పై విధముగ పాపియైన గురువు సప్తమ భావమును నవమదృష్టితో చూచుటచే ఆ భావము పాపపంకిలమైనదట!

నా దృష్టిలో, ఇదియొక విచిత్ర సిద్ధాంతము. భావాధిపతి భావమును చూచినచో ఆ భావము చెడునని ఏ మహర్షి చెప్పినాడో తెలియదు.

"యో భావః స్వామి సౌమ్యాభ్యాం
యుక్తో దృష్టోయ మేధతే."

అను మొదలగు ప్రమాణములచే అట్టిదృష్టి భావ పోషక మగుననుట శాస్త్ర సంప్రదాయము. వరాహమిహిరాచార్యుని ఉపలక్షణ సూత్రమిది.

"హోరా స్వామి గురుజ్ఞవీక్షిత యుతా,
నా న్యైస్తు, వీర్యోత్కటా."

(iii) అంశ చక్రములో సప్తమభావము శని కుజుల వలన పాపకర్తరి పాలయినదట! ఆ చక్రములో అష్టమాధిపతి కుజుని దృష్టి లగ్నముపై నున్నదట! శుక్రుడు ఉచ్చాంశలో నుండినా, లగ్నాధిపతితో చేరినా, కళత్ర కారకుడై సప్తమములో నుండుటచే 'కారకో భావనాశాయ' అను వాక్యమువలన ధర్మ భావము పాడైనదట!

ఏమి సామంజస్య సాధన వైదగ్ధ్య మిది? దృష్టి, సంయోగము, పాపకర్తరి, మున్నగుయోగములు నవాంశ చక్రమున కన్వయించు సంప్రదాయము ఏ మహర్షి ప్రోక్తమో తెలిపి యుండినచో, విద్యార్థుల కెంతో యుపకరించి యుండెడిది. దృష్టిని సాధించి దానికి విలువ నిర్ణయించు సూత్రములను విధించిన శ్రీపతి ప్రముఖుల గతి ఏమి? పోనిండు. సప్తమ శుక్రునికి 'సారావళి' సత్ఫలమే చెప్పినది కదా! శుక్రుడు కళత్ర కారకుడని, పాపము, కల్యాణవర్మకు తెలియదు కాబోలు.

(iv) నవాంశలో సప్తమాధిపతి గురువు సప్తమములో స్వక్షేత్రబలము కలిగి యుండినా, శత్రువగు ఉచ్చ శుక్రునితో చేరుటచే అశుభుడయినాడట!

సత్యాచార్య మతమున గురు శుక్రులు పరస్పరసములే కాని శత్రువులు కారు. మరి యవనాచార్య మతమందో, వారు అన్యోన్య మిత్రులే. విమర్శకులు సూచించినది ఏ మహర్షి సిద్ధాంతమో? శుక్ర క్షేత్రములో గురువునకు, గురు క్షేత్రములో శుక్రునికి, శాస్త్ర గ్రంథములలో శుభ ఫలము చెప్పబడినది కాని, అశుభ ఫలము లేదు. వారొకరికొకరు శత్రువులైనచో, ఇట్టి ఫలము కలుగుననుట యుక్తి సహము కాదు. కావున నే,

"జ్యోతి శ్శాస్త్రేషు సర్వేషు
జని తల్ జ్ఞే గురుః శుభః;
జీవస్య జనితా శత్రూ
యది, తద్యుజ్యతే కథం"

అని 'జాతక తిలక' గ్రంథక ర్త గురు శుక్రుల శత్రుత్వపు సిద్ధాంతమును అధిక్షేపించినాడు.

(v) కుజుడు ఎనిమిదింట ఉండుటచే కుజ దోషమున్నది. ఇది వివాహ విషయమున మహాదోషము.

ఇచట వృషభములో నున్నాడు కుజుడు.

"సిత రాశి స్థితే భౌమే,
కుజదోషో నవిద్యతే"

అను అపవాద సూత్ర ముండుటచే, ఈ కుజ దోషమునకు గొప్ప విలువ లేదనవచ్చును. అది యట్లుండ, ఉడుకుపాలు త్రావకోరు కుజుడు అష్టమ మందున్నచో, వివాహమై క్లేశము కలుగవచ్చును కాని, వివాహ భంగమగుటకు హేతువు చూపట్టదు.

పాఠక మహాశయులకు ఒక్క మనవి. కలిగిన ఫలమునకు పై కారణములు ఏ విధముగా తగిన వనవచ్చునో యోచింపుడు. ఇట్టి కార్య కారణము సమన్వయమునకు ఎంత విలువ కట్టవచ్చునో, తద్ జ్ఞులే ప్రమాణము.

ఈ క్రిందనున్న సాయన జాతక చక్రమును ఒక్కసారి కటాక్షింతురుగాక. నూతన గ్రహములు సయితము దానిలో చూపబడి యున్నవి.

రా 21-12 ధర్త 12-55	శ 22-48	పుణ్య 15-57 కు 28-33	౧ 28-46-2
కే 8-43 (వ)	(సాయనము) శుద్ధ జాతక చక్రము.		బు 7-15 శు 12-18 (వ X 20-1 య 21-4
చ 23-6			దాంపత్య 0-56 శు 19-41
		I 21-37	ఇ 5-32 కే 21-12

లగ్నము కోమలస్వభావముగల తుల. యమునితో చేరి లగ్నాధిపతి శుక్రుడు గగనమధ్యమున ప్రకాశించుచున్నాడు. భాగ్యములో రవి. రాజయోగకారకుడు. (చతుర్థ పంచమాధిపతి) శని ప్రబలుడై నాల్గింట నుండుట. లాభస్థానములో తృతీయ (విద్యా) షష్ఠాధిపతి బృహస్పతికలడు. గొప్పవిద్య, యోగ్యమగువృత్తి, ఆర్థిక స్వాతంత్ర్యము, వినయవిధేయతలు, నైతికప్రవర్తనము, సాధుశీలము తెలుపుజాతక మిది. తగిన వేతనముతో యోగ్యమైన యుద్యోగము కలదు.

ఇచట ముఖ్యసమస్య సప్తభావముకదా? సప్తమాధిపతి కుజుడు ఎనిమిదిభాగల దూరములో అష్టమభావముందియున్నాడు. అనారోగ్యము, ఆందోళనము సుఖాభావము దీనిఫలము కావచ్చును. భావమధ్యమునకు కుజుడు దూరమందుండుటచే, ఈ ఫలములో రమారమి నూటికి యేబదివంతులకంటె హెచ్చుగా రాదు. ఉండుగాక.

సప్తమభావ మధ్యబిందువునకు పార్శ్వకేంద్రములో మహామాయావి ఇంద్రుడున్నాడుకదా? వివాహ విషయమున జాతకురాలు వాస్తవమును కనుగొనజాలక భ్రమపాలగుటో, ఇతరులచే వంచింపబడుటో, జరుగవచ్చును. ఇకపోతే, ధిర్త్రృభావమధ్యమందే నికరముగా వరుణుడు పీటపెట్టుకుని కూర్చుండియుండుట చదువరులు గమనింపగలరు. ఆకర్షణము, అపకర్షణము, అను ధర్మములతో పనిసాగించు నేర్పరి వరుణుడు. కనుక నే విప్రలంభ శృంగార ప్రియుండని, విడాకుల గ్రహమని, ఇతనికి ప్రతీతి. స్వాతంత్ర్య కాంక్ష మిక్కుటమయి పరిస్థితుల మార్పునకు తగినరీతిగా అతుకుకొని, పొంది, సాగి, మనుస్వభావము ఇతడు నేర్పవిద్య. అగుటచే, అతి సులభముగా అతుకులు ఊడిపోగలవు. కావుననే, శాశ్వత బంధముగా కొనసాగ తగిన వివాహపు విషయమున సామాన్యముగా వరుణ వేధదోషముగా ఏర్పడుచుండుట, ఇట్టి వరుణునికి నాల్గింటి చంద్రునినుండియు, పదింటి యమునినుండియు నింకు కేంద్రవేధ. పుట్టినింటి పరిస్థితులలో, వృత్తిపద్ధతిలో, కంకణ ప్రాప్తికైనా, లేక దాంపత్య జీవనమునకైనా, ప్రతిబంధక సామగ్రిగా ఏర్పడగలవని దీని సూచన. ఇట్టి వరుణుడు కుజక్షేత్రములో నిలిచి దండశాసనుడై నూటికి నూరువంతులుఫలమును తెచ్చి పెట్టుటకు నడుముకట్టుకొని సప్తమ భావమధ్యమందే యుండగా, అతనిని వదలిపెట్టి ఎడముగా, ఎనిమిదింట ఎక్కడనో, కూర్చుండియున్న కుజునిపట్టి రచ్చకులాగ నేల? కన్నములో కూర్చుండియున్న దొంగ కంటె దోషముగలవ కావరాకపోగా, కంచె ప్రక్కన కదుపులు మేయుచుండిన కన్నమ్మ కొడుకు కుంటరి

యని వారిపైన దొంగకేసును మోపిరను సామెత యగునుకదా?

ఏ యోగములయినా తగిన దశలలో కదా ఫలించగలవు? దేవమానదశలో లాభాధిపతి యగు చలితరవి (కర్కాటకము 22-48) జన్మవరుణుని కేంద్రవేధనం దశలోగా, వరుని ఆవాహనము జరిగెను. అదేరవి గలితవరుణునికి కేంద్రమునకు (కర్కాటకము 23 19) వచ్చినప్పుడే విసర్జనము! వరుణ దోషముగల దశలో జరిగిన ప్రయత్నపు ఫలమిది. వివాహము జరిగి విడాకుల వరకు రానిది జాతకురాలి పుణ్యము. ఇంతనికరముగా చలితదశ వరుణప్రభావమును ప్రేలితో చూపినట్లు తెల్పుచుండగా, ఆ గ్రహవేధకు ఫలము లేదనుట శాస్త్రమర్యాద అగునా?

దేవమానదశ నట్లుండగా, ఆ వయస్సునకు 'వర్ష జాతక' మొకండునో చూతముగాక. అచట నయితము వరుణగ్రహప్రభావము చూపట్టవలయును కదా? ఇదే ఆమె వర్ష జాతకము.

ద 28-17	ధర్త 24-14	శ 17-41	ల 13-12 ర 28-46-2
	(సాయన) వర్ష జాతకము		కు 16-31 కు 29-19
			బు 4-56 X 5-46 య 28-20
శ 9-40	I 7-12 రా 17-41	ఇ 29-59	గు 28-32

ఇచట లగ్నాధిపతి కుజుడు; సప్తమాధిపతి శుక్రుడు. ఈ ఇద్దఱు ఏకరాశిలోనుండినా, పదుమూడు భాగల అంతరములో నుండుటచే, ఫలప్రదమగు సంయోగము వారికి లేదు. ఆ లగ్నాధిపతి కుజుడో, నీచపడి ఇంద్రుని కేంద్రవేధను, వరుణుని సంయోగమును, అభిలషించుచుండుట. వరుడు ఆమెను మోసగించి స్వస్తి చెప్పినాడు.

ఇప్పుట ధర్త్రృవహాముము ఎందున్నదో చిత్తగించితిరి, చదువరులకు వరుణప్రభావము కరతలామలకమగును. చలితవరుణస్థానమునందే యీ వర్షారంభకాలమున ధర్త్రృవహాముము నిలువవలయునా? జన్మకాలపు వాగ్దానమును యూరేను వరుణునకు నెరవేర్చినాడు. ఈ సాక్ష్యము మనము సృష్టించినది కాదుకదా?

ఈ వార్షిక కేంద్రములను దైనికపద్ధతితో అనుభవవిశేషములు కలిగిన దినములకు చలింపచేసి చూతముగాక.

1. నిశ్చయము జరిగిననాడు.

వర్షారంభమునాటి నాక్షత్రకాలభుక్తి = 8-34-25
వర్షారంభమునుండి డెబ్బదిరెండు దినములకు
వార్షిక నాక్షత్రకాలవృద్ధి = 5-52-30
మొత్తము = 14-26.55
దీనికి చలితలగ్నము = 29½ మకరము

అనగా ఆనాడు చలిత వార్షిక సప్తమము (ధర్త్రు) వర్ష జాతకమందలి లగ్నాధిపతి కుజునిపైన వేధకరముగ నుండునట. ధర్త్రృసంపాదన కార్యమునకు తృప్తికరముగా ఆనాడు పునాది వేయబడినదికదా?

(ii) నిరాకరణ కారణము కలిగిననాడు.

వర్షారంభమునాటి నక్షత్ర కాలభుక్తి = 8-34.25
వర్షారంభమునుండి 220 దినములకు
వార్షిక నక్షత్ర కాలవృద్ధి = 17-57-5
మొత్తము. = 2-31 30
దీనికి చలిత లగ్నము 9½ సింహము.

ఆనాడు వరుణమహాశయుడు సింహరాశిలో 9-20 లో యుండెనని విన్నచో, పాఠక మహాశయులు ముక్కుపై వేలిడుకొనగలరు. చలితలగ్నము పోయిపోయి ఆనాడు వరుణునిపై చేరుకోవలయునా? వరుణుకు పూనుకొన్న కార్యము నెరవేర్చుటకు ఇంతకంటె తగినదినము ఎందు లభించగదు?

"సంపూర్ణదృష్ట్యా తు దిశే ఫలం స్యాత్ ।
యోగస్థితే కాంకే సమాగమో స్తి ॥"

అను యాదవసూరి సూత్రమును ఎంత స్పష్టముగా అన్వయించుచున్నదో చదువరులు గమనించగలరు. ఇది కూటసాక్ష్యమనగలరా?

మరియొక్కమాట. ఉద్యోగభంగపు జాబు వచ్చిన దినమునకే దైనిక జాతకమును సాధించినచో, దైనిక

చతుర్థము (పరిణామము) జాతకురాలి జన్మకాలపు ఇంద్రస్థానమందే (కన్యారాశిలో 6 వ భాగ) నిలిచి యుండినగలదు. వరుడామెను వివాహించినాడు. ఇంద్ర మాయ ఇట్లు పరిణమించి మబ్బులై తేలిపోయినది. బహుశః ఇతర వ్యాఖ్యానమునకు చిక్కు అరిడీల్లు వర్తించె నేమో?

ఇంద్రా వరుణ గ్రహములకు ఫలమున్నదో లేదో, మన విమర్శకుల కంటికి కానరాకపోయినా, పాఠక మహాశయులే తేల్చగలరు.

ఇంతె చాలును. ఇతరుల, అందులో పండితుల, అభిప్రాయములను విమర్శించుటకాని, వాద ప్రతి వాదములకు దిగుటగాని, నాకు రుచించదు. దానికి తలపడ యోగ్యత సహితము నాకు చాలదు కూడా. సామాన్య విద్యార్థులు గమనించి ఆలోచించదగిన సమస్యలు కొన్ని ఇందున్న కారణమున యీ విమర్శనా విషయము ఇచట ప్రస్తావించవలసి వచ్చినది. చదువరులు మన్నింతురుగాక.

ఒక్కమాట. గుప్తరవుగారి దశాకాలమున జాతకురాలు చేసిన పురుషకారము విషఫలములో పర్యవసాన మయినది. ఆ ప్రయత్నము వివాహ రూపమున ఫలించకపోవుట జాతకురాలి పూర్వ సుకృత ఫలమునకు సందేహము లేదు. గోష్ఠలికి ప్రసక్తి లేక, గోటితో చే తొలగిపోయినది పీడ. లగ్న సప్తములపై శుభదృష్టిగల గురువు లాభస్థాన మందున్నాడు. వివాహమె విడాకులు తెచ్చుకొను అవసరము లేకుండ ఆ మహానుభావుడు జాతకురాలిని కాపాడినాడు. 1959 ఫిబ్రవరి మార్చి ప్రాంతములో కొన్ని శుభవేళలు వచ్చును. ప్రయత్నానుసారముగ అప్పుడు వివాహ మంగళము సుఖప్రదముగ నెరవేరగలదు. అట్లనుగ్రహింపుమని భగవంతుని ప్రార్థింతుముగాక!

“మమ యది న పదుక్తం సజ్జనైః క్షమ్యతాం తత్.”

వరద వెల్లువ

శ్రీ బలివాడ కాంతారావు

వానలు కురిశాయి. సెలయేళ్లు పొంగి, నదిలో కలిశాయి. ఏరు ఒడ్డు కూల్చుతూ చెట్లు పెకలించి, వరదలో వందలాది ప్రాణులను కలుపుకొని పొర్లాంగి పోతూ హోరుమంటూ దిగువకు దిగజారిపోతూంది అది ఉవ్వెత్తుగా పొంగిన వరద వెల్లువ!

తెల తెల వారే సమయం! దిగువన ఒక గ్రామంలో తెప్పలతో యేటి కర్రలు తీసేవాళ్ళలో ఒకడు కర్ర అనుకొని శవాన్ని ముట్టుకున్నాడు. ఒళ్ళు జలదరించింది! ఒడ్డుకు ఆయాసంతో చేరుకున్నాడు. ఆ శవం అలా కొట్టుకొని పోతూ పోతూ ఆ గ్రామానికి దక్షిణంగా రెండు మైళ్ళలో ఉన్న పర్రలో ఒక తుప్పకు చిక్కుకుంది. ఏటి సత్తువను మేటిదైన జలధి లాగుకున్నది. సాయంత్రం అయ్యేసరికి వరద నీరు తగ్గ నారంభించింది. తెల్లవారేసరికి ఆ శవం ఆగినచోట లేదు. రాత్రంతా నక్కలే కాక, తెల్లారేసరికి రాబందులు కూడా కొల్లలుగా చేరి ఫలహారం చేశాయి. మిగిలింది అస్థిపంజరం. పర్రలో చేరి చెత్తను పూడ్చు కోవటానికి వెళ్ళేవాళ్ళలో సంచలనం బయలుదేరింది. గ్రామాధికారుల చెవులకు యీ వార్త చేరగానే పోలీసులు రావటం జరిగింది!

ఈ యెముకలగూడు శవపరీక్షకు పట్నం పోయింది.

"అయ్యో! పాపం! ఎంత పెద్దింటి యిల్లాలో! కాలుజారి పడివుంటుంది. బలవంతం చావైతే నగలన్నీ యెందుకు పెట్టుకుంటుంది..." ఇలా వూళ్లో తలోలా అనుకున్నారు. ఆమెనుగురించి వారం రోజులవరకూ మనిషో వార్త తెచ్చేవారు. అన్నీ నమ్మనగట్టుగానే వుండేవి.

పోలీసు స్టేషనుకు వెళుతున్న మనిషి రాగానే అసలు సంగతి ఆయనవలన కాకుండా వెంటవున్న వారి వలన తెలిసింది.

"శ్రీమంగాడు... రామరామ. ఆ యేముంది... చూడలేం! అంతటి వాడి పరువు పూర్తిగా తియ్యాలనే నగలతో యీపని చేసిందిగా!"

"అలాంటి దానికి యిలాంటి చావురాక మంచి చావొస్తుందా?"

ఇలా మనిషోలా అనుకున్నారు. చిన్నవాళ్ళు వృత్తాంతాన్ని గురించి కొందరితో చెప్పుకున్నారు. ఆ కొందరు మరి కొందరితో చెప్పారు. ఇప్పటికీ ఆ చుట్టుపట్ల యే ఆడది దిగజారినా యీమె కథే చెప్పుకుంటారు!

ఆమె పేరు రాజమ్మ. మహారాణికివుండే తీవితో శరీరం పొందికతో వుండేది. ఆ కళ్ళల్లో యేదో గంభీరమైన మెరుపు. ఆ శరీరచ్ఛాయలో పసిడిపురంగు కలిసింది! పెద్దింటిపిల్ల. తండ్రికి నూరెకరాల పొలం - ఒక్కర్తే కూతురు. ఆస్తివారసి కటింపు. భర్త ఉదారుడు. చెయ్యి దాచకుండా యిచ్చేదాత. ఏ సత్కార్యంలోనైనా అతని! పొలంగట్టున నిలుచున్నాడంటే యెక్కటితలు కూడా సమ్మతితో ఉత్సాహంతో పనిచేసేవి. ఆ కాంత గంభీరస్వరం ఆలించి పాటించేవారే అందరూ! అలాంటి మకుటంలేని మహారాజు భార్యగా వచ్చింది. యిద్దరుబిడ్డల తల్లిఅయింది. అయినా ఆమె నిత్య యౌవని — లోతైన చెరువుమధ్యలో పద్మంలా ఆమె యెవరికీ అందలేదు — బహుశః ఏ దైవకూడా చేమోవని కొన్నాళ్ళకిగానీ అతడు పోల్చుకోలేక పోయాడు.

పైకి పద్మంలా అగుపించినా లోన గట్టి కాడలా ఆమెలో యేదో కఠినత్వం, ఆ దిగువ బురదలా యేదో మలినం...ఆమె హృదయంలో దాగుంది. పురుషుల మీద ఒక నీరసభావం ఏర్పడింది. తనకు తెలియని గర్వం ఆమెకు వెగటుగా అంటుకుంది.

బతుకు తెరువుకోసం చేపలుపట్టడానికి చెరువు మధ్యకు చేరిన జాలరివానిలా సిమ్మన్న వీళ్ళ యింట్లో నౌకరుగా చేరాడు. ఇద్దరుపిల్లలతండ్రి పెళ్ళాం సన్నంగా నల్లగా పెద్దబుట్టలాంటితలతో అసహ్యంగా వుంటుంది. వ్యవసాయపు కూలిపని చేసుకొని ఆమె భర్త యీ పెద్దయింటిలో నౌకరీచేసి, తెచ్చుకున్న ధాన్యంతో కాలంగడవాలి. సిమ్మన్నకు ప్రక్కవా

కేమనుకున్నదీ అక్కర లేదు. ఒకడి జోలికిపోడు— ఒకడిచేత ఒకమాట అనిపించుకోడు. మొగవాళ్లకుండే పొగరుపోతులేవు, పోటుదనం లేదు. బహు మెత్తనైన మనిషి. ఇంటియిల్లాలని పేడి వినయాన్నీ మంచినీ గౌరవించాడు. ఎవరికీ యివ్వని స్వతంత్రం ఇచ్చాడు. ఇంటి యిల్లాలికి, సీమ్మన్నలో మిగతా మగవాళ్లలో లేని అందమేదో అగుపించింది. ఇన్నాళ్లూ తను కోరుకున్న దేదో దొరికినట్లు, ఎదురుచూస్తున్న మనిషి వచ్చినట్లు, స్త్రీమూర్తి ఆమె కంటికి సీమ్మన్నలో గోచరించింది—

పద్మం, కోరి జాలరివాని భుజానికి తాకింది. బ్రతికినబ్రతుకు తలుచుకుని జాలరి అది తప్పించుకోని చేపలు పట్టబోయాడు. బాగా విప్పారి భ్రమ పెట్టింది ఆ ముగ్ధ. ఆ అందాన్ని చూసిగానే జాలరిలో దాగున్న, అణచుకొంటున్న రసానుభూతి పొంగి పారింది. అప్పటికీ ప్రయత్నించాడు కాని యెదురీద లేకపోయాడు. ఆప్యాయంగా ఆ పువ్వు తాకి చేతులతో చుట్టి వేశాడు. హృదయానికి హత్తుకున్నాడు. తుమ్మెద ఝుమ్మంటూ వచ్చి వెంట తిరిగింది. ఆలుబిడ్డలను, బ్రతుకు తెరువును మరచిపోయి భిన్న వదనంతో చెరువుగట్టుమీద సమయంకోసం వేచివున్నాడు. చీకటిపడింది. తుమ్మెద అప్పటికీ గానీ పద్మాన్ని వదల్లేదు. మెల్లగా చెరువులో దిగి యీదుకుంటూ వెళ్ళాడు. నక్షత్రపు వెలుగులో అర్ధనిమీలిత నేత్రయై యెదురుచూస్తున్న ప్రేయసి దగ్గరకు వెళ్ళాడు. ఆమె యేడ్చింది. ఆ యెడబాటు సహించరానిది. మెత్తగా అన్నది. “చూడు యీ చెరువులో బురదా, తుప్పలూ ఎండ్రలూ, కప్పలూ, జలగలూ తప్పించి యింకేమీ లేవు నీ వెంతకాలం యీలోతైన నీటిలో యీ జలచరాలమధ్య యీదుకోనివుండగలవు? అందరికీ యీ నీరూ, యీగాలీ, యెంతో గొప్పలావున్నా నాకు మాత్రం అసహ్యం అయింది. పదపద యెక్కడికో పోదాం...స్వతంత్రంగా నీతో వుండగల చోటికి పోదాం;” అంది. చీకటి భయం భయంగా వుంది. ఏ సమయంలో యే జంతువైనా హాని చెయ్యవచ్చు. కోరివలచి వస్తోంది సుందరి—ఎన్ని జన్మలెత్తాలి యిటువంటి పుష్పాన్ని స్పృశించడానికి? పువ్వును కాడతో బురదనుంచి పైకెత్తాడు. చుట్టూనీరు కల్మషమైంది. ప్రక్క నేవున్న రెండు మొగ్గలు కావుమన్నాయి. పువ్వును పట్టుకొని ఒక మారుమూలలో వున్న కుగ్రామానికి తీసుకపోయి ఒక గృహంలో దాచాడు. ఆ అందాన్ని అనుభవించాడు. రానురాను పువ్వు వాడిపోజొచ్చింది. ఆ కంటికి పసందుగా అగపడటం లేదు. జాలరికి పెళ్ళాం పిల్లలు జ్ఞాపకం వచ్చారు. కొల్లలుగా చేపలుయిచ్చి అభిమానం చూపించిన ఆ చెరువు జ్ఞాపకం వచ్చింది. అయ్యో ఆచెరువుమధ్యలో అంత అందంగా వున్న పువ్వా నేను పీకివేశాను మథన పడసాగాడు. తిరిగి ఆ పువ్వును ఆ చెరువులో వేసి క్షమాపణ వేడుకోవాలనుకున్నాడు. తనవునికి త్రోవ పోయే ఒక మనిషికి తెలియచేశాడు.

ఒకనాడు తెల్ల తెలవారు సమయాన్ని యింటిముందు జోడెద్దబండి ఆగింది. ఆమె అందులోనించి దిగిన భర్తను, పిల్లలను, తన బిడ్డలను చూచింది. సీమ్మన్న గజగజ వణకనారంభించాడు. ఆమెకళ్ళు పగడాల్లా మెరుస్తున్నాయి. మనసును పాషాణంచేసుకుంది. అమ్మ అంటూ కావుమని పిల్లలు దగ్గరకు పరుగెత్తుకొచ్చారు. ఆ రాయి కదలేదు. మెదల్లేదు. ఆ దృశ్యం చూసిన సీమ్మన్నకు కళ్లలో నీళ్లు గిర్రునతిరిగిపోయాయి. ఆ పద్మం కాగితంతో చేసి యెవరో చెరువులో వేసి తనను మభ్యపరచినట్లనిపించింది. ఆమెభర్త పిల్లలను చేరదీసి “ఇంకా ఇంటికి రావా?” అన్నాడు ఆ గొంతుకలో మర్యాద ఉట్టిపడుతోంది. ఊర్లో ప్రజ మూగిపోయారు. “రాను” అంది రాజమ్మ కటువుగా. భర్త కాస్త దగ్గరగా జరిగి “నన్ను క్షమించరాదు. ఆరోజునుంచీ యీపిల్లల యేడుపు వినలేకపోతున్నాను. అన్నీ యివ్వగలను గానీ...... తల్లిప్రేమ యివ్వగలనా ... వీళ్ళమీదైనా కనికరం చూపించి తిరిగి రావా రాజమ్మా?”

అతని మర్యాద, ఓరిమి, ఆమెకు కనిపించలేదు. వినిపించలేదు. “అన్ని వనులకో నేవచ్చాను. నీవెవ్వరో నే నెరగ...!” అంది

“అంతేనా...” అన్నాడు.

అతని మాటలా పాషాణాన్ని కరగించకపోగా నే ఆ గుంపులో ఒక వయసు మళ్ళిన వ్యక్తి ముందుకు వచ్చి “ఇల్లు వదలిన యిల్లాలు, చెట్టువదలినకోతీ ఒక

టమ్మా! అన్నిటికీ సహించిన ఆ మారాజుకో రోజు రాదనుకొన్నావు...?"

ఆమె రొంగ్రగించి చూసింది. శరీరమంతా పౌరుషంతో మండుకుపోతూంది. "నాకు పిరికితనమూ తెలీదు. నాకు తెలిసినవాడు ఆరుగో...వాడొక్కడే...మీరంతా పొండి...పోతారా లేదా?" ఆమె కసిరి వేసింది. ఆమె నిప్పులు కక్కుతూంటే సిమ్మన్న కూడా త్రుళ్ళి పడి భయపడ్డాడు. ఆ ముదుసలి గంభీరమైన గొంతుక మళ్ళీ వినిపించింది. "ఓ అమ్మా! ఇప్పుడు ఒళ్లు బింకంతో వున్నావు. నీ కేమీ తెలిసిరాదు. దేవుడూ లేడు! నీతీ లేదంటావ్. కాస్త వాడిపోగానే నీ దరికి ఏదీ చేరదు. ఎక్కడో మారుమూలల్లో గతిలేక చచ్చి నక్కలచేత, కుక్కలచేత, రాబందులచేత పీకించుకుంటావ్?"

"నేను చచ్చాక నాకేమైతే నేం? నేను చూడొచ్చానా? నాకు సిమ్మన్నతోనే బ్రతుకూ చావూనూ! వాడి చేతులతో నన్ను పొడిచినా నేను సంతోషంగా చచ్చిపోతాను. ఈ లోకంలో వాడొక్కడు తప్పించి నాకెంకెవరూ లేరు."

అంటూ ఆమె అక్కడనుంచి గబగబ కదిలి పోయింది. చుట్టూ మూగినవాళ్లు 'ఛీ ఛీ' అన్నారు. తుప్పున వూశారు. "అది మనిషి కాదు పశువు!" అన్నారు. "దానికైనా కొంత సిగ్గుంటాది. దీనికి లే"దన్నారు. నానా దుర్భాషలూ ఆడారు. ఒక మూల తలపట్టుకొని కూర్చుండిపోయిన యజమానిని చూడగానే సిమ్మన్న దగ్గరగాపోయి కాళ్లు పట్టుకొని వల వలా యేడ్చేశాడు.

"నా నౌకరుగా వుండొద్దు. నాతో సరిసమానంగా వుండు" అన్నాడు. సిమ్మన్న గతుక్కుమన్నాడు. అతని పాదాలొత్తడానికి పనికొస్తాడతను... యెన్ని అంతస్తులు లేవా!

"నీకు కొంతపొలం యిస్తాను. దున్నుకొని హాయిగా బ్రతకండి!"

ఈ మాటలు సంతోషంతోపాటు భయాన్ని కూడా రేకెత్తించాయి. ఎందుకో గుండె దడపట్టుకుంది. యీ భూమి యిచ్చి తన పిల్లాపాపతో బ్రతకమన లేదే! ఈ మెతోనా? ఈ రాయితోనా తన కాపురం? అన్నది చెప్పలేకపోయాడు. చెప్పలేకపోయాడు. అంతదూరంలో వున్న ఆమెను చూడగానే తనకు భయంవేసింది. పిశంగిని చూచినట్లయింది. మొగుడు నిల్చున్నాడు. "రండి! ఇద్దరూ బండియెక్కండి" అన్నాడు. ఆ గంభీర కంఠ స్వరాన్ని పాటించే అలవాటుకొద్దీ సిమ్మన్న బండివేపు నడవగానే ఆమె ఆపడానికి పరుగెత్తుకు వచ్చింది. "వద్దు వద్దు...మళ్ళీ ఆ నరకానికి వెళ్లొద్దు మనం...ఇక్కడే యిలాగ వుండిపోదాం. ఒక్కసారి యిద్దరు ఇక్కడే చచ్చి పోదాం!"

ఆమె ధాటికి సిమ్మన్న జంకిపోయాడు. కాళ్లు కట్టుకున్నట్లు నిల్చుండిపోయాడు. ఆమె భర్త ఒకసారి ఆమెవేపు రొంగాదిగా చూశాడు. ఆమె శరీరం జలదరిస్తోంది. కోపంతో కంపిస్తోంది. మతిచెడిన మనిషిలా కొద్దిగా పిచ్చిచేష్టలు అగపడ్డాయ్. అంతిమందిలో సిమ్మన్న చెయిపట్టి లాగే ఆమె సాహసాన్ని చూసి పౌరుషాన్ని ఆపుకోలేక పోయాడు. బిగ్గరగా "వాణ్ణి త్రాళ్లతో కాళ్లు చేతులూ కట్టి బండిలో వెయ్యం"డని హుకుం జారీ చేశాడు.

ఆ ఆజ్ఞ అరనిమిషంలో శిరసావహించడం జరిగింది. బండి కదిలిపోతోంది. ఆమె యెంత గుంజాటన పడినా లాభం లేకపోయింది. ఊళ్లోవాళ్లు వున్న సామానులు బయట పడవేసి "నీలాంటి నీచురాలు మా వూర్లో వద్ద"ని కేకలు వేశారు. ఆమె కీ కేకలేవీ వినిపించలేదు. బండి వెనుక పరుగెత్తింది. కొంత దూరం పోయాక భర్త బండి ఆపించి "మీదికి రా!" అన్నాడు.

"చేరాను...సిమ్మన్న కట్లు విప్పు...ఎక్కడికో పోతాం!"

మళ్ళీ బండి తోలించాడు. ఎంత బ్రహ్మాండమైన యెండ...పొలాల త్రోవలోనుంచి యెడ్లబండి పరుగు తీస్తోంది. ఆమె కాళ్లు బొబ్బ లెక్కిపోయాయి. స్నానం చేసినట్లు చెమట కారుతోంది. దాహం బ్రహ్మాండంగా వుంది. కాళ్లు పట్లుతప్పి పీకుతున్నాయ్. శరీరమంతా కందిపోయింది. విరబోసిన జుత్తుతో వున్న కొద్ది శక్తితో బండివెనుక పరుగెడుతోంది... అదిగో ఊరు! ఒళ్లు స్వాధీనంతప్పుతోంది. ఎదురుగా బండి రెండు బళ్లుగా అగపడి...మసక మసగ్గా...అనిపించి...ఒక్కసారి మాయమైపోయింది. బండి ఆగింది. మొగుడు మూర్ఛపోయిన రాజమ్మను బండిమీద వేశాడు. నీళ్లు చల్లాడు. ఆమెకు తెలివివచ్చే

సరికి చాల రాత్రయింది. మాట రాలేదు. తను ఎక్కడ వున్నదీ సరిగా గుర్తు రాలేదు. ఆకలి వేస్తున్నట్లు సైగ చేసింది. కడుపునిండాక సత్తువ వచ్చింది కానీ ఒళ్లంతా పట్లు జారిపట్టుంది. చుట్టూ మూగివున్న స్వజనంవైపు చూడకుండా బోర్లపడి పడుకుంది. తెలివి వున్నా నిద్రలో వున్నట్లే నటించింది. ఆ రాత్రంతా తన కాళ్ల వేపు రోవలో కుర్చీమీద కూర్చున్నాడు. అప్పుడప్పుడలా విసురుతున్నాడు చిన్న పిల్లవాడు యేడుస్తుంటే వెళ్లి జోకొడుతున్నాడు. ఆమె వుదయం లేచే సరికి కుర్చీమీద కూర్చునే కునుకుతున్న భర్త అగుపించాడు.

'మళ్ళీ యీ కైదులో యెందుకు వేశావ్ దేముడా!' అనుకుంది. ఎవరితోనూ మాట్లాడ లేదు. ఎవరు మాటలు కలుపుతున్నా ముఖం త్రిప్పి వేస్తోంది. తనకు కావలసినవన్నీ అడక్కుండా దగ్గరకు వస్తున్నాయ్. ఎప్పటికి చీకటి పడుతుందని యెదురు చూసింది. చీకటిపడింది. ఎడి రాత్రి...కదలడానికి వీలులేకుండా భర్త కాపలా కాస్తున్నాడు...ఒకటి రెండుసార్లు లేవటానికి ప్రయత్నిస్తే మెలకువ యేంకావాలన్నాడు. జవాబు చెప్పకుండా పడుకుంది. ఈలోగా పురుగులు ప్రతిధ్వని స్తున్నాయి. లేచి భర్త వేపు చూసింది. అలా కుర్చీ మీద కూర్చునే చిన్న మాగన్ను నిద్రపోతున్నాడు. కదులుదామనుకునేసరికి దబదబ వర్షం ముంచుకొచ్చింది. ఆ వానజల్లుకు లేచిపోయాడు. కూర్చున్న రాజమ్మను చూచి "నిద్ర రాలేదా?" అన్నాడు.

జవాబులేదు కానీ అలా ఆమెవేపు దృష్టి సారించి చూశాడు. అతనిలో యేదో భావుకత్వం పొంగిపొరలింది ఆమెకి సహజంగా తనకున్న అను రాగం పుట్టించింది. నికరం చేసింది. అరచేతిని ముడిచి కుడి అరచేతితో ముడిచి తన చేతిని లాలిస్తున్నట్టు నిమురుతూ..."యేదో తప్పు చెయ్యకపోతే మనిషిలా అవుతావే...నీకు ఎందుకోనో లోటు చేసివుంటాను... చందమామకి మచ్చవున్నా చూచేవాళ్ళకి ఒళ్ళు పులక రిస్తుందిగా...ఏమంటావ్!"

ఆమె నిష్ఠూరంగా "గంగలో దూకుతానంటాను!" అంటూ మళ్ళీ జేరబడిపోయింది.

"నీవు మంచివాడివే...నీనోటంట అలాంటి మాటలు హాస్యానికైనా రాకూడదు!"

"నీకే అంతా నిజం...నాకే అంతా అబద్దంలే... ఊరుకో" అంది.

ఈ వాగును పట్టి పాములపెట్టెలో పెట్టి నా యింకా మచ్చిక చేయలేక పోతున్నానని పాములవాడు చివుక్కుమన్నాడు.

ఆ మరునటిరోజు మధ్యాహ్నం అయేసరికి ఆ వూరికి అనుకుని తిరస్కరాలు గా పాకలేయేరు ముంచుక వచ్చింది. ప్రవాహం రానురాను పెద్దదై చీకటిపడే సరికి యేరు రెండు ఒడ్డులకు అంటుకొని పారుతోంది. హోరుమనే శబ్దం మైలుదూరం వినిపిస్తోంది. వానలవల్ల చెరువులు నిండాయ్, కప్పలు బెక బెక డప్పులు కొడుతున్నాయ్. కాలువలు నిండి పొలాల్లోపారి వుభాలు మొదలు పెట్టించాయ్. పనిపాట్లలో శోక్యం చెసుకో కండా భర్త యింట్లో వేవున్నాడు. ఆమె ఆ రోజున లేచి తల దువ్వుకుంది. చీర మార్చింది. ఒంటినిండా నగలూ ముఖంనిండా బొట్టు పెట్టుకుని పేరంటాలులా పసుపు రాసుకొని తయారయ్యింది. ఆమెలో మార్పును చూచి భర్త సంతోషపడ్డాడు. ఆ రాత్రి తనకు కంటి నిండుగా నిద్రపట్టింది.

సీమన్న ఒంటిగా తన యింటివాకిట మంచం వేసుకొని పడుకున్నాడు. కొంతవరకూ పిల్లలు తనమీద సవారీచేసి సంతోష పెట్టి యింట్లో నిద్రపోయారు. తర వాత పెళ్ళాం మాట్లాడి చాలా రాత్రయిందని పోయి ఇంట్లో పడుకుంది. చీకటిగావుంది. ఆకాశాన్ని నక్షత్రాలు మెరుస్తున్నాయ్. దగ్గరగావున్న యేటి గంభీర మైన అరుపు వినిపిస్తోంది. సీమన్నకు నిద్ర రావటం లేదు. తన యజమాని...రాజమ్మ...అంతా జ్ఞాపకం వస్తున్నారు. యజమాని వుదారస్వభావం తలుచు కుంటుంటే ఒళ్ళు పులకరిస్తోంది. మనసులోనే దేవు డితో సమానమైన మారాజని మొక్కుకుంటున్నాడు. రాజమ్మ సౌందర్యమంతా కళ్లకు కట్టింది—ఎక్కడి కండ అక్కడ—ఎంతో పొందికైన ఒళ్ళు—మంచి సారా త్రాగినట్లుంది ఆమెతో సంసారం! ఆ క్షణం లోనే తన పెళ్ళాం తలపుకొచ్చింది. ఇద్దర్నీ పోల్చు కోవటం జరిగింది. ఇదా వుత్తి యెండ్రిబాగులది— మెత్తనిముద్ద—అది లేకుండా నా కెన్నిసార్లు గంజి పోసింది. దీని ఒళ్ళు కోస్తే అంతా మంచే! అభి మానమే! కాకపోతే సవితిని పట్టుకొని పూరూరా తిరిగావెందుకు? యింటికి తేలేకపోయావా అని అడుగు

లేదా? "నీకోసం అంత బ్రతుకూ కాలదన్నింది. నీతో నేను సుఖపడ్డాను. అదీ సుఖపడనీ—దాన్ని చెల్లెల్లాగ చూసుకుంటాను—దానికింత చేస్తాను—" ఇలాగన్నాడే యిదెక్కడ? కన్నకడుపులో పుట్టిన పిల్లలు అమ్మా అని యేడిస్తే మీదికొస్తే కదలేదు. మొక్క లేదు అదెక్కడ? అది మనిషిపుట్టుక పుట్టలేదు. దాన్ని కోసే అభిమానమే లేదు. అలాంటిది నాయింటి కొస్తే పులిలాగ నన్నా మింగేస్తాది—దాని కడుపులో ఒక పిల్ల పుట్టే నా పిల పీకలు పిసికేస్తాది! దానికి పూర్లోనే చోటు యివ్వకూడదు. మూడు ముల్లూ కట్టానా రండో మొండో ధరించడానికి? దానికీ నాకు సమ్మంధం యేం వున్నాదని యిలా ఆలోచించుకుంటూవుంటే యెవరో అతనిమీద చెయ్యి వేశారు. గతుక్కుమని తిరిగేసరికి రాజమ్మ సింగారించుకొని వచ్చిన కామినీ దేవతలావుంది. పదపద అన్నది తొందరగా. 'రాను' అని చెప్పటానికి నోరు కదలేదు. లేచాడు. ఆమె గబగబ నడుస్తోంది ముందుకు. మెల్లగా అడుగులు వేస్తున్న సిమ్మన్నను చూచి ఆగి "రా" అని పిల్చింది. గబగబ తనకు తెలియకుండానే కాళ్ళు కదలిపోయాయి.

ఊరు దాటాగా. చుక్కల వెలుగులో యేటిఒడ్డు వెంబడే త్రోవలో పోతూనే వెనుకవున్న వాడిని ముందు నడవమని ఆమె త్రోవ తిప్పుతుంది. ముందుకు నాలుగు అడుగులు వేసి ఆగి ధైర్యం చిక్కబట్టుకొని యెక్కడికి అన్నాడు ఆమె సహజగంభీరస్వరంతో "నీ వెంటనే వస్తాను... ముళ్ళత్రోవ కానీ...యిసక దిబ్బలు కానీ...గంగలోనికి గానీ...గగనానికి గానీ... నరకానికైనా....నీతో నే వస్తాను...తీసుకుపో..." అంది.

సిమ్మన్నకు కాళ్లు సరిగా ముందుకు పడటంలేదు. ఈమె తనంతు అనురాగంకంటే అతీతమైన బంధనం తనను వెనుకకు లాగుతోంది. ఆడమనిషిలో వుండే మానవత్వం తెలుపుతూవచ్చి యింటి వేపు తిరిగి పరుగెత్తమని ప్రోత్సహిస్తోంది. పిలలపై కన్నతండ్రికి సహజంగా వుండే మమకారం మనసులో మథనం చేస్తోంది. ఈ జెబ్బులిని యెలా విడిపించుకోవటం—తన నిర్మలమైన బాటకు అడ్డుగా కాసింది. దోచుకుంటూ కలుపుకుంటూ బొబ్బలు పెడుతూ కదులుతున్న యేరు ప్రక్కనే వుందని స్ఫురించింది. మనసు కఠినమైంది. కార్య నిమగ్నుడై ఆగాడు.

ఆమె అతని భుజంమీద చెయ్యి వేసి "చీకటని భయంగా వుందా?" అంది

"లేదులే..." అన్నాడు.

"పాములుంటాయనా? అది నిన్ను కరిస్తే— నేనూ కరిపించుకుంటానులే...పద...పద...!" ఆమె కదలని అతనిని, తన అందమైన బాహువులతో చుట్ట చేసింది. ముఖంలో ముఖం పెట్టింది. సిమ్మన్నలో సంచలనం కలిగింది. ఆ నిశిలో నిశాచరుడయ్యాడు. పువ్వు పూర్తిగా నలిపివేసి ఉద్రేకంతో ఒక్కసారి గంగలోనికి త్రోసివేశాడు! తిరిగి యేమి తెలియనట్లు యింటి వేపు నిద్రపోడానికి పరుగెత్తాడు.

రాజమ్మ చనిపోయి ఒక దశాబ్దం గడిచింది. ఆ గ్రామం వస్తేవాళ్ళకి యేటిఒడ్డున ఒక మనిషి కనిపిస్తాడు. యేటి వేపు చూపిస్తూ "నన్ను రమ్మని పిలుస్తున్నాది! మీకు వినపడలేదా రాజమ్మ పిలుపు... అదిగో...అదిగో!" అంటాడు. ఆ చుట్టుపట్లవున్న వాళ్ళు "పిచ్చి సన్యాసి బాబూ, రేయీ పగలూ అదే మాట...అక్కడే వుంటాడు!" అంటారు.

కౌటిల్యుని అర్థశాస్త్రము

శ్రీ సి. వరహాలరావు

ప్రాచీన హైందవ రాజనీతి శాస్త్రచరిత్రలో కౌటిల్యుని అర్థశాస్త్రం అత్యంత ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తుంది. కౌటిలీయం, మన రాజనీతి శాస్త్రంపాలిట మహోన్నత భాండాగారం. దీన్ని రచించినవాడు కౌటిల్యుడు లేక చాణక్యుడు. ఇతడు తక్షశిలానగరంలో జన్మించాడని కొందరు, ద్రవిడ దేశస్థుడని మరికొందరు ఊహిస్తున్నారు. ఇతడు ఆంధ్రుడనే ప్రవాదంకూడా ఉంది. ఏది ఏమైనా, ఈయన జన్మస్థానం యిది అని చరిత్రపండితులు యిదమిత్థంగా తేల్చలేదు. ఈయన వేదవేత్తయే గాక నాటికాలపు విద్యలన్నిటినీ, సమగ్రంగా అభ్యసించినవాడు. తక్షశిలావిశ్వవిద్యాలయంలో విద్యార్థిగావున్న దినాల్లోనే కూటముద్రలు (దొంగనాణెములు) తయారుచేసేవాడనీ, 'కుంటనక్క'వంటి తెలివితేటలుగలవాడనీ ప్రతీతి. "ముద్రారాక్షస" నాటకకర్తయైన విశాఖదత్తుడు "కౌటిల్యః కుటిలమతిః" అని ఒక పాత్రచే యీయన శీలాన్ని అభివర్ణింప జేశాడు.

కౌటిల్యుడు "అర్థశాస్త్రాన్ని" క్రీ. పూ. 300 ప్రాంతాల రచించి వుంటాడు. కాంతిలోకి వచ్చిన నాటినుండీ యీ మహాగ్రంథం కీర్తి చంద్రికలు, సూర్యకిరణాల్లాగ దశదిశలకీ వ్యాపించాయి. క్రీ. శ. 8 వ శతాబ్దంలో జీవించిన కామందకుడు తన "నీతిసారం"లో కౌటిలీయ ప్రాశస్త్యాన్ని వేనోళ్ళ ప్రశంసించాడు. శాస్త్రాంబుధిలోనుండి కౌటిలీయమనే రాజనీతి శాస్త్రామృతాన్ని ఉద్ధరింప జేసిన మహోన్నత ప్రతిభాశాలిగా కౌటిల్యుణ్ణి వర్ణించాడు. క్రీ. శ. 8 వ శతాబ్దంలో జీవించిన భవభూతి తన 'మహావీరచరిత'లోను, భవభూతికి 50 సంవత్సరాలకు పూర్వమున్న మహాకవి దండి తన 'దశకుమార చరిత'లోను, క్రీ. శ. 5 వ శతాబ్దంలో వ్రాయబడిన 'నారదస్మృతి'లోను, కౌటిలీయార్థశాస్త్రం ప్రస్తావించబడడం గమనార్హం. న్యాయభాష్యము క్రీ. శ. 850 లో వ్రాయబడిన 'యాజ్ఞవల్క్యస్మృతి'లాంటి ధర్మశాస్త్రగ్రంథాలు, మేధాతిథి, మల్లినాథుడూ వంటి సుప్రసిద్ధ వ్యాఖ్యాతకారులూ, కౌటిలీయాన్ని పేర్కొన్నారు. ఇంతమంది మహామేధావుల, ఉద్దండ పండిత ప్రకాండుల దృష్టి ఆకర్షించిన యీ గ్రంథం కొంతకాలం అదృశ్యమైపోయింది.

మౌర్యచంద్రగుప్తుని ఆస్థానంలోవున్న గ్రీసు రాయబారి మెగస్తనీసు, తన 'ఇండికా' గ్రంథంలో చంద్రగుప్తుని గూర్చి విశేషముగ సమాచారాన్ని అందించి, మౌర్యసామ్రాజ్యాన్ని స్థాపించి, చంద్రగుప్తుని ప్రధానామాత్యుడుగావుండి, దైనందిన రాజ్యకార్య నిర్వహణలో పాల్గొనిన కౌటిల్యుని పేరును పేర్కొనకపోవటం నిజంగా ఆశ్చర్యకరమైన విషయమే! దీన్ని ఆధారంగా చేసికొని, కొందరు పాశ్చాత్య, భారతీయ పండితులు కౌటిల్యుడు పుక్కిటి పురాణానికి చెందిన వ్యక్తి అనే నిర్ణయానికి వచ్చారు. ఐతే వారి సందేహాలు, నిర్ణయాలు, నిరాధారాలని చరిత్ర రుజువుచేసింది.

కొన్ని శతాబ్దాలాదిగా ప్రాచీన హైందవ రాజనీతి శాస్త్రం పాలిట కామధేనువులా ఉన్న 'అర్థశాస్త్రం' కొంతకాలం మరుగునపడిపోయి, 20 వ శతాబ్ది ప్రారంభంలో, 1900 ప్రాంతాన డాక్టరు శ్యామశాస్త్రిచే కనుగొనబడింది. ఆయన యీ గ్రంథంలోని కొన్ని భాగాలు ఇంగ్లీషు భాషలోనికి అనువదించి ప్రచురించారు. దాంతో యూరపియన్ పండితులు, ప్రత్యేకంగా జర్మన్ సంస్కృత విద్వాంసులు, దీన్ని అధ్యయనం చేసి పరిశోధనలు ప్రారంభించారు. అంతదాకా, ప్రాచీన హైందవులకు స్వతంత్ర అర్థశాస్త్రమంటూ, ఒకటి లేదని ప్రచారం చేసిన యూరపియన్ పండితుల దృక్పథంలో కౌటిలీయం పునర్దర్శనం విప్లవాత్మకమగు మార్పును తీసుకువచ్చింది. అంతేగాదు; కౌటిలీయానికి పూర్వము, తదనంతరము ఎన్నో రాజనీతిగ్రంథాలు వ్రాయబడ్డాయి. అవన్నీ కౌటిలీయంలా, ఏదో ఒకనాడు వెలుగులోకి రాకుండా మానవని ఆశిద్దాము.

కౌటిల్యుడు 'అర్థశాస్త్రాన్ని' రచించేందుకు సూత్రశైలి ఉపయోగించాడు. అందుచేత, ఆయన అభిప్రాయాలు అతినిగూఢంగా కన్పిస్తాయి. గ్రంథంలో వుపయోగించిన పరిభాష, తక్కిన సంస్కృతగ్రంథాల్లోగానీ, నిఘంటువుల్లోగానీ కన్పించదు. కౌటిల్యుని పిదపవచ్చిన గ్రంథకర్తలు ఎవ్వరూ ఆయనలా రాజ్యపాలనకు సంబంధించిన విషయా

లన్నిటినీ విపులంగా వివరించలేదు. కాటిలీయంలో ఉన్న అన్వ్యతి ప్రచార ధర్మస్థీయ యోగవృత్తాది అధికరణాలను గూర్చిన ప్రకరణాలవంటివి కామందకుని "నీతిసారం"లో గానీ, శుక్ర "నీతిసారం"లో గానీ లేవు. కాబట్టి రాజ్యాంగతంత్రం గూర్చి ప్రాచీన శాస్త్రవేత్తలు చేసిన సిద్ధాంతీకరణానికి కాటిలీయమే ప్రధానమైన ఆధారం.

కాటిలీయం అవతరణ కాలంనాటికి భారతదేశంలోని విభిన్నపరిస్థితులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మాసిడోనియా దేశస్థుడయిన అలెగ్జాండరు, ప్రపంచాన్ని జయించాలని వాంఛతో దండయాత్ర ప్రారంభించాడు. పారసీక సామ్రాజ్యాన్ని తన పాదాక్రాంతం చేసికొని, హిందూకుష్ పర్వతాలు దాటి, క్రీ పూ. 326 లో భారతదేశంపై దండెత్తాడు. ఆ నాటికి, ఉత్తర భారతదేశంలో చిన్న చిన్న రాజ్యాలు అసంఖ్యాకంగా వున్నాయి. అనామకులై, నిరంతరం కలహంతప్ప మరో వ్యాపకంలేని రాజులు, భోగభాగ్యాలనుభవిస్తూ, బతుకున్న రోజులవి. పంజాబ్ చిన్న చిన్న భాగాల క్రింద చీలిపోయింది. దేశం ఐక్యము, క్షేమము మరచి, విదేశశత్రువు దేశ స్వాతంత్ర్యాన్ని దొంగిలించ సిద్ధపడ్డప్పుడుకూడా, నాటి క్షుద్రులైన రాజులు, (పురుషోత్తమునివంటి రాజులు తప్ప) పరస్పరం కుత్తుకలు త్రెంచుకొనే యత్నంలో ఉన్నారు. అలాంటి పరిస్థితులలో అలెగ్జాండరు దండెత్తాడు. అలెగ్జాండరు దండయాత్ర భారతదేశ రాజకీయాకాశాన్ని తాత్కాలికంగా ఆవరించిన కారుమేఘం. ఇది వెంటనే అదృశ్యమైంది.

గ్రీకుదండయాత్ర కొన్ని సత్ఫలితాలనేగాదు కొన్ని దుష్ఫలితాలనుకూడా కలుగజేసింది. గ్రీకు దండయాత్రా ఫలితాలు, హిందూసంఘం ఆచార వ్యవహారాలను కొంతవరకు కళంకితం చేశాయి. కొందరు రాజవంశస్థులు, గ్రీకు సేనాధిపతులకు తమ కన్యల నిచ్చి వియ్యమొందారు. మౌర్య చంద్రగుప్తుడు, సెల్యూకస్ కూతురును వివాహమాడాడు. దీని ఫలితంగా హిందూ సంఘంలో వర్ణసాంకర్యం ప్రారంభమైంది. వైదిక మతానికి దుర్గతి ప్రాప్తించింది. నాటి కాలంలో, దేశంలో జైన బౌద్ధాలు ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. కౌటిల్యుని కాలంనాటికి, మగధరాజ్యాన్ని నవనందులు పాలిస్తున్నారు. నందులలో చివరివాడైన ధననందుడు ప్రజాద్రోహిగా తయారై, ప్రజల్ని హింసించడం జరిగింది. అలాంటి పరిస్థితులలో, ప్రజాకంటకంగా తయారైన నందరాజులపాలన తుదముట్టింపజేసి, వైదికమతాన్ని పునరుద్ధరించేందుకు, కౌటిల్యుడు కంకణం కట్టాడు. మహాశూరుడైన చంద్రగుప్తుడు, అసామాన్య ప్రతిభాశాలి, అఘటనఘటనా రాజనీతి శాస్త్రపారంగతుడైన కౌటిల్యుడూ కలిసి, బ్రహ్మాండమైన సైన్యాన్ని సమకూర్చి, నందులను ఓడించారు. మగధరాజ్యాన్ని వశపరచుకొన్నారు. ప్రాచీన హైందవ రాజకీయాకాశంలో మిణుకు మిణుకు మంటూ, అమూల్య దివ్యకాంతిలో ప్రకాశించిన ఆదిమ గణ సంఘాలు క్రమేణా మౌర్య సామ్రాజ్యంలో సైనిక శక్తి సహాయంతో కబళించివేయబడ్డాయి. ఈ విధంగా, భారతదేశ చరిత్రలో, మొట్టమొదటిసారిగా, సువిశాలమైన మౌర్య సామ్రాజ్య అవతరణం జరిగింది.

కౌటిల్యుడు : వైదికధర్మపరత్వం

కౌటిల్యుడు వైదికమతంపై అధిక తరమయిన అభిమానం చూపాడు. ఇతని వైదిక ధర్మ పరత్వానికి కౌటిలీయార్థశాస్త్రంలోనే ఎన్నో నిదర్శనాలున్నాయి. కామందకుడు కౌటిల్యుని శాస్త్ర పాండిత్యాన్ని, వైదిక ధర్మపరత్వాన్ని, అసాధారణ ప్రతిభనీ యీ విధంగా ప్రశంసించాడు:

"వంశే విశాల వంశ్యానాం ఋషీణామివ భూయసాం
అప్రతిగ్రాహకాణాం యో బభూవ భువి విశ్రుతః
జాతవేదా ఇవార్చిష్మాన్ వేదాన్ వేదవిదాం వరః
యోఽధీతవాన్ సుచతురః చతురోఽప్యేక వేదవత్
యస్యాభిచార వజ్రేణ వజ్ర జ్వలన తేజసః
పపాత మూలతః శ్రీమాన్ సుపర్వా నందపర్వతః
ఏకాకీ మంత్రశక్త్యా యః శక్త్యా శక్తిధరోపమః
ఆజహార నృచంద్రాయ చంద్రగుప్తాయ మేదినీమ్
నీతిశాస్త్రామృతం ధీమాన్ అర్థశాస్త్రమహోదధేః
సముద్దధ్రే నమస్తస్మై విష్ణుగుప్తాయ వేధసే"

అప్రతిగ్రాహకమైన ఉత్తమ ఋషి వంశంలో ఉద్భవించి, శ్రేష్ఠతో నాలు వేదాలనీ ఒకే వేదంలా అధ్యయనంచేసి, సర్వశాస్త్ర విశారదుడై, పవిత్ర జీవనము యాగాగ్నిలా ప్రకాశించి, ఆర్య ధర్మ రక్షణకొరకు విదేశీ విజృంభణాన్ని అరికట్టి, అద్భుత మంత్ర సామర్థ్యంతో, నందపర్వతాన్ని, శివ సేనానిలా ఒంటరిగా స్వశక్తిచే నిర్మూలించి, మౌర్య చంద్రగుప్తునికి చక్రవర్తిత్వాన్ని సాధించి, అర్థశాస్త్రాంబుధినుండి నీతిశాస్త్రామృతాన్ని పుట్టింపజేసిన మహోన్నత ప్రతిభాశాలిగా, కౌటిల్యుణ్ణి, కామందకుడు ప్రశంసించాడు. వైదికధర్మరక్షణ, మౌర్యసామ్రాజ్య స్థాపన తత్పరిపాలన ఇవే కౌటిల్యుని ప్రధానాశయాలు. అందుకే తాను రచించిన అర్థశాస్త్రంలో వేదాలకు, చాతుర్వర్ణ్య చతు

రాశ్రమాలకు ఎక్కువ ప్రాముఖ్యమిచ్చాడు. రాజ్యాన్ని పరిపాలించే రాజకుమారులు, చిన్ననాటి నుండీ వేదవిద్యలు, వర్ణాశ్రమ ధర్మసూత్రాలు, అధ్యయనం చేయాలని, నిర్దేశించాడు. రాజకుమారుడు ప్రాతఃకాలాన హస్త్యశ్వ, రథ ప్రహరణవిద్యలు అభ్యసిస్తూ మధ్యాహ్నం పూట మహాభారత రామాయణేతిహాసాలని వింటూ శాస్త్రాలలో శిక్షణ పొందాలంటాడు. నాలుగు వర్ణాలు కలిగి, నాలుగు ఆశ్రమాలు కలది లోకమని చెప్పాడు. ఇలాంటి లోకం రాజదండంచే పరిపాలింపబడి 'స్వధర్మ కర్మాభిరతమై తమ తమ మార్గాల్లో ప్రవర్తించుచున్న' దంటాడు. హిందూసంఘమందలి నాలుగు వర్ణాలకు చెందిన ప్రజలు ఈ క్రింది వృత్తుల్ని స్వీకరించాలంటాడు. బ్రాహ్మణునికి అధ్యయన అధ్యాపన యజన యాజన ప్రతిగ్రహములు, క్షత్రియునికి అధ్యయన యజన యాజన ప్రతిగ్రహములు, వైశ్యునికి అధ్యయన యజన యాజన దానకృషి పాశుపాల్య వాణిజ్యములు శూద్రునికి బ్రాహ్మణ క్షత్రియ వర్ణాల శుశ్రూష, వార్తా కారు కుశీలవకర్మలు స్వధర్మాలు. 'స్వధర్మము ననుసరించుట స్వర్గమోక్షములకొరకే' నని ఖండితంగా చెప్పాడు. స్వధర్మాన్ని అతిక్రమిస్తే వర్ణసాంకర్యంవల్ల లోకం నశిస్తుంది కాబట్టి ప్రభువు ప్రజల్ని స్వధర్మాన్నుండి దూరం కానివ్వరాదు. స్వధర్మ పరిపాలకుడు, ఆర్య మర్యాదా వ్యవస్థాపకుడు, వర్ణాశ్రమ ధర్మస్థితికర్త అయిన రాజు ఇహపర సుఖాలు పొందుతాడు. అప్పుడు లోకం త్రయి (మూడు వేదాలు) చేత రక్షింపబడి వృద్ధిచెందగల"దని చెప్పాడు. 'లోకంలోని చాతుర్వర్ణ చతురాశ్రమాలను, వాటిని నడవడానికి సిద్ధమైన స్వధర్మాలను, రక్షించడంచేతనే రాజు ధర్మపాలకుడవుచున్నాడు' (ధర్మస్థేయం—అర్థశాస్త్రం) హిందూ సమాజమందలి ప్రజలలో ఐకమత్యభావాన్ని నెలకొల్పేందుకు, వర్ణవ్యవస్థ ప్రవేశపెట్టాలని కౌటిల్యుడు నిర్దేశించాడు. ఈ వర్ణవ్యవస్థ కుంటుబడితే లోక జీవితం సంక్షోభంలో పడిపోతుందని చెప్పాడు. ప్రజాజీవితం సంక్షుభితం గాకుండా వుండేందుకు, ప్రజలు ఐహికాముష్మిక సుఖాలుపొందేందుకు రాజు వర్ణాశ్రమ ధర్మాన్ని రక్షించాలి. అలా కాపాడకుండా వర్ణ సాంకర్యాన్ని ప్రోత్సహించి, ధర్మశాస్త్రాలని తిరస్కరించితే, రాజు పదవిభ్రష్టుడు చేయబడతాడు.

కౌటిల్యుడు : పూర్వశాస్త్రకారులు

'అర్థశాస్త్రం' అనే పేరుతో రాజధర్మాన్ని విపులంగా వివరించే గ్రంథరాజాన్ని వ్రాయడం, శాస్త్ర సిద్ధాంతాల ననుసరించి, దిగంత విశ్రాంతమైన మౌర్య సామ్రాజ్యాన్ని చంద్రగుప్తుని సహాయంతో స్థాపించడం, యీ రెండు కారణాలవల్ల, కౌటిల్యుడు ప్రాచీన హిందవార్థ శాస్త్ర చరిత్రలో అగ్రగణ్యుడైన శాస్త్రవేత్తగాను, భారతదేశ చరిత్రలో ఒక మహాపురుషుడుగాను, పరిగణింపబడుతున్నాడు. శాస్త్ర సిద్ధాంతాలను ప్రతిపాదించడంలోనే గాకుండా, వాటి మంచిచెడ్డలు ఆచరణలో నిర్ధారణ చేయడంలో కూడా, కౌటిల్యుడు అనన్యసామాన్యమైన ప్రజ్ఞను ప్రదర్శించాడు. అతడు పూర్వ శాస్త్రవేత్తల సిద్ధాంతాలు, సూత్రాలు, కొంతవరకు అంగీకరించాడు. కొన్ని సందర్భాలలో, ఆ సిద్ధాంతాలకు కొన్ని తీవ్ర సంస్కరణలుకూడా చేశాడు. మరికొన్ని సందర్భాలలో మూలసిద్ధాంతాలు ఖండించి సంపూర్ణముగ స్వతంత్ర సిద్ధాంత ప్రతిపాదన కుద్యమించాడు

కౌటిల్యునికి పూర్వమున్న శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సూత్రాలు, ధర్మమనే ఉక్కుచట్రంలో బంధింపబడ్డాయి. పూర్వ శాస్త్రకారులు "అర్థం" కంటె ధర్మాన్ని గూర్చి అధికంగా చెప్పారు. ఆ ధర్మశాస్త్ర నియమాలకు అర్థశాస్త్ర సూత్రాలు కట్టుబడి వుండాలని, నిర్దేశించారు. కాలచక్రం గిర్రున తిరిగింది. పరిస్థితులు మారిపోయాయి. పూర్వం చెప్పబడిన ధర్మ సూత్రాలు కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల కనుకూలంగా మారక, యాంత్రికంగా తయారయ్యాయి. అలాంటి పరిస్థితులలో, మారుతున్న కాలానికి అనుగుణంగా అర్థశాస్త్ర సూత్రాలను కొన్నిచోట్ల సంస్కరించాడు. కొన్ని విషయాలలో మూల సిద్ధాంతాలే మార్చాడు. ఉదాహరణకు—కౌటిల్యునికి పూర్వమున్న ధర్మశాస్త్రకారులు విధవా వివాహాలుగానీ, వివాహబంధ విమోచనాన్నిగానీ అంగీకరించలేదు. కాని కౌటిల్యుడు కాలానుకూలంగా, వివాహ బంధ విమోచనం, ప్రోషిత భర్తృకలకు, మృత భర్తృకలకు పునర్వివాహము, ఋతుమతికి స్వయంవరణము యిత్యాది తీవ్రసాంఘిక సంస్కరణలు హిందూ సంఘంలో అతి ధైర్యంగా ప్రవేశపెట్టాడు. దైనందిన రాజ్యపాలనలో కాకలు తీరిన, రాజనీతిజ్ఞుడుగా వ్యవహరించాడు.

రాజ్య పాలనా రంగంలో కూడా అతడు మార్పులు ప్రవేశపెట్టాడు. రాజులు తమ రాజ్యాలలో గూఢచారి దళాలను ఏర్పరచాలని, భేదోపాయాలచే శత్రువును మోసగించి తెగటార్చాలనీ, శత్రురాజులకు వ్యతిరేకంగా ఆ రాజ్య ప్రజలలో ద్వేషం కలుగజేయాలనీ చెప్పాడు. ఈ "కుటిల" మార్గాలు, పరంపరానుగతంగా వస్తున్న ధర్మసూత్రాలను నిలువునా కూని

చేస్తాయని పూర్వ పండితులు తలచి, ఆయనపై కత్తులు నూరారు. కౌటిల్యుడు రాజ్యపాలనా శాస్త్రాన్ని పటిష్ఠం చేసేందుకు ప్రవేశపెట్టిన సంస్కరణలు, సూచించిన నూత్న మార్గాలు ప్రాచీన ధర్మశాస్త్రవేత్తల యాంత్రిక సూత్రాలకు వ్యతిరేకంగా తయారయ్యాయి. కరువు కాటకాలు నివారించేందుకు, రాజ్యంలో విప్లవం, శత్రుదండయాత్ర, మొదలైన అత్యవసర పరిస్థితులు హఠాత్తుగా సంభవించినప్పుడు, ప్రభుత్వ కోశంలో ధనం లేకపోతే సంపన్నుల నుండి బలవంతంగా డబ్బు గుంజడం, దుర్మార్గుల పొలాలను బలప్రయోగంతో స్వాధీనం చేసుకోవడం, ప్రజల మూఢమత విశ్వాసాలను ఆసరాగా తీసుకొని అధర్మమార్గాల ద్వారానైనా ధనం సంపాదించడం - యివి రాజ్యం యొక్క శాంతి భద్రతల దృష్ట్యా, సుస్థిరత దృష్ట్యా అత్యవసరమని కౌటిలీయంలో స్పష్టంగా ప్రతిపాదించాడు. కాని ధర్మశాస్త్రకారులు యీ ప్రతిపాదనలపై విరుచుకుపడ్డారు.

ధర్మగ్లాని కలుగుతుందని, కారాలు మిరియాలు నూరారు. ఐనా వారి విమర్శలకీ, ఆ వేళ కాకేకలకీ యిసుమంతైనా లెక్క చేయకుండా నల్లేరుపై బండిని తోలినట్లు తన మార్గాన తాను ప్రయాణించాడు చాణక్యుడు!

వాస్తవిక రాజకీయరంగంలో అధికార దాహంలో వుండేవారు ఎలా వ్యవహరిస్తారో కూడా విశదీకరించాడు. ఈ ప్రవర్తన న్యాయబద్ధమా, ధర్మబద్ధమా అనే మీమాంసకు అతడెట్టి ప్రాధాన్యం యివ్వలేదు. శత్రువులను ఓడించడంలో మోసం, అసత్యప్రచారం, కుట్రలూ, దుహాకాలూ,— యివన్నీ ఉపయోగించదగిన సాధనాలనే కౌటిల్యుని అభిప్రాయం. ఈ సందర్భంలో ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారి అభిప్రాయాన్ని యిక్కడ ఉల్లేఖిస్తాను. "చాణక్యుని ప్రపంచము వాస్తవిక ప్రపంచముగాని, ఆదర్శ ప్రపంచముగాదు. రాజులు ఎట్టి మార్గముల ననుసరించుచుండెడివారో వివరించుటయే అతని ఉద్దేశ్యము. న్యాయాన్యాయములు, ధర్మాధర్మములు విధించుటకు అతడు ప్రయత్నించుటలేదు. అతని గ్రంథమును, అందులోని సూత్రములను విమర్శించువారు ఈ విషయమును జ్ఞాపకముంచుకొనవలయును. శత్రువును మోసపుచ్చి ఓడించుట న్యాయమా అన్న విషయమును అతడు విచారించుటలేదు. శత్రువును, వంచించి వశపరచుకొనుట సర్వసాధారణమని నిరూపించుటయే అతని ఉద్దేశ్యము."

ఉత్తమ లక్ష్యమును పొందుటకు వక్రమార్గాన్నైనా అనుసరించాలని అతని మతం. రాజ్యభద్రతకీ, సుస్థిరతకీ ఘోరవిపత్తు వాటిల్లినప్పుడు, శత్రువును ఎదుర్కొనుటకు డబ్బు అవసరమైతే, అధర్మము, వక్రమూ, దౌర్జన్యయుతమూ ఐన మార్గం ద్వారా సంపాదించినా పరవాలేదని అతడంటాడు. దీనికొక ఉదాహరణ యిచ్చాడు. ఒక గోవును కసాయి వేటకాడొకడు తరుముకొని వచ్చాడు. ఆ ఆవు పారిపోయివచ్చి ఒక పరమ సత్యవ్రతుని ఆశ్రమంలో దాక్కున్నది. వేటకాడు పరుగెత్తుకొనివచ్చి "ఆవు యీ దారిన పోయినదా?" అని అడిగితే, సత్యాన్ని చెప్పి గోవును కసాయికత్తికి ఒప్పగించాలా? లేక అసత్యం పలికి దాన్ని రక్షించాలా? ఆ సమయంలో ఎంతటి సత్యవ్రతుడైనా, అబద్ధమాడైనా ఆవును రక్షించడం ధర్మం, న్యాయం — అంటాడు కౌటిల్యుడు. 100 అబద్ధాలాడైనా ఒక పెళ్ళి చేయమనే సామెత విన్నమాట! ఉత్తమ సాధ్యాలను అయుక్త సాధనాల ద్వారానైనా సాధించవచ్చు. సాధించాలి అని అంటాడు. ఈ ప్రతిపాదన ఆచరణలో చేసి చూపినవాడు, 19 వ శతాబ్దంలో జీవించి, జర్మన్ సామ్రాజ్య వాదానికి పునాదులు వేసిన అనన్యసామాన్య రాజనీతిజ్ఞుడు బిస్మార్క్. అంతకు పూర్వం క్రీ. పూ. 4 వ శతాబ్దంలోనే, మగధలాంటి అతి చిన్న రాజ్యాన్ని తన యుక్తిచే, ప్రజ్ఞచే దిగంత విశ్రాంతమైన మౌర్య సామ్రాజ్యంగా విస్తరింపజేసిన మహోన్నత ప్రతిభాశాలి కౌటిల్యుడు.

మేక్ వెల్లి

సాధ్యాలు సాధనాలను సమర్థిస్తాయి అనే సిద్ధాంతాలను ప్రతిపాదించిన మరో రాజకీయ తత్వవేత్త—ఇటాలియన్ దేశీయుడైన నికోలో మేక్ వెల్లీ. ఇతను "ప్రిన్స్" (Prince) అనే ప్రపంచ ప్రఖ్యాతి గ్రంథం రచించాడు. రాజులు తమ గమ్యాన్ని చేరుటకు, తాము వాంఛించిన లక్ష్యాన్ని సాధించేందుకు ఎలాంటి కుట్రలనైనా చేయవచ్చుననీ, మోసాలు, అసత్యాలు, దుర్మార్గాలనైనా చేపట్టవచ్చుననీ, అతి నగ్నంగా ప్రతిపాదించాడు. ఈ మార్గాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నాటి 16 వ శతాబ్దపు రాజులు, రాజకీయవేత్తలు, మతగురువులు అనుసరిస్తున్నప్పటికీ, వారంతా మేక్ వెల్లీ సిద్ధాంతాలను నోరారా తిట్టి కారాలు మిరియాలు నూరారు. వీరు ఏ మార్గాలనైతే రహస్యంగాను, బహిరంగంగాను, ఆచరణలో పెట్టారో, వాటిని సిద్ధాంతరీత్యా సమర్థించి ప్రచారం చేయడమే మేక్ వెల్లీ చేసిన 'బ్రహ్మాం

డమైన నేరం'. అందుకని నాటి క్రిస్టియన్ నీతి శాస్త్రవేత్తలు, పీఠాధిపతులు, ఆయనమీద ఒక్కుమ్మడిని విరుచుకుపడ్డారు. ఈ విషయాన్ని గూర్చి ప్రొఫెసర్ మాక్స్ యిలాగంటాడు—

"Niccolo Machiavelli is perhaps the most universally reprobated figure in the history of political philosophy; the man whose precepts are universally disavowed in principle, but regularly followed in practice. Yet Machiavelli was a moral man according to the conventions of his time and apparantly also a man of considerable culture and charm."

కౌటిల్యుని కాలంనాటికి భారతదేశంలో ప్రధానంగా ఉత్తరభారతంలో చిన్న చిన్న రాజ్యాలు అసంఖ్యాకంగా వుండేవి. రాజకీయ ఐక్యం కరిమింగిన వెలగపండులా అదృశ్యమైపోయింది. నిరంతరం అంతఃకలహాలతో యీ రాజ్యాలు కుతకుతలాడా కూరుకపోయాయి. రాజకీయమైన ఐక్యం నశించి శాంతిభద్రతలు క్షీణించిన విషమ పరిస్థితులలో కౌటిల్యుడు ఉద్భవించాడు. అలాంటి పరిస్థితుల్లో భారతదేశాన్నంతటినీ ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకు తీసుకువచ్చి తద్వారా ఐక్యభారత నిర్మాణమే కౌటిల్యుని ఏకైకలక్ష్యం. ఈ మహత్తర లక్ష్యసిద్ధికే, ఆయన అర్థశాస్త్రరచన కుపక్రమించాడు.

ఇదే విధమైన అనైక్యం, అంతఃకలహాలు, శాంతిభద్రతలలేమి మేకావెల్లీ జీవించిన ఇటలీలో వుండేవి. అలాంటి విచ్ఛిన్నకర పరిస్థితులనుండి మాతృదేశాన్ని రక్షించి ఏకీభూతమయిన ఇటలీ సంస్థాపన కోసం మేక్‌వెల్లీ తన సుప్రసిద్ధ గ్రంథం రచన చేశాడు.

మానవస్వభావంలో అధికార దాహం అంతర్గర్భితంగా వుందంటాడు కౌటిల్యుడు. ఆ అధికార దాహంలోని కౌటిల్యాన్ని, వంచననీ అమానుషనీ కుట్రనీ ఉన్నది వున్నట్టుగా అతడు పరిశీలించి వివరించాడు. ఇదేపని మేక్‌వెలీ కూడా చేశాడు. కౌటిల్యునికి పూర్వమున్న ధర్మశాస్త్రవేత్తల దృక్పథం ఇందుకు భిన్నమైంది. అది ఆదర్శాల పుట్ట; ఆచరణకి ఎంతో దూరం. ధర్మశాస్త్రవేత్త రాజ్యాదర్శాలను, వాటిని సాధించేందుకు వినియోగించదగినవి మార్గాలను వివరించాడు. కౌటిల్యుడు దీనితో భేదించాడు. ఆదర్శప్రాయము రాజ్యాన్ని (Republic) "స్వర్గలోకంలో" సృష్టించిన ప్లేటోతో ఆయన శిష్యుడు అరిస్టాటిల్ ఎలా అంగీకరించలేదో, అలాగే పూర్వ ధర్మశాస్త్రవేత్తల జనప్రాయమైన ఆదర్శయుతమైన, కేవల ధర్మబద్ధమైన సూత్రాలనుండి కౌటిల్యుడు భేదించి, ఆచరణయోగ్యము మారుతున్న సమాజ పరిస్థితుల కనుగుణము అయిన మార్గాన పయనించినాడు. అర్థశాస్త్రగమ్యాన్ని మరో మార్గం వేపు మళ్లించి, ధర్మశాస్త్రానికి తలవంచని స్వతంత్రశాస్త్రంగా నిర్మించాడు. ఇదే ఆయన శేముషికి ఎదురులేని తార్కాణం. అందువలనే కౌటిల్యుడు ప్రాచీన హైందవ అర్థశాస్త్ర చరిత్రలో అజరామరుడయ్యాడు. నాటి పండితలోకంలో అర్థశాస్త్రాధ్యయనాన్ని పురికొల్పి మరణావస్థంగావున్న శాస్త్రానికి తిరిగి జీవంపోశాడు. అందుకనే కామందకుడు తన "నీతిసారం"లో, కౌటిల్యుణ్ణి అవతార పురుషునిగా ప్రశంసించాడు.

కౌటిలీయం - అర్థశాస్త్ర నిర్వచనం

కౌటిల్యుడు అర్థశాస్త్రాన్ని యిలా నిర్వచించాడు: "అర్థం" అంటే ప్రజలతో కూడిన ఒక ప్రత్యేక భూభాగం (జనపదం). ప్రజలతో కూడిన ఒక ప్రత్యేక భూభాగాన్ని సంపాదించి, దాన్ని తరతరాలా అభివృద్ధిచేయుటకు అనువైన వివిధ మార్గాలను పరిశీలించు శాస్త్రమే—అర్థశాస్త్రం. (That Science which deals with the means of acquisition and growth of territory).

"మనుష్యాణాం వృత్తిరర్థః
మనుష్యవతీ భూమిరిత్యర్థః
తస్యాః పృథివ్యా లాభపాలనోపాయః శాస్త్రం
అర్థశాస్త్రం ఇతి" (అర్థశాస్త్రం—పేజీ 426)

మానవులకు బ్రతికేందుకు మూలాధారం అర్థం. అర్థం అంటే ప్రజలతో కూడిన భూభాగం. కాబట్టి ఆభూభాగాన్ని ఎలా సంపాదించాలో, ఎలా భద్రపరచాలో, వివరించు శాస్త్రమే—అర్థశాస్త్రం.

రాజదండాన్ని నిరంతరం సమ్యక్తతో ఉపయోగించడమే "దండనీతి" అని నిర్వచించాడు కౌటిల్యుడు. ఈ నీతిలో నాలుగు ప్రధాన విషయాలు గర్భీకృతమై వున్నాయి.

1. ఏదైతే లభ్యంకాలేదో దాన్ని సంపాదించడం; (అలబ్ధ లాభార్థ.)

2. ఏదైతే లబ్ధమైనదో దాన్ని భద్రపరచడం; (లబ్ధ పరిరక్షణం)

3. అలా భద్రపరచబడిన దానిని వృద్ధిచేయడం; (రక్షిత వివర్ధనం)

4 అలా వృద్ధిచేయబడిన దాన్ని తగినవారికి—అర్హులకు—పంచిపెట్టడం. (వృద్ధస్య తీర్థేషు ప్రతిపాదనం)

కౌటిల్యుడే కాదు యిలాంటి నిర్వచనం చేసింది; మనువుకూడా తన ధర్మశాస్త్రంలో పై విధంగా చెప్పాడు. భూభాగాన్ని (దండం) సైన్యం సహాయంతో సంపాదించాలని చెప్పాడు. భూభాగం (సంపాదన) తో సంబంధించినదే దండనీతి లేక అర్థశాస్త్రం అని మనువు నిర్వచనం.

రాజ్య దృక్పథం : దాని లక్షణాలు

ప్రాచీన హైందవ అర్థశాస్త్రజ్ఞులు రాజ్యానికి ఏడు లక్షణాలు, లేక ప్రకృతులు వుంటాయని చెప్పారు. పాశ్చాత్య రాజనీతి శాస్త్రజ్ఞులు, రాజ్యానికి నాలుగు లక్షణాలుంటాయని చెప్పారు—1. జనులు 2. భూభాగం 3. ప్రభుత్వం 4. సార్వభౌమాధికారం. ఈ నాల్గవ లక్షణాన్ని బహిర్గత, అంతర్గత సార్వభౌమాధికారాలని రెండుగా విభజించారు.

మన శాస్త్రజ్ఞులు రాజ్యానికి ఏడు ప్రకృతులుంటాయని చెప్పారు. ప్రకృతులంటే రాజ్యంయొక్క సహజభాగాలనీ, సహజమైన అంగాలనీ అర్థం చేసుకోవాలి. రాజ్యం అంటే రాజు పాలించే ప్రత్యేక భూభాగాన్ని సూచించదు. రాజు పాలించే భూభాగమే "రాజ్యం" ఐతే, ఆ రాజ్యానికి (State) వున్న ఏడు ప్రకృతులలో "రాజు" ఒక అంగంగా ఎందుకు పరిగణింపబడాలి? రాజు పాలించే భూభాగమే రాజ్యం ఐతే, ఆ భూభాగానికి "జనపదము" అనే పేరుపెట్టి దానిని ఒక స్వతంత్ర ప్రకృతిగా ఎందుకు మన రాజనీతిశాస్త్రవేత్తలు పరిగణించారు? కాబట్టి రాజు పాలించు భూభాగం రాజ్యం కాదు. ఆ భూభాగానికి జనపదము అనే పేరు ప్రత్యేకంగావుంది. రాజ్యం అంటే ప్రభుత్వంకూడా కాదు. రాజ్యమునకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను ఆచరణలో పెట్టు యంత్రము లేక కార్యనిర్వాహకవర్గమే ప్రభుత్వం. పోతే దుర్గం (Fort) కోశం (Treasury) యీ రెండూకూడ రాజ్యంయొక్క ప్రకృతులనియే మన వారి దృక్పథం. కాబట్టి ప్రభుత్వంగానీ, రాజు పాలించే ప్రత్యేక భూభాగంగానీ రాజ్యం కాదు. స్వామి, అమాత్యులు, జనపదం, దుర్గం, కోశం, దండం, మిత్రం—యీ యేడు అంగాలు కలిస్తే రాజ్యం ఔతుందని మన శాస్త్రజ్ఞుల దృక్పథం.

కౌటిల్యుడు తన "అర్థశాస్త్రం"లోనూ కామందకుడు "నీతిసారం" లోనూ, యీ యేడు ప్రకృతులనూ అతివిస్తరంగా వివరించారు. ప్రస్తుతం పై ఏడు ప్రకృతులనుగూర్చి కౌటిల్యుడు చెప్పినది పరిశీలిద్దాం.

1. స్వామి : స్వామి (రాజు) రాజ్యంయొక్క అత్యంత ప్రధానమైన లక్షణం లేక భాగమని కౌటిల్యుడంటాడు. స్వామి అంటే రాజు లేక సార్వభౌమాధికారి. ఈ సార్వభౌమాధికారం ఒకనియందు గానీ లేక పెక్కుమందిలో గానీ వుండవచ్చును. ఈ స్వామికి ప్రధానంగా వుండవలసిన లక్షణాలు ఇవి:

ప్రజల్ని ఆకర్షించి వారు తన నాయకత్వాన్ని అనుసరించునట్లు చేసుకోగలగాలి. (అభిగామిక స్వభావం.)

1. ప్రజల్ని అర్థంచేసుకోగలగాలి (ప్రజ్ఞా.)

2. శక్తివంతుడై వుండాలి (ఉత్సాహ.)

3. ఆత్మసంపద కలిగినవాడై వుండాలి (ఆత్మసంపద)

4. శక్యసామంతుడై వుండాలి (తనచుట్టూవుండే వ్యక్తులను అదుపులో పెట్టగలిగినవాడై వుండాలి)

5. క్షుద్రులుగాని మంత్రి మండలిని కలిగివుండాలి.

6. యుద్ధంచేయడానికీ సంధిచేసికోవడానికీ తగిన సందర్భాన్ని గుర్తించగలిగిన చాకచక్యం వుండాలి.

పైనచెప్పిన లక్షణాలను నిశితంగా పరిశీలిస్తే, స్వామి అంటే సామంతరాజు కాదనీ, అంతర్గత బహిర్గత సార్వభౌమాధికారాల్ని చలాయిస్తూ ఏ విదేశ రాజ్యాధికారానికి లొంగని సార్వభౌమాధికారి అని బోధపడుతుంది.

2. అమాత్యులు:— సాధారణంగా అమాత్యుడంటే రాజమంత్రి అని అర్థం. కాని కౌటిలీయంలోని మొదటి అధ్యాయాలను జాగ్రత్తగా పరిశీలిస్తే, అమాత్య పదానికి అర్థం, రాజమంత్రి కాదనీ, వివిధమైన రాజ్యోన్నతాధికారి ఐనా కావచ్చునేది స్పష్టంగా బోధపడుతుంది. అమాత్యుడు జనపదానికి చెందినవాడై వుండాలనీ, రాజ్యంపై అధికతర భక్తిశ్రద్ధలను కలిగివుండాలనీ చెప్పాడు.

3. జనపదం:— ఈ పదాన్ని జనం—పదము అని రెండుభాగాలుగా విభజించాలి. దీనికి సామాన్యార్థం, పల్లెపట్టు లేక గ్రామము. కాని అర్థశాస్త్ర పరిభాషలో దీనికొక ప్రత్యేకమైన అర్థంవుంది. పాశ్చాత్యరాజనీతి శాస్త్రంలో జనులు, భూభాగంఅనేది స్టేట్ యొక్క

రెండులక్షణాలు. కాని మన అర్థశాస్త్రజ్ఞులు ఈ రెంటినీ ఒకేపదంలో యిమిడ్చి జనపదం అనే పేరును వాడుకలోకి తెచ్చారు. జనపదాన్ని కౌటిల్యుడు అత్యంత ప్రతిభావంతంగా నిర్వచించాడు. మొదటి "పదము" అనేభాగాన్ని (భూభాగం) నిర్వచించి దానికి ఉండవలసిన ప్రధానలక్షణాలు వివరించాడు. పిదప "జన" అనుదాన్ని నిర్వచించి ఒకప్రత్యేక భూభాగమందలి జనులకుండవలసిన లక్షణాలు వివరించాడు. భూభాగమున్నచోటనే జనులు నివసిస్తారు, జనులు భూభాగమందే నివసిస్తారు కనుక ఈ రెంటినీ (జన-పద) ఒకటిగానే పరిగణించి, 'జనపదం' అను పేరును వాడుకలోకి తెచ్చారు. ప్రాచీన హైందవ రాజనీతి శాస్త్రవేత్తల ప్రతిభ కిది తార్కాణం. పాశ్చాత్యులదృష్టిలో భూభాగము జనులూ వేర్వేరు లక్షణాలతో ఉన్నాయి. ఇది యాంత్రిక దృక్పథం. కారణం? జనులు భూభాగమున్న చోటనే నివాసయోగ్యమగు ప్రదేశాలు సృష్టించుకోగలరు. రొచ్చు ప్రాంతాలు పర్వత ప్రదేశాలు, పెద్దపులులవంటి మృగాలుండే భీకరారణ్యాలు లేని ప్రదేశం ఉత్తమ జనపదమని కౌటిల్యుడన్నాడు. సస్యశ్యామలమై ఫలవంతమైన ఉత్తమ క్షేత్రములూ, ఏనుగు జేకులపలో నిండిన అరణ్యాలు జనపదంలో ఉండాలి. ఇంతట భూభాగం లక్షణాలను గూర్చి చర్చ.

ఇక జనులను గూర్చి ఏం చెప్పాడో పరిశీలిద్దాం. జనులు శత్రుద్వేషం కలవారై వుండాలని శక్య సామంతులై వుండాలనీ అంటాడు. అంతేగాదు, కర్మశీలురైన కర్షకులతో నిండి వుండాలి. జనులు రాజు యెడల భక్తి ప్రపత్తులలో మెలుగుతూ శుచిగా వుండాలి. 1 శత్రుద్వేషం 2 శక్య సామంతత 3. కర్మశీలకర్షక 4 భక్తి శుచిత్వం—యీ నాలుగు లక్షణా గలిగిన వారై వుండాలి.

1 ప్రజలు శత్రువులను ద్వేషించువారై దేశభక్తులై రాజ్య స్వాతంత్ర్యాన్ని పరిరక్షించ నిరంతర దీక్షా కంకణులై వుండాలి.

2 పరిసర రాజ్యాలను యుద్ధరంగమందు ఎదిర్చ శక్తిస్తోమతులు గలవారై వుండాలి.

3 రాత్రింబవళ్ళు కష్టించి భూమినున్న దేశాన్ని భాగ్యవంతం చేయగలిగిన కర్మశీలతగలిగిన కర్షకులతో నిండి వుండాలి.

4 రాజ్యం (state) యెడల భక్తి ప్రకటిస్తూ శుచిగల హృదయాలు కలిగివుండాలి. (భక్తి శుచి మనుష్య.)

4 దుర్గం: రాజ్యమందలి నాలుగు దిక్కులలోను యుద్ధావసరాలకొరకు శత్రు విధ్వంసకారకమూ దుర్గాలు నిర్మించాలి. ఏ రాజు ప్రకృతి సిద్ధమైన దుర్గాన్ని నిర్మిస్తాడో ఆతడు శత్రురాజులను సునాయాసంగా నిర్జించగలడు. జలదుర్గం గిరిదుర్గం ఎడారి దుర్గం అటవీదుర్గం వంటి నాలుగురకాల దుర్గాలనునిర్మించాలని కౌటిల్యుడు చెప్పాడు.

5 కోశం: రాజ్యకోశం వెండి బంగారాలతో నిండి ఉండాలి. బంగారు వెండి నాణాలతో నూ, వజ్రవైడూర్య మరకతగోమేధిక పుష్యరాగాది అమూల్య రత్నసంచయంతోను కోశాగారం నిరంతరం ఘలు ఘలు మంటూవుండాలి. ఈవిధంగా వుండినప్పుడే విపరీత విపత్కర పరిస్థితులనుండి రాజ్యం రక్షింపబడుతుంది. ఈ అమూల్య సంపద నంతటినీ రాజుగాని అతని తండ్రి తాతలుగాని ధర్మబద్ధమైన మార్గాల ద్వారా సంపాదించాలంటాడు. రాజ్య సంరక్షణ, సామ్రాజ్య విస్తరణ, కరువుకాటకాల నిర్మూలన, అంతః కలహపరిహరణ, వర్తక వాణిజ్యాల అభివృద్ధి వంటి సర్వకార్యవ్యవహారాలు, రాజ్యకోశంమీదనే ప్రధానంగా ఆధారపడి వుంటాయంటాడు. కాబట్టి కోశాభివృద్ధికి రాజులు నిరంతర జాగరూకులై వుండాలని చెప్పాడు. "ధనమూల మిదమ్ జగత్" అనే పరమ సత్యాన్ని గ్రహించాడు కౌటిల్యుడు. ప్రభుత్వ యాజమాన్యాన పారిశ్రామిక శాఖలను (ప్రచార సమృద్ధి) నడిపినపుడు, సస్యసంపద సమృద్ధిగా వున్నపుడు, వర్తక వాణిజ్యాలు ఉచ్చదశలో వున్నపుడు, రాజ్యకోశం ధన కనక వస్తువాహనాలతో సమృద్ధిగా ఉండినపుడు మాత్రమే శత్రువులదాడిని రాజు ఎదుర్కొని జయింపగలడు. వర్తకాభివృద్ధిపై కోశం, కోశాభివృద్ధిపై రాజ్య సుస్థిరతను కాపాడు సైన్యం, ఆధారపడి వుంటాయని చెప్పాడు.

కోశం ఖాళీగావున్నపుడు శత్రుదండయాత్ర జరిగితే అధర్మమార్గాలద్వారానైనా రాజు ద్రవ్యాన్ని సేకరించాలి. విపత్కరసమయాలలో ధర్మం కార్యాచరణకు అడ్డురాగూడదంటాడు. అందుకనే కౌటిల్యుడు ధర్మశాస్త్ర నిబంధనల సంకెళ్ళనుండి అర్థశాస్త్ర సిద్ధాంతాలను బైటికిలాగి, ఆ శాస్త్రాన్ని సర్వసమగ్రమగు స్వతంత్ర శాస్త్రంగా సృష్టించగలిగాడు.

ఫలవంతాలైన భూములపై అధికంగా పన్ను విధించడం, సంపన్నులైన వణిక్ ప్రముఖులు అమ్మే సరకులపై విపరీతంగా ప్రభుత్వ సుంకాన్ని వసూలు చెయ్యడం, రాజుపేరట ఋణాల వసూలుచేయడం, (Forced loans and Benevolences) ప్రజల మూఢవిశ్వాసాలను, మతనమ్మకాలను, ఆసరాగా తీసి

కాని రాజ్యప్రయోజనాలకోసం డబ్బుదారుణంగా గుంజడం, ద్రోహులు, నేరస్థులైన వ్యక్తుల భూములు దాక్షిణ్యరహితంగా స్వాధీనపరచుకోవడంవంటి వివిధ మార్గాలద్వారా ప్రభుత్వకోశాన్ని అవసరసమయాల్లో తప్పక పూరించాలని గట్టిగా చెప్పాడు. చాణక్యుడు సమకాలీన ధర్మశాస్త్రాల అనుసరణకంటే, రాజ్య భద్రతయే ప్రధానలక్ష్యమనీ, దానికోరకు ధర్మోల్లంఘనం జరిగినా జరగవచ్చనీ, దైనందిన పరిపాలన నిర్వహణలో అలాంటి ఉల్లంఘనం అనివార్యమనీ అంటాడు.

6. దండం లేక బలం (సైన్యం) - రాజు సైన్యం సహాయంతోనే శత్రువును ఎదురుదెబ్బతీయగలడు; రాజ్యమందు శాంతిభద్రతలు సంస్థాపించగలడు. కౌటిల్యుడు ఆరువిధాలైన సైనికులను, వర్ణించాడు.

1. మౌల; (సాంప్రదాయసిద్ధమైన రాజ సైన్యం)

2. భృతక (కిరాయికి వచ్చే సైనికులు.)

3. శ్రేణి (యుద్ధాలు చేసే వర్గాల సైనికులు)

4 మిత్రుడైన రాజుకు చెందిన సైన్యం.

5. శత్రురాజుకు చెందిన సైన్యం.

6 అటవీబలం (చెంచుకోయలు, నిషాదులు యిత్యాది జాతులకు చెందిన సైన్యం.)

కౌటిల్యుని గురువర్యుడు మరో వరుసక్రమంలో పై వరుసకు భిన్నంగా చెప్పాడు. ఆ వరుసక్రమం యిది—1. బ్రాహ్మణ సైనికులు 2. క్షత్రియ సైనికులు 3 వైశ్య సైనికులు 4. శూద్ర సైనికులు బ్రాహ్మణ సైనికులు మిగతా సైనికులకంటే ఎందుకు అధికులంటే—వారియొక్క కాంతి (lustre) వల్లనని కౌటిల్యుని గురువు చెప్పాడు. దీనితో కౌటిల్యుడు సుతరామూ వొప్పుకోలేదు. తన అనంగీకారానికి ఈ క్రింది కారణాలు చూపించాడు. బ్రాహ్మణ సైన్యానికి సాష్టాంగదండప్రణామం చేయుటద్వారా, శత్రురాజు బ్రాహ్మణ సైనికుల్ని సునాయాసంగా లొంగదీయవచ్చునని కౌటిల్యుడు చెప్పాడు. యుద్ధకౌశలంలో నైపుణ్యాన్ని సంపాయించిన క్షత్రియవీరులు, బ్రాహ్మణ సైనికులకంటె నిస్సందేహంగా అధికులని చెప్పాడు. అదేవిధంగానే వైశ్యశూద్ర సైనికులు కూడ బ్రాహ్మణ సైనికులకంటె అధికులంటాడు.

తండ్రి తాతల దగ్గరనుండీ సైనిక వృత్తినే జీవనాధారంగా స్వీకరించి ఎలాంటి విపత్కర దీర్ఘదండయాత్రలనైనా, సహించి భరించి, కత్తిబట్టి నవ రంగంలో శత్రువును ముక్కముక్కలుగా నరుకగల క్షత్రియ సైన్యమే ఆదర్శప్రాయమైన సైన్యమని కౌటిల్యుడు సిద్ధాంతీకరించాడు. పూర్వశాస్త్రవేత్తలు సైనికులను వర్గీకరించిన క్రమంవల్ల రాజ్యసుస్థిరతకు భంగం వాటిల్లుతుందని కౌటిల్యుడు అన్నాడు.

7. మిత్ర:—మిత్రులలో రెండు రకాలు.— 1. సహజమిత్రుడు, 2. కృత్రిమమిత్రుడు. రెండవ వానికంటె మొదటివాడే సర్వవిధాలా శ్రేయస్సును కోరుతాడని చెప్పాడు.

మొత్తంగా, పైన చెప్పిన ఏడుభాగాలు లేక ప్రకృతులు ప్రాచీన హైందవ రాజ్యాంగ యంత్రానికి సంబంధించిన ఏడు అంగాలని ప్రాచీనార్థశాస్త్రవేత్తల దృక్పథం.

కౌటిలీయం—సామ్రాజ్యపరిపాలన

క్రీ. పూ. 322 లో మౌర్యసామ్రాజ్యం స్థాపింపబడింది. మౌర్యసామ్రాజ్య స్థాపనకు, కౌటిలీయార్థశాస్త్రం ఆవిర్భావానికి అవినాభావసంబంధం వుంది. కౌటిలీయం సహాయంలేని మౌర్య సామ్రాజ్యం పునాదిలేని పేకమేడ. మౌర్య సామ్రాజ్యము లేని కౌటిలీయం నిర్జీవశాస్త్ర గ్రంథం. మౌర్యసామ్రాజ్యం బొంది, కౌటిలీయం ఊపిరి.

“సహాయ సాధ్యమ్ రాజత్వమ్, చక్రమేకమ్ న వర్తతే”—రాజ్య పరిపాలన రథ చక్రాలవంటిది. ఒక చక్రంతో రథం యెన్నడూ నడవదు. కాబట్టి రాజత్వం సహాయ సాధ్యం. సామ్రాజ్యాన్ని పరిపాలించేటప్పుడు చక్రవర్తి ఒక్కడే సర్వకార్యాలనీ నిర్వహించలేడు. అందుచేత రాజు అమాత్యుల సహాయంతో రాజ్యపాలన చేయాలి. కౌటిల్యుని నిర్వచనం ప్రకారం అమాత్యుడంటే రాజమంత్రి కాదు. ప్రతి రాజోద్యోగీ అమాత్యుడే (సివిల్ సర్వెంట్). ప్రతిభావంతుడూ, రాజకార్యదక్షుడూ, రాజభక్తియుతుడూ అయినవాడే అమాత్యపదవికి అర్హుడు. అమాత్యులందరిలోను మంత్రులు ముఖ్యులు. రాజు నలుగురు మంత్రులతో కలిసి ఆలోచనచేసి పాలించాలి. మంత్రులే కాక 'మంత్రి పరిషత్తు' అనే మరో సంస్థకూడా వుండాలి. కంటికి రెప్పలా రాజును యీ పరిషత్తు కాపాడుతుంది. మంత్రులు మంత్రిపరిషత్సభ్యులూ, బహుశాస్త్రజ్ఞానానుభవంలో నిష్ణాతులై వుండాలని కౌటిల్యుడు కోరాడు. యుద్ధానికి సంబంధించిన కార్యాలను చక్కబెట్టడం, యుద్ధావసరాలకు కావలసిన సదుపాయాలు కల్పించడం, మంత్రి పరిషత్తు ప్రధాన బాధ్యతలు. దీని సభ్యులు తరచు దేశాటన చేస్తూ పరగ

కాల్లోని ప్రభుత్వోద్యోగులు తమతమ పనులు చక్కగా నిర్వహిస్తున్నారో లేదో పరిశీలించాలి. తాము తెలిసికొన్న విషయాలు రాజుకు విన్నవించడం వంటివి వీరి బాధ్యతలు. రాజు మంత్రి పరిషత్తును అత్యవసర సమయాలలో నే సమావేశపరిచి వారితో సంప్రదించాలి. వారిలో ఎక్కువమంది ఏది కార్యసిద్ధిదాయకమని సూచిస్తారో దాన్నే రాజు ఆదరించాలి. మంత్రులలో ముఖ్యుడు ప్రధానామాత్యుడు. ఇతడు రాజుకు కుడిభుజం. రాజ్యపాలనలో రాజు తర్వాత రాజంతటివాడు. రాజ్యాన్ని అపహరించగలంతటి అవకాశం అతనికుండేది ప్రాచీన హిందూ రాజ్యానికి యుద్ధమూ, అంతరంగ విప్లవమూ, మహా అపాయకరమైనవి. యుద్ధంవస్తే రాజు వునికికే భంగం వాటిల్లుతుంది. అందుచేత, యుద్ధం, అంతర్గత విప్లవంలాంటి విపత్కర పరిస్థితులలో రాజు తానుచేసిన దోషాలేవయినా వుంటే ఒప్పుకొని ప్రధానమంత్రిని శాంతింప చేయాలి. కాకపోతే పదవిచ్యుతి ఖాయం. నాటి రాజరిక వ్యవస్థలో ప్రధానామాత్య పదవి ప్రాముఖ్యాన్ని శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగారు యిలా వివరించారు— "అమాత్యపదవి యింతటి గౌరవముతో అధికారముతో ను, కూడుకొనిన దగుటచేతనే, ప్రభువునుండి యితనిని వేరుపరచినయెడల తమకు తప్పక జయము లభించునని శత్రువులు నమ్ముచుండువారు. రాజ్యమండలి గూఢచారు లందరిపై అమాత్యునికి నిరంకుశాధికార ముండెడిది." అందుకే కౌటిల్యుడు పురోహితుడు, ప్రధానమంత్రి ఎంతటి మహాపరాధాన్ని చేసినా, వారికి మరణదండన విధించరాదని చెప్పాడు.

రాజకార్య నిర్వహణ

కౌటిల్యుని కాలంలో రాజకార్య నిర్వాహకులు మూడుభాగాలుగా విభజింప బడ్డారు. రాజు సమక్షమందుండి రాజ్యమంతటిపై కార్య నిర్వహణాధికారం వహించే కేంద్ర కార్య నిర్వాహకోద్యోగులు కొందరు. వారి పేర్లివి—1. మంత్రి, 2. పురోహితుడు, 3. సేనాపతి, 4. యువరాజు, 5. దౌవారికుడు, 6. అంతర్వంశికుడు, 7. ప్రశాస్త్రి, 8. సమాహర్త, 9. సన్నిధాత, 10. ప్రదేష్ట, 11. నాయకుడు, 12. పౌరవ్యావహారికుడు, 13. కార్మాంతికుడు, 14. మంత్రి పరిషదధ్యక్షుడు, 15. దండపాలుడు, 16. దుర్గపాలుడు, 17. అంతపాలుడు, 18. ఆటవికుడు. ఈ 18 మంది ఉద్యోగులకు 18 తీర్థాలని పేరు. ప్రధానకార్యాన్ని దేన్నైనా ప్రారంభించాలంటే ధనం లేకపోతే అడుగు ముందుకుపడదు. అందుచేత ధన సేకరణతో, కూడుకొన్న సమాహర్త ఉద్యోగం అధికతర బాధ్యతతో కూడుకొన్నది. రాజ్యానికి ఆదాయాన్నిచ్చే ప్రధాన అంగాలు—దుర్గ, రాష్ట్ర, ఖని, సేతు, వన, వ్రజ, వణిక్పథాలు. వీటిని మంచిస్థితిలో ఉంచి బాగా వృద్ధిచేయాలి. విపత్తులేవైనా ముంచుకొస్తే, వారించేందుకు కోశాన్ని పుష్కలంగా నింపుతూండడం సమాహర్త విధి. ఈ ఏడు రకాలైన ఆదాయాల్ని వసూలుచేయడానికి ఐదు లేక పది గ్రామాలపై గోపుని నియమించాలి. ఇతడు గ్రామంలోని పాడు భూముల్ని, బంజరు భూముల్ని, సర్వే చేయించి వాటికి సంబంధించిన దాన విక్రయాదుల్ని, రిజిష్టర్ చేయడం, నాలుగువర్ణాలకు చెందిన ప్రజల జననమరణ లెక్కలను వ్రాయడం చేయాలి. గోపునిపై స్థానికుడనే మండలాధికారీ, అతనిపై ప్రదేష్ట అనే రాష్ట్రాధికారీ, నియమింపబడేవారు. వీరందరి సహాయంతో సమాహర్త అప్రమత్తుడై జనపదాన్ని పరిశీలిస్తూ విషయసేకరణకు గూఢచారులను, జనపదమంతా తిప్పుతూ విషయాలను గ్రహించేవాడు. యుద్ధం, దుర్భిక్షం యిత్యాది ఉపద్రవాలవల్ల కోశం ఖాళీఐతే, దేవుని ఉత్సవాలు, మతకార్యకలాపాల వంటి సత్కార్యాల కోసం ధనం కావాలని మిషపెట్టి పౌరుల్ని యాచించాలి. మొదట కొంతమంది ధనవంతుల్ని ప్రోత్సహించి అధిక మొత్తాల్ని రాబట్టాలి. ఈ మొత్తాలు చూచి, పౌరజానపదులు తమ తమ ముడుపుల్ని ముట్టచెప్పేట్లు చేయాలి. యాచింపబడకుండా తమంతటతామే రాజుకు డబ్బు యిచ్చేవారికి, వారివారి మొత్తాలను దృష్టిలో పెట్టుకొని స్థాన, ఛత్ర, వేష్టన, విభూషణవంటి బిరుదులు యివ్వాలి. కోశం ఖాళీగావుంటే దేవ ద్రవ్యాన్ని, ప్రేతద్రవ్యాన్ని కూడా సంగ్రహించవచ్చునని కౌటిల్యుడు ఖండితంగా చెప్పాడు. సంకట సమయాల్లో మతవిశ్వాసాలు, మూఢాచారాలు, ప్రచారంచేసి మోసంచేసి ఐనా, బెదిరించైనా, ప్రజలనుండి ధనాన్ని రాబట్టాలి, అని ఖండితంగా, నిర్భీతిగా చెప్పాడు. కౌటిల్యుడు తన శాస్త్రంలో ప్రతిపాదించిన సూత్రాలకు, కేవల ధర్మసూత్రాలకు సమన్వయం కుదరదని వేరె చెప్పనక్కరలేదు. లక్ష్యం ఎంత పవిత్రమైనదో, దాన్ని సాధించేందుకు అవలంబించే మార్గాలు కూడా అంత పరిశుద్ధంగా వుండాలని - చాలా మంది చెప్పవచ్చు. ఐతే దురదృష్టవశాత్తూ కౌటిలీయంలో ధర్మసూత్రాలకి, మంచిచెడ్డలకీ తావులేదు. అతడు సూచించిన కూటయుద్ధాలు. భేదోపాయాలు, హింసాకృత్యాలు, మోసం, కుటిలత్వం, ధర్మశాస్త్ర వేత్తలకీ, నీతిశాస్త్ర పారంగతులకీ నచ్చకపోవచ్చు. ఆదర్శానికీ ఆచరణకీ ఎంతో దూరంవుందని గుర్తించిన కౌటిల్యుడు సర్వకుటిల

దుకు అనువైన మార్గాన్ని ప్రవేశపెట్టడానికి కౌటిల్యుడే విస్పష్టంగా బాధ్యుడు. అంతేగాక స్వయంగా రాజనీతిని, రాజకార్య నిర్వహణను నిర్వహించాడు. కామందకుడు, తదితరులు పండితులు మాత్రమేగాని ఇలాంటి వ్యవహారానుభవం కలవారు కారు.

దండప్రయోగంలో కౌటిల్యుడు మధ్యే మార్గాన్ని అవలంబించాడు. ఉద్వేజనీయమైన తీవ్ర దండంగానీ, పరిభవకారియైన మృదుదండంగానీ కూడ దనీ, యథార్థ దండమే దండమనీ చెప్పాడు. దండం ప్రజలకు ధర్మార్థకామము లిస్తుందని చెప్పాడు. ప్రభుత్వానికి దండమూ, దండాధికారమూ ప్రధాన లక్షణమని చెప్పాడు. దండం లేకపోతే మాత్స్య న్యాయం ఉద్భవించి బలవంతుడు దుర్బలుణ్ణి నాశనం చేస్తాడు. దండధరునిచే (రాజుచే) రక్షింపబడి బలహీనుడు భద్రత పొందుతున్నాడు. చతుర్వర్ణ చతురాశ్రమాలు గలిగిన లోకం రాజదండంచే పరిపాలింపబడి స్వధర్మాన్ని ఆచరిస్తూ తమ తమ మార్గాలలో ప్రవర్తిస్తూ ఉంటుంది.

కౌటిల్యుడు ప్రవేశపెట్టదలచిన రాచరిక వ్యవస్థ నిరంకుశమైనదనే విషయం సర్వులూ అంగీకరించినదే. "కార్య నిర్వహణలో మాత్రము ఆ కాలపు రాజులు నిరంకుశులై యుండిరి. ఉద్యోగస్థులు రాజాజ్ఞ బద్ధులు గాని ప్రజాభిప్రాయము ననుసరించినవారు కారు. రాజశాసనములు శాస్త్ర విరుద్ధము లవునా కావా యని తీర్మానించు పండితులు రాజునకు నౌకరులేగాని, స్వతంత్రాధికారులు కారు. కావున ప్రజలను పీడించి అక్రమముగా కార్యము లొనర్చుటకా కాలపు రాజులకు చాల యవకాశ ముండెను." (ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్య.)

ఇలాంటి నిరంకుశ రాచరికం ప్రతిపాదించినా, అరాచకత్వంనుండీ, అవ్యవస్థనుండీ, విదేశ దండయాత్రలనుండీ ప్రజల్ని రక్షించి శాంతిభద్రతలు నిలకొల్పేందుకు అవసరమైన కట్టుదిట్టాలెన్నో కౌటిల్యుడు ప్రవేశపెట్టాడు. ఆయన కాలంనాటి రాజకీయ సాంఘిక పరిస్థితుల స్వభావాన్ని మనం అర్థంచేసుకొంటే నాటి పరిస్థితులలో ప్రజాస్వామ్య వ్యవస్థ అనేది ఊహించరాని విషయమనీ, నిరంకుశవ్యవస్థే నాటి కాలపు సమస్యలకు పరిష్కారమార్గ మనేది సువిదితం. ఆ రీత్యా కౌటిల్యుడు ప్రశంసాపాత్రుడేగాని విమర్శింప తగినవాడు కాడు. ఎంతటి రాజకీయ నిరంకుశ వ్యవస్థ ప్రవేశపెట్టినా, ప్రజోపయోగ కార్యాలు రాజు అతి శ్రద్ధతో చేయించవలెనని ఖండితంగా చెప్పాడు. మౌర్యుల కాలంనాటి రాజ్యాంగ విధానాన్నీ, వివిధ రంగాలలో పనిచేసే అధ్యక్షుల కార్యవిధులను మనం పరిశీలించితే, కౌటిలీయం ప్రజాక్షేమంకొరకు ఎలా విధి విధానాలను నిర్వచించిందో, మనకు సులభంగా గ్రాహ్యమౌతుంది. కౌటిలీయం అర్థశాస్త్రంమాత్రమే కాదు. నాటి రాజకీయ వ్యవస్థలేగాక, సాంఘిక ధార్మిక పరిస్థితులను సయితం సూక్ష్మాతి సూక్ష్మమైన వివరాలతో సహా భద్రపరచిన మహోన్నత భాండాగారం. ఇళ్ళ తలుపులకు పెట్టవలసిన యినుపగడియలు, యింటి వెనకాలవుండే "అవస్కారం" (పెంటపోగు) దగ్గరనుండి మహామహీమండల పరిపాలనకు సంబంధించిన వివిధ విషయాలు సమగ్రంగా అత్యంత ప్రతిభావంతంగా కౌటిల్యుడు వివరించాడు.

కౌటిల్యుడు తన పూర్వులైన అర్థశాస్త్రవేత్తల వాదనలను కొన్నిటిని సమర్థించి, కొన్నిటిని ఖండించాడు. ఈ వాద ప్రతివాదనలను పరీక్షిస్తే, అతనిబుద్ధి ధారాళమైందనీ, విషయ వివరణంలో స్పష్టత కోరుతుందనీ, మనం అర్థం చేసుకోవచ్చును. అతడు "అతి సర్వత్ర వర్జయేత్," అనే సూక్తిని ఎల్లప్పుడు పాటించాడనీ, అందుచేతనే దండము నాతితీవ్రము నాతిమృదువుగా వుండాలనే మధ్యమార్గాన్ని ప్రతిపాదించాడనీ, మనం గ్రహించవచ్చును. యుద్ధాలను సాధించుటలో వ్యవహారకౌశల్యమే ప్రధానాంశంగా యెంచాడనేది స్పష్టం. క్రియాస్వరూపాన్ని బట్టి దోషాన్ని నిర్ణయించకూడదు. ఆ కార్యాన్ని చేయుటలోని ఉద్దేశాన్ని బట్టి దోషారోపణ జరగాలి. నేర స్వరూపాన్ని బట్టిగాక, నేరం చేయుటంలోని వుద్దేశాన్ని బట్టి శిక్షించాలి అని అంటాడు. సాధనాలు ఎలాంటివైనా సాధ్యాలు (Ends) ఉత్తమాదర్శాలను కలిగివుండాలి. మహోన్నతాశయాలు సాధించేందుకు వుపయోగించే సాధనం దుర్మార్గమైనా, వక్రమైనా, దుష్టమైనదానినిగా పరిగణించకూడ దంటాడు. ఈవిషయంలో మేకవెల్లీకి కౌటిల్యునికి చాలదగ్గర పోలికలున్నాయి. అర్థశాస్త్రసిద్ధాంతాలు నీతిశాస్త్ర సూత్రాలకు కట్టుబడి వుండాలని చెప్పిన గ్రీకుశాస్త్రవేత్త అరిస్టాటిల్ కు, కౌటిల్యునకీ పోలికకంటె భేదమే ఎక్కువ.

కౌటిల్యుని అర్థశాస్త్రం పరిపాలనా విధానాన్ని వర్ణిస్తున్నదేగాని పరిపాలనా తత్వాన్ని దాని పరమార్థాన్ని విమర్శించుటలేదని కౌటిలీయంపై కొందరు పండితులు విమర్శ పెట్టారు. "రాజ్యము యొక్క బాహ్యాంగములు, బహిర్వ్యాపారము లోనగు వాని యందున్నంతటి శ్రద్ధ, దానియొక్క ఆత్మ తాత్త్విక విచారమందతనికి లేకపోయెను. మనుష్యుని స్వభావము గ్రహించుట కతని శరీరముయొక్కయు, అవయవములయొక్కయు జ్ఞానము మాత్రమే కాక

వారి శరీరములోనుండు వాత్మయొక్క జ్ఞానముకూడా ఆవశ్యకమైనట్లు, రాజ్యముయొక్క స్వభావమును గుర్తించుటకు రాజ్యతత్త్వముకూడా తెలిసికొను టవసరము. ఈ విచక్షణలేని కారణముచేత కౌటిల్యుని గ్రంథమేగాక, సంస్కృతమందలి తక్కిన రాజనీతి గ్రంథములుకూడా, పాశ్చాత్య గ్రంథముల పరిచయము కలవారికి శిష్యులకు రుచించుటలేదు. ఎన్నో విషయములలో మేక్ వెల్లితో కౌటిల్యుని పోల్చారు. హేతువాదము అధికముగా లేకపోవుటయేగాక తన యుక్తి ప్రాయములను బలపరచు ఉదాహరణలుకూడ కౌటిల్యునిలో చాల తక్కువగానున్నవి" (మామిడిపూడి) షాడ్గుణ్యవిధులను (Six Fold Policy) రాజు చేయవలెనంటాడు. ఇందుకు కారణముగానీ, అలాచేసిన రాజుల ఉదాహరణలుగానీ యివ్వడు. అరిస్టాటిల్, మేక్ వెల్లీ మున్నగు పాశ్చాత్య శాస్త్రవేత్తల గ్రంథములలో యిదియే ముఖ్యము. ఆచార్య వెంకట రంగయ్యగారు కౌటిలీయార్థ శాస్త్రంపై పెట్టిన విమర్శ సహేతుకమైనదే. ఐతే ఈ విమర్శకు జవాబు కౌటిలీయంలోనే కన్పిస్తుంది.

కౌటిల్యునికి పూర్వమే "దండనీతి" అనే పేరుతో అర్థశాస్త్రం అధ్యయనం చేయబడేది. ప్రజాపతియైన బ్రహ్మ ప్రజాయోగక్షేమార్థం ధర్మ, అర్థ, కామములను సంపాదించేందుకు ఒక లక్ష అధ్యాయాలతో కూడిన బృహత్ గ్రంథాన్ని రాశాడట. ధర్మానికి సంబంధించిన అధ్యాయాలను ఆ గ్రంథంనుండి వేరుచేసి మనువు ప్రత్యేకమైన ధర్మశాస్త్రంగా రచించాడట. అర్థానికి సంబంధించిన అధ్యాయాలను బృహస్పతి వేరుచేసి స్వతంత్ర అర్థశాస్త్రంగా రచించాడట. కామానికి సంబంధించిన అధ్యాయాలను నందుడు వేరుచేసి, ప్రత్యేక కామశాస్త్రంగా వ్రాశాడట. లక్ష అధ్యాయాలు గలిగిన ఆమహాగ్రంథంలో "దండనీతికి" (The science of politics) చెందినభాగం చాలా పెద్దదిగా వుండటంవలన దాన్ని విశాలాక్షుడు 10 వేల అధ్యాయాలకు, బాహుదంతుడు 5 వేల అధ్యాయాలకు బృహస్పతి 3 వేల అధ్యాయాలకు కుదించారట. తరువాత ఉశనాసుడు (శుక్రుడు) వెయ్యి అధ్యాయాలతో కూడిన గ్రంథం రచించాడట. అర్థశాస్త్రం పుట్టుకను గూర్చిన ఈ వృత్తాంతం, మహాభారతం, శాంతిపర్వంలోని 59 వ అధ్యాయంద్వారా తెలుస్తోంది. లక్ష అధ్యాయాలున్న దండనీతి అనే ప్రత్యేకశాస్త్రం క్రమంగా 10 వేలు, 5 వేలు, 3 వేలు చివరికి వెయ్యి అధ్యాయాలకి విశాలాక్షు, బాహుదంతి, బృహస్పతి, ఉశనాసులవల్ల సంక్షిప్తపరచబడిందంటే, ఆ శాస్త్ర అధ్యయనాన్ని గూర్చిన ఆకాంక్ష, రాహువునోటబడ్డ చంద్రబింబంలా, కరిమింగిన వెలగపండులా, క్రమంగా క్షీణిస్తూ వొచ్చిందని మనం గ్రహించవచ్చును. అట్టి విపత్తినుండి అమూల్యశాస్త్రాన్ని కాచి కాపాడిన ఖ్యాతి, మౌర్యసామ్రాజ్య నిర్మాత, జగద్విఖ్యాత రాజనీతిశాస్త్రవేత్త, సుప్రసిద్ధ "అర్థశాస్త్ర" గ్రంథకర్త ఐన కౌటిల్యునికి దక్కింది. ధర్మశాస్త్రకారులమైనవారు మెలికలలోనూ, ప్రాచీన తాళపత్రగ్రంథసంచయంలో వున్న అర్థశాస్త్రాన్ని కౌటిల్యుడు బయటికి తెచ్చి, పండితులలో, ధర్మశాస్త్రంతో సమానమైన గౌరవాన్ని సంపాదింపగలిగాడు. మరుగునపడిపోతున్న శాస్త్రాన్ని తాను కాపాడానని కౌటిల్యుడే స్వయంగా తన గ్రంథం చివరిభాగంలో చెప్పుకొన్నాడు.

తన కాలంనాటికి అర్థశాస్త్రాలు ఎన్ని వున్నాయో, ఎన్ని ఆలోచనా ధోరణులు (Schools of Thought) వున్నవో, వాటి నన్నిటిని సంక్షిప్తపరచి, అతి జాగరూకతతో క్రోడీకరించి ఒక సంహితగా రచించానని అతడే చెప్పాడు. అంటే ఆ నాటికి వ్యాప్తిలోవున్న వివిధమయిన ఆలోచనా ధోరణులు, సిద్ధాంతాలు సంక్షిప్తపరచి వాటి నన్నిటిని సంకలనం చేశాడనే నిర్ణయానికి వొస్తే, అంతకంటె అవివేకం మరొకటి వుండదు. ఎన్నో అనవసర వివరాలతో నిండి, వట్టి సిద్ధాంత సంబంధమగు వాగ్వాదాలతో, చర్చలతో, కూడి విపరీతంగా విస్తరిస్తూ ఉన్న శాస్త్రాన్ని ఆచరణయోగ్యమై, దైనందిన రాజ్యపాలనా వ్యవహారాలకు సహాయపడే విధంగా, ఒక మహోత్తమ శాస్త్రగ్రంథాన్ని రచించాడు. అట్టి రచనద్వారా శాస్త్రాధ్యయనాన్ని ప్రోత్సహించాడు. అందువల్లనే నాటికీ నేటికీ కౌటిలీయంలోని జీవశక్తిని కాలం తన పమ్మెట పోటులలో చంపలేకపోయింది.

క్రమేపి క్షీణించిపోతున్న అర్థశాస్త్రం అధ్యయనాన్ని తిరిగి ప్రోత్సహించాలనే దృక్పథంతో, ఆ శాస్త్రానికి మరల జీవంపోయాలనే దృఢ సంకల్పంతో, సిద్ధాంతపరమైన అనవసర వివరాలజోలికి పోకుండా, వాటికి ప్రాధాన్య మివ్వకుండా ఆచరణభాగంపైనే కౌటిల్యుడు తన దృష్టిని కేంద్రీకరించడం జరిగింది.

సిద్ధాంత ప్రతిపాదనకన్న, మహా రాజమంత్రి ఐన కౌటిల్యుని, దృక్పథంలో కార్యాచరణమే ప్రధానం. తాను స్థాపించిన మహా సామ్రాజ్యాన్ని, తనచే రచించబడ్డ అర్థశాస్త్రం సహాయంచేత పరిపాలింప ప్రయత్నించాడు. కౌటిలీయం వచన సిద్ధాంత ప్రతిపాదన; మౌర్య సామ్రాజ్యపరిపాలన కౌటిల్యుడు చేసిన మహోన్నత ప్రయోగం. అందుచేత, అతడు సిద్ధాంతచర్చకు, హేతువాదంతో కూడిన వివరాలకు

అధిక ప్రాముఖ్యం ఇవ్వలేదు. అందుకనే, కౌటిల్యుడు పరిపాలనా తత్వాన్ని విమర్శించలేదని మనం అర్థం చేసుకోవచ్చు.

కౌటిల్యుడు : అరిస్టోటల్

ప్రస్తుతం, ప్రాక్ పశ్చిమ రాజనీతి శాస్త్రాలకు సంబంధించిన మరో ప్రధాన విషయాన్ని మనం విశ్లేషించదాం. మౌర్య సామ్రాజ్య స్థాపనం భారతదేశములో ఒకవైపు జరుగుతూంటే, అదే కాలంలో ప్రపంచ తత్వవేత్తలలో ఒకడుగాను, యూరోపియన్ తత్వశాస్త్ర చరిత్రలో ప్లేటో పిదప అంతటి మహా మేధావంతుడుగాను, పరిగణింపబడే అరిస్టోటల్ మాసిడోనియన్ వలస రాజ్యము "స్టెగిరా"లో క్రీ. పూ. 384 లో జన్మించాడు. యూరపులో మహాసామ్రాజ్య నిర్మాత అయిన అలెగ్జాండరుకు రాజకీయ పాఠాలను బోధించాడు. అదే సమయంలో మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అయిన చంద్రగుప్తుకు కౌటిల్యునివద్ద రాజకీయ శిష్యత్వం చేస్తున్నాడు. 158 రాజ్యాంగాలను శోధించి సుప్రసిద్ధమైన పాలిటిక్స్ అనే గ్రంథం అరిస్టోటల్ రచించాడు. ప్రాచీన హైందవ రాజనీతి శాస్త్రం పాలిట మహోజ్వల భాండాగారమైన అర్థశాస్త్రాన్ని కౌటిల్యుడు రచించాడు. స్వయం సమృద్ధమైన 'నగర రాజ్యాన్ని' (State City) అరిస్టోటల్ ప్రతిపాదించగా, చతురంత మహీమండలం దాకా వ్యాప్తి చెందగల సువిశాల సామ్రాజ్య స్థాపనం కౌటిల్యుడు వాంఛించాడు. అరిస్టోటల్ చట్టబద్ధమైన రాజరికాన్ని, కౌటిల్యుడు నిరంకుశమయిన రాజరికాన్ని ప్రతిపాదించాడు. అరిస్టోటల్ స్వతంత్రవ్యక్తియొక్క మనస్తత్వం కలిగిన డెమాక్రాట్. కౌటిల్యుడు రాచరిక నిరంకుశత్వాన్ని సమర్థించిన నియంత. అందుకే కౌటిల్యుడు "అర్థశాస్త్రం" నరేంద్రుల కొరకే వ్రాయబడిందని స్పష్టంగా చెప్పాడు. "సర్వ శాస్త్రాణ్యనుక్రమ్య ప్రయోగ ముపలభ్య చ. కౌటిల్యేన నరేంద్రార్థే శాసనస్య విధిః కృతః" అని కౌటిల్యుడు చెప్పాడు. అలెగ్జాండరు సామ్రాజ్యవాద కాంక్ష గ్రీసులోని నగర రాజ్యాలను కబళించి వేసింది. మౌర్య సామ్రాజ్య వాదం, చిల్లర మల్లర రాజ్యాలనూ, అసంఖ్యాకములగు గణ సంఘాలనూ మింగి వేసింది.

స్వయం సంపూర్ణ నగర రాజ్యం కొరకు అరిస్టోటల్ ఆ కాలంలో 'పాలిటిక్స్' గ్రంథరచన చేసి, ఆ రాజ్యాన్ని స్థాపించేందుకు తహతహ లాడాడు. కాని ఆ ఆదర్శం, ఆయన కంటిముందరే పేకమేడలా కూలిపోయింది. ఒకవైపున నగర రాజ్యాన్ని గురించి అరిస్టోటల్ తన మేధస్సు నంతటినీ వినియోగిస్తుంటే, మరోవైపున దిగంత విజయయాత్రా సముపార్జిత యశో ధురీణుడు, వీరాగ్రగణ్యుడు అయిన అలెగ్జాండరు సేనలు నగర రాజ్య ప్రాకారాలనే గాక, ఆ వ్యవస్థనే మూలమట్టం చేసివేయడం జరిగింది. సామ్రాజ్య సరణి కొరకు అలెగ్జాండరు నగర రాజ్య పునాదులనే భూస్థాపితం చేస్తూంటే, అరిస్టోటల్ వంటి శాస్త్రవేత్త నగరరాజ్యాన్ని సామగ్రితను బూటకపు స్వయంసమృద్ధితో పునరుద్ధరించాలని సుందరమగు స్వప్నం కన్నాడు. ఆ స్వప్నం వాస్తవిక రూపాన్ని ధరించక పగటికలగానే మిగిలిపోయింది. సిటీ స్టేట్ యొక్క దహనసంస్కార క్రియలను జరిపేందుకు ఏర్పాటు చేయబడ్డ ఉత్సవాన్ని అనుసరించువాడుగానే అరిస్టోటల్ మిగిలిపోయాడు.

వెయ్యి స్తంభాల పైనిలచిన మహోజ్వల సామ్రాజ్య సౌధాన్ని నిర్మించిన మహాశిల్పి కౌటిల్యుడు. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా తనను తాను మార్చుకో లేక గతంవెంట పయనించిన వ్యాఖ్యాతుడు అరిస్టోటల్. మారుతున్న దేశపరిస్థితుల కనుగుణంగా అవ్యవస్థనుండి వ్యవస్థను, కల్లోలంనుండి శాంతిభద్రతలను సృష్టించి సువిశాల సామ్రాజ్య స్థాపనను చేసి సురుచిర సుందర స్వప్నాన్ని, సత్యంగా మార్చిన కార్యశూరుడు కౌటిల్యుడు!

కౌటిల్యుడు తన గురువులతోను, పూర్వ శాస్త్రకారులు ప్రతిపాదించిన పెక్కు సిద్ధాంతాలతోను తాను ఏకీభవించడం లేదని చెప్పాడు. అంతే గాక ఆయన ఒక స్వతంత్రమైన రాజనీతిధోరణికి ప్రారంభకుడయ్యాడు. ఈ విషయాన్ని గూర్చి డాక్టరు భండార్కర్ యిలా అంటాడు—

"In many places where Questions of policy or administration are discussed and where the views of his predecessors are indicated, he has set forth his own with a clarity and precision which show that he was not a mere theorist or literary pedant but rather a statesman endowed with rare political insight and practical wisdom. Koutilya had a definite set of views on all the important points of policy and administration, views sufficiently numerous and characteristic to go to form a different school of polity. ("Some As) pects of Ancients Hindu Polity"–Page 23.-

కౌటిల్యుని తర్వాత అర్థశాస్త్రం ఏ విధమైన అభ్యుదయాన్నీ సాధించలేకపోయింది. క్రీ. శ. 4 వ శతాబ్దంలో కామందకుడు రచించిన "నీతిసారం", 10 వ శతాబ్దంలో సోమదేవ సూరి రచించిన "నీతి వాక్యామృతం" మొదలో, మిగతా గ్రంథాలన్నీ అతుకుల బొంతలు, అనుకరణలూను. పైగా, రచింపబడ్డ వన్నీ, ప్రాచీన శాస్త్రజ్ఞుల ప్రతిపదికలతోనో, ఇంకా సంక్షిప్తంగానో వ్రాయబడ్డ అర్థశాస్త్ర సంకలనాలు. ఇవి కొల్లలుగా పుట్టాయి. తత్ఫలితంగా అర్థశాస్త్రాన్ని గూర్చిన అధ్యయనం క్రమేపి క్షీణించి పోయింది. ప్రాచీన భారతంలో ఉద్దండులైన పండిత ప్రకాండులచే, మహామహులైన శాస్త్రవేత్తలచే పెంచి పోషింపబడి మూడు పూలూ, ఆరు కాయలు కాసిన హైందవార్థశాస్త్రం, తదధ్యయనం క్రమంగా నాశన మైపోయింది. కోటిసూర్యుల తేజస్సుతో వర్ధిల్లి ప్రకాశించిన ప్రాచీన అర్థశాస్త్రం కాటిలీయాన్నే అవశేషంగా వదిలిపోయింది.

మనకీ ఒక అర్థశాస్త్రం వుంది. దానికి వేలసంవత్సరాల చరిత్ర వుంది. ఆ దీర్ఘ చరిత్రలో కౌటిలీయార్థ శాస్త్రం ఒక మహోజ్జ్వల గ్రంథం. మన ప్రాచీన శాస్త్రాన్నీ, దాని చరిత్రనీ కవిలికట్టల్లోనుండి, పుస్తక భాండాగారాలలో దిక్కూ మొక్కూ లేక పడివున్న వివిధ తాళపత్ర గ్రంథ సంచయమునుండి తవ్వి తల కెత్తాలి. ఎన్నో అర్థశాస్త్ర గ్రంథాలలో పేర్కొనబడ్డ వివిధ శాస్త్రగ్రంథాలు మనకు నేడు ఎక్కడా కనిపించటంలేదు. వాటినన్నిటినీ తిరిగి పరిశోధించి, వెలికి తీయాలి. అప్పుడే మనం ప్రాచీన హైందవుల అర్థ శాస్త్రాన్ని, దాని చరిత్రను సర్వసమగ్రంగా, సర్వాంగ సుందరంగా కాంతిలోకి తెచ్చి ప్రపంచం ముందు పెట్టగలం.

సింత సివురు

'రమణశ్రీ'

'సింత సివురు సివ్వది
సొగసు వయసు సివ్వది
సీకు సింత లేనిదీ
సెంత సేర వన్నదీ'

'సెం...త...సే...ర...వన్న...దీ'

గాలిలో తేలిపోతోన్న మాటలు, పాటలూ చింతచెట్టు చివుళ్ళని మరింత చివురింపచేస్తున్నయ్! చింత చివురు కోసుకొంటోన్న నాగులు కొమ్మల కింద నుంచి, తొంగి తొంగి చూసింది పాట వరుసల్లో వస్తోన్న వెంపు...

గొర్రెలూ, మేకలూ కాసుకొంటోన్న గొర్రెల మంగాలన్న కొడుకు 'సిన్నోడు' పాడుతోన్న పాట!

'సిటారు కొమ్మని సివురుంది
కొయ్యగలోళ్ళే లేరంది'

నిజంగా తన పనలాగే వుంది! తొలకరించిందని, చెట్టు పులకరించికే, ఆ చివుళ్ళు తను గిల్లుకుపోయి, అమ్ముకొని సొమ్ము చేసుకొంటుంది.

'సింత సివురు సివ్వదాన్ని సీకు కుట్టింది
వయసు పొగరు పిల్లదాన్ని దోమ కుట్టిందీ'

పాట విని నవ్వుకొంది. 'ఓ నబ్బో! పాడతన్నాడు పాట. కోడె వోయసులో పొగరెక్కి...' అనుకుంటూ—

నిజంగా కండచీమలు కండ లూడ కొరుకుతున్నయ్, నిగనిగలాడుతోన్న వంటి పట్టిపెట్టుకొని కళ్ళు బయట్లు కమ్మేలా ఐనా గోళ్ళు గిల్లడం మానలేదు చివుళ్ళని.

అదీగాక రాయన్న మాన్యంలో చెట్టంటే, అందరికీ ఆశే! ఇక పచ్చగా పకపకలాడుతోన్న చెట్టుని చూసి, నాగు లూరుకొంటుంది?

'నీ యిష్టం వొచ్చినట్టు కోసుకోయే పిల్లా!' అని రాయన్న అధికారం ఇచ్చాడు.

ఒడినిండా కోసుకొని చక్కా బజారున పడి ఇన్ని గింజలకో, డబ్బులకో అమ్ముకొని ఆరోజు వెళ్ళమారిస్తే అదే పదివేలు! రేపటిరోజు దేవు డెరుగు!

పైకొమ్మలు కూడా ఎక్కికోసింది......ఒడి నిండించికొని, పిటపిటలాడుతూ కిందికి దిగింది.

పొద్దు, తాటితోపులోంచి వాటారుతోంది

రెండు వీధులు తిరిగితే చాలు...చింత చివురంతా అఖరు...ఇంకా గరువుమీద గొర్రెల సిన్నోడు కూనిరాగం తీస్తున్నాడు.

'వొంతంగా కవిత్తం గడతాడంట! అడికి పుట్టిక నించీ వొచ్చును పాటలూ, పదాలూ, గొల్ల సుద్దులూనూ' అనుకొంటూ గట్టెక్కింది నాగులు.

'తొలకరి కురిసించీ
సింతలు సివురించీ
పచ్చిక పరిసింది
నాగులూ నీ దేపూ కే?'

పాట ఆగింది—పాట పాడేది తను కానట్టు చూశాడు సిన్నోడు.

'ఏరా! సిన్నోడా!... తెగ పాట పాడతన్నావ్ నామీదే కవిత్తం గడతన్నావా?...నాదీపూకే గదరా సివ్వా!'

ఒడిలో చింతకూర చేతుల్తో సద్దుతూ అంది.

'ఇయ్యాల తీసుంటావు. కే పెక్కుడుంటావో? ఎవరి కొరిక? నాగులూ!...రాయన్న సెట్టంతా యిరగ్గోసేశావు గందా?...సెట్టెంకుకన్నా పనిరొస్తది? నీ సేయి దిగిలి...రాయన్నతో సెపుతానే! నీ పని...'

'సెపితే సెప్పుకో! సెప్పిచ్చి కొట్టుకో! సెపితే కొరతే యిస్తాడా?'

'కొంతే యిస్తాడో? కొరుక్కుతింటాడో నా కేటి తెలుస్తది?'

'నోరు తిన్నగా రానీ సిన్నోడా! సేపలాంటి దాన్ని గాను? సేరుకున్నానని, తెగ నీల్గుతుండవు. ఊరికే కపిత్తం గడతన్నావు!'

'నా నోటికొచ్చిన పాట పాడతాను! నీకేం?' అని వడిలో కూర తీసుకొని నవుల్తా, 'దానికేం గాని, సురపన్న మామ సిన్నోదిలి యేడకు పోయినోడు? నువ్వెన్నాళ్ళట్టా వుంటం...' అని ఆగి, నాగులు కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూశాడు. నాగులు కీ మాటలు దురుగ్గా అంటాయి.

'ఏమో నాకేటి తెలుసు' అని గట్టు దిగి పొలాల కడ్డంబడి నడక సాగింది.

'సిన్నప్పుడే పెళ్ళాడిన సురపన్నమావ, సంసారం సేస్తా సే, ఓ రోజు మాయమైపోనాడు...అంతు సిక్కని దూరాలకి'

సిన్నోడు నాగులు దారి సేస్తూ గొర్రెల్ని మేకల్ని మళ్ళించుకొంటున్నాడు.

పాతగాయం రేగినట్టుంది...మెల బాపుకు మంటోంది—ముక్కు మొగానికి నగలూ నాణాలూ లేవు...అన్నీ ముసలయ్య రోగాల్లో కరిగిపోయాయి. సురపన్న జాడ తెలియదు చిటికెడకూ....

'ఎంతకాలం మగపురుసున్ని మొక్కోమంటావు? ఆడికోసం ఎన్నాళ్ళని ఎదురుసూడ్డం...సింత సెట్టు బావున్నంత కాలం నీకు సింతలేదు...' అంటోంది. మనసు.

తుమ్మతోపులోంచి, వీస్తోన్న ఈదర గాలి, వర్షించబోయే మబ్బుల తొందర...

వయ్యారంగా కనుపడ్డగా ఉయ్యాల లూగుతూన్న ఆకుమళ్ళ...దాటుకొంటూ వడిలో కూర మప్పితంగా సద్దుకొని, రైలు గేటు దాటింది.

'ఎంతకన్నా తెగ్గావోసే! మర్రాలమ్మ కొడుకు. యిసిరి యిసిరి...ఎంత మాటన్నాడు...మారు మనువు సేసుకోమని, మనసు మార్చుకోమని...మా యిద్దరు వున్నారు...కూడెంలో నోట్లో—సురపన్న మామకోసం ఎదురుసూసీ, ఎదురుసూసి పేనాలన్నా యిత్తగాని, మనువు సేసుకోను...మొగోణ్ణి నమ్ముకు సెడమన్న దెవరు? మరొకడ్ని వగురుగా అనితే పాలు...తిన్నోదిలి పారిపోతాడు......మనువు సేసుకొన్నావోడు మాయలోడైతే బతుకు మరేంగాను"

కాశెలమ్మ గుడిదగ్గరికొచ్చింది. గుడిలో అమ్మవారికి వంగి వంగి మొక్కింది. 'సురపన్న మామని దూరం సెయ్యకు తల్లీ!' అని......

తల్లి, 'నీమొరాలించాలే' అన్నట్టు చూసింది దయామయంగా. గుడికెదురుగా గంగరావిచెట్టు కింద ఒకక్షణం కూర్చోని, లేచి, చకచకా నడుచుకొంటూ వీధినపడింది......

'అమ్మా! చింతకూర...' అని ఆగింది సుబ్బం ముందు...ఇంటావిడ 'అచ్చా! బాగుగా తక్కువ పెడుతున్నావు! కానాలా పెట్టాలా? ఊరికే నే వచ్చిందిక దూ? ...... మరింత పెడితే నీసొమ్మేం పోయింది?' అంటోంది—చేలతెచ్చి బియ్యం జేసి కూర పెట్టించుకొంటూ.

ఇంట్లో వాళ్ళదో గొణుక్కుంటున్నారు.

'అచ్చె వాళ్ళకి పెళ్ళి పెడాకులూ ఏంటే? గొడ్డి పశువులు...'

ఇంటావిడ పగలబడి నవ్వుతోంది.

నాగులు చెవుల్ని కొరుకుతున్నయ్ వాళ్ళ మాటలు...

నీతికీ, నిజాయితీకి తనేం తక్కువకాదు...

త్వరగా, కూర పూర్తిచేసి సంత చేసుకొని, గుడిసెకి మళ్ళింది.

ఆకాశం మబ్బుపట్టి మరింత చీకటి పెంపొందుతోంది. చిన్న చిన్న తుప్పరపడి, నాగులు ఒంటిమీదబట్టలు తడిసి, ముడుచుకుపోతున్నాయి. ఎదురుగాలి ముఖాన్ని మొత్తుతోంది. చలిగాలికి ముడుచుకొన్న పెదవులు వణుకుతున్నాయి. ఎదుగొస్తోన్న పసువుల్ని, పసుల కాపరుల్ని తప్పుకొంటూ, మళ్ళా గుడిదగ్గరికొచ్చేసరికి ముసురు మరింతగా విసురుతోంది. ఐనా, గేటుదాటి రైలుపట్టాలవెంట నడిచి, ఆలోచనల ముళ్ళు విప్పుకొంటూ గూడు చేరేసరికి, గుడ్డిదీపం వెలిగించమని ముందుకొస్తోంది.

తుక్కు నులకమంచంమీద ముసలయ్య ఖళ్లుఖళ్లున దగ్గుతూ, 'ఏటి నాగూ? గిరన్నాలేంది దీపమేం ఎలిగిత్తావు?...సంతసేసుకొచ్చావా?' అన్నాడు.

'ఆఁ' అంది.

'ఏడన్నా ఊసుతున్నారా? ఊసితే మన ఏడుపు కొంత తీర్తది'

'ఆడు లేవకుంటే యేం పూడుస్తారు? బోరింగు లున్నా వోళ్ళ మాతరం, ఆరకలు గడతన్నారు...'

'ఎంతకాలం సింతసిగురుమీద బతుకుతాం! నువ్వు మనువుసేసుకో! ఓ లొస్తది...దాంతో కాల క్షేపం సెయ్యొచ్చు...ముద్దూ ముచ్చటా తీరతది. ఇంకా కురిదిగా జొచ్చేది లేదు...'

అని ఆగాడు. మళ్ళీ దగ్గు లంకించుకొంది.

మంచం మన్న పైపోతన్నాడు ముసలయ్య... ఉన్నన్ని రోజాలూ కమతంలో కాపుదనాలుండి, పేరు దెచ్చుకొని, చివరికిలా చావుబతుకుల మధ్య వేలాడుతున్నాడు. అడుగుబడుగూవున్న దముకుపీల్చి దీప శిఖ వెలుగుతోంది. నాగులు రాజబెట్టినపొయ్యి ఆకలి గొన్న కడుపులా రగుల్తోంది.

కురిదిగాడు పోయిన్నాటినించీ, బతుకు బండలై పోతన్నాది. కూటికీ డమ్ముకూ మొగం వాచి పోనాం...ఏటి పోగాలమో, ఆడుపోవాడు ఏలినాటి శని బట్టుకొని యేడిపిస్తన్నాది...' అని గొణుక్కుంటున్నాడు ముసలయ్య.

'మనువుసేసుకో! మనువుసేసుకో!' అని గుండెల్లో గూళ్లు కట్టుకొని పోరుపెడుతున్నాడు ముసలయ్య. నాగుల కా మాటలు ఒళ్లు మండిస్తున్నయ్!

ఏటిలోకం ... సిగూ సెరం లేదు కూడెం వోళ్లకి...చొక్కాలు మార్చుకొన్నట్టు మార్చుకోడం ఏటెబతుకు?...' అని యీసడించుకుంది.

మంచంమీద ముసలయ్య నిద్రపోతున్నాడు. గుడిసెముందు చీకటిపక్షి వర్షంలో తడుస్తూ టెపటెప లాడుతూ ఎగురుతోంది!

2

'మారుమనువు సేసుకొని మనుసులిరుసుకొని, ఏటె బతికేది రాయన్న బాబుగోరూ!'

తిరిగి చిగురించిన చెక్కెక్కుతూ అందినాగులు. రాయన్న పిరగాళ్లకు నీరు పెడుతున్నాడు. పాలికాపు దూరంగా పల్లంమడికి నీరు పోంగకుండా గట్టు వరిజేస్తున్నాడు.

రాయన్న నాగులు మారుమనువునిగురించి అడిగి నట్టున్నాడు జవాబు చెబుతూ చెక్కెక్కుతోంది.

'సెటంతా నువ్వే యిరిసేనావన్నావే! సింతలు పండకపోయేనో, నీతో లొలుస్తా!' అన్నాడు వెటకారంగా...

'నానొక్కదాన్నే నేటిబాబూ! నా పిల్లాజెల్లా ముంగుతిరంఅంతా నీ సెట్టమీదే బతుకుతాం... నీ పేరు సెప్పుకొండి' అంది ... చెట్టుకొమ్మమీద సద్దుకొని...

వంట్లో వలతిగా వుండేమో నీరసంగా వచ్చింది మాట...

'పేవం బాగోలేదు...ఐనా తప్పదు ...ముస లయ్య కింత గంజి పొయ్యకపోతే, గింజుకొంటాడు' అనుకొంటూ.

సెక్కెక్కేందుకు నాకేటె స్తవే? సింత సిగురు సిన్నదానా!' అన్నాడు రాయన్న.

దొరబాబులు మీకు నానింకేటి కావాలి? వోళ్ళు కాసితాలా? ముగాలు కాసితాలా? నీబానిసలం పాలించేవోళ్ళు మీరూ...ఆలించేవోళ్లం మేమూ... మీ మాట సట్టం గాదూ బాబులూ"

'ముసలయ్య కెలాగున్నదే?'

'ఎలాగున్నదేటి బాబూ! గుమ్మంలో కాసు క్కూచున్నది సావు'

'పాపం! కమత మున్నంతకాలం యిప్పాసంగల కుక్కలా పనుంజేవోడు...ఒక్కమాట పడేవోడు గాదు, పౌరుసంగా బతికేవోడు—'

నవ్వించి మెరిసే మబ్బు, కొమ్మ మీదివాలి నటించి నాగులు! కోకిల కూస్తున్నట్టు ... పుల్లని చింతచిగురునవుల్తాన్నట్టు ...కోడెగాలి వీస్తున్నట్టు ...అనిపిస్తోంది రాయన్నకి.

మడిలోకి నీరుమళ్ళిస్తూ గుండె మదురు చేసు కొంటున్నాడు. పాదరసంలా పాకుతోంది మనసు పరిసరాల మీదికి.

ఎందుకో చిన్నదానితో మానసిక వ్యభిచారం? తన అంతస్తేమిటి? దాని పరువెక్కడ? వాసనచూడాని కైనా తగని వస్తువు.

'బాబూ నీబానిసని'

తనబానిస ..తన కోర్కలు తీర్చగలబానిస...

చింత చివురు కోసుకుపోయేదాకా అలానే మాట్లాడుతుండి గట్టు దిగాక, 'ఛోడ్ కాయన్నా!' అని పకపకా నవ్వుతూ పారిపోతుంది!

నాగులుకి ఎదురెండ ముఖంమీద కొడుతోంది. పొద్దున్నుంచీ చద్దిగంజి తాగక, కంట్లో నలతగావుండి శరీరమంతా జెత్తుగుమురుతోంది.

కళ్ళు తిరుగుతున్నయ్. కాళ్ళు లాగుతున్నయ్... చింత చివురులు లోకువకట్టి వేళ్ళని తోసిపారేస్తున్నయ్...

గభీల్ మని పడిన చప్పుడు వినిపించకుండా నే, కాయన్న చెట్టుకిందికి లంఘించి ఒక్క ఉదుటన పట్టుకొన్నాడు నాగుల్ని...

నాగులు కాయన్న చేతుల్లో వాలిపోయింది అర మోడ్పుకనుల్లో సొగసులు బంధించుకొంటూ.

'పోనీ నీ యిల్లు బళ్ళా బంగారంగానూ! కళ్ళు తిరుగుతుంటే యెక్కకపోతే యేమేం? పాపం దెబ్బ తగిలిందా?'

నాగులుకళ్ళు దప్పిపోయింది కాయన్న స్పర్శలకి. కళ్ళు సిగ్గుతో తడిసి వాలిపోయాయి. ఇంత కళ్ళు తెలియకుండా పడిపోయినందుకు శపించుకొంది.

కాయన్న కౌమారోద్రిక్తమైన వేళ్ళు ఆ వంటి చిరు వేడిమీద పరవశం పొందుతున్నాయ్! కళ్ళల్లో ఆశ కోరగా మాస్తోంది. యౌవనందీజాలుతోన్న ముఖం... పెదవుల్లో పెరుగుతోన్న కోరిక...

ఆ చూపుల ఆరాన్ని భరించలేక భ్రామలా తోజుకూ, లేచి దూరంగా నిలబడింది.

"కాయన్న బాబూ! నా వొళ్ళు ముట్టకండి! నాను పాపం సేసుకుపుట్టను. నాది రెయిలజన్మ... నాకరమూని నన్ను పోనీండి! నానూ నాన నన్ను బతకనీండి!... మీరు దొరబాబులు.. మాకూ మీకూ సానాదూరం.. మీసింత పుణ్యమా అని యిన్ని గంజినీళ్ళు కొసుకు తాగుతున్నా...అయి కూడా తాగనీరా? నీతిగా నీమంగా బతకనీరా? అంతా ఒగలాంటోళ్లే ఉంటారను కోకండి! నన్ను కొల్చుకు తింటే, మీకేటి నాబం? నన్ను కొట్టండి...సంపండి గాని, మీరు ఈ రోజు సేసిన పని మంచిది గాదు బాబూ!

కాయన్న నాగులికి దగ్గరగా వచ్చి 'ఎంటే నాగులూ అంతపాఠం చదివావు నే నేటన్నా నని...నిన్ను చెట్టు దగ్గి రావొద్దన్నానా? ఆ మాత్రం నాకూ తెల్సులే?'

ఏటి మీకు జలిసింది? బాబూ! మా వోంటి రకతం పీలిసి తాగడానికేనా? పాలికాపోళ్ళ కంటెలు కరిగిపోయ్యేనా పన్ను సేయించుకోని. కాలికింద చెప్పుల్ని తొక్కినట్టు తొక్కడానికేనా? జాతి నీతీ లేకుండా బతకడానికేనా? నిప్పులా బతుకుతున్నాను... నా కరకన్న కోసం ఎదురు తెన్నులు సూస్తున్నా... పాతికేళ్ళొచ్చినయ్! పల్లెత్తుమాట బడెలా...ఇంత కాలం మానసన్నా! ఎప్పుడో తిప్పుతారతారు... భామంగులు...'

కారుమేఘం కమ్ముకొంటుంది ... ఇంతలో రొంప...

అంతలో నష్టం...ప్రకృతి నైవిచిత్ర్యంలో రహస్యమే అంతా!— కాయన్న బుసగొడుతున్నాడు. ఏమీ చేయలేక...

ఎన్ని మాటలు నేర్చింది చిలక!...

'పిన్నోడు పింఛినిప్పు! అను మాగోడ్లో కపిత్థం గట్టి పాటపాడతాడు. నే తోలిగిపోతా...'

అనుకొని అడుగుల్లో అడుగు వేసుకుంటూ గట్టెక్కింది.

నీటిలో వడి మునిగిపోయింది. దూరంనించి పాలికాపు కేక లేస్తున్నాడు

'అరరె! వడి మునిగిపోయిందే! ఇంతా సేపి యిదా?' నాగుల్ని తిట్టుకొంటూ కాయన్న చెట్టు కింద చతికిల పడ్డాడు.

పిన్నోడి మేకలూ, గొర్రెలూ గడ్డిమేస్తున్నయ్ మేతలకి. నీరునిలిచిన కళ్ళతో నీరు నిలిచిన మళ్లవైపు చూస్తూ. .నాగులు గట్టుమీద నిలబడి దిక్కులు చూస్తోంది.

మిట్టమీద పిన్నోడు పిల్లనగ్రోవి ఊదుతున్నాడు తుమ్మచెట్టులా నిలిచి...అడవితుకే అతుకు లేంది! గొర్రెల్ని, మేకల్ని మేపుకొని, మందచేసి అమ్ముకొంటాడు. డబ్బుకు డబ్బు చేసుకొంటాడు— గుండెలు ఎండిపోయిన పాటలో ఏదో వినబడుతోంది. నిప్పురాని ముల్లితో, ముల్లదారిలో, చీకటిలో వోదీపంకోసం వెదుకుతోంది.

'ఊరోజా పస్తే! కాయన్న పున్నెమా' అని అనుకొంటూ ముందుకు నడిచింది. తుమ్మతోపుదగ్గర పిన్నోడెదురొచ్చాడు.

'సింతసివురు సిన్నాదానా! ఏమిటీ చేతుల్లో యెల్లిపోతివ్నావూ? కాయన్న సెప్పేటక్కా నిన్నలేదో?' అన్నాడు.

'పోరా! నీకంతా యెటకారం!' అంటూ తప్పించుకొంది.

'నాను సెలుసులే! రగశ్యం!' అంటూ ముందుకు సాగాడు.

'సింతసివురు చిన్నది
ఎంతో వానెలు తున్నదీ'

'నం...త...సుమ...లు...తు...న్న....దీ'

పిన్నోడిమాటలు చెవుల్లో జోరుగా కొరికి పారేస్తున్నయ్! నాగులు వంచిన మెడ మొత్తకుండా ముందుదారి వెతుక్కుంటూ గుడిసెవెంపు నడిచింది.

3

పొద్దు వాలిపోతోంది.

పొయ్యి మంటుతున్నట్టుంది ఆకాశం ..పొగ మారిన గోడల్లా మేఘాలు...పొగలుపొగలుగా తేలు తున్నయ్!

నాగులు గట్టెక్క చెట్టువైపు చూసింది.

కొలుకులోట కాల్చిన మంటల పొగలకి చివురు చివురంతా నల్లగా మాడిపోయివుంది.

నిన్న జరిగిందప్పుడే యెఱక లేదా?'

మళ్ళీ మనసు వెనక్కి మళ్ళింది.

పాలెంనించి మరిదమ్మ వచ్చి తన కొడుకుని మనువు చేసుకోమని బతిమిలాడింది.

'నా కొడుకిని సేసుకోయే కోడలా! బంట్రోతు పని. ఇన్ని జీతం రాళ్ళు. నిన్ను కోరి కోరి చేసుకొంటా నంటున్నాడు...కాదనమాకు...సక్క చిలకా గోరింకల్లా కాపరం సేసుకొందురు గాని...'

'ససేమిరా' వల్లకాదంది. 'అంతా దగా! యెద వలు! నేనీ జన్మలో సేసుకోను'

అని ముందే బద్దలు కొట్టినట్టు పొమ్మంది.

ముసలయ్య పోరుపెట్టాడు. చావు సిద్ధమైనా...

ఐనా సరే!

'మొగోళ్ళని నమ్మకు!' అంటోంది మనసు.

'ఎవర్నీ నమ్మక యేమిటి సేసేది?' అంటోంది వయసు.

'అడివిగాసిన యెన్నెల సేయకు!' అంటోంది సొగసు. నిన్నల్లా కడుపులో కాల్చేస్తున్నదే పరు గంట! ముసలయ్య రాత్రంతా ఒహాటే బాధ!.

ఆ బాధ సూడలేక యేడ్చింది...కడుపు కన్నీరు తాగింది. ఏంపనులూ దొరకని ఈ రోజుల్లో ఆదరు వైన చెట్టు తిన్ని చూసి తరిమేస్తోంది. ప్రతిఫలం ఆశిస్తోంది.

చివరికి, చెట్టూ తనలాగే మాడిపోయింది.

దీనంగా దిక్కులు చూస్తోంది.

గట్టుదిగి తిన్నగా చెట్టు దగ్గరకొచ్చింది. నిన్నటి పచ్చదనం మచ్చుకైనా లేకుండా పొగమారిపోయింది. కాలిన అరచురములా ఆకులు అల్లలాడుతున్నయి....

'నామీద యీసు, సెట్టెంసేసింది. దానిమీద బడ్డాడు? కామన్న?'

తలలో మెలుస్తోన్న తలపులతో క్రుంగిపో తోన్న సంజెవైపు చూస్తోంది. కన్నీటిబొట్లు విదు లుస్తోన్న మేఘాలు! తుమ్మలోపు కాలిపోతోన్నట్టు పొగలు పొగలుగా మూసుకుతోన్న చీకట్లు!

పిన్నోడి అలికిడైనా కూడా లేదు. అప్పుడేమంటని మళ్ళించుకు పోయుంటాడు.

'సింతసెట్టు అడిపాటకి సంగీతం పాడేది. నాకు యీ బతుకుమీద యిరక్తి పుడతిన్నాది.'

గూళ్ళలో అరకలుకట్టిన జాడలు నీడలుగా పరదు కొన్నయ్. ప్రేమకోసం పలవరిస్తోంది ప్రకృతి...

ఎవరో కొంగొట్టుకొని, ఎదురుచూస్తోన్న తను, ఈ సంజె చీకట్లో మరుగున పడిపోయినతను.

తనకో విషయం పొద్దున్నే తెలిసింది.

రహస్యపుటరలో దాచుకొంది—

సుబ్బన్న మారిపట్నం వచ్చేసిన్నారెవరో?

'పరిహాసంగా' అనుకొని పూరుకొంది.

'ఒక్క పాంవన్నా సూసేందుకు రావా? తనని ముసలయ్యనీ

'రాడు! ఏముఖం పెట్టుకో వొస్తాడు? దాన్ని మనువుసేసుకొని...' గుండె చేదుగా మారింది.

'వస్తే రాకూడదా?'

'వచ్చి యెనకటిట్టు నే కళ్ళయూస్తే?'

'ఎంతకాలం వుంటది! ఇంతవయసూ ఓసారి పులకరించిపోతది'— ఊహలు పోతోన్న వాగులు కళ్లు పాకలోకి పోతోన్న దారిలో మనుషులు నడక పసిగట్టి ఆవైపే నిగిడించి చూస్తోంది.

ఎవరో ఎలుగెత్తిన పిలుపు...

ఆపిలుపు తనకి వినిపించడం లేదు.

చీకట్లు కమ్ముతోన్న తనకళ్ళకి పంజె ఎఱ్ఱిరిపెనవులు చప్పరిస్తోన్న దప్పురులాంటి భావం—

అడవిలో నిలిచేరి సిపాయి...

తిన్నగా చెట్టుకింకే వస్తావున్నాడు భయం భయంగా ముడుచుకుపోతోంది శరీరం...

ఎవరోవాడు? తన్నెత్తుకుపోయే రాక్షసుడు!

'అదిది కంటబడితేపాక... గదల్లా తన్నుకు పోతారు సిపాయీలు' అని చెప్తుంటేవాడు ముసలయ్య...

అందరూ కళ్ళముందు మెసిలారు... ముసలయ్య, గొల్లలసిన్నోడు.... రాయన్న.... కుఱ్ఱవన్నదూళ్ళ.... అందరూ?

దగ్గరికి కలువపూవులా ముడుచుకుపోయింది. చీకట్లో వస్నెల్లా విరుస్తోన్న జీవితం—

'చే చే... చే చే... భయపడతావేం?' అన్నాడు సిపాయి.

గొంతు దూంపంముద్ది మింగుతోన్నట్టు వినిపించింది.

సిపాయిని, నిండుగా కళ్లెత్తిచూసింది. చావుకు మన్నది.

'పిచ్చిదానా! అంతవాడలెందుకే! నిన్నేం మింగేసేరాక్షసుణ్ణా? ఒక్కసారి కన్నెత్తిమాడు! అంత బేజారెత్తిపోతావేం?......నీకే విచారమూ వొద్దింక...' అన్నాడు సిపాయి దనువుగా...

'మాఅయ్య సావుబతుకుల్లో వున్నాడు! నువ్వెవరో తెలీదుగనుకా! అంతా ఐపోవాక యెందుకొస్తవ్?'

అంది గొంతు పెకల్చుకొని...

బొద్దుమీపాలు, బలిసినవొదూళ్ళు, కండలుదిరిగిన జబ్బలూ... తూపుల్లాంటి చూపులూ... ఈ దేవా?... ఈ దేవా?...

సిపాయి, సిపాయిలా గర్జించాడు.

'వాకతలబయం లేదు. ఈబండికెళ్లిపోవాల... పోకపొయ్యేవో? ఉద్యోగం ఊడిపోద్ది... ఈ బతుకేదు...'

వాగులు లేచింది. అతనివెంటబడింది బతికడానికి.. ఎంతదూరంనించి వొచ్చాడో ఈసిపాయి దూరంకతన్ని వెదుక్కుంటూ...

చీకటి యిరువుర్నీ కౌగలించుకొంటోంది... నక్షత్రాలు కన్నుగీటుతున్నాయి... కీచురాళ్ళ సంగీతం... చెవుల్ని బూజులుపుతోంది...

గరువుమీదకెక్కి చింతచెట్టువైపు చూసింది. చీకట్లోమునిగిపోయింది. గట్టుకడ్డం బడ్డారు. పల్లవి మళ్ళలో నీళ్లు నక్షత్రాల కాంతికి తళతళలాడుతున్నయ్!

కోడుమీదకొచ్చాగా.

'మాఅయ్యసంగతీ...'

'అడ్డీవాడే పోయాడు. నువ్విలారాంగానే, కళ్లుమూసుకొన్నాడు... నేను కూడెంలో కళ్ళెపరికి అందరూ చెప్పుకొంటున్నారు. నువ్వెక్కడున్నావని వచ్చాను. ఎంలోటయింలేదు. బండికచ్చేవేళ... వాగు చేరావో, బండిజారిపొద్ది...'

'నేనురాను దూరాం! నన్నిడిచిపెట్టు ... నా బతుకు నాకొదలెయ్!'

కన్నీళ్ళు తెలియకుండా ధారాపాతంగా వర్షించాయి.

సిపాయి కురుకన్న వాగులు చేతులొడిసిపట్టి, విడిచిపెట్టకండా లాక్కుపోతున్నాడు...

తనవలపు చింతలు అందంగా చిపురించడానికి వెళుతున్నది సిపాయికురువన్నతో ... ఆచింతలు చివురించినప్పుడే తనకోర్కెలగోళ్లు ఎటు పెక్కుతయ్!

'సింతసివురు సిన్నదీ
సీకుసింత లేనిదీ'

సిన్నోడిపాట! ఎక్కడికెళ్లినా వాగులు బతుకంతా చివురిస్తూనే వుంటుంది!

భాగ్యనగర కోకిల

శ్రీ నాయని సుబ్బారావు

౧

పదిగళము లొక్క గళమై
విదిలించినగతి సుస్పష్ట విస్పష్టరవా
భ్యుదయ మనోహరగానా
స్పదమూర్తివి శ్యామల ప్రభారమ్యతనూ!

నీ నినద ప్రభావమహా
　　నీయరసోన్నమితమ్మయైన మూ
లీనది తట్టిలేప విక
　　సించిన గంధసుమ ప్రభాసితో
ద్యానవనీ బలాతిశయ
　　దర్పితు డతడు పేర్చు చైత్ర యా
త్రానిరతిఁ వసంతు డమి
　　త ప్రమదోదయ దిగ్ధిగంతుడై.

అన్యవన్యస్థలమ్ముల నచిరకాల
మున వసంతుడు తానొక్క ముసలివాడు,
త్వద్దయాపోషిత ప్రాణధనుడు వాడు
నిత్యనూతన యౌవనాన్వితు డచట.

నీమాయ మెట్టిదో నీ
శ్రీ మధురకలస్వనమున చిగిరించినవా
రై మరులు కొంద్రు రతియును
కాముండు వసంతరూపకలనాగరిమన్.

౨

సుర్వాపై షేర్వాణీ
పర్వ చిబుకజానుయుగళ పర్యంతము, కిం
ఖుర్వాణ ధారితక చి
త్తార్వాయిత. కింకిరాటు లచ్చటి తరుణుల్.

అరుదగు నీకలరవమున
కరఁగుదు రే చార్మినార్ సిగారెట్ దమ్ముఁ
జరదా వేసిన బీడా
పరమార్థమువారి కింకపనివల దేమిఁ.

పెల్యార్ కుర్తా వోణీ
చెల్వమ్ముల విశ్వవిజయశీలి మరుని చే
తల్వార్లు క్రొత్త బాదమ్
హల్వా రుచిఁ గాదను రతులచ్చటితరుణుల్.

అథవ సెగకంటి మంటల నార్పజాలు
చలువకాటుక కడ్డీ పసందు లోలయు
రెండు జడల రతీదేవు లుండబట్టి
బ్రదికి రంగసంయుక్తులై భావభవులు.

3

వారు సంస్కార శుచులైన భాగ్యవంతు
లొక్కడజ్జీ మహారథ మ్మెక్కివచ్చి
చెఱువుకట్ట బెంచీపైన చెలియొకదెస
కొలువుదీర్తురు చేతిగుడ్డలను పఱచి.

ఏకణా వేసుసెనగ పప్పెంచికొని య
తండు నగపాలు మోహంపు తరుణి కిచ్చు,
ఆమె మదనసామ్రాజ్య పట్టాభిషిక్త
యైనరీతి హసన్ముఖియై వెలుంగు.

నీవసంతాగమోన్నిద్ర నిభృతరాగ
మంజు శింజాన రమణీయ మధురగీతి
కాదు వారికి, వారు సంస్కార జడులు
వారి మోటారుహారనే వారి వీణ!

౪

కోరి మోటారుసైకిల్ మీఁ గారుపోవు
దడదడల డబడబల సిక్కుదర్శకునకు
చెవులు హాగాంతరే సురక్షితము లతని
కేమి వినపడిచచ్చు నీప్రేమఘోష.

జాఘరావల్లకొనలు వాల్ జడలు రెండు
రెండు గాలికి టపటపల్ రెపరెపలుగ
అతను విజయధ్వజమ్ము నా నతని వెనుక
సీటుపై రతి కొనిరి నీపాట వినును.

పాటవిని కామపరవశోల్బణము లతివ
చూపు రాకెట్లతని వీపు చొచ్చి గుచ్చి
దూసికొని త్రోసికొనిపోయి తుదకు బవిరి
గడ్డ మాతని దోకయింత కిళవళించు.

౫

అదిగో మూడు చక్రాలవాహనము స్వీయ
విశ్వరూపదర్శన జిత విష్ణుమూర్తి,
స్వంతవాహనములు లేని జంటలకును
సరసశృంగార కేళి కాస్థానభూమి.

అతఁడు నారాయణుఁడా మహాప్రశస్త
శీధుపానాధరీకృత సీరపాణి,
కలితరథచోదనక్రియా కౌశలమున
దారుకుని మాతలిని తలదన్నినాడు.

గుమ్మటమువంటి రిక్షా
నిమ్ముగ నిఱుకుకొని రతియునించు విలుతుఁడుఁ
కమ్మని నీ కోకోల్వని
బమ్మెరవోవుదు రొకళ్ళపై నొక్కరుగా.

పరభృతకుహూనినాద సంభ్రమములు వార
లొక్కరా యిర్వరా యన్న చిక్కుపుట్టు,
పరభృతకుహూనినాద విభ్రముడు సూతు
డేకచక్రమ్ముపై సివమెత్తి యూఁగు.

౬

ఏలోకమ్మునుండి వచ్చితివో నీ
వెందుందువో గాన వి
ద్యాలాలిత్యకళాప్రపంచ మెటు సా
ధ్యమ్మయ్యెనో నీమొదఁ
త్రైలోక్య ప్రణయ ప్రసాద రచనా
త్రయ్యంతముల్ నీ మహో
లీలల్ మానసమోహనమ్ములు గదా
లీలా శకుంతప్రభూ!

ఒకరాగ మొక్కపాటగా బ్రదుకు బా
టొక్కింతయుఁ దాట కం
గక సుశ్యామల కోమల ప్రభల న
య్యాటన్ తలంపింతు వీ
వాకప లొక్కక్కశరమ్ము నొక్కనతిగా
నూర్జస్వలాంగప్రదీ
ప్తి కలాప ప్రతిపాలితాఖిల జగ
దీ్వర్థిఁ రఘూత్తంసముఁ.

సరిహద్దులు

శ్రీ అంగర సూర్యారావు

పాత్రలు:

లచ్చన్న నారాయుడు
వెంకన్న రుద్రయ్య
రాముడు రాజయ్య
చిన్నయ్య పెద్దయ్య
చంద్రమ్మ.

(తెలతెలవారుతూవుంది. దూరాన్నుంచి మేలుకొలుపుపాట శ్రావ్యంగా విని పిస్తోంది.

* "...తెల్లవారావచ్చె తెలియాక నాసామి
మళ్ళీ పరున్నావు లే-రా!
వేణునాదాము వీని వేగ పర్విచివస్సి
వేళాకోళమేల - లే - రా!"

మసక వెలుతురులో రంగస్థలం అస్పష్టంగా-స్వప్నంలోని దృశ్యంలా-కనిపిస్తూవుంది. ఒక పంటపొలం - పొలం మధ్య ఒక పెద్ద గట్టువుంది. పొలాన్ని - ఆగట్టు - రెండు భాగాలుగా విభజిస్తోంది. దూరాన్ని గట్టుకు యిరువైపులా రెండు గడ్డిమేట్లు - మసక వెలుగులో కొండలలా కనిపిస్తున్నై. కథ జరుగుతూవుండగా రంగస్థలం మీదికి క్రమంగా ఉదయకాంతి వస్తూ వుంటుంది. ఎడమవైపు గడ్డిమేటుకు చేరబడి వెంకన్న కునుకుపాట్లు పడుతూ వుంటాడు. పాట దూరంగాపోయి గాలిలో కలిసిపోతుంది.)

వెంక : (కళ్ళు తెరిచిచూసి భయంతో) ఓరి దేవుడా! అప్పుడే తెల్లారి పోయింది!

లచ్చ : (నేపథ్యంలో) ఓరేయ్ వెంకన్నా!

వెంక : (ఉలికిపడి లేచి నుంచుని) యిక్కడే వున్నాను బాబయ్యా!

(లచ్చన్న ఎడమవైపునుంచి వస్తాడు. మోకాళ్ళ వరకూ పంచె యెత్తికట్టాడు. లావుగా పొట్టిగా వున్నాడు. తెల్లగావుంది. భుజం మీద తువాలు వేసుకున్నాడు. వేళ్ళకు రవ్వల ఉంగరాలు వున్నాయి.— వేషాన్నిబట్టి 'పెద్ద రైతు' అని తెలుస్తూ వుంది.)

లచ్చ : జాగర్తగా యిక్కడ కాపలా వుండరా యెవరా అంటే నిద్రపోతున్నావంట్రా?

వెంక : లేదు బాబయ్యా! తెల్లవార్లూ మెలుకూగానే వున్నాను. నాకంఠంలో వూపిరి వున్నంతదాకా (గట్టుకేసి చూపిస్తూ) ఆ అడ్డుదాటి చెమ్మ దేవుడైనా యివతలికి రానియ్యను.

లచ్చ : (కోపంతో) ఆ వెధవలంతా యెంక మా అయ్యదగ్గిర పాలి కాపులు. ఆళ్ళికిప్పుడు కొమ్ములు మొలిసిపోయినై. గింజాకు పచ్చినా బోద కాలవ వొదల్ను. ఒక్క నీటిచుక్క కూడా దొరకనివ్వను.

వెంక : ఆళ్ళు రాత్రంతా తిరుగుతానే వున్నారండి.

లచ్చ : ఓరేయ్ వెంకన్నా! తిరగడమే కాదురా! ఆళ్ళంతా యియ్యేళ నా మీదకి రాడాకి తయారుగా వున్నారు.

వెంక : దిక్కుమాలినకాలం. ఒకప్పుడు తమరిపేరు చెబితే చుట్టుపట్ల మూడూళ్ళదాకా హడల్. యీ యెలక్షన్ రోజులొచ్చిం దగ్గర్నుంచీ ప్రతీవోడూ పెళ్ళికొడుకులాగ బిర్ర బిగుసుక్కూచున్నాడు. ఐదేళ్ళకిముందు లచ్చన్న కాపు పేరుచెబితే దిశలు తెల్లారేయి.

లచ్చు: సుబ్బయ్యగా డైరుసుదువు గాదూ?

వెంక: అక్షరోక్కం బాబయ్యా!

లచ్చు: తెగమిడిసి పడేవోడు యెవడు! నూసేను. ఆలో సింగేను.—యీడి పొగరిలాక్కదని మన దూళ్లమందని—అది పైరు పేలోకి ఒక రాత్రి కాడ తోలించేశాను. ఒక యేడాదిలో దివాళా తీసేశాడు. పొలం తిణఖా పెట్టేశాడు.

వెంక: యిప్పుడు జనం తెలివి మీరి పోయేరు బాబయ్యా! యీళ్లకి భయం, భక్తి లేవు.

లచ్చు: (మీసం మెలేస్తూ) మన సంగతి యీ దెబ్బతో తెలిసి పోతాది.—యివేళ సరద్దు దాటేసి కాలవ తెగ్గొట్టేస్తానంటున్నాడంట.

వెంక: (ఆత్రుతతో) ఆ మాట అన్నా డెవడండీ?

లచ్చు: నారాయుడు.

వెంక: ఆ గట్టు దాటిన గాడిద కొడుకుని పట్టుకుని మేకన్నరపట్టు వరికి పారేస్తానండి.

లచ్చు: మనం అనుకున్నట్టు లేదు యవ్వారం. రంగు మారతంది. పల్లెపుపాలాలోళ్లంతా యేకమై పోయేరు. మనం యిరవై నాలుగ్గంటలూ కాసుకుని వుండాలి.

వెంక: యిక్కణ్ణించి అడుగు కదపటం లేదు బాబయ్యా!

లచ్చు: యీ గట్టు కాపలా కాయటం నీ వొక్కడివల్లా అవ్వదు. యెవడైనా గట్టుదగ్గిరి కొచ్చేడో యెంటనే రుద్రయ్యగాణ్ణి పిలు (ఎడమవైపు తిరిగి బిగ్గరగా పొలికేక వేస్తాడు.) ఓ...రి... రుద్రయ్యా!

రుద్ర: (దూరాన్నుంచి) ఓ...హోయ్!

[మరుక్షణంలో రుద్రయ్య ఎడమవైపునుంచి అమాంతంగా వచ్చి వాల్తాడు. పెద్ద గిరజాలతల. పొడవుగా వున్నాడు. వంపులు తిరిగిన దండలు. మోకాళ్ళవరకూ పంచె, బనీను. కోరమీసం పైకి మెలితిరిగివుంది. చేతిలో కర్రవుంది.)

రుద్ర: (వస్తూనే బిగరగా) యెవడు? గట్టు దాటిన యెవర యెవడంట!! (చుట్టూ చూస్తాడు.)

లచ్చు: యింకా యెవడూ దాట్లేదులే! (రుద్రయ్య వీపు తట్టుతూ) ఒకేయ్ రుద్రయ్యా! నువ్వు జాగర్తగా వుండాలి. అళ్ళంతా కూడబలుక్కున్నారని తెలిసింది. యివ్యేళ గట్టు దాటేస్తారంట.

వెంక: యెవడైనా గట్టు దాట్డానికి వచ్చేడో యెంటనే నిన్ను పిలుస్తాను.

రుద్ర: నీ కేక యినగానే కాకిలా వాల్తానిక్కడ.

లచ్చు: దానగొట్టి చెవులుయీ సెయ్. పనోస్తే పదొందలు ఖర్చుపెడతాను. నీకేం బయం లేదు.

రుద్ర: (హుంకరించి) నాకా బయం! ఆ యెదవలికింకా నా సంగతి తెలవనంలేదు.

వెంక: పులయ్యగాడి కాలుసరికి ఆర్నెల్లు జైలు కెళ్ళొచ్చేవ్ — నీ సంగతి తెలుసుకపోడ మేట్రా?

రుద్ర: యీ దెబ్బతో పూర్తిగా తెలిసిపోవాల్నా సంగతి.

లచ్చు: ఒకేయ్ రుద్రయ్యా! నువ్వుమాత్రం కోర కాలవని ఒకకంట కనిపెడూవుండాలి. మన కతంతా దాన్తోవుంది.

రుద్ర: నేనక్కడే కూర్చుంటున్నాను.

లచ్చు: పద! పద! అక్కడికే యెళ్లిపో! (వెంకన్న వైపు తిరిగి) ఒకేయ్ యెంకన్నా! నువ్విక్కణ్ణించి కదలకు.

వెంక: అలాగే బాబయ్యా!

రుద్ర: యీ మద్దిని మన సేతులికి పనిలేక కుదులు పట్టేస్తున్నాయి. (ఎడమవైపు వెళ్ళిపోతాడు.)

లచ్చు: నేను పైపాలంలో వుంటాను. అవసరమొస్తే పిలు!

వెంక: అలాగే బాబయ్యా!

(లచ్చన్న ఎడమవైపు వెళ్ళిపోతాడు. వెంకన్న గట్టు దగరనుంచి ఎడమ చివరవరకూ తిరుగుతూ వుంటాడు. వెంకన్న ఎడమవైపు తిరిగి వున్న సమయంలో కుడి చివర నారాయుడు కనిపిస్తాడు. రెండడుగులు ముందుకు వేస్తాడు. వెంకన్న ఆకస్మికంగా తిరిగి చూస్తాడు.)

వెంక: (బిగ్గరగా) ఆగక్కడ! గట్టుదాటేవో నీ తలకాయ నీది కాదు.

నారాయుడు: (నిర్లక్ష్యంగా నవ్వి) ఎందుకురా రెంకన్నా అలా ఉలికులికి పడతావ్?

వెంక: ఒరేయ్. నారాయుడూ! మన పుట్టరికాలు ఇక్కడ కాదు ఇంటికాడ.

నారా: (ముందుకు వచ్చి చేతికర్ర గట్టుమీద ఆని) నేను నా నేలలో నా అద్దులో నిలబడి మాట్లాడుతున్నాను.

వెంక: నీ అద్దులో నువ్వుంటే గోడ వేలేను. అద్దు దాటితే నే చెప్పి.

నారా: నువ్వే న్యాయం చెప్పరా రెంకన్నా, బోదకాలవకి అడ్డెయ్యడం న్యాయమా?

వెంక: అదంతా నాకు తెల్దు. నేను తలమున్కలున్నా వోణ్ణి. నౌకరీవోణ్ణి. పెద్దర లేం చెప్తే అదే సెయ్యాలి.

నారా: న్యాయంతో నాకేం పనేదంటావా?

వెంక: న్యాయమో, అన్యాయమో తీర్పు చెప్పడానికి పూళ్ళో పెద్దమనుసులున్నారు.

నారా: పూరి పెద్దల్లో నీతుంటే ఇన్ని తగాదాలు, పేచీలు ఎందుకొస్తాయ్‌రా రెంకోడా!

వెంక: నువ్వు సెప్పింది నిజమే, అయినా యీ గొడవలో నే నేం సెయ్యలేను.

నారా: దేవుడు కళ్లెందుకిచ్చేడు? మంచిదారిలో నడవడానికి. బుద్ధి ఎందుకిచ్చేడు? మంచిపనులు సెయ్యడానికి.

వెంక: నన్నేం సెయ్యమంటావ్ నువ్వు?

నారా: ఏం సెయ్యొద్దు. నాల్రోజులపాటు పొలం లోకి రాడం మానెయ్. మా పని మేం సూసుకుంటాం.

వెంక: లచ్చన్నగారి నౌకరీలో వున్నంతకాలం నేను ఆ పని సస్తే సెయ్యను.

నారా: రెంకన్న బావా! మరోమాటు ఆలోసించు నువ్వు పిల్లలుగలోడివి.

వెంక: నువ్వెంత సెప్పినా నేను యిన్ను.

నారా: లచ్చన్న తన పొలంలోం చొస్తున్న బోదకాలవకి గట్టేసేడు. మా పొలాల్లోకి ఒక నీటి సుక్కైనా రాకుండా సేసేడు. తను పెద్ద రైతు. తన పొలానికే ముందు నీరెట్టుకో మన్నాం. తనపొలం తడిసేక మానేలకి నీరొదల మన్నాం. వొదలనంట. పైగా తనసెరువుకి నీరు పెట్టుకుంటాడంట. పిల్లా మేకల్తో మేం బీదోళ్ళుంతా యేమైపోవాలి? మా చిన్న మడి పండక్కర్లేదా? మాకు కట్టుకోడానికి గుడ్డ లేకపోతే మానె తిండానికి తిండైనా వద్దా?

వెంక: (బాధగా) నే నేం సెయ్యలేను నారాయుడూ!

నారా: నువ్వేం సెయ్యొద్దు. తప్పుకో. నువ్వు నాకావలసినోడివి గనక యింత సెబుతున్నాను. నువ్వు తప్పుకుంటే సాలు. మేం గట్టు తెగ్గొట్టేస్తాం. మా నేలు తడుపుకుంటాం.

వెంక: (తీవ్రంగా) నా గొంతులో పూపిరున్నంత దాకా ఆపని జరగదు.

(కుడివైపునుంచి రాముడు వస్తాడు. వయస్సు 20 సంవత్సరాలు. నూనూగు మీసం, మల్లు చొక్కా, పంచెకట్టూ, చేతిలో కర్రా, ఉంగరాలు తిరిగి చిందరవందరగావున్న నల్లటి జుత్తు. ముఖంలో ఉద్రేకం, మురుకుతనం కనిపిస్తూ ఉంటాయి)

రాముడు: (వస్తూనే నారాయుడుతో) ఒరేయ్ బాబా! నీకు బుద్ధిలేదురా, యీళ్లతో మళ్ళీ రాజీ బేరాలకొచ్చేవా?

నారా: మరోమాటు సెప్పిసూదామని. ఏమన్నా వింటాడేమో అనుకున్నాను.

రాము: నీ వెర్రికాని ఆళ్ళు నోటిమాటల్తో యినర్రా బాబా!

వెంక: (రాముడితో) ఒరే రాముడూ! బొడ్డూడని కుర్రోడువు! నీకెందుకురా యీ గొడవలు!

రాము: (తీవ్రంగా) రెంకన్నమామా! మీరు సేసే అన్యాయాలు మావొళ్లకుర్రాడిక్కూడా తెలుస్తాయి. కాని తెలగా ఉండని నువ్వెంత సెప్పినా సిన్నకుర్రోడుకూడా ఒప్పుకోడు.

నారా: ఆ కరువుమాటు కచ్చితంగా లచ్చన్న కాపుని నిలదీసి అడుగుతాను ఒప్పుకుంటాడా! సరేసరి! లేదా...

రాము: (మధ్యలో అందుకొని బిగ్గరగా) ఒప్పుకోడు. తగినబుద్ధి సెప్పేదాకా ఒప్పుకోడు. యేడాది

కితం మన పొలం పదిగజాలు కలిపేసుకున్నాడు. రాత్రికి రాత్రి పరిహద్దులు మార్చేశాడు. అంత అన్యాయం సేసినా మనం అప్పుడు నోరెత్తలేకపోయాం.

నారా: తలూపెప్పే పెద్దమనుషులుకూడా అన్యాయానికే ఒడికట్టేరు.

రాము: యెంకన్న మావాఁ! యిప్పుడైనా తెలుసుకో! మా పెద్దరైతులరోజులు వెళ్ళిపోయినై. యింక ఆళ్ళ ఆటలు సాగవ్. సిన్నరైతులమంతా యేకమైపోయాం. పరిహద్దులు సెరిపేశాం. ఉమ్మడి యెవసాయం సేసుకుంటున్నాం.

నారా: యీమాట వప్ప సెప్పినా కష్ట సెప్పినా ఒకడికి రాదు. అందరికీ వస్తాది. అందరూ ఒక తాటిని నిలబడతారు.

రాము: మా లచ్చన్నలాంటి పెద్దరైతులు వందరుందొచ్చినా యేం జంకం. ఒకే మాటమీద నిలబడతాం.

నారా: యెంకన్న బావా! నువ్వుకూడా యెందుకీ గొడవలో యిరుక్కుంటావ్? రా! మాతో కలిసిపోయి యెవసాయం సేసుకో. మాతో పాటు కలో గంజో తాగు. యీ రక్తంకూటికి ఆశపడక.

వెంక : ఒరేయ్ నారాయుడూ! నీపాటి నాకు తెల్దనుకోకు. యీ నౌకరి నేను కుదుర్చుకున్నది కాదు. మా తాత ముత్తాతలదగ్గర్నుంచి వస్తంది.

రాము : మీ తాత ముత్తాత లెలా వున్నారో నువ్వూ అలాగే వుండామనుకుంటున్నావా? నీ బతుకు ఆళ్ళకంటే కొంచెమైనా మెరుగ్గా వుండొద్దా?

వెంక : యీ బతుకిలాగ ఎళ్ళిపోతే సాలురా రాముడూ!

నారా : యెంకన్న బావా! మరోమాటు సెబుతున్నాను. నామాట యిను. రెండ్రోజులపాటు నువ్వే పని మానేసి యింట్లో కూర్చో. నీలాంటి మంచోడు యిలాంటిగొడవల్లో సిక్కుకోడం నాకిష్టం లేదు. అందుకని యింత సెబుతున్నాను.

వెంక : నువ్వెంత సెప్పినా నా పని నేను మాన్ను. మా రైతు యేం సెప్తే అదే సెయ్యాలి నేను. యీగట్టు కాపలా కాయమన్నాడు. అదే సేస్తన్నాన్నేను.

రాము : (కోపంతో) ఒరేయ్ బావా! యిక నోటి మాటల్తో పనులవ్వవురా! (బిగ్గరగా) యిదిగో! యెంకన్నా సెబుతున్నాను. బోరు కాలవకి మా కేసిన గట్టు ఈరోజు జబర్దస్తీగా తెగ్గొట్టేస్తాం. యేమౌతుందో సూస్తాం.

రుద్రయ్య : (బిగ్గరగా కేకలు వేస్తూ ప్రవేశిస్తాడు.) ఒరేయ్! ఒరేయ్! యెవడ్రా అక్కడ? గట్టు తెగేసే మొనగాడెవడ్రా అంట! (ముందుకు ఒక్క దూకుదూకి పొలం గట్టుమీద చేతికర్రతో ఒక్కటి కొడతాడు.)

రాము : (గట్టును సమీపించి కోపంతో) చెప్రా!

రుద్ర : ఒరేయ్! నీకు మూతిమీద మీసంవుంటే గట్టు దాటరా చెబ్తాను.

రాము : ఇయ్యాళ నువ్వో నేనో తేలిపోవాలి.

(రాముడు బిరబిరా గట్టుదాటబోతాడు. నారాయుడు రాముణ్ణి రెండుచేతుల్తో పట్టుకొని వెనక్కి లాగేస్తాడు.)

రుద్ర : ఒరేయ్! మీతండ్రీకొడుకులిద్దరూ యేకమై కాలవగట్టు తెగ్గొడదామనుకున్నార్రా! (సగర్వంగా) జాగర్త! యీ రుద్రయ్యగాడు యిక్కడున్నాడని జ్ఞాపకం వుంచుకోండి.

నారా : (కోపంతో) యేట్రా! పూటకుడికోడీ తెగ మిడిసిపడతన్నావ్?

రుద్ర : ఒరేయి గట్టుదాట్రా! నీ తలకాయ తియ్యకపోతే నా పేరు రుద్రిగాడు కాదు.

(నారాయుడు, రుద్రయ్య పరిహద్దుకు యిరువైపులా దగ్గరగా నిలబడతారు.)

నారా : ఒరేయ్ యెదవా! నాయింకోసం ఆలోసిస్తన్నాంరా. మేం గట్టుదాడ్డం కాని తేవాలంట్రా? సెనంపట్టదు.

రుద్ర : ఒరేయ్ 'నేను ప్రతిజ్ఞ చేస్తన్నాన్రా' అడ్డుదాటిన యెదవకి తలకాయతీసి బూమిలో పెంతేస్తాను.

(కుడివైపునుంచి తొందరగా చిన్నయ్య, పెద్దయ్య ప్రవేశిస్తారు. యిద్దరి చేతుల్లోనూ

కర్రలువున్నాయి. వేషాన్నిబట్టి చిన్న రైతులని తెలుస్తోంది.)

చిన్నయ్య : (ఒక్కదూకు దూకి నారాయుడు పక్కను నిలబడి) తలకాయిలేసి సెలవేసి మెంతగాడెక్కడా?

పెద్దయ్య : (ముందుకువచ్చి) ఒరేయ్ గుర్రిగా, వాయంగాసెత్తే యింటాంగని 'తిన్నాతాం దున్నతాం' అంటే మేమంత తీసిపోయేమను కున్నావంట్రా!

వెంక : (సమాధానంగా) ఒరేయ్, రుద్రయ్య 'నువ్వెళ్లిపో' నువ్వుంటే యింకా గొడవ ముదిరి పోతాది. యీళ్లు అదుదాటరులే. నేను సూసు కుంటాను యెళ్లు.

రుద్ర : (విధిలేక) యేదో పెద్దోడువు నువ్వుసెప్పేవని వూరుకుంటన్నాను. యీళ్లు గట్టుదాటితే నన్ను పిలు, ఒకొక్కడ్ని కప్పెట్టేస్తాను.

(ఎడమవైపు వెళుతూవుంటాడు.)

రాము : పోరా, కుక్కా,

చిన్న : (హేళనగా) దుగ్గొచ్చి!

(రుద్రయ్య గత్యంతరంలేక వాళ్లకేసి కోపంగా చూసి వెళ్లిపోతాడు.)

పెద్ద : ఒరేయ్, యెంకన్నా, అళ్లకి బుద్దిలేకపోతే నీకైనా వుండక్కర్లేదంట్రా, గవర్నమెంటు కాలవకి లచ్చన్న అడ్డేస్తాడా? మాకు నీళ్లు రాకుండాసేస్తాడా? అడి పొలాలు బంగార మయిపోవాలా? మా పొలాలు మట్టయి పోవాలా?

చిన్న : మేంమాత్రం పన్నులు కట్టడంలేదంట్రా?

రాము : మునసబు కర్ణాలు పొలాలు పండినా పండక పోయినా ముక్కుపిండి డబ్బువసూలుసేస్తన్నారు.

చిన్న : అళ్లి మామ్యాక్ట్రితో సయిగెం నిలదీసి వసూలు సేస్తున్నారు.

నారా : డబ్బున్న మారాజులు డబ్బుజలేసి పండినా పండలేదని రాయించుకుంటున్నారు. శిస్తు తగ్గించుకుంటున్నారు.

పెద్ద : యీ పల్లెటూళ్లలో పెద్దమారాజులు సేస్తన్న అన్యాయాలు యిన్నీ అన్నీ కావు జబర్దస్తీగా సరద్దులే మార్చేస్తున్నారు.

నారా : అన్యాయానికి ఒడిగట్టినోళ్లని భగవంతుడు కనిపెడతా వుంటాడ్లే!

పెద్ద : అదెలాగా తప్పదు. యెంతటికి 'హిట్లర్' యేంజేశాడు? దేవుడిచ్చిన సముద్రానికి, ఆకాశానికి, భూమికి అన్నిటికీ అద్దులు పెట్టేశాడు. సివరికి బస్మాసురుళ్లాగ బూడిదై పోయేడు.

చిన్న : యిప్పుడా లచ్చన్నకికూడా అలాంటికాస్తే అవ్వాలి.

రాము : అదెలాగా దేవుడానిపెట్టిండే.

నారా : పదండిపోయి ఆలోసిద్దాం. మనోళ్లందరూ యేమంటారో యిందాం.

చిన్న : యిమ్మేళితో కాలవనీటి సంగతి తేల్చెయ్యాలి. లేకపోతే మనం మట్టిగొట్టుకుపోతాం.

రాము : డబ్బు మూటగట్టి దాస్తన్నాడు, అలాగే నీళ్లనుకూడా తన సెరువులో దాసుకుందా మను కుంటన్నాడు లచ్చన్న.

నారా : గవర్నమెంటు పొలాల్లా గేసుకుంటారని తేలగానే...

రాము : (సంధ్యలో అందుకొని) గింజకు సచ్చి పోయేడు.

చిన్న : కొడుకులపేర్ని, కూతుళ్లపేర్ని, మనవలపేర్ని పొలాలన్నీ సర్దేశాడు.

నారా : సివరకి పిసరంభూమి కూడా సైకిపోడానికి దారి లేకుండా సేశాడు.

పెద్ద : డబ్బున్న మాదాజాలం జేసినా అలా సెల్లి పోతాది. (యింతవరకూ తలవంచుకొని దిదారంగా ఆలోచిస్తున్న వెంకన్నతో) యేం కన్నా, మేం యెళ్లొస్తాం. లచ్చన్నగారితో మరోమాటు సెప్పు. నీళ్లు మర్యాదగా వొదిలి పెడతాడో...

చిన్న : (మధ్యలో అందుకొని) వదిలిపెట్టమను లేదా

రాము : యీ రోజు పొద్దుకూకేసరికి మేమే కాలవ గట్టు తెగ్గొట్టేస్తాం.

పెద్ద : (అందరితో బిగ్గరగా) పదండిరా! పదండి!

చిన్న : యింక వూరుకో దానికి యీ శ్లేదు.

రాము: యీ రోజుతో తేల్చేద్దాం

నారా: యెంకన్న బావా! ఆలోసించుకో! నువ్వు బురదలోంచి తప్పుకో!

(రాముడు, నారాయుడు, చిన్నయ్య, పెద్దయ్య కుడివైపు నిష్క్రమిస్తారు. వర్షంకురిసి వెలిసినట్లయ్యింది. అంతా నిశ్శబ్దం. వెంకన్న ఒక్కడూ దిగులుగా యేదో ఆలోచిస్తూ అటూ యిటూ తిరుగుతున్నాడు. ఆ ప్రశాంతతను చీల్చుకొని దూరాన్నుంచి పాట వినిపిస్తోంది.

* "ఓ...ఓబలేసుని కొండల నడుమా
యెద్దులతో శే ముద్దుల మరిది
దాపటెద్దుకు దప్పికాయెనురా...ఓ..."

యెద్దుల మువ్వలన్నీ వినిపిస్తుంది. "ఒరేయ్! యెలపటెద్దా నొక్కి పెయ్యరా!" "దాపటెద్దు నోటి పాదు." "ఓ...ఓరి మల్లయ్యా!... ఆగి తినిలా మళ్లించరా!"—అని కేకలు వినిపిస్తూ వుంటాయి. — ఒక చేత్తో అన్నంముంత పట్టుకొని ఒయ్యారంగా ఎడమవైపునుంచి చంద్రమ్మ వస్తుంది. వయస్సు 15 సంవత్సరాలు. జుత్తు చిందరవందరగా ముఖంమీద పడుతోంది. ముఖంలో చురుకుతనం కనిపిస్తోంది. పరికిణీ, ఓణీ, జాకెట్టు వేసుకొంది).

చంద్ర : (వస్తూనే) ఒరేయ్ అయ్యా! నే నొస్తుంటే నేం...దారిలో నేం...

వెంక : (ఆత్రుతతో) యేమయ్యిందే తల్లీ?

చంద్ర : ఆ కొండయ్యగాడ్లేడూ?

వెంక : (కోపంతో) యేం! యేం జేశాడు?

చంద్ర : ఆబోతు-నేం ... దుగ్గుచ్చికొట్టి తోలేశాడు.

వెంక : (నవ్వుతూ) అంతేనా!

చంద్ర : అప్పుడా ఆంబోతు యేం జేసిందను కున్నావురా అయ్యా!... ముంగు కాళ్లు రెండూ పైకిలేసి లగాపు తీసేసింది. అడ్డొచ్చిన పెట్టెల్నీ, బుట్టల్నీ కుమ్మేసింది.

వెంక : కొండెదవ ఆ కొండిగాడు పేనేసుక్నీ ఆలాంటిపన్లే.

చంద్ర : అప్పుడె నేం జేసి నవుతున్నావ్. పొలంగట్టు వోడిలేసి పుంతలోంచొచ్చేను.

వెంక : అందుకే ఆలిస్యంగా వొచ్చేవ్. పాసే అయ్యా! సుట్టు తిరిగి రావడమే మంచిదయింది.

చంద్ర : (ముంత తండ్రి చేతికిస్తూ) ఒరేయ్ అయ్యా! యియ్యేళ పల్లికూటిలోకి పోరగాయ ముక్క లేదురా. కోమటమ్మ కొట్టు కట్టేసింది.

వెంక : (ముంత తీసుకొని) పొన్లే, నేను పద్దికూడు తినొచ్చేదాకా యిక్కడే కూచో. యీగట్టు కేసి సూస్తా వుండు.

చంద్ర : గట్టుకేసి సూడ్డం యెందుకురా అయ్యా! అదెక్కడికైనా పారిపోతాదంటే?

వెంక : నీకు తెల్దులే, అది ఆర్థికే మనకీ అదు. యెక్కడికీ కదలకొండా కూర్చో.

(వెంకన్న ముంత తీసుకొని ఎడమవైపు వెళ్ళిపోతాడు. చంద్రమ్మ చుట్టూ చూస్తూ యేం తోచక అటూ యిటూ తిరుగుతుంది. కోకిలను అనుకరిస్తూ "కోయ్...కోయ్..." అని కూత కూస్తుంది. తనలో తను నవ్వుకుంటుంది. తన్మయంతో పాట పాడుతూ వుంటుంది.)

చంద్ర : (పాట) ఇసుక వడిలో దూరి బుసలుకొట్టింది
పాడుతూ కోయిలా పరుగులెత్తింది.
ఆడుతూ ఆ సెవలి అలిసిపోయింది.
నవ్వుతూ మా అయ్య బువ్వతిన్నాడు.

(పాట మధ్యలో కుడివైపునుంచి నెమ్మదిగా రాముడు ప్రవేశిస్తాడు. చేతికర్రమీద గడ్డం ఆని చంద్రమ్మకేసి కొరచూపులు చూస్తూ వుంటాడు)

చంద్ర : (రాముణ్ణి చూడగానే) యేరోయ్, రాముడూ అరవంతరి నోళ్లా మొకం అలా పెట్టుకున్నావేం?

రాము: (కోపాన్ని భివయిస్తూ) ఏయ్ పిల్లా! నువ్వు నాతో మాట్లాడకు.

చంద్ర: (వెంటనే) నీతో మాట్లాడకపోతే నాకేం నష్టమా?

రాము: మీ బాబుకీ మాకూ పేచీ మాంచి పాకంలో పడింది. తెల్సిందా?

చంద్ర: మా బాబుకీ మీ బాబుకీ పేచీ వుంటే వుండనియ్. మధ్దిని నీకూ నాకూ యెందుకూ అంట—యీ మాటి తిప్పుకోడాలు.

రాము: మీ బాబు సాలా అన్యాయాని! వొడికట్టుకున్నాడు.

చంద్ర: (కోపంతో) అలాంటి కట్టాకోరుమాటలు నాతో సెప్పకు. సుంచిమంచి మల్లిపువ్వులు గురించి. దోరదోర జాంకాయలుగురించి నాతో యెంతసేపైనా సెప్పు యింటాను.

రాము: చంద్రమ్మా! కచ్చితంగా సెప్పేస్తున్నాను యినను. యియ్యాళనుంచి నీకూ నాకూ మాటల్లేవు.

చంద్ర: (ఒక్క దూకుదూకి — చెంగున పరిహద్దు దాటేసి రాముణ్ణి చెరిపట్టుకొని) యేది? నువ్వు నాతో మాట్లాడ్డని పెమాణకం సెయ్యి.

రాము: (చలికిపడి చేరి విడిపించుకొని) యేయ్ పిల్లా! కొంపతీసేశావు. పరిహద్దు దాటేశావు!

చంద్ర: (తేలిగా) అలాంటి అద్దులు యీనాటివా అన్నా నాను. నాకు అద్దేంటంట! తెగమాట్లే గట్టు దాటకుండా సెయ్యగలవా?

రాము: మెళ్ళో పలుపుతాడేసి కట్టేస్తే సరి.

చంద్ర: యెంతసేపు కట్టగలవేంటి?

రాము: యెంతసేపైనా సరి!

చంద్ర: పోదూ! పట్నపోళ్లలాగ పూసులబూత్రం సెబుతావ్. (రాముడి చెయ్యిపట్టుకు లాగుతూ) దా! దా! మా వుసిరిసెట్టు కాడ కెల్దాం.

రాము: మీ అద్దులోకి నే రాను.

చంద్ర: నువ్వు రాకపోతే యేంజేస్తానో తెలిసిందా?

రాము: యేంజేస్తా వేంటి?

చంద్ర: పొగరుమోతుయెద్దుని యీడ్చుకెళ్ళతారు సూశావా? అలాగ ముక్కుకితాడేసి యీడ్చి కెళతాను. (గట్టువరకూ చెయ్యిపట్టుకొని లాక్కెళుతుంది.)

రాము: (ఉపాయం ఆలోచించి) సూడే చంద్రీ! (కుడివైపు చూపిస్తూ) అదుగో! ఆ సేరెకు సెట్టు సూడు! వల్లగా — దాక్షపల్లిలాగ — యెంతందంగా వున్నాయే సేరేకుపళ్లు...

చంద్ర: (ఉత్సాహంతో అటుమాస్తూ) మరి నువ్వు సెట్టెక్కి కోస్తావా?

రాము: నేను సెట్టెక్కి కొమ్మలు దులుపుతాను. నువ్వు కిందపడ్డ పళ్ళు యేరి మూటగట్టు.

చంద్ర: అయితే పద!

(రాముడూ చంద్రమ్మా చెయ్యీ చెయ్యీ పట్టుకొని కుడివైపు వెళుతూ వుంటారు. అంతలో పాటవిని వెనక్కి తిరిగిమాస్తారు. రాజయ్య హుషారుగా యీలేసి పాటపాడుతూ ప్రవేశిస్తాడు. మోకాళ్లవరకూ పంచె, చేతిలో కర్ర, పైమీద పంచె—వయస్సు 30. సంవత్సరాలు.)

రాజయ్య: * రూపాయి కావాలా పిల్లా
రూపాయి పిల్లర కావాలా?

చంద్ర: (నవ్వుతూ) ఓరి రాజియ్యమావా! నుమస్కారం!

రాము: (నవ్వుతూ) బలే! బలే పాట పాడావురా!

రాజ: శాక్కుడికెళ్ళోయ్! పిల్లా పిల్లోడూ బలు ద్దేరేను!

చంద్ర: సేరేకు సెట్టుకాడికి! నువ్వుకూడా వస్తేరా!

రాజ: మీ యిద్దరికీ మధ్దిని గుదికర్రలాగ నే నెందుకు? యెల్లండా బాబా యెల్లండి! తిరగండే పిల్లా తిరగండి! యిది వయసురా బాబా! యిది పోతే మళ్లీ రాదు. ఒకమాటు పొంగి సల్లారిన పాలు—యింకోమాటు పొంగవ్.

రాము: యేం వాగుతావ్ రా వసపిట్టలాగ! రాముడు చంద్రమ్మ కిలకిల నవ్వుతూ కుడివైపు వెళ్లిపోతారు. రాజయ్య తిరిగి పాటపాడుతూ వుంటాడు.

రాజ: (పాట)

రాజమండ్రీ రయిళ్లా నేలా
రంగుబట్టా కట్టా నేలా
రమణీ నిన్నూ మరవాలేనే
రావే రావే నా యెంటా!

(ఎడమవైపునుంచి చేతులు తుడుచుకుంటూ వెంకన్న ప్రవేశిస్తాడు.)

వెంక: (వస్తూనే) యేరోయ్ రాజియ్యా! యియ్యాళ రావని రైతుదగ్గిర సెలవు పుచ్చుకున్నావ్. మళ్లా దిగబడ్డావేం?

రాజ: మా యింటిదానో యెక్కడైని గొడవా వచ్చి పడిపోయిందిరా!

* ఈ గుర్తుకలవి జానపద గేయాలు.

వెంక : యేం? యేమయ్యింది?

రాజ : ఒక్క దినం కుదురుగా యింట్లో కూచోలేక పోతున్నానంటే నమ్ము.

వెంక : సుఖంగా కాపరం చేసుకోక దెబ్బలాట లెందుకురా?

రాజ : ముద్దని చేసేం లేరా బాబూ! నువ్వు నన్నంటావ్?—అసలు బస్తీపిల్లని పెళ్లి చేసుకోడం నాదే బుద్ధితక్కువ.

వెంక : యేం చేసిందేంటి?

రాజ : దాని పోజు, దాని యవ్వారం, దాని కులుకు— అంతా దాని గోడవే! ముద్దని చెను మట్టి గొట్టుకు పోయినా దానికేంపట్టదు. నాక్కట్టుకోడానికి సుబ్రమైన పంచలొకటైనా లేదు. దానికి సుక్కల సీరలు, సారల సీరలు, పే...ద్ద— పే...ద్ద అంచులున్న సీరలు యేం కావాలంటే అవన్నీ కొనేశాను. కొన్నాళ్ళు జబ్బల్దాకా సేతులున్న జాకెట్లు కావాలంది. అలాగే తెచ్చాను. మూణ్ణెల్లు తిరక్కుండా పొట్టి సేతుల జాకెట్లు కావాలంది. పదిరూపాయలప్పుసేసి మూడు కుట్టించాను. చాలదంది. యేం సెప్పుకోన్రా నా కత, సెప్పుల్లో జోరీగలాగ యింట్లో ఒకటే పోరు!

వెంక : కొంచెం నచ్చజెప్ప లేకపోయేవంట్రా నీ పెళ్లానికి.

రాజ : అయ్య బాబోయ్! నచ్చజెప్పడమే, కాట్ల కుక్కలాగ మీదపడిపోదూ!

వెంక : యెంత సెమటోడ్చి కష్టపడ్డా మన కొచ్చే రాబడి తక్కువ. దూబరా ఖర్చులు సేసేస్తే గంజిలోకి మెతుకు కూడా దొరకదు.

రాజ : (కోపంతో) దాన్ని కాదురా అనడం! దాన్ని అలాగ తయారుచేసిన దాని బాబుని అనాలి.

వెంక : మీ మావ అలాగ సేసేడంటావా?

రాజ : మా మావ పట్నంలో జట్కా తోల్తాడు. ఆడికి యిదొక్కత్తే కూతురు. వాడు పిల్లదగ్గర్నుంచి దానికి కాఫీ నాష్టాలు, సినిమాలు, షోకులు అన్నీ మప్పేశాడు. సిన్నప్పట్నుంచీ దాన్నలా తయారుసేసి నామీదకి తోలేశాడు.

(కుడివైపునుంచి చిన్నయ్య, పెద్దయ్య వస్తారు. పరిహద్దు వరకూ వచ్చి ఆగిపోయి మాట్లాడతారు.)

పెద్ద : ఒరేయ్ యెంకన్నా! సెప్పేవా?

వెంక : లేదు.

చిన్న : అయితే మేమే సెప్తాం. మా లచ్చన్న గార్ని ఒకసారి పిల్చుకురా!

రాజ : యేరా! చిన్నయ్యా! మా రైతుతో నీకేం పని?

పెద్ద : పూసలు పెట్టుక్కూచుంటే పనులు తెమలవ్. యెళ్లి సెప్పరారా యెంకన్నా! ఆయన్నిక్కడి కొచ్చినా సరే! లేదంటే మేమే అక్కడి కొస్తాం.

రాజ : (పెద్దయ్య కేసి తిరిగి ఆశ్చర్యంతో) యేటి పెద్దయ్యా! నీక్కూడా మా రైతుతో పని తగిలిందేంటి?

వెంక : నే పెళ్ళి మా రైతో సెప్పొస్తాను. మీరు అద్దు దాటమని మాటివ్వాలి పెద్దయ్యా!

పెద్ద : రాకలేరాని కొచ్చినప్పుడు యెందుకు దాటతాంరా! యెళ్ళరా!

వెంక : ఒరేయి రాజయ్యా! నే నొచ్చేదాకా నువ్విక్కడే వుండు. (ఎడమవైపు వెళ్ళిపోతాడు.)

చిన్న : (కోపంతో) ఆడి అద్దులోంచి వస్తుంది కందా అని కాలవకి అడ్డేస్తాడా? కాలవ ఆడి బాబు గారి దనుకున్నాడో యేంటో!

పెద్ద : తొందరెందుకురా సిన్నీ! వుండు. అడ్డి రానియ్.

రాజ : ఒరేయ్ పెద్దయ్యా! నే సిన్నప్పట్నుంచీ సూస్తన్నాను. లచ్చన్న రైతు తగూలేని రోజే లేదు. మా రైతని మా రైతు మాటనే సెప్పడూ ఆణ్ణు. నాయం నాయమే! అన్నాయం అన్నాయమే.

చిన్న : ఆడు సేయించే అన్నాయాలు నువ్వు సూస్తన్నావ్ కందా!

రాజ : సూడక పోడయేంట్రా బాబూ! పక్క పాలాల్లో దూళ్లని బందెలదొడ్లో పెట్టించేసేడు. పండిన పాలాల్ని పాడు సేయించేసేడు. ఎదురు సెప్పినోళ్ళని పట్టుకు యిరిసికట్టి కొట్టించేసేడు,

పెద్ద : అలాంటోడి దగ్గర నువ్వు నౌకిరీకెందుకుంటన్నావ్?

రాజ : గతిలేక వుంటున్నాను. యెక్కడైనా మంచి పన్దొరికితే యిది వొదిలేస్తాను.

చిన్న : మాపన్లోకిరా! మీ రైతుయిచ్చే దానికంటే ఒక కాటాబస్తాడొడ్లు యెక్కువ యిస్తాం.

పెద్ద : మాపొక్క, యిలాంటిచేరం మళ్ళీ దొరకదు.

రాజ : (మెత్తబడి) యీ తొలకారి (తొలియేకారిది) దాకా నాకు పనుంది. అది అయిపోగానే యిక్కడ మానేస్తాను.

(ఎడమవైపునుంచి ముందు వెంకన్న వస్తాడు. వెనక రుద్రయ్య కేకలువేస్తూ దూకుడుగా వస్తాడు.)

రుద్ర : (వస్తూ కేబిగ్గరగా) యెవడ్రా? రాజిగానికి గాచ్చిన మొగోడెవడ్రా అంట!

(రుద్రయ్య వెనక లచ్చన్న వస్తాడు)

చిన్న : (ముందుకు వచ్చి రుద్రయ్యతో) ముద్దిని నువ్వెందుకురా కుక్కలాగ మొరుగుతావ్?

రుద్ర : ఒరేయ్, నోరు మెదిపేవంటే కజాతీసేస్తాను.

లచ్చ : పెరం అగరా రుద్రిగా, (పెద్దయ్యతో తిరిగా) యేరా పెద్దయ్యా! నువ్వెప్పుడు పెద్దరైతువైపో యేవన్నమాట, బోర యిగసు కొచ్చేవేంటి సంగతి?

పెద్ద : బాబయ్యా! మేమెక్కడ? తమరెక్కడ? మేం పెదరైతులం—సచ్చినా—అవ్వలేం.

లచ్చ : బతుకుంటాలు, యెకరం, యెకరంనరవున్న సిన్నా పిన్నా రైతులందర్నీ యేకం జేశావ్. సరే, సేసేవే అనుకో, అల్లందర్నీ నా మీదకి తోల్తున్నావా?

పెద్ద : నేనేం సెయ్యలేదు బాబయ్యా!

చిన్న : ఒకర్ను సేసేదేంటి? పీకల్లోంచి అల్లంతట అల్లే యెలుగులో కొచ్చేరు.

లచ్చ : (మీసంమీద చెయ్యేసి) ఒరేయ్ మీలాంటి యెదవలు లచ్చమంది యేకమైనా యీ లచ్చన్నకు తిరుగులేదు. తెలిసిందా?

పెద్ద : ఆ పట్టింపులు ఆ పౌరుషాలు మా కెందుకు బాబూ! (సంభాషణ జరుగుతూ వుండగా వెంకన్న, రాజయ్య, రుద్రయ్య, లచ్చన్న గట్టుకు యివతలవైపు — పెద్దయ్య, చిన్నయ్య అవతల వైపు నిలబడి ఒకరికేసి ఒకరు తీవ్రంగా చూస్తూ వుంటారు.)

చిన్న : మీరు బోదికాలవకి అడ్డు తీసేస్తే సాలు.

లచ్చ : నా పొలాలన్నీ నిండాలి.

పెద్ద : మీ సేలకి నీరు—మొన్నటికే—ఎక్కిపోయింది.

లచ్చ : నా సేలు నిండాలి. నా చెరువు నిండాలి— అందాక గింజుకు సచ్చినా నీరొదల్ను. ముద్దిని నువ్వెవడెవ్ రా నాకు చెప్పేవోడువ్?

చిన్న : మా పొలాలకు నీరు అక్కర్లేదా? యెండి పోయి మట్టం అయిపోవాలా?

లచ్చ : యేరా? తల తిరుగుతుందేంటి?

పెద్ద : (సమాధానంగా) లచ్చన్న బాబూ! (కుడివైపు చూపిస్తూ) ఆ పొలాలకేసి సూడండి. అటికి అల్సింగా నీరెడితే అయ్యింక బతకవ్. యీ యేడు నాసేవుడుకూడా మామీద పగపట్టేడు. వాల్లో జాలపాటు నీరొదలండి.

లచ్చ : నా అవసరం తీరిదాకా నే నొదల్ను.

చిన్న : (వ్యంగ్యంగా) తమరు మర్యాదగా వదుల్తారన్న ఆశ నా కేనాడూ లేదు.

లచ్చ : (కోపంతో) యేరా? ఒళ్లు కొవ్వెంకేంటి?

రుద్ర : (కళ్ళెర్రజేసి) కొవ్వణిచెయ్యగలను జాగర్త!!

చిన్న : (నిర్లక్ష్యంగా) పోరా కిరాయెదవా! అసలోడి కంటే కిరాయోడికి తలుకెక్కువ!

రుద్ర : లచ్చన్న బాబూ! మీరు "ఊం" అంటే సాలు. యీదవని కుండెల్తిసేస్తాను.

లచ్చ : ఆగరా రుద్రిగా! యిలాంటి గోచీపాతగాళ్ళ కంట్లో మనం జడిసేది. (తీవ్రంగా) ఒరేయ్ పెద్దయ్యా! నేను కచ్చితంగా చెబుతున్నాను యిను. మీ పొగరణిగేదాకా సుక్కనీరుకూడా వొదల్ను!

పెద్ద : పోండ్రా, మీ దిక్కున్నకాడ చెప్పుకోండి.

రుద్ర : (వినయంగా) లచ్చన్న బాబూ! తమరు మాలాంటి బీదోళ్ళతో పంతం పడితే మేము తీసిపోతాం. మా పల్లపు పొలాలోళ్ళంతా నన్ను తమ కాడకి పంపితే వచ్చాను.

లచ్చ : నిన్ను రాయబారానికి పంపేరా?

చిన్న : (ముంగుకు వచ్చి తీవ్రంగా) ఓయ్ పెద్దరైతూ (లచ్చన్న ఉలికిపడి చూశాడు.) అపల్నంగతి చెప్పడానికి మాయన్న యెంకొడ తిన్నాడు. నేనెన్నెబుకున్నాను యిను. పలపొల్లాలలోకళ్ళ్లి నక్కడికిపోయివుంది. ఆ శైపణాని కేమి చేస్తారో చెప్పలేం. నీ రొంగల్లావా? మరియాదగా యిప్పుడే వొదలెయ్యి. లేదంటావా యీ పంచేళలోగా గట్టు తెగ్గొట్టేస్తాం. రారా! అన్నా.

(పెద్దయ్య, చిన్నయ్య కుడివైపు నిష్క్రమిస్తారు.)

లచ్చ : (కోపంతో అవమానంతో ముఖం ఎర్రబడింది. క్రోధంతో) హద్దుదాటిన యెవరినిపాతి లేయం చేస్తాను.

రుద్ర : (మీసం మెలేసి) ఒరేయ్! యీ రుద్రిగాడుంటే బరిమీద తొసుపాం. యీ అద్దుదాటిన యెదవని బుర్రచెక్కలేసేస్తాను.

లచ్చ : (తొందరగా) పదండ్రా! పదండి. మనపాలి కాపుల్నందర్నీ పిలండి.

(వెంటనే రుద్రయ్య బిగ్గరగా — దకదకొక్కకు తిప్పుకోకుండా — పేరు పెట్టి పిలుస్తూ వుంటాడు. ఒకొక్కరూ నేపథ్యంలోంచి బిగ్గరగా సమాధానాలు యిస్తూవుంటారు.)

రుద్ర : ఓరి! అచ్చిగాయ్యా!

నేపథ్యంలో : వున్నాను బాబయ్యా!

రుద్ర : ఓ...రి...పుల్లయ్యా...!

నేపథ్యంలో : యిక్కడున్నా బాబయ్యా!

రుద్ర : ఓ...రెల్లిగే!

నేపథ్యంలో : ఓ...హో...

రుద్ర : ఓ...ఓ...మల్లయ్యా!

నేపథ్యంలో : హో...హొయ్...యిక్కడ...

(నేపథ్యంలో బిగ్గరగా ముక్యలవ్వరి, యొన్లు పరుగెడుతున్నప్పుడు — మనుషుల అడుగుల చప్పుడి ఉద్ధృతంగా వినిపిస్తూవుంటాయి.)

లచ్చ : (బిగ్గరగా) నడండ్రా! నడండి! యిద్యోళీ యీళ్లు గట్టుదాటేరో ఒక్కొక్కణ్ణి వొళ్లు హూనం చేసేద్దాం.

వెంక : అద్దుదాటరు బాబయ్యా! యేదో వారోపాని కన్నాడు.

రుద్ర : (నవ్వుతూ కేలిగా) అంతేరా! యెంకన్నా! నువ్వన్నకే రైటు. గట్టుదాటడానికి కాలేజా వుండొద్దంట్రా!

రాజ : (వ్యంగ్యంగా) ఒరేయి రుద్రిగా! నీక లేజా కూడొద్దు కలేజారా!!

(ముందు లచ్చన్న, రుద్రయ్య ఆర్భాటం చేస్తూ ఎడమవైపు నిష్క్రమిస్తారు. వాళ్ళవెనుక వెంకన్న రాజయ్య వెళ్ళిపోతారు, — కుడివైపు నుంచి రాముడూ చంద్రమ్మా చెయ్యీ చెయ్యీ పట్టుకొని వస్తారు. చంద్రమ్మ చేతిలో చెరకు పల్లెమూట వుంది.)

రాము : (ముందుకు చూస్తూ) కొంపలంటుకుపోయినట్టు అలా ఆగుకుంటూపోతున్నా రేంటబ్బ?

చంద్ర : ఆరుద్రిగాడంతే! పోనిద్దూ! అల్లపూసెందుకు మనకి! — నేనుకొత పాడుతాను. నువ్వెప్పటో చూద్దాం.

రాము : యేదీ చెప్పు!

చంద్ర : 'పిటాగు కొమ్మని మిటాయి పొట్లం'— యేంటో చెప్పు!

రాము : జాంపండు.

చంద్ర : (హేళనగా నవ్వుతూ) హ హ్హ హ్హ! కాదు. నేనెన్నెబ్తాను యిను—పిచ్చిగాడు!

రాము : మరి నేను పొడుస్తాను. నువ్వెప్పుకో!

చంద్ర : (ఉత్సాహంతో తలఊగిస్తూ) చెప్పు.

రాము : 'మూగయ్యను మూపెనిగంగ, పాకలి ఉతకని మడుగు."

చంద్ర : కొబ్బరికాయినీళ్లు (చప్పట్లుకొట్టి బిగ్గరగా నవ్వుతూ) చెప్పేసుకున్నాను. గెలుపునాదే. నువ్వే ఓడిపోయేవు. వుంకో పందెం యేద్దాం.

రాము : యీ మాటు నేనే ఓడించేవాన్నను.

చంద్ర : అయితే నన్ను ముట్టుకో.

(చంద్రమ్మముందు, రాముడు వెనుక పరుగెత్తారు. యిద్దరూ అమాయిక మైన ఆటేదో తేళ్లలా ఆడుతూ వుంటారు. ముందు చంద్రమ్మ పరిహద్దు దాటేసి అవతలవైపు వెళ్లిపోతుంది. రాముడు పరవశత్వంలో హద్దు విషయం మరిచిపోయి గట్టుదాటేసి ఒక్క దూకుదూకి చంద్రమ్మ చెయ్యిపట్టు కుంటాడు.)

రాము: (ఉత్సాహంతో) దొరికి పోయేవ్! నువ్వే ఓడిపోయేవ్!

చంద్ర: రెండుమాట్లు నువ్వోడిపోతే ఒకమాటు నే నోడిపోయాను.

(యిద్దరూ ఒక్కసారి నవ్వుతారు—ఎనెను చివర రుద్రయ్య కనిపిస్తాడు. యిద్దరూ అతని చూసేరు. రుద్రయ్య తల ఒకసారి పంకించి—చేతికర్ర సాపుచేసి—నెమ్మదిగా గడ్డిమేటు వెనక్కి వెళ్లి దాక్కుంటాడు.)

రాము: చంద్రీ!

చంద్ర: యేరామూవాఁ అలా సూస్తన్నావ్?

రాము: అబ్బెబ్బే యేంలేదే! రేపు పొద్దుపొడిసే సరికి వస్తావని మాటెయ్యి.

చంద్ర: నే నెందుకు రావాలి?

రాము: (కుడివైపు చూపిస్తూ) అదుగో! ఆ తాటితోపు యెనకాల జాంతోట వుంది సూశావా?

చంద్ర: చూశాను.

రాము: ఆ తోటని మా చిన్నతాత కౌలుకి పుచ్చుకున్నాడు. రేపొద్దున్నే అక్కడి కెల్దాం.

చంద్ర: (ఉత్సాహంతో) ఓ! అయితే వస్తాను.

(నెమ్మది నెమ్మదిగా వెలుగు తగ్గుతుంది ముందు మెరుపు కనిపిస్తుంది. తరవాత ఉరుము విని పిస్తుంది.)

రాము: (ఆకాశంకేసి చూస్తూ) సూశేవ చంద్రీ! ఆకాశ మంతా మసిపూసేసినట్టు యెంత నల్లగావుంది.

చంద్ర: యిలాంటప్పుడు వానొస్తే—బలే సరదాగా వుంటాది.

రాము: అదుగో! అప్పుడే గాలిదుమారం మొదలయ్యింది. మబ్బులు దూదిపింజలలా చెదిరిపోతున్నాయ్. వాన కురిసేయోగం లేదు. (విచారంగా కుడివైపు చూస్తూ) ఆ సేలన్నీ నీరులేక యెలా గండిపోతన్నాయో సూడు! (అకస్మికంగా జ్ఞప్తికి వచ్చినట్లు) అరెరే, మా అద్దు దాటేసేను! చంద్రీ! నేనింక పోతాన్లే! (ఆత్రుతగా కుడివైపు వెళుతూవుంటాడు.)

చంద్ర: (అతని చెయ్యి పట్టుకొని ఆపుచేసి) అద్దులు మీ అయ్యకీ మా అయ్యకీని. నీకూ నాకూ అద్దు లేంటి! యిక్కడే వుండు. చెన్నిగోత యిలం తెచ్చిపెడతాను. (ఎడమవైపు వెళ్లిపోతుంది)

రాము: (ఆమె చెయ్యి పట్టుకొని) అదేంటో చెప్పి'

చంద్ర: నే చెప్పను.

రాము: నువ్వు చెప్పకపోతే నేను పోనివ్వను.

చంద్ర: అయితే నువ్వు చెప్పుకో సూద్దాం.

రాము: పకోడి.

చంద్ర: కాదు.

రాము: తాటికాయి.

చంద్ర: ఉహూఁ!

రాము: కర్రపెండలంగుంప.

చంద్ర: అదీ కాదు.

రాము: మరింకేంటి చెప్పు!

చంద్ర: (అతని చెయ్యి విడిపించుకొని కిలకిలనవ్వుతూ) నువ్వు చెప్పుకో లేకపోయేవు. యిహాతి మొవ్వ. చిటికలో వస్తాను.

(చంద్రమ్మ ఎడమవైపు పరుగెత్తుకుపోతుంది. రాముడు ఆమె పోతున్నవైపు పరవశత్వంలో చూస్తూ వుంటాడు. గడ్డిమేటు వెనకనుంచి రుద్రయ్య నెమ్మదిగా ముందుకు వస్తాడు)

రుద్ర: (ఒక్కదూకు దూకి) ఇంకెక్కడికి పోతావ్ రా యెదవా! (కర్ర రెండు చేతులతో పైకెత్తి రాముడి బుర్రమీద కొట్టేస్తాడు.)

రాము: (బిగ్గరగా) ఓ...రి బాబా! సచ్చిపోయాన్రా! (కూలబడిపోతాడు. తల, ముఖం రక్తంతో తడిసిపోతాయి)

రుద్ర: (బిగ్గరగా) ఒరేయ్! అద్దు దాటిన యెదవని కైమా సేసేస్తాన్రా.

(మళ్ళీ కర్ర పైకెత్తాడు—అమాంతంగా కుడివైపునుంచి నారాయుడు, ఎడమవైపునుంచి వెంకన్న కర్రలు తీసుకొని వస్తారు.)

నారా: (ముందుకు దూకి) ఆగరా! ఆగరా రుద్రిగా! యిద్యోకతో నువ్వాకరువు.

(నారాయుడు కర్ర యెత్తుతాడు. రాముడు కూడా వెంటనే లేచిపోయి కర్ర పైకెత్తుతాడు)

రుద్ర: (కర్ర పైకెత్తి) ఒరేయ్! యెంకన్నా! ఊం! కొట్రా! కొట్రా! ఆలోసింగకు.

("తిన్నరా తిన్ను" "పాతెయ్యరా! పాతెయ్యి" అంటూ వీరావేశంతో కేకలు వేస్తూ అటు ఇద్దరు ఇటు ఇద్దరూ కర్రలు యెత్తుతారు. అంతలో

కేకలు వేస్తూ చంద్రమ్మ మెరుపులా వచ్చి ఇరు పక్షాల మధ్యా నిలబడుతుంది.)

చంద్ర: (వస్తూనే బిగ్గరగా) ఆగండి! ఆగండి! మీరు మనుషులా? పశువులా?

(అందరూ మంత్రముగ్ధులలా ఆగిపోతారు)

చంద్ర: (రాముడి మొహం తుడుస్తూ చేతులు వేసి) యెవడ్రా మావా! నిన్నిలా కొట్టింది యెవడ్రా?

రుద్ర: (మీసంమీద చెయ్యేసి) అడ్డు దాటితే కాస తాగా పాతేస్తావా?

చంద్ర: (కోపంతో రుద్రయ్య కేసి తిరిగి) నువ్వేనా! నీ చేతులు రాలిపోను! యెంత దెబ్బ కొట్టేవ్ రా! మా మావ రాను మొర్రో అంటే చేసేసి తీసు కొచ్చేను అమ్మో! అమ్మో! యెంత దెబ్బ! నా మూలాన్ని యెంత దెబ్బ తినేశావ్ రా రాముడూ! (పైటచెంగు చింపి రాముడి ముఖాన్ని వున్న రక్తం తుడుస్తూ వుంటుంది)

రుద్ర: (కోపంతో కర్ర దంకను పట్టుకొని) ఓరేయ్! యెంకన్నా ఇదంతా నువ్వు చేయిస్తన్నావ్. నీ పిల్లని అడ్డేసి వొదిలేశావు. యీ యెదవ లందర్నీ మన అడ్డులోకి రానిచ్చావ్. తొందర పడకు! లచ్చన్న రైతుని పిలిచి నీ పొగరణిగిస్తా.)
(విరవిరా ఎడమవైపు నిష్క్రమిస్తాడు)

నారా: (కోపాన్ని అపుకుంటూ) తప్పు మనదై పోయింది. లేకపోతేనా! ఆ యెదవ అంతు చూసేద్దును. పదరా! పద!

(రాముణ్ణి రెక్క పట్టుకొని కుడివైపు తీసుకు పోతూ వుంటాను. చంద్రమ్మ రాముడికేసి జాలిగా చూస్తూ వుంటుంది. రాముడు 'ఫరవా లేద'న్నట్లు చిరునవ్వుతో ఆమెకేసి చూసి నిష్క్రమిస్తాడు.)

వెంక: చూశావ్ తల్లీ! మనల్నీ యిలాంటి దుడుకుపనులే చేస్తుంటావ్! ఇంటికెళ్ళిపో! ఇంక ఇక్కడుండకు. పెద్ద రైతొస్తాడు.

చంద్ర: (విషాదంగా) ఒరేయ్ అయ్యా!

వెంక: (ఆత్రుతతో) ఇక ఆలస్యం చెయ్యకే తల్లీ!
(ఖాళీగిన్నెలు తీసుకువచ్చి కూతురికి యిస్తాడు. చంద్రమ్మ కుడివైపు దిగులుగా ఒకసారిచూసి ఎడమవైపు నిష్క్రమిస్తుంది. వెంకన్న తీవ్రంగా ఆలోచిస్తూ తిరుగుతూ వుంటాడు. క్రిందపడి వున్న చెరకుపళ్ళెమూట చూస్తాడు. పైకితీసి, ఒకసారిచూసి—గడ్డి మేటుప్రక్కను పెడతాడు. ఎడమవైపునుంచి రాజయ్యవస్తాడు.)

రాజ: (వస్తూనే) యేంట్రా యెంకన్నా? రుద్రిగాడు ఆంబోతులాగ రంకె లేసుకుంటూ యెళ్తున్నాడు.

వెంక: (కోపంతో) అడు రుద్రిగాడు కాదు మనకి శనిగాడు

రాజ: 'బుర్ర బద్దలు కొట్టేశాను' అని మీసం తిప్పేడు నన్ను చూసి. 'యెవడినిరా' అన్నాను. నా మాట యినిపించుకుంటే కాదూ!

వెంక: కుర్రోణ్ణి కొట్టడానికి చేతు లెలాగ ఆడినియ్యో.

రాజ: యే కుర్రోడు?

వెంక: రాముడు.

రాజ: అరెరె! ఆ కొండుకొట్టాడ్రా?

వెంక: అడుమనిషైతే కాదూ? గ్యానం లేని యెదవ.

రాజ: లచ్చన్నగారి బూమికోసం మనం మద్దిని కొట్టుకు సస్తన్నాం.

వెంక: అంతేరా బాబా! పెద్ద మారాజులు సల్లగానే వుంటారు. మద్దినున్న కూలోళ్ళే కొట్టుకు సచ్చేది.

రాజ: మీద కేసు యేమయ్యిందో చూశావ్ కాదూ! ఎలక్సన్ల నాటినుంచి పెద్దరైతులు రామపాడు గారు, వసన్న గారూ ఒకళ్ళమీద ఒకళ్ళు పగ పట్టుకున్నారు. అళ్ళిద్దరూ పంచులుమాతులు యిచ్చేసి డబ్బు జల్లేశారు. కనుపులో చల్ల కదలకుండా యిద్దరు మారాజులూ యెవరి మేడలో అళ్ళే కూకున్నారు. యింక మద్దినున్నారు కాదూ మనలాంటి యెదవలు? వలు కురు వాళ్ళక్కు సచ్చారు. పదిమందికి కొట్లాట్లో చేతులూ పోయినా ముప్పాతిక మంది సావు దెబ్బలుతిని ఆసుపత్రి పాలైపోయేరు. పాపగా మిగిలినోళ్ళని పోలీసులు పట్టుకుపోయేరు. మదిని నష్టపోయినోళ్ళెవరు?

వెంక: నష్టపోయేవోళ్ళెప్పుడూ కూలోళ్ళే!

రాజ: యిద్దరు పెద్దరైతులనుకున్నావోళ్ళంతా ఎన్నో అన్యాయాలు చేసి భూములు పెంచుకున్నారు. అప్పులియ్యడం, వడ్డీలకు వడ్డీలు

పెంచెయ్యడం...ఆ కరువుకి ఆడికున్న బూమి పుట్టా లాగేసుకోడం.

వెంక: పెద్దోళ్ళగోడవలు మనకెందుకు పోనియ్యరా!

రాజు: సివరికి మిగిలిపోయింది మంచీ సెడ్డా! సచ్చిపోయాటప్పుడు తనకూడా పిడికెడు బూమి పట్టకెళ్ళలేడుగందా! బూమిమీదవున్న వాళ్ళలో జాలూ తెగమిడిసి పడతాడు. జోరయిగుడుకు తిరుగుతాడు. నిన్న గాక మొన్న సచ్చిపోయిన యెంకటసామిగార్ని సూడు. ఆయనకి యెన్ని లోగిళ్ళు! ఎంత పొలం! యెన్ని తోటలూ! కూడా యేమన్నా మోసుకెళ్ళగలిగేడా?— నరసయ్యగార్ని సూడు! కూలోళ్ళని కన్న కొడుకుల్లాగ సూసుకునవోడు మా రాజు. ఆయన సేతులమీద ఎందరు పాలికాపులకో పెళ్ళిళ్ళు సేయించేడు. ఆయన సచ్చిపోయినప్పుడు అందరూ జోరున యేడిశారు. ఆ మారాజు సచ్చి యే లోకానున్నాడో యిప్పుడికీ ఆయన్ని గ్యాపకం చేసుకోనిరోజు లేదు.

వెంక: యేంట్రా! యేదాంతంలో పడ్డావ్ ?

రాజు: సేనీ మద్దిని శాస్తుల్లుగారింటికెళ్ళి పురాణం యింటన్నాన్లే. యేం నీతులూ! యేం దర్మాలు! అన్నీ తెలుసుండి మనుషులెందుకు అగ్గానంలో పడతన్నారా...

(ఎడంవేపునుంచి దిగ్గరగా కేకలు వేస్తూ లావుపాటి కర్ర తీసుకొనివస్తాడు రుద్రయ్య.)

రుద్ర: (ఎనకవైపు తిరిగి) ఒరేయ్! యెదవల్లారా! కదలండిరా! ఆల్శెం సెయ్యకండిరా, కర్రలు, కొడవళ్ళు, గునపాలు, గొడ్డళ్ళు-సేతికి యేది అందితే అదే పట్టుకురండ్రా!

లచ్చి: (నాలుగు చేతికర్రలు భుజంమీద వేసుకొని దిగ్గరగా కేకలు వేస్తూ వస్తాడు) రండ్రా! రండి! గట్టు పొడుగునా నిలబడండి. గట్టుమీదకొచ్చిన యెవడ్ని బలే సెయ్యండి. మీకేం బయ్యం లేదు. యెనకాల నేనున్నాను. పడోళ్ళొస్తే పదోండలు కన్నా పెడతాను.

రుద్ర: యిద్యోళ్ళి సిన్నిగాణ్ణి, నారిగాణ్ణి బలేస్తాను. అడ్డొచ్చిన యెవడ్ని వరికి పొలానికి పాతేస్తాను.

లచ్చి: (ఒక కర్రతీసి వెంకన్నకియిస్తూ) ఒరేయ్ యెంకన్నా! యీ కర్ర పుచ్చుకో! యెవ కాడకు. మీ బాబులాగ పౌరుషానికి నువ్వు కూడా పేరు తెచ్చుకో.

వెంక: (విధిలేక తన చేతిలోని కర్ర క్రిందపారేసి పెద్ద కర్రతీసుకొని దిగులుగా నిలబడతాడు.)

లచ్చి: (దిగ్గరగా) ఒరేయ్! రాజిగా!

రాజు: (ఉలికిపడి) బాబయ్యా!

లచ్చి: బెల్లంకొట్టి రాయిలాగ పలకవేంరా! యెదవా! నీ సేతులో కర్ర అవతల పారెయ్య.

రాజు: ఎందుకు బాబయ్యా?

లచ్చి: (కర్రయిస్తూ) యీ కర్రతో సరిగా యెత్తి కొట్టేవంటే బుర్ర పెక్కలైపోతాది.

రాజు: (భయంతో గుటక వేసి) యెవర్ని కొట్టాలి బాబయ్యా!

లచ్చి: (కోపంతో) కళ్ళుమూసుకుపోయినయ్యేంట్రా? కనబడ్డంలేదూ? అలాగ ముంగకుసూడు. పల్లపోళ్లు యెలాయిందుకు సూసుకోస్తున్నారో!

(నేపథ్యంలో కేకలు, అరుపులు, మనుషుల అడుగుల సవ్వడి, ఎద్దుల మువ్వల [illegible] అస్పష్టంగా వినిపిస్తాయి.)

రుద్ర: ఒరేయి రాజిగా! నువ్వు కర్రపట్టుకొని నాయెనకాలే నిలబడు!

లచ్చి: అగ్గుదాటినోణ్ణి పట్టుకుని బుర్రకి అడ్డంగా ఒక్కటేపెట్టు.

రాజు: (భయంతో సుడుతిప్పి వెనక్కి తిరిగి లచ్చన్నతో) బాబయ్యా! నాలుక్కాలాలపాటు సుకంగా బతకాలని తమరిదగ్గర నౌకరీకున్నాను. అంతేగాని బుర్రలు బద్దలుకొట్టుకోడానికి లేను. బాబయ్యా! కొత్తగా పెళ్ళయినోణ్ణి. పది కాలాలపాటు బతకవలిసినోణ్ణి. తమరి నౌకరీకి ఒకదణ్ణం. తమకి ఒకదణ్ణం. నాకు సెలవిప్పించండి బాబయ్యా!—యింతకీ యిద్యోళ్ళ లేనిన యేళాయికేవం అలాంటిది. యింటిదాన్ని పొల్లాడి యిక్కడికొచ్చిపడ్డాను. యెవకటికి యెవడో నాలాంటోడే యింటిలో గోలగా వుందని సంతలో కళ్ళేడంట!!

ఖైదీ విషాదగాథ

శ్రీ జనస్వామి కోదండరామశాస్త్రి

జైలుగంట గణగణమని ధ్వనిస్తూ గాఢసుషుప్తిలో మునిగివున్న ఆ నిర్భాగ్యజీవుల్ని కొద్ది కొద్దిగా మేల్కొల్పుతోంది. యీ నరకానికి కారణంగాగల నేరాల చరిత్రలోని విషమఘట్టాల్ని వర్ణించి ఖైదీల శ్రవణపుటాల్లో పైశాచికగానం సల్పుతూ గత రాత్రంతా వ్యథతో చిదికిపోయిన హృదయాల్లో మరల కలతలకు తావు కల్పిస్తున్నాయి, ఆ భయంకర ఘంటానాదాలు. సువ్వాకులకు బిగించివున్న ఇనుప చువ్వల్లోగుండా లోపలకు అరుణోదయపు లేతకాంతులు బలవంతంగా తోసుకువచ్చి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ మెల్లి మెల్లిగా కళ్ళు విప్పుకుంటూన్న ఖైదీల జీవాల్ని నులివెచ్చగా తాకుతున్నాయి. పక్షులపై బాణప్రయోగంచేసి చివరకు అలసట చెంది కొంచెం విశ్రాంతి తీసుకునే కిరాతుని హస్తాలవలె ఘోర జ్ఞాపకాల్ని ఉత్పాదించే ఆ దారుణ ధ్వనులు ఆగిపోయినై. జైలు నౌకర్లు తాళాలు తీసి ఇనుప చువ్వల్ని ప్రక్కకు నెట్టుతున్నారు. అయిదు నిమిషాల తరువాత జైలు గంట మరోక మారు ధ్వనించింది. ఇక లేవండోయ్ అని ధూమ్యకాకాలు అదిరిపోయేలాగు అరుస్తూ పేము బెత్తాలు వూపుకుంటూ ఒక్కొక్క గదికి యిద్దరు ముగ్గురు పోలీసులు తయారైనారు. నిశాదేవి పైటకొంగుపై కష్టాలన్నీ మర్చిపోయిన మనసుతో నిర్వ్యాపారంగా విశ్రమించి రెండుగంటలసేపైనా కాలేదు. యీ పోలీసుల గాండ్రింపులకు ఖైదీలు దివ్యతపోధనాన్ని కోల్పోయి అంతఃపతితులలైన మునీశ్వరులవలె నిద్రాదేవి కరుణ హస్తాల్లోంచి జాగ్రదవస్థలోకి ఒక్క గంతుతో దూకటం జరిగింది. నిద్రమత్తు కండ్ల రెప్పల్ని నలిపివేస్తూండగా తూలిపోతూ పరమ దీనులై లేచి కూర్చున్నారు. నాలుగోవార్డు చివరి గదినుంచి ఇద్దరు ఖైదీలుమాత్రం బద్ధకంగా కూర్చున్నారు. ఒక ఖైదీ మరోకఖైదీతో వాలిక దవ్వరిస్తూ యిలా అన్నాడు "ఇంకా విచారించకోయ్! యీ చీకటి గదిలోనుంచి బయటపడే సుదినం రానేవచ్చింది కదా!"

తన విషాద వచనాల్ని ఒక్కతెరవ బాధగా మోసుకుని ఆ రెండవఖైదీ యిలా జవాబిచ్చాడు. "దూరంగా ఆలోచించి చూస్తే నిజంగా ఇది నా జీవితంలో రెండో దుర్దినమేమో! నన్ను ఎంతో ప్రేమగా పెంచి పెద్దచేసిన వ్యక్తిని నా చేతుల్తో చంపివేసిరోజు మొదటి దుర్దినం. నా జీవిత శేషాన్ని ఎదుర్కొనపోవు దుర్భరావమానాల్లో ఎలా నిలవగలగాలో అనే ప్రశ్న పెద్ద భూతంలాగా నోరు తెరుచుకుని చూస్తూన్న యీరోజు రెండో దుర్దినం..." మోహన్ చాలా కాలంగా శ్రీ కృష్ణ జన్మస్థాన నివాసానికి అలవాటు పడ్డాడు. ఇది ఎన్నోతడవో అయినా నిమిషంపాటు లెక్క పెట్టుకుంటే గాని అతనే చెప్పలేడు. "భాయీ, ఇటుచూడు. మానావమానాలు మానవుణ్ణి గడ్డు పరిస్థితులలోను మానసిక యాతనలలోను నింపేమాట నిజమే. అందుకే వాటికి మనం బుద్ధిచెప్పాలిగాని మనకు అవి బుద్ధిచెప్పే స్థితివరకు పోకూడదని నా అభిప్రాయం..."

రెండుమూడు నిమిషాలనుంచీ గోడచాటున నిల్చుని యీ ప్రసంగాన్ని వింటూన్న జైలు వార్డెన్ కోపావేశంతో లోపలకు వచ్చి "ఎంత గొప్ప అభిప్రాయాలురా అబ్బాయ్! నీ ఉద్రేకాలు నీతిబోధలుగా చెలామణీ అయితే యీ ప్రపంచానికి ఆయుర్దాయం మూడినట్టే. లేరా! కూర్చుని కబురుచెప్తున్నావ్" అని అంటూ నాని వీపుపై ఒకతిరవ హంటరు ప్రయోగించాడు. మోహన్ హంటర్ దెబ్బతో బాధ కలిగినచోటును ఒకచేతో రాచుకుంటూ లేచి నిలబడి వార్డెన్వంక కోపంగా చూస్తూ ముందుకు సాగి నడుస్తున్నాడు. ఇక వెనక లేచి నిలబడి ముందుకు వెళ్లనున్న మల్లేసువైపు చూచి వికటంగా నవ్వుతూ

“యీ గదుల్లోనల్లని ఆవరణలో పెట్టావంటే మళ్లీ మళ్లీ నీ దర్శనం మాకు ఇవ్వకు. నా మాదిరిగా నే ఏదో ఒక వృత్తి చేసుకుని సుఖంగా యోగ్యతగా జీవించుకో. పరిస్థితులకు అవకాశానికి ప్రాధాన్యత లిచ్చి మూర్ఖత్వాలతో ఆవేశాలకు లోనై క్రూర కార్యాలకు పాల్పడిన ఫలితంగా యిక్కడికి వచ్చి, యీ హింస లన్నీ అనుభవిస్తూంటే నీలాంటి కొద్దో గొప్పో చదువుకున్న వాళ్లను చూచి విచారపడటం తప్ప మేము చేయగలిందేమీ కనపడటం లేదు. త్వరగా కదులు. ఎనిమిదిన్నరకే నీ విడుదల” అన్నాడు వారెన్.

ఎనిమిదిన్నరకు అయిదు నిమిషాలు తక్కువ వుండగా నీ వాలుగొండల పదహారో నంబరు ఖైదీ మల్లేసును జైల్ వార్డరు వచ్చి ఇన్‌స్పెక్టర్ గారి గదిలోకి తీసుకువెళ్లాడు. మల్లేశ్ అధికారికి నమస్కరించి ఎదురుగా నిలబడ్డాడు. ఆ అయిదునిమిషాల్లోనూ అతని విడుదలకు సంబంధించిన కాగితాలు వ్రాయడం పూర్తయింది. గోడమీద గడియారం అరగంట కొట్టగానే ‘నీవు వెళ్లవచ్చు. ఇకనైనా మంచిగా బతుకు.’ అన్నాడు ఇన్‌స్పెక్టర్. అలాగే అన్నట్టు బుజ్జవూపి ఆయనకు శాల్యూట్ చేసి బయటకు వచ్చాడు మల్లేశ్. జైలు ప్రాకారందాటి గేటు ముందువున్న రాజబాటపై నిలబడి ఏదో ఆలోచిస్తున్నాడు. ఒక అరగంటసేపు ఆరకంగా గడిచింది ఏడు సంవత్సరాల కాలం కఠిన నిర్బంధబాధను అనుభవించిన పిమ్మట స్వేచ్ఛ లభించిందికదా అనే ఆనందం అతనిముఖంలో ఎక్కడా ప్రస్ఫుటమవటం లేదు. ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకోకుండా నే తల వంచుకుని ముందుకు నడుస్తున్నాడు. అంతకంతకు నిదాఘతాపం ఎక్కువవుతోంది. శరీరం స్వేదప్రవాహంతో నిండిపోయింది. ధోవతీ చొక్కా తడిసిముద్దలలాగా తయారయినాయి. కడుపులో మిక్కుటంగా ఆకలిబాధ కలుతోంది. దప్పిక గొంతుకను ఎండింప చేస్తోంది బలహీనపడ్డ ఆ పీలదేహం తూలిపోతూండగా మరి యిక ముందుకు నడవలేక సమీపంలో కన్పిస్తూన్న ఒక గ్రంథాలయభవనం దగ్గరకు వెళ్ళాడు. ముందు వాకిటవున్న ఆ వసారాలో ఎవరూ లేరు. బాధగా కణతలు నొక్కుకుంటూ అక్కడ కూర్చున్నాడు. గతించిన జీవితకాలంలోని కొన్ని ముఖ్యఘట్టాలు అతని కండ్లముందు నృత్యం సల్పుతున్నాయి.

2

వెంకటేశు, మల్లేశు—వీరిద్దరూ అన్నదమ్ములు. చిన్నవాడైన మల్లేశు శైశవదశలో వుండగానే తల్లిదండ్రులు ఇద్దరూ గతించారు. వెంకటేశు ఎంతో ప్రేమతో తన తమ్ముణ్ణి పెంచి పెద్దవాణ్ణి చేశాడు ఉన్నత విద్యావంతుణ్ణిగా చేయాలని ప్రయత్నించాడు. కాని ఆ అదృష్టం మల్లేశుకు లేకపోయింది. ఎన్ని తడవలు పట్టుదలగా ప్రయత్నించినప్పటికీ, మెట్రిక్యులేషన్ అతనిపాలిట ఎన్నటికీ దాటలేని ఒక అగాధజలధిగా తయారైంది. మల్లేశ్ నిస్పృహచెంది ఇక ఆజోలికే పోనన్నాడు. వెంకటేసు ఎంత ప్రోత్సాహపరిచినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ‘నేను యిటూ పనికిరాక అటూ పనికిరాక రెండింటాలా పాడైపోవటం జరుగుతుంది. నాకు చదువుమీద మనసు పోవటంలేదు. నేను వ్యవసాయంలో నే ప్రవేశించి నీకు అండగా వుంటాను. నీకపుడు కొంత శ్రమతగ్గుతుంది. వ్యవసాయికంగా మన యిద్దరి యొక్క కృషి కలిస్తే ఫలసాయంకూడా పెరుగుతుంది’ అని అంటూ వాదించాడు మల్లేసు. చివరకు వెంకటేసు ఒప్పుకోక తప్పింది కాదు. మల్లేసు పొలంపని నేర్చుకోటం ప్రారంభించాడు. ఉన్నత విద్యావంతుడై సూటూబూటూ వేసుకుని తన తమ్ముడు ఎంతో దర్జాగా ఒక పెద్ద ఆఫీసరైవుండటం కళ్లారా చూడాలని ఎన్నివిధాలుగానో ఆశలు నింపుకున్న వెంకటేశ్, గడ్డపనులకాలంలో ఒళ్ళంతా నీరైపోతూండగా ఆయాసపడుతూ పలుగుతో తవ్వి గడ్డ విరవటం. వానాకాలంలో భోరుమని వర్షిస్తూండగా గంటలకొలదీ నడుమువొంచి మొక్క నాటటం మొదలైన శరీరశ్రమ ఎక్కువగా అవసరమైన యిటువంటిపనులలో పాల్గొంటూన్న మల్లేసును చూచి కంట తడిపెట్టుకునేవాడు. కొద్దికాలం గడిచినాక వ్యవసాయపుపనులకు సంబంధించిన కష్టమైనభాగాన్ని తానే నిర్వహించుకుంటూ ఏవేవో చిన్నచిన్న పనులుమాత్రం అతనికి ప్రత్యేకించాడు. ఒక సంవత్సరకాలం ఆ విధంగా గడిచింది. ఇంతలో ఆ గ్రామంలో దస్తావేజులు వ్రాసిపెడుతూ పొలాలు కొలిచిపెడుతూ మరి యితర ప్రయివేటుదారీ పనులన్నీకూడా నిర్వహిస్తూండే ఒకాయన మరణించటం జరిగింది. మళ్లా ఆ పనులకు తమ గ్రామంలోనివారినే ఒకర్ని నియమించాలని

నిర్ణయించుకున్నారు కొంతమంది భూస్వాములు. వారిచ్చి మల్లేసు పెపడ్డది. తన తమ్ముడు యీ చట్టు క్రింద క్లీనర్‌వృత్తిలో ప్రవేశించడానికి వెంకటేసు ముందు ఒప్పుకోలేదు ఒకప్రక్కన ఆ భూస్వాముల ఒత్తిడీ మరోప్రక్కన తనతమ్ముడు ఆ వృత్తిపై ఎక్కువ మోజు కనపర్చడం—ఇందువలన వెంకటేసు అంగీకారసూచకంగా తలవూపటం జరిగింది. అందుకు తగినట్టుగా సాంపులవిక్రయానికి సంబంధించిన లైసెన్సు కూడా సంపాదించాడు. మల్లేస్ రెండు సంవత్సరాలలో మంచి ప్రావీణ్యతగల డ్రైవర్ కాగలిగాడు. మరొక సంవత్సరానికి అతనిభార్య కాపురానికొచ్చింది.

మల్లేస్ భార్య వెంకటలు కొంచెం స్వతంత్రేచ్ఛ కలిగినమనిషి. వసుకు చెనుకూ లేకుండా తన మనసుకి వచ్చిన పనల్లా చేస్తూండటం, జంకూ గొంకూ లేకుండా తన నోటికివచ్చిన మాటనల్లా వాగుతూండటం— ఇటువంటి అలవాట్లను గమనించి వెంకట్ల్ని రెండు మూడు తడవలు కొంచెం గట్టిగా మందలించాడు వెంకటేసు. ఆ మందలింపును గొప్ప పరాభవంగా భావించి ఎన్నటికైనా తన బావగారిపై పగ తీర్చుకోవాలని సంకల్పించింది వెంకటలు. అందుకై తగిన సమయంకోసం నిరీక్షిస్తూ తగిన పన్నాగానికై అన్వేషణ జరుప ప్రారంభించింది. తోడుకోడలో తగాదాకు దిగాలని ఎంత ప్రయత్నించినా ఫలింపలేదు. కయ్యానికి కాలుదువ్వే వెంకటలు తీరునో చూసి అతని ముసిముసి నవ్వుల్తో 'నీకు ఇంకా చిన్నతనం వదల్లేదు వెంకటలూ!' అని అంటూండేది. యీ భగీరథప్రయత్నంలో తనభర్తనే ఒక సాధనంగా వుపయోగించ గలగటం తప్పితే మరో మార్గం ఆమెకు తోచలేదు. ఆ మార్గంలో కూడా రెండుమూడు తడవలు విఫలురాలైంది. అయినప్పటికీ ఆమె నిరుత్సాహ పడి నీరు కారలేదు. గుండెలో చెలరేగిపోతూన్న ఉత్సాహాన్నంతా కూడదీసుకుని అధికమైన పట్టుదలతో ఒక దారుణాస్త్ర ప్రయోగానికి పూనుకుంది. ఒక రోజున లోపలి గదిలో ఏదో వ్రాసుకుంటూ కూర్చున్న తన భర్తదగ్గరకు వెళ్ళి మహా నేర్పుగా ధోరణి ప్రారంభించింది.

"ఇవు దస్తావేజులు వ్రాసి పెట్టటం—అటు స్టాంపు లమ్మకం—ఇంకేం సంపాదన వేలలోనే వుంటుంది. కాని ఇంట్లో ఆడదానికి అణాడబ్బులు పెట్టి మల్లెపూలైనా తేవాలని వుండదుకదా?......"

"ముష్టెన్నకూట వేళల్లో ఆకుర్రాళ్ళ బండల్లో వుంచేవాళ్ళు! ఆమాడికేమ్ మనకెందుకులే అనుకున్న వాళ్ళు ఏ పదిహారేండ్లలో మట చెప్తూంటారు. ఆ వుద్దేశం లేనివారు రెండు మూడు గంటలసేపు దాకిరీ చేయించుకుని చేతులు జాడించుకుంటూ పోతారు. కొంతమంది వాళ్ళకు పండిన ధాన్యాలతో కొద్దికొద్దిగా పంపిస్తూంటారు. గ్రామంలోని నలుగురు పెద్దలూ తెలివిగలవాడవనీ, సమర్థుడవనీ మెచ్చుకోవటం తప్ప అంతకుమించి ఒరిగేదేమీ వాళ్ళు కల్పించటం లేదు."

"ఏమిటి మీరా? తీరిక లేకుండా ఎప్పుడూ యీ పనుల్లోనే తిరుగుతూంటారా! తగిన సంపాదన లేనిదే యీ శ్రమంతా మనకెందుకండీ?"

"ఏదో కొంతసంపాదన వుంటుందనుకో, రైత్వారీ గ్రామాల్లో యిటువంటి వృత్తులకు సంబంధించిన వాళ్ళి డబ్బుద్వారా రాబట్టుకోటం కష్టమే"

"డబ్బుకాకపోతేమాత్రం ఇతరత్రా మాత్రం ఏమి వస్తున్నయ్యంటారు?"

"ఏ పంటకోజుల్లో ఆ పంటధాన్యం ఎవరికి తోచినంతవారు మన ఇంటికి పంపిస్తూనే వున్నారు కదా?"

కనుబొమ్మల్ని విలాసంగా కదుల్చుతూ ఎదుటివాడి గుండెలో తన మాటలు నాటుకొనే గల ఆకర్షణతో ఇలా అన్నది వెంకటలు. "అట్లాగండీ! నా మొగుడు సంపాదించినవాటిని నాకు చూపించకపోతే చూపించకపోయె! యీ విధంగా మతిలేదివల్ల రాబడి వున్నట్టు చెప్పి అని నాతో ఆవిడగారు ఒక్క ముక్క అయినా అన్నదికాదే! అంతవరకెందుకండీ! ముష్టి మల్లెపూల విషయంలో చూడకూడదండీ? మతేది, తోడుకోడలు మనుష్యులన్న భావన ఆవిడకు యింత వరకూ లేదనుకోండి. నీసం ముత్తయిదుపిల్ల యింట్లో వున్నదికదా అనే కొద్ది సద్భావమైనా చూపకూడదండీ? మొగుడు బజార్నించి తెచ్చిన మల్లెపూల పొట్లం ముందు పెట్టుకొని దండలు గుచ్చి తన సిగకు మాత్రం అలంకరించుకుని కూర్చుంటుందా?"

"అంత దురుసుతనంగా ప్రవర్తిస్తోందా మా వదినె?"

"నెమ్మదిగా అంటారేమిటి? ఆవిడ మాట అలా వుంచండి. ఆయన తతంగాన్ని అసలు మీరు అర్థం

చేసుకున్నారా? యీరోతకోతల చాకిరీవల్ల మనకేమీ సంపాదన లేదని మీరే అంటున్నారు కదా? అసలు భూదేవిని నమ్ముకొని ఆమె మీద పోరాటమంటూ వుంటుందా? వ్యవసాయం జోలికి మిమ్మల్ని రానివ్వకుండా పొలం పనులు మీకు అబ్బకుండాచేసి పూర్వుల్ని నలుగుర్ని ఆశ్రయించి వారిచేత మీకు విద్య చెప్పించి మీ చెట్టు కింద క్షీణవృత్తి అంటగట్టిన మీ అన్నగారి పన్నుగడ దర్పం తెలియనా మీరు గ్రహించారా చెప్పండి."

"ఇందులో పన్నుగడ ఏముంటుంది? ఒకరు ఆ వృత్తి, మరొకరు ఇంకొక వృత్తి చేసుకుంటే ఆదాయం ఎక్కువ వుంటుందనే అభిప్రాయమై ఉండాలనుకుంటాను."

"అల్లాగా? మన తెలివితేటలు ఇంత తక్కువ ఎత్తులో విహరిస్తుండబట్టే మనల్ని తెల్లదొరలు శ్రమ పడకుండా కూడా బోల్తా కొట్టించగలుగుతున్నారు. అసలు కీలక మున్నది యిక్కడే నాయనా! పెద్ద కీలకమే వున్నది. మా నాన్న ఎన్నాళ్ళనుంచో మోస్తున్నాడు. ఇక చెప్తా వినండి. వ్యవసాయం మన కులవృత్తి. నాగలి, బండి దున్నలు మనకు అన్నం పెట్టే దాతలు. అటువంటప్పుడు వాటికి మిమ్మల్ని మీ అన్నగారు సదభిప్రాయముతోనే దూరము చేస్తున్నారని నమ్ముతున్నారా? యీ నాలుగెకరాల వల్ల తెలిసెనా తనొక్కడే ఆధిపత్యం అట్టిపెట్టుకోవాలనే తప్ప మరేమీ కాదు. ఇప్పటికైనా గ్రహించండి." మల్లేస్ మరి ఒక మాట్లాడలేదు. అతనిమౌనాన్ని ఆమె అర్థాంగీకారంగా భావించి ఆనాటినుండి ప్రతి రోజూ మల్లేసుకు తీరికున్నప్పుడల్లా దగ్గర కూర్చుని తన తోడికోడలు బావగార్లపైన ఆ నేరా చాడీలు చెప్తూండేది.

కొంతకాలం గడిచిన తరువాత వాటి ప్రభావం మల్లేసు మనసుపై బాగానే పనిచేసింది. చివరకొక రోజున గ్రామ పెద్దల్నందర్నీ సమావేశపరచి పంపిణీ జరిగి తీరాల్సిందేనని పట్టుపట్టాడు. "మన ఇద్దరిలో ఎవరికీ యింతవరకూ పిల్లాజెల్లా లేరు కదా? మనలో ఎవరికో ఒకరికి సంతానం కలిగేటంతవరకు యీ విషయాన్ని గురించి ఆలోచించటం అనవసర మనుకుంటాను. ఇప్పుడే అవసరమని నువ్వు భావించే పక్షంలో నాకేమీ అభ్యంతరం లేదు. ఏమైనప్పటికీ చాలా ఆలోచించి చెయ్యవలసిన పని. అందుకుగాను పదిరోజులు వ్యవధి వుంచుకోవటం మంచిది. ఈలోగా నువు మనసులో బాగా దర్చించుకున్న తరువాత నీ అభిప్రాయం తెలియచెయ్" అన్నాడు వెంకటేసు విషాదవదనంతో. మల్లేసు అంగీకరించి ఇంటికి వెళ్ళాడు. భార్యతో విషయాన్ని వివరించి చెప్పాడు. "మాశారా! ఆయన దొంగదెబ్బ! మిమ్మల్ని ఓపలడానికి ఆయన ఇష్టపడటం లేదు. ఏముందండీ! మీరు మేలుకొనటంతో ఆయన న్నించి ఒక బంగారుకొండ ఎగిరిపోయినట్టే కదా!" అన్నది వెంకులు. ఇటువంటి మాటలే చెపుతూ ఆ పదిదినాల వ్యవధిలోను భాగం పంపిణీ కావాలనే దృఢ నిశ్చయాన్నిండి అతన్ని మరలనివ్వకుండా, అతనిదృష్టి ఏమాత్రం సడలనివ్వకుండా కృషి చేసింది. వ్యవధి తీరిన మరుసటి దినాన గ్రామ పెద్దలందర్నీ మల్లేసు సమావేశపర్చి 'నేను బాగా ఆలోచించుకున్నాను. ఈనిర్ణయం చాలా మంచిదనే నేను భావిస్తున్నాను' అని చెప్పాడు. పంపిణీ కార్యక్రమం ఒకగంటలో పూర్తయింది. ఫారీకత్ దస్తావేజా కూడా వ్రాసుకున్నారు. చివర్లో వెంకటేసు తన తమ్ముడికంటుకు ప్రత్యేకంగా రెండు వేల రూపాయల్ని మొలుచూపి ఆ రొఖ్ఖం అతని చేతిలో వుంచినపుడు అందరూ ఆశ్చర్యపడ్డారు. 'ఇంత డబ్బు నేనెపుడు సంపాదించాను అన్నయ్యా!' అన్నాడు విస్మయంగా మల్లేసు. అది నీ కష్టార్జితం తమ్ముడూ! నీకోసమై యింట్లో యితరులు అప్పు చెప్పిన గడ్డిపోచ దగ్గర్నుంచీ ప్రతిదానికీ విలువకట్టి నీపేర యీ మొత్తాన్ని నిలవచేసి వుంచాను" అన్నాడు వెంకటేసు. ఇది ఒక అద్భుత కార్యంగా పరిగణించుకుని నలుగురు పెద్దలూ వెంకటేస్ సౌశీల్యాన్ని వేనోళ్ల పొగడుతూండగా వెంకులుమాత్రం "అసలు యింతకు పదిరెట్లుగా మా సంపాదన ఆయనవద్దకు చేరివుంటేబట్టే యీమాత్రం తొంటిచేతిని బయటకు చూపాడు" అని అంటూ వ్యాఖ్యానించింది. ఆ తరువాత వెంకులు కటువుగా ప్రవర్తిస్తున్నప్పటికీ ఆ అన్నదమ్ములిరువురూ పరస్పరం సహకారంగానూ ఐకమత్యంగానూ వుంటూనే వచ్చారు.

3

సహజంగా వెంకటేసుది దయార్ద్రహృదయము. ఇతరులను త్వరితంగా ఆకర్షించగల వెంకటేస్‌లోని కొన్ని సుగుణాలు అతని వ్యక్తిత్వాన్ని మెరుగుపెట్టే ప్రధానకారులుగా ఉపయోగపడుతూంటాయి. భూలోక భోగ్యతయాలైన ఉన్నతి, ధనం, అధికారం

ఈ మూడింటికోరకు మానవుడు నిరంతరమూ తపన పడుతూంటాడు. యోగ్యత లేనిదే ఉన్నతి పొందుకో లేమనీ, అదృష్టం వరించనిదే ధనప్రాప్తి ఉండదనీ, సమర్థతా యోగ్యత అధికారప్రాప్తికి బద్ధశత్రువనీ వెంకటేష్ భావన. ఆయా అర్హతలు కూర్చుకున్న తరువాత మానవుడు సలిపే స్వల్పకృషితోనే సఫలమనో రథుడు కాగలడని అతని ఆత్మవిశ్వాసం. అతని అనుంచి తనంతట నే తమ సమస్యల్ని గూర్చి అతని సలహా నాశించి పొందగోరి అతివినమ్రతో కొంతమంది వస్తూవుంటారు. ఫలానా మనిషి దుర్మార్గుడని ఖండితంగా నిర్ణయం చేసుకోవడంలో తొందర పాటు ప్రదర్శించే కోవకు చెందినవాడు కాదు వెంకటేష్. అందువల్లనే మల్లేష్ తనపై ఎన్నో దూషణవాక్యాలను విసురుతున్నాడని ఎంతోమందివల్ల వినివుండీకూడా వెంకటేష్ తన హృదయంలో తన తమ్మునికిగల వాత్సల్యస్థానాన్ని వీసంపాలైనా చెరప డానికి ఇష్టపడలేదు. తనవద్దకు ఏవేవో వ్యవహారాలను గూర్చి సలహాలకోరకు వచ్చినవారిని తన తమ్ముడు లౌకికవ్యవహారజ్ఞానం కలవాడు కదా అని మల్లేష్ దగ్గరకు పంపగా అతను తేలికగా సమసిపోగల ఆ సమస్యలకు జటిలస్వరూపములు తొడిగి, దావాల లోకి దింపి కోర్టులచుట్టూ తిప్పి ఎంతో డబ్బు గుంజుకుని వారిని ఎన్నోవిధాల ధ్వంసం చేసినప్పుడు కూడా వెంకటేష్ తనలో తాను పరితపించాడే కాని మల్లేష్ నేమీ దూషించలేదు.

అయితే సూరమ్మ వ్యవహార విషయంలోమాత్రం వెంకటేష్ మౌనంగా వుండలేకపోయాడు. మల్లేసు మేడప్రక్కనే సూరమ్మ ఇల్లు. ఆవిడను ఒకమాదిరి భాగ్యవంతురాలుగానే చెప్పుకోవచ్చు. ప్రస్తుత ధరల ప్రకారం విలువకడితే ఆమె ఆస్తి రెండు లక్షలకు విలువగాను ఉండును. ఆవిడకు సంతానం లేదు. దగ్గర వుండే ఇతర బంధువులుకూడా ఎవరూ లేరు. ఆ పెంకుటి ధవంతిలో ఏకాకిగా జీవితాన్ని గడుపుకుంటూ భూములమీద వచ్చిన ఫలసాయాన్ని దానధర్మాలకు వినియోగిస్తూ, ఆ గ్రామంలోని కొన్ని శిథిల ధర్మ సంస్థలు తమ జీర్ణస్థితిని తొలగించుకోగలిగి పొందవలసిన విలసితంగా రూపురేఖల్ని దిద్దుకుని ప్రజోపకారంగా వుపయోగపడేటందుకు కారకురాలవుతూ వచ్చిన ఔదార్యవంతురాలు సూరమ్మ. కొంతకాలానికి మల్లేసు విషదృష్టి ఆమెపై వాలింది. ఒకనాటి రాత్రి మేడమీద కూర్చుని ధనసంపాదనా మార్గాలనుగురించి తీవ్రంగా ఆలోచిస్తూన్నప్పుడు అతని మనసులో 'కష్ట పడి సంపాదించి ఎవడూ పెద్ద ఆస్తుల్ని కూర్చ లేడు. అక్రమంగానో వక్రమంగానో ఇతరుల ఆస్తిని సంక్రమింప చేసుకోవటమే అందుకు తగిన ముఖ్యమార్గం' అని ఒక భావన దొర్లింది.

ఆ మర్నాడు సూరమ్మ జిల్లా కలెక్టరుకు దరఖాస్తు వ్రాసిపెట్టమని మల్లేష్ దగ్గరకు వచ్చింది. 'కలెక్టరు దొరవారికి పంపే దరఖాస్తులు మామూలు కాగితాల పైన వ్రాయకూడదు. స్టాంపులు వుపయోగించాలి. వ్రాసే ముందు ప్లీడరుతో ఆలోచించటం కూడా మంచిది. నేను రేపు గుంటూరు వెళ్ళవలసి వుంది. ప్లీడరుగారితో కూడా సంప్రదించి దరఖాస్తు పూర్తి చేసి నేనే స్వయంగా కలెక్టరుగారికి యిచ్చివస్తాను' అని చెప్పి నాలుగు దస్తావేజుల పైన ఆవిడ చేతి వేలి ముద్రలు వేయించాడు మల్లేష్. ఆవిడ చదువుకున్నది కాకపోయినప్పటికీ కొంత లోకజ్ఞానం లేకపోలేదు. కాని ఏ విషయాన్ని గురించయినా కుటిలంగా ఆలోచించటం ఆమెవల్ల కాదు. ఆ కారణం చేతనే మల్లేష్ చేసిన యీ పనిలోని అంతరార్థాన్ని ఆమె గ్రహించలేక పోయింది. ఆ తర్వాత రెండు మాసాలకు, తనకు విక్రయించుటకు ఒప్పుకున్న విక్రయాస్తి ఖరీదులోని మూడున్నరవంతుల పైకము దస్తావేజులు వ్రాయించి యిచ్చిన రోజునే పొంది కూడా రిజిస్ట్రేషనుకు ఎన్ని తడవలు పిలిచినా రానందున శేషించిన ధనమును బ్యాంకులో డిపాజిట్ చేసి దస్తావేజు రిజిష్టరు చేయించుకునే ఏర్పాట్లకు పూనుకోబోతున్నానంటూ ఒక నోటీసు ఇచ్చాడు మల్లేసు సూరమ్మకు. ఆ నోటీసు చదివించడానికి సూరమ్మ వెంకటేసుదగ్గరకు వచ్చింది. ఆ నోటీసంతా పూర్తిగా చదివి చూసుకుని అత్యంతాశ్చర్యంగా అడిగాడు వెంకటేష్. "మావాడికి నువ్వు పదియాడెకరాల పొలం అమ్మేవా సూరమ్మ పిన్నీ?" "ఆ దేమిటి నాయనా! నేనేమీ ఎఱుగనే" అన్నది సూరమ్మ. ఆ వెంటనే నోటీసులోని విషయాలను వెంకటేష్ బిగ్గరగా చదివి వినిపించాడు. నోటీసులోని ఘోరమైన అసత్యాలన్నిటినీ విని సూరమ్మ మూర్ఛిల్లింది. గ్రామంలోని పెద్దలందరూ చేరారు. విషయాన్ని సావధానంగా విని చాలా పరితపించారు. మల్లేసు కుటిల స్వభావం జగమెరిగినదే! ఎవరికీ తెలియని దేమీ కాదు. ఇదివరకు పలువురైదుగుర్ని మోసపుచ్చాడు. ఇప్పుడు అది చాలా భారీ ఎత్తున జరిగింది. యీతడిని మాత్రం మల్లేసుకు తగిన ప్రాయ శ్చిత్తం చేసి తీరవల్సిందే నన్నారు గ్రామపెద్దలు. యీ సర్పాన్ని యికమీదట పాలుపోసి పెంచటం మంచిది కాదు. కనపడిన వాడినల్లా కాటువేసి గ్రామ వినాశనం జరిపే ప్రమాదమున్నది గనుక లేతలోనే దాని పడగను చితకకొట్టడం అవసరమన్నారు. యీ దురంతాన్ని హర్షించి వూరుకోడానికి వీల్లేదని పట్టు పట్టారు. సూరమ్మకు జరిగిన యీ ద్రోహంతమలో ప్రతిఒక్కరికీ జరిగినట్లుగా భావించుకుని యీ ఆకా

ర్యాన్ని తుదముట్టించాలని ప్రతిజ్ఞగా మాట్లాడాడు. వెంకటేష్ మనసు కూడా చాలా బాధపడింది. మల్లేష్ పాలిట పతనకాలం దాపురించబోతున్నది కాబట్టి మారమ్మవంటి మహోదాత్తను, పతివ్రతకు ద్రోహం తలపెట్ట బూనుకున్నాడని గ్రహించాడు. ఈ సందర్భంలో తగిన కార్యక్రమాన్ని నిర్ణయించేందుకు అందరూ వెంకటేష్ వైపు కళ్లు పెట్టుకుని చూస్తున్నారు. 'వెంకటేషూ! నువ్వు గనక యీ విషయంలో కలగజేసి కాపాడకపోతే మారమ్మ మునిగిపోయినట్టే' అని చుట్టూవున్న పెద్దల్నుంచి వినిపిస్తున్న మాటలు సత్య సుశోభితమైన అతని హృదయాన్ని సవాలు చేస్తున్నయ్. లోకానికి ఉపయోగింపని మంచితనం అడవిలో వికసించిన గులాబీ పుష్పంమాదిరి వ్యర్థ ప్రయోజనం కలదికదా! మల్లేష్‌తో నీకు రక్తసంబంధం వుండవచ్చు. కాని అతనిలోని అల్పత్వం, అత్యాశ, నిరంకుశత్వం, దగాకోరుతనం — వీటిలో మాత్రం నీకు ఏ విధమైన చుట్టరికం లేదు. పైగా నీకవి బద్ధశత్రువులు కూడాను. అందుచేత లేచి నిలబడు! అని అంటూ ఆత్మ ప్రబోధింప మొదలిడింది. ఇంతలో మారమ్మ గుండెలు బాదుకుంటూ వెంకటేష్ పాదాలపైపడి విలపటం ప్రారంభించింది. ధూమ్రకేశాలు కదలిపోతున్నట్టనిపించింది. అతనిలోని ప్రతి రక్తాణువూ రోషావేశంలో కంపించిపోయింది. అతని ముఖబింబం ఒక్కసారిగా నూతన తేజంతో ప్రకాశించింది. వాక్కులో పటుత్వం ప్రబలమవుతూండగా కొంచెం వంగి పాదాలమీద మారమ్మను పైకి లేవతీస్తూ వెంకటేష్ ఇలా అన్నాడు: "లేచి నిలబడమ్మా. ఇక నీవు భయపడవలసిన పనిలేదు. యీ దుర్మార్గాన్ని తప్పకుండా ఎదుర్కొని తీరుతాను. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆగేది లేదు." మారమ్మ చేతులు జోడించి నమస్కరిస్తూ ఇంటికి వెళ్లింది. ఆ మర్నాడు వెంకటేష్ తన తమ్ముడికి కబురంపి పిలిపించాడు. తమ్ముల చెరువు గట్టుమీద వేపచెట్టు నీడన కూర్చోబెట్టి తాను చేసిన తప్పును సరిదిద్దుకోవలసిందని ఎంతో బుజ్జగింపుగా బోధించాడు. మల్లేష్ తన మూర్ఖత్వాన్ని విడిచాడు కాదు. చివరకు తన ప్రయత్నం విఫలమైందనే నిస్పృహలో లేచి నిలబడాడు వెంకటేసు. మల్లేసు కూడా చొక్కా దులుపుకుంటూ లేచి నిలబడి అంతంలేని ఆక్రోశంతో ఇలా అన్నాడు. "నువు ఎన్నటికైనా నా అభివృద్ధిని మంట కలపదల్చుకున్న అసూయాపరుడవని నా భార్య చెప్తూనే వచ్చింది. ఆ మాటను నమ్మనుకాను. ఇప్పుడు ప్రత్యక్ష నిదర్శనంగా చూపి ఆ పరమ సత్యాన్ని లక్ష్మీస్వరూపిణిఅయిన ఈ వేపచెట్టు అనుగ్రహించింది."

దీర్ఘ ప్రయాణంలో అలసిపోయిన దుర్బలుడైన పడమటికొండ చాటున ఒరిగిపోతూన్న సూర్యభగవానుడి వేపు నిశ్చలంగా దృష్టిబరపి ఇలా అన్నాడు వెంకటేష్.

"నా తమ్ముడు గొప్ప విద్యావంతుడు కావాలనీ వ్యవహారదక్షతతో రాణింపు పొంది కీర్తికుసుమాలతో పూజింపబడాలనీ నేను చేసిన కృషిఅంతా బూడిదలో పోసిన పన్నీరుమాదిరి వ్యర్థమైపోయి చివరకు ఒక అజ్ఞానవతిఅయిన స్త్రీయొక్క వెఱ్ఱి వుపదేశాలకు దాసోహమై పోతలచిన నేను స్వప్నంలో సైనా భరింపలేను. మల్లేష్, ఒక్కమాట చెప్తున్నాను. శ్రద్ధగా ఆలకించు. నన్ను ఎన్ని దుర్భాషలాడినా వాటిని ప్రేమ వాక్యాలుగానే ఎంచుకుంటాను. అమాయకులను దగాద్రోహాలు జరుగుతూన్నపుడు మాత్రం నాలో రక్తం దాని నిర్దిష్ట ధర్మాన్ని చేర వేస్కుని తీరుతుంది సుమా!"

వెంకటేష్ బోధలు మల్లేష్ మనసును ఏవిధంగానూ మార్చలేకపోయినయ్. అతడు ముందు నిర్ణయించుకున్న పద్ధతి ప్రకారం మారమ్మమీద దావా వేశాడు. మారమ్మ తనకు కోర్టువారినుండి వచ్చిన సమన్లు తీసుకునివచ్చి వెంకటేష్ చేతిలోవుంచి 'ఏమో నాయనా, ఏం చేస్తావో నీదయ." అన్నది. వెంకటేష్ సమన్లు చదువుకున్నాడు. మారమ్మ అతనివంక దీనంగా చూసింది. అతని మనసు ఘోరంగా గురపిల్లుతోంది. నేత్రాలనుండి రెండు నీటిబొట్లు రాల్తూండగా ఇలా అన్నాడు. "నేను నీకు వాగ్దానం చేసివున్నాను కదా పిన్నీ. ఆ తప్పుడు దస్తావేజును చిత్తుకాగితం మాదిరి విలువలేకుండా చేయించడానికి నా శాయశక్తులా పాటుపడతాను. నా గుండెలో ఏనాడో నెలకొని ఎంతో వాత్సల్యాన్ని సహనాన్ని ఆహారంగా పొందుతూన్న 'నా తమ్ముడు' అనే పదంలోని 'నా' అనే అక్షరాన్ని తుడిచేసుకోగల్గితేగాని యీ పని సాధ్యం కాదు."

ఒక సంవత్సరం గడిచిన తరువాత ఆ దావా మునిసిఫ్ కోర్టులో విచారణకు వచ్చింది. తీర్పు విని గ్రామస్థులు నిర్ఘాంతపోయినారు. మారమ్మ దిగులుతో కుంగిపోయింది. మల్లేసు, యీ సందర్భంలో అతనికి అండగా నిల్చిన పల్లెగ్రామస్తులూ హాస్యధ్వానలతో విజయోత్సవం సల్పుకుంటూ వెంకటేసును అతని వైపువారినీ హేళనగా మాటాడుతున్నారు. కాని వెంకటేష్ మాత్రం కించిత్ మాత్రమైనా నిరుత్సాహపడలేదు. 'ధర్మదేవత నియమబద్ధంగా నడవటానికి యిదేమీ రామరాజ్యపు కాలం కాదుగదా!' అని అంటూ నాలుక దప్పరించి ఊరుకుని మారమ్మచేత పై కోర్టులో అపీల్ చేయించాడు. నాలుగు మాసాలు గడిచిన తరువాత పైకోర్టు నిర్ణయంకూడా మారమ్మకు వ్యతిరేకంగానే వచ్చింది. దావా ఖర్చులు, రెండు సంవత్సరాల ఫలసాయపు విలువ, ఇదంతా కలిపి పదివేల రూపాయలవరకు మారమ్మ మల్లేసుకు చెల్లింపవలసి

వచ్చింది. ఆ మొత్తం కోర్టులో చెల్లించిన తదుపరి హైకోర్టుకు పోదామన్నాడు వెంకటేసు. యీ సందర్భంలో ఇక ముందుకు సాగిపోవటం నూరమ్మకు ఇష్టంలేదు. యీ అపజయాలతో నిరుత్సాహినియై యీవిషయాన్ని ముగించమని పోరుపెడదామనుకుంది. కాని వెంకటేస్ మాటను కాదనలేక హైకోర్టులో అప్పీల్ చేసింది. కాని హైకోర్టు న్యాయమూర్తుల హృదయాలుకూడా నూరమ్మను వెంకటేసును చిన్నచూపే చూసినయ్. మల్లేస్ అదృష్టదేవత అందిచ్చిన మధుపాత్రను నోటిముందుంచుకుని మదించిన మనసును అదుపులో వుంచుకోలేక ఇష్టం వచ్చినట్లు అందరితోను, వాగటం ప్రారంభించాడు. వెంకటేశ్ మాత్రం ఇదివరకటి ఉత్సాహంతోనే నూరమ్మతో "మా డబ్బోతే, మన దేశంలో సుప్రీమ్ కోర్టు వున్నదని విశ్వాసం కలిగేవుంది" అన్నాడు. "ఇక వద్దు నాయనా, యీ వ్యవహారాన్ని మర్చిపోదాం. యీ అపజయాలతో ఇప్పటికే నేను చాలా అలిసిపోయాను. బోలెడు డబ్బు దండగైపోయింది. యిక మొండిపట్టుగా పూనుకుంటే యీ మిగిలిన ఆ పైకి కూడా ఆశవదులుకోవల్సి వస్తుందేమో?" అన్నది నూరమ్మ.

"అలా వీల్లేదు పిన్నీ! మనకు అందుబాటులో వున్నంతవరకూ న్యాయశాస్త్రాన్ని 'నువ్వు మాయారూపంలో వ్యవహరిస్తూ మాకు యీ ద్రోహం ఎందుకు జరిగించావ్?' అని నిగ్గతీసి అడిగి తీరవలిసిందే. నువ్వేమీ ధనవ్యయమని చింతపడనక్కర్లా. నా రెండెకరాల వల్ల నేల, ఇలా అమ్మి ఢిల్లీ చుట్టూ తిరుగుతాను. ఈ ధర్మయుద్ధపు హోమకుండంలో నా సర్వస్వాన్నీ వస్నాకూడా దగ్ధం చేసికోవల్సొస్తే." అన్నాడు వెంకటేస్. "అంతపని మాత్రం వద్దు నాయనా. నా కోసం యిప్పటికే ఎంతో శ్రమపడ్డావ్. నీ యిష్టప్రకారంగానే మళ్ళీ అప్పీలు చేద్దాం." అన్నది నూరమ్మ. వెంకటేస్ ఢిల్లీవెళ్ళి సుప్రీంకోర్టులో అప్పీలుచేసి వచ్చాడు. గ్రామంలో తల ఎత్తుకుని తిరగడానికి వీలులేకుండా మల్లేస్ మాటల వలన అతను అనేక విధాలుగా అవమానపడుతున్నాడు. ఆ ఉన్నత న్యాయస్థానం వారికూడా యీ అన్యాయాన్ని సహించలేకపోవచ్చునేమో అను ఒక చిన్న ఆశతో తీర్పుకొరకు అతను నిరీక్షిస్తున్నాడు. మూడునాళ్లు గడిచిన తరువాత సుప్రీంకోర్టునుండి వచ్చిన ఒక టెలిగ్రాం అతని ఆశను ఫలింపచేసింది. న్యాయానికీ అన్యాయానికీగల తేడా వివరించి చెప్పింది. యీ వార్త ఒక్క నిమిషకాలంలో వూరంతా పాకిపోయింది. నూరమ్మ వైపు కృషిచేసిన వారందరూ విజయావేశంతో పొంగిపోతూ వెంకటేశ్ యింటిచుట్టూ మూగారు. 'ధర్మాత్ముడు వెంకటేస్‌కి జై' అనే కీర్తినాదాలు మిన్నుముట్టుతున్నాయి. యీవిషయం మల్లేస్‌కు తెలియడానికి ఎంతో సేపు పటలేదు. అత్యంత కోపావేశంలో వూగిపోతున్నాడు. ఆ పరిస్థితిచూచి అతని భార్య వెంకమ్మ యిలా అన్నది "నేను మీకు అపుడు చెప్పలేదండీ! మొదట్లో నెత్తిమీద మొట్టికాయ వేసి ఆశన్ని అణిచిపెట్టి వుండండీ అని! ఎన్నికలో పోటీచేయ్యండీ అని నెత్తిమీద నోరుపెట్టుకుని మొత్తుకున్నా కూడా వింటారా? పూరికే కాలు ఆడించేటి వాడుకూడా లేకుండా దమ్మిడీ ఖర్చులేకుండా హాయిగా పంచాయితీ బోర్డు ప్రెసిడెంటయి కూర్చున్నాడు. ఆహోదాతో బోలెడు పరపతి సంపాదించి వూళ్ళో వాళ్ళందర్నీ కట్టుకుని మననెత్తిమీద దీపం పెట్టాడు"

"పిచ్చిదానా? పదవి తెచ్చే పరపతి వుండదు. పరపతే పదవి నిస్తుంది. పదవీ స్వీకరణ పరపతిని నశింపచేసే విషమాస్త్రం."

"మరి ఆయనకు వూళ్ళో యింతమంది మద్దతుగా వుండటానికి కారణం ఏమిటంటారు?"

"ఆయనలోని మంచితనంకూడా కొంతకారణమైవుండవచ్చు. మన కపకారంచేసినవాడల్లా మంచివాడుకాదనే అభిప్రాయం సరైనదికాదు. శీలం, శౌర్యం అపమార్గాన వినియోగపడకుండావుంటే మానవుని మంచితనానికి అవి అలంకారభూషణాలు. ఆయన ఎంతమంచివాడైనా కానియ్! నాకు అపకారి, నాతలను తుంచివేసిన యీ ఘోర శత్రువును వదిలిపెట్టను."

"ఒదిలిపెట్టక ఏమి చేయగల్గిందేమిటి?"

"చూద్దువుగాని"

మల్లేస్ దరదరా నడుస్తూ గదిలోకి వెళ్ళాడు. అస్థిమితమైన అతని మనసులో గుబులు రేగుతోంది. ఆకాశానికి ఎత్తిన యీ విజయ పరంపరలు అంతెత్తునుంచి అతన్ని ఒక్కసారిగా నేలమీదకు విసిరివేసినై. ప్రచండ వాయువేగంతో అనేక వేల భావనలు అతని మనసులో పరుగులు తీస్తున్నయ్. జీవితం సాకల్యంగా తెరిచి చూడగల ఓపిక అతని మనసుకు లోపించింది. గుబులు గుబులుగా అటూ ఇటూ పరికిస్తూండగా ఎదురుగా గోడమీద మేకునుంచి వ్రేలాడుతూన్న ఒక వస్తువు కన్పించింది. అది కత్తి! గాఢంగా నిగనిగలాడుతూ మెరిసిపోతున్నది. ఆ వస్తువు 'కొంతమందికి నేను భయంకరంగా కన్పించినప్పటికీ, నన్ను అత్యంత మిత్రునిగా ఎంచి ఆత్మసంతృప్తిని పొందగలిగే వాళ్లు కూడా లేకపోలేదు.' అని చెప్తున్నట్టుగా తోచింది. మల్లేస్ దృష్టికి ఆ వస్తువు కేంద్రీకృతమైంది అతని

ఆలోచనలన్నీ దానిచుట్టూ విహరిస్తున్నాయ్. ఆలోచనల ఒత్తిడికి తట్టుకోగలిగోద్ది అతని మనసుకి గట్టిబలం కలిగింది.

"అనవసరపు ఆలోచనలతో కాలం వ్యర్థపుచ్చకుండా నన్ను ఉపయోగించడమే నీ కర్తవ్యం! మరి ఎన్నటికీ అతనివలన యిలాంటి గడ్డుసమస్యలు తిరిగి సముత్పన్నము కాకుండా నిన్ను నీవు కాపాడుకోవాలనుకుంటే నన్ను అతనిమీదకు ప్రయోగించు. మీ మీ బాంధవ్యాలతో నాకేమీ పనిలేదు. ఎవరి చేతిలో కూర్చుంటే వాడు చెప్పినట్లు చేయటమే నా విధి. ఆలోచన వాడిది. కార్యాచరణ నాది." అని ఆ కత్తి అన్నట్లు తోచింది అతనికి!

ఇందాకటినుంచీ ఊహాజనిత లోకంలో విహరిస్తూండిన మల్లేసును వాస్తవికత, బంధాలేని యీ లోకంలోకి లాగింది. 'కాలయాపన కూడదు, అనుకున్న పని వెంటనే జరిగిపోవాలి' అని నిశ్చయించుకుని గోడదగ్గరకు వెళ్ళాడు మల్లేస్. ఆవస్తువుపై హస్తాన్ని వుంచినపుడు కూడా అతని మనసు కొంచెం ఆలోచింప మొదలిడింది. కాని అవమాన వ్యథతో ఉడికిపోతూన్న అతని రక్తం 'కాలయాపన చేయవద్దు. ఆలోచనలకు నీతిలేదు. అవి మనిషిని ఎటు పడితే అటు లాగుతూంటాయి' అని హెచ్చరించింది. వెంటనే ఆ వస్తువుతీసి ఒక పొడుగాటి లెదర్ బేగ్ లో వుంచాడు. ఆ లెదర్ బేగ్ ని బొడ్డుదగ్గర బట్టముడిలో దాచుకుని మేడమెట్లు దిగి బయటకు వెళ్ళిపోయాడు. అప్పటికి చాలాసేపు కావటం మూలాన వెంకటేస్ ఇంటివద్ద జనసందడి కొంచెం తగ్గింది. వీధిగుమ్మంలో నిలబడి అపుడే వచ్చిన అయినవారు పెద్దలతో మాట్లాడుతున్నాడు వెంకటేస్. ఏ దిక్కునుంచి వచ్చాడో కూడా ఎవరూ గమనించలేదు. వెఱ్ఱి ఆవేశంతో వెంకటేస్ మీద పడికి రెండు కత్తిపోట్లు వేసే వరకూ ఆ అయినవారుగురూ యిది హత్యాప్రయత్నమని అవగాహన చేసికోలేకపోయారు. వారికి కాళ్ళాడ లేదు. మనసులు పనిచేయలేదు. కండ్లముందు జరుగుతూన్న దురంతం గుండెల్ని తీవ్రంగా కంపింపచేస్తోంది. హంతకుడు వెంకటేస్ శరీరాన్ని ఛిద్రం చేస్తున్నాడు. రుధిర ధారలు ప్రవహిస్తున్నాయి. నాలుగు నిమిషాలవరకూ పెద్దమనుష్యులు నిశ్చేష్టులై శిలాప్రతిమలవలె నిలబడివున్నారు. తరువాత ముందుకు సాగివెళ్ళి హంతకుడి రెక్కలు పట్టుకుని యివతలకు లాగటానికి ప్రయత్నించారు. వెఱ్ఱి ఆవేశంలో క్రూర బలంతో వూగిపోతూన్న హంతకుడు వారిని ఒకచేత్తో ప్రక్కకు నెట్టుతూ మరోకచేత్తో తనపని పూర్తిచేసుకున్నాడు. డొక్కల్లోపడ్డ పోటుతో వెంకటేస్ నేలమీదకు ఒరిగిపోగానే కత్తి దూరంగా విసిరేసి 'ఇక మీరు ప్రేక్షకులు కారు. నన్ను పట్టుకుని మీ రేమైనా చెయ్యండి. నాకు ఇష్టమే' అని వారి ముందు నిలబడ్డాడు హంతకుడు. అప్పుడు గుర్తుపట్టగలిగారు హంతకుడు మల్లేస్ అని. రెండు నిమిషాలలో మల్లేస్ లోని వెఱ్ఱి ఆవేశం పూర్తిగా తగ్గిపోయింది. రక్తపు మడుగులో పడివున్న తన అన్న శరీరాన్ని ఒక తడవ కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు. ఎంతో వాత్సల్య పూరితంగా 'తమ్ముడూ' అని సంబోధించే ఆనోటినుండి రక్తపు బొట్లు రాలుతున్నాయి. తమ కుటుంబం కొంచెం దుర్భర కాలంలో వున్నపుడు 'విచారపడకు తమ్ముడూ! మనకు మంచిరోజులు రాకపోవు!' అని ఆదరణగా తలనిమిరిన ఆ హస్తాలు నాలుగైదు ముక్కలుగా విరిగిపడి వున్నాయి. తనయెడల అధిక దయారసం ప్రవహింపచేసిన ఆ నేత్రాలు కాంతి క్షీణములై పోతున్నాయ్. తనను చిన్నప్పటి నుంచీ ఎంతో లాలించి బుజగించి ప్రేమగా పెంచిన తన అన్న తన మూర్ఖ రౌద్రానికి బలియైపోతున్నాడు... మల్లేస్ హృదయంలో దుఃఖ ప్రవాహం పొంగింది. 'నా అన్నను నేనే చంపుకున్నాను' అని బిగ్గరగా విలపిస్తూ ఆ రక్తపు మడుగులో దొర్లుతున్నాడు. చుట్టూ కూర్చొనివున్న పెద్ద మనుష్యులవంక వెంకటేస్ ఒక్కతడవ దీనంగా కండ్లరెప్పలు విప్పిచూచి హీన కంఠస్వరంతో 'నా తమ్ముడిపై హత్యానేరం మోపకండి, యీ విషయాన్ని మరణ వాఙ్మూలంగా చెప్పామనుకుంటే నాకు వ్యవధిలేకుండా పోతోంది." అని అంటూ కళ్ళు మూశాడు. అదే ఆఖరిమాట అయింది. తర్వాత ఒక అరగంటకు పోలీసు ఉద్యోగస్థులు వచ్చారు. వారితో మల్లేస్ తానే హంతకుడని ఒప్పుకుని ఆవిధంగా వ్రాసియిచ్చాడు. అందుకు తగినట్లుగా అక్కడవున్న పెద్ద మనుష్యుల సాక్ష్యాలు కూడా తీసుకుని మల్లేస్ ని బస్తీకి తీసుకువెళ్ళి సబ్ జైల్ లో వుంచారు. కేసు నడుస్తూన్నపుడు కొంతమంది స్నేహితుల ప్రోద్బలంతో మల్లేస్ తన మనసును మార్చుకున్నాడు. "నేను హంతకుణ్ని కాదు. యీ హత్యతో నాకు ఏ మాత్రమూ సంబంధములేదు. పోలీసువారి హింసా కాండను భరించలేక ఆవిధంగా స్టేట్ మెంటిచ్చాను" అని న్యాయస్థానంలో వాదించాడు. యీ కేసునుండి రక్షింపబడాలనే పట్టుదలతో తన కుంటుకున్న మేడ, రెండెకరాల భూములు—యీ రెండింటినీ విక్రయించి ఆ పైకం ఖర్చుపెట్టి పెద్ద పెద్ద ప్రయత్నాలు చేశాడు. సుప్రసిద్ధుడైన ఒక బొంబాయి న్యాయవాదిని పిలిపించి తన పక్షాన వాదించుటకు న్యాయాధిపతుల ముందు హాజరుపర్చుకున్నాడు. చివరకు యీ ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనములైనాయి. కాని సెషన్సుకోర్టులో

విధింపబడిన జన్మఖైదుగను హైకోర్టులో ఎనిమిది సంవత్సరాల కారాగారవాసశిక్షగా తగించటం జరిగింది. ఖైదులో అతని మంచినడవడికిగాను ఒక సంవత్సర కాలం తగ్గింపుచేశారు. మిగిలిన ఏడుసంవత్సరాల శిక్షా కాలము పూర్తికాగానే మల్లేష్ బయటపడ్డాడు.

4

జైలునుంచి విడుదలయిన మర్నాటిరాత్రి ఏడు గంటల బండికి స్వగ్రామపు రైలుస్టేషన్లో దిగాడు మల్లేసు. స్టేషన్ గేటుదాటి బయటకు రాగానే అతి పరిచయంలోవున్న మూడెంతస్తుల మేడ అతని దృష్టికి తగిలింది. "రాత్రి బండికి యీ ప్రదేశాల్లోనుంచి రావడానికి ఎంతో భయంగావుండేది. అటువంటిచోట యీ మేడలూ మిద్దెలూ వెలిసి ఎంత సందడిగావున్నదీ!" అని ఆశ్చర్యపడుతూ కొంచెందూరం వెళ్ళాడు. దారిపొడుగుల ఎక్కడగానే విద్యుత్కాంతులతో విలసిల్లుతూ గ్రామం ఎంతో శోభగా కనిపిస్తోంది. విస్మయంగా గబగబా నడవటం ప్రారంభించాడు. పల్లెటూరు కాబట్టంమూలాన అప్పటికప్పుడే ఎనిమిదిగంటలైనా దాటకముందే వీధులలో జనసంచారం తగ్గింది. నాలుగువీధులూ కలిసిన చౌకును సమీపిస్తూండగా అక్కడేదో శిలాప్రతిమవున్నట్లు దూరానికి కనిపిస్తోంది. దాని వెనుకవైపుభాగమును చూచి 'యే నాయకునిప్రతిమో అయివుండాలి. ఈమధ్య మూడు మూలలవున్న పల్లెటూళ్ళలో సైతము యీ మోజా ఒకటి హెచ్చిపోయిందని జైల్లో రామన్ గారు చెప్పారు కదా! అని అనుకుంటూన్నంతలో నే చౌకులోకి అతను రానేవచ్చాడు. ప్రతిమ ముందుభాగంవైపుకు వెళ్ళి నిలబడ్డాడు. అత్యంతాశ్చర్యంతో అతని మనసు తిక్కిరిబిక్కిరవుతోంది. ఏ దేశనాయకుడిదో కాదు. ఆ శిలాప్రతిమ తన అన్న వెంకటేష్ ది. ప్రతిమకు కొంచెం అడుగున బిగించివున్న రాతిఫలకంపై 'పరోపకారం కొఱకు ప్రాణదానం చేసిన అమృత వ్యక్తి—వెంకటేష్' అని లిఖింపబడిన గిల్టు అక్షరాలు విద్యుత్కాంతులలో తళతళలాడుతున్నాయి. ప్రతిమ పైభాగాన నాలుగు ఎలెక్ట్రిక్ బల్బులు బిగించారు. ప్రతిమ స్పష్టంగా మంచి హుందాతనంగా కనిపిస్తోంది. మల్లేస్ ఆ ప్రతిమలోకి ఏకాగ్రతతో దృష్టి బరుపుతూ నిలబడ్డాడు. తానొకవిధంగా తలిస్తే దైవం మరొకవిధంగా చేశాడు. తనకు చేసిన ద్రోహానికిగాను యీలోకంనుంచి తన అన్నను తొలగించి తీరాలని కత్తి పొడిచి చంపాడు. అపనిచేసి తను తన మానవత్వన్ని కోల్పోయాడు గాని తన అన్నను మాత్రం యీ ప్రపంచంలోనుండి పంపలేకపోయాడేమో? పైగా తనుచేసిన పనివలన వెంకటేష్ అజరామరుడై ప్రజలనుండి అనంతమైన భక్తి ప్రపత్తులను పొందుతున్నాడు. అతనికి త్రికుసుమాల సువాసనలలో గానుమంతా గుబాళించిపోతోంది. ముందు తరాలవారికి మార్గదర్శకుడు కాగలిగాడు. ఏదో కొద్ది ప్రపంచజ్ఞానం కలిగి సామాన్యుడుగా ఎంచబడుతూండే వెంకటేష్ కి యింత ఔన్నత్యాన్ని కల్గించి విఖ్యాతిని ఆర్జించి పెట్టి మహోన్నత్యకోవలో జేర్చింది తన ప్రతీకార వాంఛేగదా! పైకి అపకారంగా కన్పించినా కొన్ని కొన్ని దుష్కార్యఫలితాలు, వాటిని అనుభవించిన వాడికి అవాంఛనీయంగా కృషిశూన్యంగా 'ఎంతో వున్నతిని కూడా స్తాయ్. తన ద్వేషం, కక్ష తనకే చెరుపు చేసినయ్. సిగ్గుతో అవమానంలో ప్రతినిమిషమూ క్రుంగిపోవల్సిన తృణీకృత క్షుద్రస్థితికి దింపినై. తన నొక క్రూర రాక్షసునిగాను, అతని నొక దివ్యాంశ సంభూతునిగాను లోకానికి చూపిస్తున్నాయి. మల్లేస్ అక్కడ్నించి కదలి ముందుకు వెళుతున్నాడు. కాని ఆ మొత్తమలుపు తిరగగానే మల్లేస్ కాళ్ళు అకస్మాత్తుగా ఆగిపోయినై. ముందుకు అడుగుపడటంలేదు. ఆ ఎదుటి గుమ్మంలో చంకన బిడ్డవిడుకుని ఎవరికోసమో నిరీక్షిస్తూ నిలబడి వున్న స్త్రీ వైపు తాటిగా చూస్తున్నాడు. పిరుదుల్ని అనుకూవున్న పొడుగాటి వాల్జడ, ఆ జడ మొదట్లో కొద్దిగా యిరికింపబడి క్రిందకు జారిపోవడానికి సిద్ధంగా వున్న పెద్దమల్లెచెండూ, ఫేస్ పౌడర్ అధికంలో నలుపు దర్పాన్ని దాచుకుని నిగనిగలాడుతున్న ముఖము, పెదవులకు పూసుకున్న ఎరుపు రంగు, చేతులు కదిలినప్పుడల్లా గలగలలాడే గోల్డు కవరింగ్ కంపెనీవారి గాజులు, ఆ వస్త్రధారణతీరు— సహజంగా సౌందర్యవతి కాకపోయినప్పటికీ యీ కృత్రిమపు మెరుగుల్లో ఆమెనుమాచేవారికి కొంచెంరూపవతి మాదిరిగానే తోస్తుంది. మెరిసేమున్న ఎలెక్ట్రిక్ లైటుయొక్క కాంతుల్లో ఆమె ముఖం మల్లేసుకు స్పష్టంగా కనిపిస్తోంది. ఇక సందేహం లేదు. ఆ వన్నెలాడి తన భార్య అని వేరే ఎవరూ వచ్చి చెప్పనక్కర్లేదు. ఆ ఇంటివాకిలి ముందుకువెళ్ళి నిలబడి "ఆ బిడ్డ ఎవరు వెంకటలూ?" అని అడిగాడు మల్లేస్ కొంచెం ఉత్సాహం తెచ్చుకుని.

"నా పిల్లే! నువు పిలిచిన పేరు ఏడెనిమిదేళ్ళ నాటిది. ఇప్పుడు నా పేరు కోమలాంగి. ఆ రకంగా గజెట్ లో ప్రచురణ చేయించాడు కూడాను మా ఆయన."

"ఏమిటి నీ ఆయనా! నీ పిల్లా!... మల్లేస్ మాటలు తడబడుతున్నాయి అతని కంఠస్వరం తీవ్రరూపాన్ని పొందుతోంది.

"ఆన లెవరయ్యా నువ్వు? వెంకులూ అని పిలుస్తున్నావ్" అని అంటూ గుమ్మందాటి ఒక మెట్టు

క్రిందకు దిగివచ్చి మల్లేస్ ముఖాన్ని తేరిపార చూసింది. అతని ముఖాన్ని క్షణమాత్రంలో గుర్తించింది. గిరుక్కున వెనక్కు తిరిగి "అరె పసిపిల్లాడా? ఊళ్ళోకి మళ్ళీ దాపురించావ్? ఫో! అవతలకు ఫో! ఖూనీలు చేస్తివాడా." అని తిట్టుకుంటూ లోపలకు వెళ్ళి ఫెడేలున తలుపు రెక్కల్ని మూసుకుంది. నేత్రాల్లో ఉబుకుతూన్న జలబిందువుల్ని చేతో తుడుచుకుంటూ వెనక్కు తిరిగివచ్చి మల్లేస్ రోడ్డు పై నిలబడ్డాడు. దుఃఖాలవేడితో ఎండుకుపోయిన అతని అంతఃస్సు తీవ్రవేదనతో మూలిగింది. తనకు మిగిలిన యీ ఒక్క ఆశాకుసుమం కూడా నలిగిపోయింది. ఒక తనకీ ప్రపంచంలో ఎవరూ లేరు. ఏదీ లేదు, సౌఖ్యం యివ్వగల ధనం లేదు. ప్రేమింపగల భార్య లేదు. ఆదరింపగల అన్న లేడు. కీర్తి ప్రతిష్ఠల నిర్వ్యాజ వ్యక్తిత్వం లేదు. అన్నిటినీ అందరినీ కోల్పోయి అనూహ్య భారంతో తలఎత్తలేక అవమానపు జ్ఞాపకాల ఒత్తిడి సహింపలేక శరీరమంతా కూలిపోయిన తనకు యింకా యీ జీవితం దేనికి? ఇంతలో శీతలవాయువులు అతని శ్రవణపుటములకు ఒక హోరుగానాన్ని అందింపచేసినయ్. 'ఔను, ఏటిపొంగే కెరటాలు కదా! ఆ నదీమాతే నాకు ఆత్మశాంతిని కల్పింపగల దివ్యౌషధం' అని అనుకుంటూ ముందుకు సాగి నడవటం ప్రారంభించాడు. కాని నాలుగు ఇళ్ళు దాటగానే మనసులోకి ఏదో ఆలోచన వచ్చి అతను ఆగి నిలబడ్డాడు. ఎదురుగా అరుగుపై ఆసీనుడై యున్న వేదపండితుడు తన యజ్ఞోపవీతాన్ని పొడుగా సాగ తీసుకుంటూ వేదమంత్రాలు వల్లెవేసుకుంటున్నాడు. మల్లేసు ఆయనకు కొంచెం సమీపంగా వెళ్ళి "శాస్త్రులు గారూ! యీ మెట్టమీది యింట్లో కాపురమున్నావిడ ఎవరండీ?" అని అడిగాడు. పండితులు పరిస్థితి కొంచెము తెల్సుకుంటాను నే ఆ దీర్ఘంతో. "అదిగో— అదీ నా మొదటిభర్తతో కాపురం చేసినపుడు పెంకుటిల్లు. రెండోభర్తను కట్టుకున్న తర్వాత కోమలాంగి. నిజం దానిసంగతి మనకెందుకులే. ఇప్పుడు యీ మాటలే వేసా వినిపించుకున్నదా అంటే దాని యూరుల పద్యాల కొంగలేక నా వేదపఠనాలకు స్వస్తి చెప్పి ఇంట్లోనూ రాలి. అటువంటి రకమంతా అంటేనే కూర్చి. అటువుంటే నీ గాని వాళ్ళు సంఘంలో జీవింపలేరు" "అదిష విషయం నాకు కొంచెం అవసరమైంది. మీకు తెల్సిందేదో కొంచెం చెప్పండి అయ్యగారూ." "దాని కిప్పటివరకూ రెండు వివాహాలని మాత్రం నాకు రూఢిగా తెలుసు...పాపం మొదటిభర్త మల్లేసు అని ...వాడు మంచివాడే మరి...ఏం దుర్బుద్ధి పుట్టిందో ఏమో అన్నను కాస్తా కత్తితో పొడిచి చంపేశాడు. శిక్షపడి వాడు జైలుకి వెళ్ళిన మూడు మాసాలకే యిది ఒక మోటారు డ్రైవర్ని కట్టుకుని కులుకుతోంది...ఇదీ దాన్ని గురించి నాకు తెల్సిన సమాచారం. అసలు నువ్వెవరివి నాయనా? ఇప్పుడు నువ్వు దాని వాకిట్లో నుంచి వస్తూన్నట్లుంది?"

"గుర్తు పట్టలేదా శాస్త్రులుగారూ? నేను మల్లేసును."

"అట్లా గురా నాయనా? నువ్వు మల్లేసువా? జైలు నుంచి విడుదలై ఎప్పుడు వచ్చావ్? దాని వాకిట్లోకి ఎందుకురా వెళ్లావ్? మల్లేస్, నువ్వు వెళ్లవలసిన ఇలు అదికాదు. అదిగో ఆ యింటివైపు. ఆ మహాతల్లి నీకోసం కాచుకుని కూర్చుంది. నీకు మళ్లా వివాహం చేసి తన ఆ తింటితంతి కాపురమసి పోకుండా కాపాడాలని ఆతురతపడుతోంది."

మల్లేస్ మౌనంగా కదిలి ముందుకు వెళ్ళుతున్నాడు. నిజంగా తన అన్న, వదిన--వారిరువురూ పుణ్యజీవులు. ఆమె తనభర్తను దైవసమానంగా భావిస్తుంటేది. అతడు తన భార్యను ఎంతో ప్రేమగా చూసుకుంటూండేవాడు. ఆ జంటను తన దారుణ హస్తాలు విడదీసినై. ఆమె భర్తను వధించి ఆమె సుఖాలను మంటగల్పిన వాణ్ని గురించి ఎంత దయగా ఆలోచింపగలుగుతోంది? కాస్తో కూస్తో దైవత్వాన్ని సాధించి వుంటేనే తప్ప, లేకపోతే మాత్రం మానవజీవికి ఇంత శాంతి సహనాలు అసంభవాలు! మల్లేసు తన అన్న ఇంటి ముందుకు వచ్చాడు. మెల్లిగా అరుగుమీదకు వచ్చి కూర్చున్నాడు. గుమ్మంలో కూర్చొని వున్న వదిన సంతోషంతో ఉప్పొంగిపోతూ లేచి నిలబడి "వచ్చావా మరిదీ? జైలు ఇన్‌స్పెక్టర్ గారికి వారంరోజుల క్రిందట ఉత్తరం వ్రాశాను. గురువారంనాడు విడుదల జరుగుతుందని వారు జవాబు వ్రాశారు. ఇవ్వాళ శుక్రవారం కదా. ఇంతవరకూ రాలేదేమా అని నీకోసం ఎదురు చూస్తున్నాను." అన్నది. "వాకిలికు ఎదురుచూడటంలోగల నీ అభిప్రాయం నేను యింతకు ముందే తెలుసుకున్నాను వదినా! నీ ప్రబోధువాటల్లో బహిర్గాన్ని సృష్టించిన యీ జన్మశత్రువుపై నీకు దయ ఎలా కలుగుతోందమ్మా. నీ ప్రేమాభిమానాలు పొందటానికి తగిన అర్హత నేను ఏనాడో కోల్పోయినాను తల్లీ! నీ పవిత్రమూర్తిత్వానికి ఒకసారి విన మ్రుడనై నమస్కరించాలని వున్నది. కాని ఆ పరమశాంతమూర్తిని చిత్రవధ చల్పిన యీ దుష్టహస్తాల్ని శోధించి అసని చేయలేకుండా వున్నాను..." అని అంటూ అరుగు దిగి వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు చరచరా నడిచివెళుతున్నాడు మల్లేస. అక్కడ వీధి దీపాలు లేవు. గాఢాంధకారం భీకృతంగా వ్యాపిస్తోంది. బాట కిరుప్రక్కలా వున్న పెద్దపెద్ద వృక్షాలు చీకటి భూతాల్లాగా నిలబడి వున్నాయ్. ఊహాపనాలు వార్డుల్ని సంకుచితపరిచె మాన

వుని అజ్ఞానంలాగా కోడుపొడుచునా బారులు తీర్చి వున్న ఆ వృక్షాలు తన ప్రక్కలనున్న ప్రదేశాల్ని కనుపించనీయటం లేదు. గగనభాగంలో అక్కడక్కడ చెదురుగా కదుల్తూన్న నల్లమబ్బు తునకలను చందమామ ఛాయంగా తప్పించుకుంటూ నిర్మలంగా వున్నచోట్లన మాత్రం నీటుగా నడుస్తున్నాడు అష్టమి చంద్రుడు. మానవజాతిలో అనాటి కౌర్యాలు విజృంభించుకు పోతూన్న అమానుష్యపాల ఉద్ధ్రతకు భూదేవి హృదయపు లోతుల్లోనుంచి బయల్దేరిన ఆక్రందన స్వరం అన్నట్లుగా, నది ప్రవాహం భయంకరమైన హోరుధ్వనిని సృష్టిస్తూ అనంత వేగంతో ముందుకురుకుతోంది. తనకు అడ్డుతగిలిన దానినల్లా నిస్సంకోచంగా తన గర్భంలో దాచుకునే నదీప్రవాహోధృతి ప్రవర్తి చే. మానవుడికి మొదటగా అధికారం, ఆవేశం, నిరంకుశత్వాలను చేర్చి వుంచెవమ్మ నేమో?

మల్లేష్ ఒడ్డుమీదకు వచ్చి కూర్చున్నాడు. సమీపంలోనే వున్న శ్మశాన స్థలంలో శవదహనం జరుగుతోంది.

మల్లేష్ తన హస్తాల్ని కళ్ళముందు పెట్టుకుని తీక్షణంగా చూసుకుంటున్నాడు. ప్రతి హస్తరేఖలోనుంచీ తన అన్న మృత్యుబాధ పడుతూన్నప్పుడు వెలువడిన ఆర్తనాదాల ధ్వనులు వినిపిస్తున్నాయి. ప్రతి ప్రేలి చివరి కొనలోనూ కత్తి పోటుతో నిండి వున్న తన అన్న మృతశరీరం కనిపిస్తోంది. యీ రాక్షస హస్తాలవలన లోకంలో యిక నెవరి కెవ్వరికీ అకృత్యాలు జరక్కుండా నది గర్భంలో దాచుకో గలటమే తాను యీ జన్మములో చేయగల్గిన పుణ్యకార్యం!

తన అన్నను హత్యచేసే ముందు అతని గుండెల్ని పూసిన ఆ వేశమే మరల యిప్పుడు కూడా అతనిలో ప్రవేశించింది. ఆనాడు ఆ సంకల్పంనుండి దిగజారిపోకుండా అతని మనసును ఎలాటి ప్రతిన్నతో కట్టివేయగలిందో, యీనాడు కూడా యీ భావన నుండి తిరిగి పోకుండా తగిన ఏర్పాట్లు చేసింది. అతని అధరాల సందునుంచి ఒక మందస్మితం ఒలికింది. ఆ నవ్వు తననుండి ప్రపంచవాసనల్ని దూరం చేసింది. ఇక తను స్వతంత్రుడు! మల్లేష్ మహోత్సాహంగా, క్రొత్తగా అవిర్భవించుకొచ్చిన బలంతో లేచి నిలబడి అయిదు నిమిషాలపాటు నదీమతను కూర్చి మనసులో ధ్యానం చేసుకున్నాడు. తరువాత నెమ్మదిగా ఒడ్డునుంచి దిగి నదిలోకి ప్రవేశించాడు. ఏకాగ్రచిత్తంతో ముందుకు నడిచివెళుతున్నాడు. నదీమాత సంతోషహృదయంతో అతనికి స్వాగతం యిస్తోంది. కొంచెం దూరంలో వున్న కోవులో చేపలుపడుతూ గట్టుమీద నిలబడిన ఒక సిపాయి గబగబా పరుగెత్తుకుని వచ్చి నదిలోకి దూకేడు. యీదుకునివెళ్ళి రెండు మునకలు పూర్తిఅయి మూడో మునకతో ప్రాణాలు విడవడానికి సిద్ధంగావున్న మల్లేసును భుజాలమీద వేసుకుని ఒడ్డుకు తీసుకొచ్చాడు. నీరు బాగా త్రాగి వుండటం మూలాన మల్లేసుకు కొంచెంగా స్మృతి తప్పింది. రెండెడ్ల బండీమీద వేసుకుని ఆ దగ్గరగా వున్న గ్రామపు పోలీసు స్టేషన్‌కు చేర్చాడు. కొంత సేపటికి మల్లేష్ కళ్ళు విప్పిచూచాడు. ఎదురుగా సబ్ ఇన్స్పెక్టర్ నలుగురు పోలీసు జవాను నిలబడి వున్నారు.

మల్లేసుపై ఆత్మహత్యా నేరంమోపి పోలీసు వారు కేసు పెట్టారు. మొదటి శ్రేణి మేజిస్ట్రేట్ కేసు విచారించి మల్లేసుకు సంవత్సరన్నర కఠిన శిక్షవిధించి మళ్ళా జైలుకు పంపించాడు!

కలగూరగంప

తెనుగుభాష వ్యక్తిత్వ వికాసాలు

శ్రీ కొత్త భావయ్యచౌదరి

భారతదేశమున ఉత్తరభాగములలో దేనియందుగాని లేని, ఎ, ఒ, చ, జ, ఱ, ఁ, అనువాని ప్రత్యేకాక్షరములను గలిగియుండి, 36 అక్షరములతో నుండిన తెనుగుభాషయే మన ప్రాచీనభాష—ఇది క్రమముగా నాంధ్రముగా మారిపోయినదని చెప్పుటకు చాలినన్ని నిదర్శనములు గలవు

తెనుగు భాష మొదట ద్రావిడ భాషాకుటుంబములో పుట్టినట్లు చాలమంది విజ్ఞులమతము. కర్త, కర్మ, క్రియలు వాక్యములలో వరుసగా నుండుట యొక ముఖ్యసాక్ష్యము. వత్తక్షరములు కొన్ని లేకుండుట మరియొకటి—దీని లిపిమాత్రము బ్రాహ్మీలిపినుండి సంస్కారముతో గైకొనబడినది. దీనిచే తెలుగు కన్నడ లిపియందును. ఈ లిపికి పూర్వము తెలుగుభాషకు ప్రత్యేకలిపియున్న దృష్టాంతము లేమియు బయటికి రాలేదు. బ్రాహ్మీజన్యమైన లిపినిబట్టి తెలుగు భాష సంస్కృతి జన్యమనుట పొసగదు. ఈ క్రింది విషయములు కూడ దీనిని రుజువు చేయును.

ఆంధ్రరాజులు క్రీస్తుపూర్వము 2 శతాబ్దులనుండి పాలించుచువచ్చిరి. వారు ప్రాకృతభాషను రాజభాషగా తీసుకొనిరి. ఆ భాషలో 40 అక్షరము లున్నవి. సంస్కృతమున నింకను మరికొన్ని యక్షరములుగలవు ఆంధ్ర రాజులకాలమున తెనుగువారి కాంధ్రరాజులతో సామ్యసంబంధములు కలిగి, వారు తెలంగాణమంతయు పాలించుటవల్ల, వారి రాజభాషలోని పదములు చాల భాగము తెనుగువారికి పట్టువడెను. ఇట్లే 3 వ శతాబ్దినుండి పల్లవరాజుల పాలన నుండి సంస్కృతము రాజభాషయగుటవల్ల సంస్కృతాక్షరము లన్నియు మనభాష కలవడినవి. ఋత్వములు 13 వ శతాబ్దినికూడ మన కలవడకుండా నుండుటవల్ల మన తెనుగుభాష వ్యక్తిత్వమును నిల్పుకొనుచుండినట్లు కనబడుచున్నది. 3.7 శతాబ్దుల మధ్యనున్న తెలుగు శాసనాలలో దాదాపన్నియు తెనుగుశబ్దములే. కొంది సంస్కృత శబ్దములు కనబడుచున్నవి. 7 వ శతాబ్దిని విప్పర్ల శాసనము అట్లేయున్నది. దీనిలో ద్రావిడభాషా సంప్రదాయములు (ళ మొదలైనవి) కొన్ని గోచరించుచున్నవి. అప్పటినుండి ప్రాకృత సంస్కృత పదములకు తద్భవ, తత్సమ పదము లుత్పత్తియై తెనుగుభాషలో జేరి, యాంధ్రభాష యని పేరొందినది. ఐనను తెనుగుభాష తన వ్యక్తిత్వమును నిలుపుకొనుచునే వచ్చెను. అద్దంకి, బెజవాడలలోని పూర్వ శాసనాలలో తెలుగు పదములు విస్తారముగా గల పద్యములు, దేశిఛందస్సులు, ద్విపదలు, తరువోజలు సీసములు, గీతములు మొదలగువానితో వ్రాయబడినవి గలవు. నన్నయ, తిక్కనలే గాక, తర్వాత కవుల నేకులు తమ గ్రంథములం దచ్చటచ్చట తెనుగు పద్యములను రచించి, తెనుగుభాష స్వరూపమును నిలిపియున్నారు. అయినను వారాంధ్రభాషనే తీర్చిదిద్దినారు. 12, 13 శతాబ్దులలో నుండిన పాలకురికి సోమనాథుడు తన బసవపురాణములోను, పండితారాధ్య చరిత్రలోను జాను తెనుగు వాడుచున్నానని చెప్పి, తెనుగుభాషలోని పదములను చాల భాగము నుపయోగించి వాడి, భాషకు మహోపకారము చేసియున్నాడు. ఆయన వాక్కునుండి భాష యెంతో వృద్ధియయ్యె ననవచ్చును. ఏలనో తెలుగుకవులు చాల మంది 13 వ శతాబ్దివరకు ఋత్వమును గైకొనక వృత్తి యను పదము వ్రిత్తియని వ్రాయుచుండిరి. అట్టివారికి సంస్కృత భాషాపరిచయము లేకపోయి యుండును.

తెనుగుబాస యనగా దక్షిణదిక్కు బాసయని యర్థము. మొదటి శాతవాహనులు దక్షిణాధిపతులని వ్రాసుకొనిరి. దక్షిణదిక్కు ప్రజలా పేరున బిలువబడుట సహజము. అందుచే తెనుగువారనబడి రనవలెను. కాని తెలుగు, తెనుగు పద ప్రయోగములు 10వ శతాబ్దికి పూర్వ శాసనములందు గన్పడుటలేదు. అట్లని అప్పుడు తెనుగువారు లేరని కాని తెలుగుబాస లేదని కాని యనరాదు. దీనికి పైన నుడివిన విప్పర్ల శాసనము, మాలె పాటి శాసనము మొదలైనవి (7వ శతాబ్ది) ప్రమాణములు.

ఇతర భాషాపదములు రాదకీయపు ప్రాబల్యమున మన భాషలో జేరిపోలదని, పవయోరభేదః, లసయోరభేదః, రలయోరభేదః, అను వ్యాకరణ సూత్రములు మన యాంధ్రభాష కౌపయోగ్యక మయ్యెను. ప్రాచీన తెనుగుబాసను నాగులు, యక్షులు, దానవులు, తెలుగులు, తులుజాతి మొదలగువారు వాడి యుండ వచ్చును. ఇంకను గొన్నిచోట స్వచ్ఛమైన తెనుగుబాస మాటలాడెదరు.

కవులు చాలనుండి తమ కావ్యములలో వచ్చ తెనుగు పద్యములను వ్రాసినను, 16వ శతాబ్దివరకు దానిలో ప్రత్యేక కావ్యములను రచించలేదు. ఆ శతాబ్దిని పొన్నగంటి తెలగనార్యుడను తెలగన్న "యయాతి చరిత్రము" అను అచ్చతెలుగు కావ్యము రచించి తెలుగుబాస వ్యక్తిత్వమును నిరూపించెను. తర్వాత కూచిమంచి తిమ్మకవి మొదలగు వారట్లే రచించి, తెనుగుబాసకు మహోపకార మొనర్చిరి. ఈ కావ్య పరిశీలనమువలన తెనుగుబాస మొదటి స్వరూపమును, తద్భవ, తత్సమ పదరిశోధనమును, నన్నయాదులు తీర్చిదిద్దిన యాంధ్రభాషకు దీనికి గల భేదములను స్పష్టముగా గనపడగలవు. "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని "దేశభాషలందు తెలుగు లెస్స"యనెడి కీర్తి యాంధ్ర భాషకే తర్వాత వచ్చినది.

నన్నయభట్టునకు సమకాలికుడు గానో, కొంచె ముపూర్వికుడు గానో తెలుపబడుచున్న నన్నెచోడుడు కూడ ఆంధ్రభాషచే తన కుమార సంభవ కావ్యములో వాడియున్నాడు గాని అచ్చ తెలుగును వాడలేదు. కాని యంచలి పద్యములు అచ్చ తెలుగుమాటలతో నిండి యున్నవి. నేటికాలమున వాడుకలో నదలిపోవుచున్న అచ్చ తెలుగు పదము లెన్నో పైన నుడివిన కావ్యములలో గ్రంథస్థములై యున్నవి. వర్తీకరములు, కవులు లేనియసంపూర్ణ శబ్దాక్షర బోధితభాషయయ్యెను, శృంగారమునం దేభాషకును లేని నుడికారముగల్గి, ప్రత్యేకాక్షరములు 6 తో నుండుటవలన మన తెలుగు ప్రాచీనభాషానన్యత్యమును నిరూపించును. ఆంగ్లేయభాష 26 అక్షరములతో నుండియు నెట్లు నేటికిని సర్వవిజ్ఞానమున కాలవాలమైనదో, మన యాంధ్ర భాషయు నేడు సర్వ సంపూర్ణ భాషయై 56 అక్షరములతో విలసిల్లియున్నను, ఆంగ్ల భాషా స్థానమును బొందలేకపోవుటకు కారణము మన వాఙ్మయము సర్వవిజ్ఞానమున కాలవాలము కాకుండుటచే. ఈ లోటును భాషాసేవకులు, వాఙ్మయ విజ్ఞానసేవకులు పూర్తిచేసి, క్రమముగా మన భాష నుద్ధరింతురని నా విశ్వాసము.

త్రిలోచనుని 'తులసీదూత' కావ్యము

శ్రీ వేదం వెంకటకృష్ణశర్మ

సంస్కృతము పలువిధ కావ్యములతోఁబాటు 'దూతకావ్యముల'ను కూడ సృష్టించినది. వానిలో ముఖ్యములయినవి—(1) మనోదూత (కర్త ఎవరో తెలియదు); (2) మనోదూతః (కైతవ్యప్రభుని పేర మామకుడు విష్ణుదాసుఁడు); (3) మనోదూత (పై విష్ణుదాసవంశీయుఁడగు రామరామశర్మ); (4) ఉద్ధవదూత (మాధవకవీంద్రభట్టాచార్యుఁడు); (5) హంసదూత (అజ్ఞాతకర్తృకము); (6) పాదాంకదూత (కృష్ణనాథ సార్వభౌముఁడు); (7) గోపీదూత (లంబోదర వైద్యకవి); (8) పాంథదూత (గంగాతీరవాసి భోలానాథుఁడు) మున్నగునవి. వలకుట సంస్కృత వాఙ్మయమున ఈ దూతకావ్యములు మిక్కిలి యుత్తమరచనలుగఁ బరిగణింపఁబడుచున్నవి.

పై దూతకావ్యములలోఁ జెక్కు లింకను బ్రచురింపఁబడలేదు. పరిశోధకులు వానిని సముపార్జింపఁ బ్రయత్నించినట్లు లేదు. భావికాలమున నైన అందుఁ జెక్కులు వెలుగడవలసియున్నది.

ఈ సందర్భమున 'త్రిలోచనకవి'—విరచిత—'తులసీదూత'—కావ్యమొకటి పేర్కొనఁ దగినది గలదు. అదియు నింతవరకుఁ బ్రచురింపఁబడలేదు.

బహుశః ఇది శాలివాహనశకము 1780 ప్రాంతమున రచింపఁబడినట్లు తోఁచుచున్నది.

ఇందు వ్రాయసకాని తప్పులు విశేషముగఁ గన్పట్టుచున్నవి.

కావ్యములోని విషయము వంగభాషలో వ్రాయఁబడిన తక్కిన కావ్యములలోని వానివంటిదే. అనఁగా శ్రీకృష్ణుఁడు బృందావనమును త్యజించి, మథుర కరుగఁగానే, విరహవేదనా దోదూయమాన మానసలయిన గోపికాస్త్రీల పరిదేవనము లిందు వర్ణితములు.

బృందావనము నుండి తటాలున శ్రీకృష్ణుఁ డదృశ్యుఁడగుటచే, ఆ గోపిక లాకులపాటు చెందిన స్థితి వర్ణించుటతోఁ గథ ప్రారంభించును.

"నాథే, యాతే మధుపుర మతి
క్షోభవిభ్రష్ట చిత్తా
గోష్ఠీ కాచిత్కులగతి సఖీ
సంత్యక్తా స్వమిత్తే,
ప్రాణత్యాగా దతిసుగతిరి
తివ్యబంధో విమోహాత్,
కేన స్థేయం యుహరిరితి చో
వ్యాకులా స్తా బభూవుః||"

కొందఱు గోపికలు స్థైర్యము లేని చిత్తవృత్తితో క్రుంగిపోయిరి. మఱికొందఱు శ్రీకృష్ణుఁడు దమ్మొకతఱి మేని, విడువ నొల్లనివాఁడగుటచే, ఆమాటచే నమ్మకైరి.

"మనోహ్యాక్రం జాతుం విదిశగవా తే
మాన మధురా,
వనశ్రేణ్యో నాథః సఘనఘనబృం
దస్యాతిరరః,
వదా ప్యక్కస్త్వ్రమబ్దిం మధుపురి మగాత్
జాతు సహసా,
సముల్లంఘ్య ప్రాణ ప్రియతతిమ విభుః
ప్రీతివసతిః"

ఇంకఁ గొందఱు గోపికలన్నటో— ఆ బృందారణ్యముననే అహరహము శ్రీకృష్ణుని మీఁది పలవరముతో విహరింపసాగిరి. అందొకానొక వల్లవపల్లవాధర "శ్రీకృష్ణుఁడు దన కెన రత్యంత ప్రియతములని పలుకుట, నిజమున కాపటకు విశ్వసనీయోగ్యము కాని యసత్యము. కనుకనే, అట్టి యసత్యవాది వాక్యములను చేమల నతిఁడు యోగీంద్రులు సహితము నమ్మునట్లు చేయుట మిక్కిలి యుక్తజమగు కార్యము. అట్టి ప్రతిజ్ఞయము వారికిఁ గలుగుటకుఁ గారణమేమన : అది కేవలము శ్రీకృష్ణ ముఖోద్గతము లగుటయే. ఇఁక, ఆ యోగివర్గము నే యనుసరించు వారును క్రుతుల విశ్వసించుటలో నబ్బురమేమి గలదు?— అని నిశ్చయించుకొన్నది.

"నాస్తి కించిత్ప్రియతమ ధవే
సుప్త మేతత్త్వదుక్తం,
వక్త్రం చైత వ్యక్తము ధవతా
బంధునా పూర్వ ముక్తమ్,
ఉహ్యా రూపం వదన మధునా
బంధునా పూర్వ ముక్తమ్,
ప్రామాణ్యం తే వదసి వపుష
రాయతే సజ్జనానామ్."
"అప్రామాణ్యం శ్రుతిషు బహుభి
ర్యుక్తితే త్వద్వచస్స్వ,
దార్ష్టైరంతి ర్వ్యతిఘటన చే
విష్ణ దృష్టా వ్రతేషు,
పశ్చాత్ శ్రేష్ఠాం కథమపి జనా
నామపి స్వర్గహేతో,
యాగే వృత్తి ర్న భవతి జనా
న్నాథ, నైతత్స్వయుక్తమ్"

ఈ తెలఁగుఁ వాపాపు గోపికల కంట బృందావనమున వీఁధులఁ దిరిగిన తులసి మొక్క యొంటరిపడెను. వారు, దానిచే శ్రీకృష్ణుని చెంతకు మాతిఁ బంప నుత్సహించిరి. లక్ష్మీదేవికంటెఁ దులసియే శ్రీకృష్ణున కత్యంతముఁ గూర్చ ప్రియురాలనియు, నామెనే మధురానగరమున కంప సర్గించుటో, స్త్రీస్వభావ సిద్ధమగు జాలిఁగండొనౌ నందుల కంగీకరింపఁగలదనియుఁ, దప్పక మరల శ్రీకృష్ణుని బృందావనమునకుఁ దోడ్కొని రాఁగలదనియుఁ దీర్మానించికొనిరి.

"త్వజ్ఞాధిక ప్రియతమా
తులసీ ప్రియోఽపి
జానీమ ఏవ కిల జనస్య తివ్య
తి హ్యాదతి ప్రియకరీ భవతీ సఖీనో
మానం త్వయా మధుపురీ
గమనం విధేయమ్."

ఇక నొక్క యంశము ముఖ్యముగ గమనింపవలసి యున్నది:— తాను అత్యంతము ప్రేమించిన పురుషుఁడు తనకుఁ దక్క ఇతరాంగనల కనుభవయోగ్యుఁడుగాఁ గూడదు. అట్టుకటోఁ బ్రాణత్యాగమున కయిన సిద్ధపడునట్టి యార్యనారీ పరవశురాలు భారత నారీమణి. ఒక పారిజాత ప్రసూన కారణముగ జనించిన సత్య యార్తిగ, ఆమెచే "నవనిచ్చి పుచ్చుకొన్నను మనవచ్చునే" అని శ్రీకృష్ణుని విషయమున బలికించినది. సతి సీతాదేవి ఆమెనేయుఁడైన శ్రీరాముని మోఁడనుగల మధ్యరమున కైక శ్రీరామునికి వనవాసమే విధించినదకదా! అట్టిచో గోపికల వేఁడికోలు సంగీ

కరించిన శ్రీ కృష్ణశ్రీకు, అకాల్యర్యమునకుఁబూనుట ఎంత అసంబద్ధమో, వారాము వంగుల కల్పించుటయు నంత అసంబద్ధమే యగును. ఇది విషయాంతరము. ప్రకృతము మన తెనుఁగువారుఁటఁ గూడఁ గొందఱు స్వతంత్ర దూత కావ్యరచయితలు లేకపోలేదు. ఇరువదియేండ్ల నాటిమాట:— తిరుపతి దేవస్థానము వారి ముద్రాక్షరశాల మునరాసున నున్నప్పుడు— దాని నధికారిగ నియమింపఁబడియుండిన శ్రీ వైష్ణవాచార్యులుగారు ఒకరు ఒక దూతకావ్యమును రచియించిరి. నే వారిని దర్శించుట తటస్థపడఁగా, అందలి శ్లోకములను గొన్నింటిఁ జదివి వినిపించిరి. వారప్పటికే అఱువదేండ్లు దాఁటిన వృద్ధులు— అస్ఖలితమగు పాండిత్యము గీర్వాణమున వ్యుత్పత్తికలిగినవారు శిఖరిణిలో సాగిన యా కావ్యము పేరిప్పుడు గుఱుతులేదు. కాని మన భరతఖండమునందలి సుప్రసిద్ధ స్థలముల నన్నింటిని — వారు ప్రదక్షిణముగ వర్ణించుచుఁ బోయిరి. మిక్కిలి రసవంతమగు ఆ కావ్యమును తిరుపతిలోని సాహిత్యవిదులు సంపాదించి ముద్రించుచో నెంతేని భాషాసేవ, దేశసేవ— చేసినవారగుదురు.

ఆంధ్రమున నవీన వృత్తములతో మిత్రులు— సుప్రసిద్ధ పారస్య సేవాపరాయణులు, శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారును 'మేఘదూతి' యను పేరితో నొక రచించి ప్రకటించిరి. అందు మన యాంధ్రదేశమందలి వివిధ చారిత్రిక, పుణ్యస్థలములు అత్యంత మనోహరములుగ వర్ణింపఁబడినవి. తప్పక యిది తెలుఁగువారు ఆదరింపఁదగిన యుత్తమ కావ్యము.

ఇంకను ఈ 'దూతకావ్యము'లవంటి వెవరయిన మహాప్రాజ్ఞులు వ్రాసిరేమో, తెలియకున్నది.

ఈ తెగకుఁ జేరిన కావ్యములు కేవలము విప్రలంభ దశలో నాయికానాయకుల మనోవేదనముల నుగ్గడించు శృంగారకృతులని యనఁదగును. మఱి విరహమునందయితే మొక్క శృంగారచేష్టయే గదా!— తన్నెడబాసిన ప్రియునుగూర్చి ప్రియురాలు తన వ్యథావస్థలో నేమేమో మనవులను తగిన దూతను గని తన ప్రియునికి సందేశమంపును. ఏతన్మార్గమున ఆ దూత యే యే దేశములను అతిక్రమింపవలెనో, యే యే ప్రదేశముల నే యే వింతలు చూడఁబడుచుండునో వాని నన్నిటిని విస్పష్టముగ వర్ణించి చెప్పును.

ఒకవిధముగ నిది భూప్రదక్షిణము చేయువారికిఁ దెలుఁగునకు భూగోళశాస్త్రవిజ్ఞానము మనుటలో సందియము లేదు. అయినఁ బ్రాచీనకాలమున నది మన భారతదేశమునకే పరిమితమయినది. అంతకంటె వారికిఁ దెలిసినది.

విప్రలంభశృంగారమునే దాదాపు దూతకావ్యము లన్నియు వెలడించినను కొన్ని యందులకు భిన్నములు నహితమున్నవి; వాల్మీకి రామాయణమున సుగ్రీవుఁడు వానర సమూహములను సీతాన్వేషణార్థము నలుదిశలకుఁ బంపుచో నూహ కందని ప్రదేశములను వారికి వర్ణించి చెప్పును; గురుతగావానములు, గుర్తుములు నగు చోటను సూచించును. అందుఁ గొన్ని యనూహ్యములగు విర్యపాత్రములు గాకున్నవి.

కవికులగురు కాళిదాస మహాకవి కిది యొక నడిమయి యుండవచ్చునేమో, కాని అతని పంథా వ్రాతము వేఱుగ తప్పదు. విరహ శృంగారమునకు ప్రాధాన్యమొసఁగుటచే, నూత్న భావోల్లేఖ కావ్యరీతులను అతని 'మేఘదూతము'— సంతరించుకొన్నది. ఇఁక దాని తరువాతి 'దూత' కావ్యములెల్ల పిల్లలను చరిత్రలవంటి వని మరుపులలో వసతిక్యము లేదు.

ఇప్పటికిని దూతకావ్యములకుఁ గల ప్రాముఖ్యమును గుర్తించి, ప్రభుత్వ శాఖను గల పరిశోధకు లట్టివానిఁ బ్రకటించి, వాని నజరామరముగఁ జేయుట తమ కర్తవ్యమని గుర్తించుట శ్రేయస్కరము.

గ్రంథవిమర్శనము

పతివ్రతాచరిత్రము

ప్రకాశకులు: గవర్న్మెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ, మదరాసు. వెల: నాలుగు రూపాయల ఇరవై నయా పైసలు.

ఇది ద్విపదరూపంలో ఉన్న 312 పుటల ఉద్గ్రంథం. దీని ధోరణి చూస్తే ఇది తెలుగులో కథాసరిత్సాగరం వంటి గ్రంథమేమోనని అనిపిస్తుంది. రచన అంతా ద్విపదలో సుసంస్కృతము, శిష్టము అయిన ప్రబంధశైలిలో సాగింది.

కథాకథనం కదిరీపతి శుకసప్తతి ధోరణిలో నడిచిపోయింది. అయితే శుకసప్తతి కేవలం శృంగార ప్రధానమయిన కావ్యం. కాని ఇది పతివ్రతల పునీతచరిత్ర లభివర్ణించే సుదీర్ఘ కావ్యం. పీఠికాకర్తలు పేర్కొన్నట్లీ కావ్యంలో కథలు కొన్ని కథాసరిత్సాగరము, ద్వాత్రింశత్సాలభంజిక, భోజరాజీయము మొదలయిన గ్రంథాలలో నుంచి సేకరించబడినట్లు కనబడుతున్నాయి.

అయితే ద్విపదలో ఈ విధమయిన కథాకావ్యం ఆంధ్ర వాఙ్మయంలో మరేదీ కనబడదు. ఆ విధంగా ఈ గ్రంథం ప్రాచీనాంధ్రవాఙ్మయంలో విశిష్టమయినది.

ఈ గ్రంథప్రచురణకోసం ఉపయోగించిన తాళపత్రప్రతులలో కవి నామధేయము, కులగోత్రాలు లుప్తమైపోయాయి. అందుచేత ఈ గ్రంథకర్తృత్వం గాని, గ్రంథకాలం గాని నిర్ణయించడానికి వీలులేకపోయిందని సంపాదకులు తెలియజేస్తున్నారు. శిష్టము, ఉదాత్తము అయిన గ్రంథశైలినిబట్టి మాత్రం గ్రంథకర్త ఇంచుమించుగా ప్రాచీన ప్రబంధకాలానికి తరువాతివాడని నిర్ణయించవచ్చును. అయితే ఇది కేవలం ఊహామాత్రమే.

ఆంధ్రదేశంలో మారుమూల గ్రామాలలో కొన్నిచోట్ల తాళపత్రగ్రంథాలింకా అజ్ఞాతంగా అడుగున పడి ఉండవచ్చును. మన అదృష్టవశాత్తు అటువంటి తాళపత్రగ్రంథాలలో పతివ్రతాచరిత్ర ప్రతి కూడ ఒకటి లభిస్తే లభించవచ్చును. పాఠకు లెవరయినా ఈ విషయంలో సహకరించగలిగితే ఆంధ్ర వాఙ్మయానికి అపూర్వమైన సేవ చేసినవారవుతారు.

ప్రస్తుత పతివ్రతాచరిత్రము కవి నామాది విషయంలోనే గాక కథలలోగూడా కొంతవరకు అసంపూర్ణంగానే ఉన్నది.

అయినా గ్రంథప్రాశస్త్యాన్ని బట్టి ఇది తప్పక ప్రకటింపవలసిన గ్రంథం. ప్రకాశకులు, యథాశక్తిగా నిర్దుష్టంగా ప్రచురించిన సంపాదకులు అభినందనీయులు.

'శాస్త్రి'

* * *

మహోదయం

[నేపథ్యగేయ రూపకము]

జమదగ్ని. ప్రకాశకులు. శ్రీ శివానంద తరంగిణి. కుమ్మెలపల్లి రామలింగేశ్వరరావు. మునిరామ వీథి కడప. వెల. రూపాయిన్నర.

ఆంధ్రులలో అనైక్యం పరిహరించి ఐక్యం పెంపొందించడమే ఈ గేయ రూపకం లక్ష్యం. గోదావరీసీమ, కృష్ణాసీమ, పెన్నాసీమ, తుంగభద్రాసీమ, మంజీరాసీమ, తమ వైభవాన్ని చాటుతూ అహంభావాలతో ఎలుగెత్తి గానం చేస్తాయి. అయితే అర్ణవఘోష ఈ సీమల ప్రత్యేక ఘోషలన్నీ తనలో ఐక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. అవిరామంగానే ఉద్బోధిస్తుంది. ఆకాశవాణి చిట్టచివరికి ఈ వేర్వేరు ప్రాంతీయాహంకారావేశాలు కూడదనీ ప్రత్యేక వ్యక్తిత్వం నిలుపుకుంటూ అందరు చేతులుకలిపి ఏకకంఠంతో ఐకమత్యంతో మెలగాలనీ ప్రబోధిస్తుంది. సంగ్రహంగా ఈ రూపకంలో విషయం ఇది.

రచయిత దీనిలో పద్యాలతో బాటెక్కువగా గేయాలుకూడా వాడారు. ఈ గేయాలు, పద్యాలు భావానుగుణంగా నడిచిపోతూ మొత్తం రచనకు ఒక విశిష్టత చేకూరుస్తున్నాయి. పాఠశాలలలోను, కళాశాలలలోను, ఉత్సవములలోను, సంగ్రహంగా ఉన్న ఈ నేపథ్య రూపకం గానాభినయాలకు, ఆంధ్రజాతిలో అనైక్య పరిహారానికి ఎంతయినా ఉపకరించగలదు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd.,- by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambbu Prasad.